సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 257

శుక్రవారం 31-5-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'



కార్ల్‌సన్‌కు ప్రజ్ఞానంద చెక్

ప్రపంచ నంబర్‌వన్‌పై నెగ్గిన భారత టీనేజ్ గ్రాండ్‌మాస్టర్ - 13లో



అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు 78,213 కోట్లు

వార్షికంగా 26 శాతం అప్.. 2024-25 లోనూ 7%పైన వృద్ధి -13లో



ఓటింగ్‌లో రికార్డు సృష్టించాలి

భారతదేశ అభివృద్ధి కోసం ఓటింగ్‌లో కొత్త రికార్డు సృష్టించాలని వారణాసి ప్రజలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

వివరాలు 6లో ▸



ప్రచారం పరిసమాప్తం

సార్వత్రిక ఎన్నికల్లో చివరిదైన ఏడో దశ ప్రచారం గురువారంతో ముగిసింది. జూన్ 1న 57 స్థానాలకు పోలింగ్ జరగనుంది.

వివరాలు 6లో ▸



లోయలో పడిన బస్సు..

జమ్మూ జిల్లా చోరా వద్ద బస్సు లోయలో పడిపోవడంతో 22 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 57 మంది గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



దూసుకెళ్లిన 'అగ్నిబాణ్'

ప్రైవేటు రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. అగ్నికుల్ కాస్మోస్‌కు చెందిన రాకెట్ 'అగ్నిబాణ్' శ్రీహరికోట నుంచి నింగిలోకి దూసుకెళ్లింది.

వివరాలు 6లో ▸

కుట్రపూరితం!

పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటుపై ఈసీ కొత్త నిబంధనలు ఎందుకు?

టీడీపీ ఇలా అడగ్గానే అలా ఆగమేఘాలపై ఎలా నిబంధనలు మారుస్తారు?

- అటెస్టేషన్ అధికారి సీల్ వేయక పోయినా, హోదా వివరాలు రాయకపోయినా చెల్లుబాటట!
- ఈ సవరణ ఎవరి కోసం.. ఎందుకోసం? దొంగ ఓట్లకు అవకాశం ఇచ్చినట్లు కాదా?
- సంతకం ఉంటే చాలట.. ఓట్ల లెక్కింపు సమయంలో సందేహాలు రావా?
- అలాంటప్పుడు వందలాదిగా ఉండే స్పెసిమెన్ సంతకాలతో సరిపోల్చడం కుదిరే పనా?
- ఎన్నికల సంఘం వ్యవహార శైలిపై ప్రజాస్వామ్యవాదుల ఆందోళన



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పోస్టల్ బ్యాలెట్ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరుపై ప్రజాస్వామ్యవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో వేటిని ఆమోదించాలి, వేటిని తిరస్కరించాలని స్పష్టమైన నిబంధనలు కేంద్ర ఎన్నికల సంఘం తన నిబంధనల పుస్తకంలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ

మిగతా 2వ పేజీలో ▸

'పోస్టల్ బ్యాలెట్'పై వైఎస్సార్‌సీపీ న్యాయ పోరాటం

- కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా సీఈవో మెమోలపై పిటిషన్
- అత్యవసరంగా విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం
- ఓ మెమోలో కొంత భాగం.. మరో మెమోను పూర్తిగా ఉపసంహరణ
- సంతకం ఉండి, పేరు, హోదా, సీలు లేకపోయినా ఆ పోస్టల్ బ్యాలెట్ ఆమోదం
- ఆ మేర చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశిస్తూ తాజాగా ఉత్తర్వులు
- హైకోర్టుకు సీఈసీ నివేదన.. వైఎస్సార్‌సీపీ కోరిన మేరకు ఈ వివరాలను రికార్డు చేసిన కోర్టు
- ఎన్నికల సంఘం తాజా ఉత్తర్వులను సవాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ సవరణ పిటిషన్
- ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసిన టీడీపీ.. ఈ పిటిషన్‌లో అభ్యర్థనను సవరించాలన్న ధర్మాసనం

2లో

మళ్లీ జయం మనదే

దేవుడి దయ, ప్రజలిచ్చిన చరిత్రాత్మక తీర్పుతో ఐదేళ్ల క్రితం ఇదే రోజు మన పార్టీ అధికారంలోకి వచ్చింది

కులం, మతం, ప్రాంతం, రాజకీయాలు చూడకుండా ప్రతీ కుటుంబానికీ మంచి చేశాం

ప్రజలందరి దీవెనలతో మరోసారి ప్రభుత్వం ఏర్పాటుచేయబోతున్నాం

ఇదే మంచిని కొనసాగిస్తాం.. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి మరిన్ని అడుగులేస్తాం

'ఎక్స్'లో సీఎం వైఎస్ జగన్ పోస్ట్

2లో



ఆ ముగ్గురు అధికారులపై వెంటనే

నిర్ణయం తీసుకోండి

- గుంటూరు రేంజి ఐజీ త్రిపాఠీ, ఎస్పీ మలికా గార్గ్, కారంపూడి ఇన్‌స్పెక్టర్‌పై తీవ్రమైన ఆరోపణలున్నాయి
- వారి విషయంలో శుక్రవారంలోగా నిర్ణయం తీసుకోవాలి.. కేంద్ర ఎన్నికల సంఘానికి, డీజీపీకి హైకోర్టు ఆదేశం
- ఏబీ వెంకటేశ్వరరావుకు గుంటూరు ఐజీ అత్యంత సన్నిహిత మిత్రుడు
- ఇన్‌స్పెక్టర్ నారాయణ స్వామి ఓ పార్టీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి

2లో



- అందుకే వీరిద్దరూ నా వెంట పడి తప్పుడు కేసులు పెడుతున్నారు
- నాపై పెట్టిన కేసుల దర్యాప్తు నుంచి వారిని దూరంగా ఉంచాలి.. హైకోర్టులో పిన్నెల్లి పిటిషన్

న్యూస్‌రీల్

ఈసెట్, ఐసెట్, డీఈఈ సెట్ ఫలితాలు విడుదల



ఇంజినీరింగ్, బీ–ఫార్మసీ రెండో సంవత్సరంలో అడ్మిషన్లకు నిర్వహించిన ఏపీ ఈసెట్, ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన డీఈఈ సెట్‌తో పాటు ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఐసెట్ ఫలితాలు విడుదలయ్యాయి.

వివరాలు 14లో ▸

తొలి ఫలితం కొవ్వూరు, నరసాపురం



రాష్ట్రంలో అన్నింటికంటే ముందుగా తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన నరసాపురం నియోజకవర్గాల ఫలితాలు ప్రకటించే అవకాశముందని.. రంపచోడవరం, చంద్రగిరిలో ఆలస్యంగా లెక్కింపు పూర్తవుతుందని ఎన్నికల అధికారులు భావిస్తున్నారు.

వివరాలు 10లో ▸

సీఈవో గుప్పెట్లో చట్టం



రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా చట్టాన్ని చేతిలోకి తీసుకున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని నాని అన్నారు. పోస్టల్ బ్యాలెట్లపై సీఈవో సర్క్యులర్ చట్టవిరుద్ధమని.. దీనిని కేంద్ర ఎన్నికల కమిషన్ ఎలా ఆమోదిస్తుందని ప్రశ్నించారు. సీఈవోది తప్పుడు నిర్ణయమని మెమోను వెనక్కి తీసుకోవడంతో తేలిందన్నారు.

వివరాలు 2లో ▸

ఏపీలో ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏర్పాటుకు చర్యలు



ఏపీలో ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు ఎన్‌సీసీ ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వి.మధుసూదన్‌రెడ్డి చెప్పారు. ఇందుకోసం గుంటూరు, ఒంగోలు ప్రాంతాలను పరిశీలించామన్నారు. విశాఖలో ఎన్‌సీసీ అకాడమీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

వివరాలు 10లో ▸

ఇదండీ సంగతి



మీరు అప్పుడు చూశారా గాంధీ సినిమా!?

ప్రేమోన్మాది చేతిలో యువతి దారుణ హత్య

కత్తితో మెడ, గొంతు నరికి హత్యచేసిన యువకుడు



నిందితుడు ఏసురత్నం (ఫైల్)

- అక్కడికక్కడే మృతిచెందిన యువతి
- ఆపై నిందితుడి ఆత్మహత్యాయత్నం.. పరిస్థితి విషమం
- ఏలూరులో ఘటన

5లో



హత్యకు గురైన రత్నగ్రేస్ (ఫైల్)

సాధికారతతో పెరిగిన మహిళా ఓటింగ్



- రాష్ట్రంలో పెరిగిన మహిళల డిపాజిట్ ఖాతాలు.. పెరిగిన మహిళల అధికారం, కుటుంబ పొదుపు
- 2019 మార్చి నుంచి 2023 మార్చికి రాష్ట్రంలో పెరిగిన మహిళా డిపాజిట్ల ఖాతాలు 90.4 లక్షలు.. గత ఎన్నికలకంటే ఈ ఎన్నికల్లో మహిళా ఓట్లలో పెరుగుదల 8.4 లక్షలు
- దేశవ్యాప్తంగానూ పెరిగిన మహిళల డిపాజిట్ల ఖాతాలు..
- ఫలితంగా సార్వత్రిక ఎన్నికల్లో 1.73 కోట్ల మహిళా ఓటర్లు అధికంగా ఓట్లు వేశారు
- ఆరు దశల పోలింగ్ సరళిపై ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి

3లో

గ్రామీణ యువతకు కిసాన్ డ్రోన్స్



- పొదుపు సంఘాల మహిళలకూ ప్రాధాన్యత.. డ్రోన్ నడపడంపై ఆసక్తిగల మహిళలకు ఉచిత శిక్షణ
- ఇప్పటికే 63 సంఘాలకు కిసాన్ డ్రోన్స్ అందజేసిన ఇఫ్కో
- డ్రోన్లతో పాటు ఎలక్ట్రికల్ వాహనాలు సైతం అందజేత.. 15 లక్షల విలువైన పరికరాలు ఉచితంగా పంపిణీ
- సెక్యూరిటీ డిపాజిట్ రూ.లక్ష చెల్లిస్తే చాలు.. నానో ఎరువుల వినియోగం పెంచడమే లక్ష్యం

14లో

కేరళను తాకిన నైరుతి

3,4 రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోకి ప్రవేశించనున్న రుతుపవనాలు



తమ అంచనాల కంటే ఒక రోజు ముందుగానే నైరుతి రుతుపవనాలు గురువారం కేరళను తాకాయని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. రాబోయే మూడు, నాలుగు రోజుల్లో రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. కాగా, జూన్ 1 తర్వాత కూడా ఢిల్లీ, పంజాబ్, హరియాణ, బిహార్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల్లో హీట్‌వేవ్ పరిస్థితులు కొనసాగవచ్చని వాతావరణ శాఖ తెలిపింది.

6లో

క్లుప్తంగా...

మళ్లీ జయం మనదే

- 'ఎక్స్'లో సీఎం వైఎస్ జగన్ ట్వీట్

సాక్షి, అమరావతి: దేవుడి దయ, ప్రజలిచ్చిన చరిత్రాత్మక తీర్పుతో సరిగ్గా ఐదేళ్ల క్రితం ఇదే రోజున మన పార్టీ అధికారంలోకి వచ్చిందని.. ప్రజలందరి దీవెనలతో మరోసారి రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుచేయబోతున్నామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. కులం, మతం, ప్రాంతం, రాజకీయాలు చూడకుండా ప్రతీ కుటుంబానికీ ఈ ఐదేళ్లు మంచి చేశామని.. ఇదే మంచిని మళ్లీ కొనసాగిస్తామని.. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి మరిన్ని అడుగులేస్తామని ఆయన గురువారం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

అటెస్టేషన్ అధికారి సంతకం తప్పనిసరి

- సీల్, హోదా వివరాలు లేకపోయినా చెల్లుబాటు
- పోస్టల్ బ్యాలెట్‌పై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పోస్టల్ బ్యాలెట్ల వ్యవహారంలో తలెత్తిన గందరగోళంపై కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి స్పష్టత ఇచ్చింది. ఓటరు డిక్లరేషన్ ఫాంపై గెజిటెడ్ ఆఫీసర్ సంతకం ఉండి, సీల్ లేకున్నా ఆమోదించాలంటూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా మే 25న ఇచ్చిన మెమోపై వైఎస్సార్‌సీపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అభ్యంతరాన్ని పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలని మీనా కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. దీన్ని పరిశీలించిన కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా ఉత్తర్వులిచ్చింది. ఫాం–13 ఏపై అటెస్టేషన్ అధికారి సంతకం మాత్రమే ఉండి.. సీల్, హోదా వివరాలు లేకున్నా ఆ ఓటు చెల్లుబాటవుతుందని ఈసీ తెలిపింది. ఆర్వో ధ్రువీకరణ తర్వాతే అటెస్టేషన్ అధికారి ఫాం 13 ఏపై సంతకం చేయడంతో ఆ ఓటర్లను పరిగణనలోకి తీసుకోవాలని ఏపీ సీఈవోకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు లేఖ రాశారు.

జెట్టిపాలెంలో ఈవీఎం ధ్వంసం కేసులో మరో ఆరుగురు అరెస్ట్

రెంటచింతల: పల్నాడు జిల్లా జెట్టిపాలెం గ్రామంలో ఈ నెల 13న పోలింగ్ బూత్‌లోని ఈవీఎంలను ధ్వంసం చేసిన ఘటనలో మరో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ఎం. ఆంజనేయులు గురువారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఈ నెల 20వ తేదీన వైఎస్సార్ సీపీకి చెందిన కుందురు నర్సింహారెడ్డి, మేకపోతుల శివారెడ్డి, కేతావత్ మంగ్లానాయక్, కొండా రామయ్య, తిక్కా శ్రీనివాస రావు, పేర్ల శివరామ్‌ను అరెస్ట్ చేసి.. నరసరావుపేట పీడీఎం కోర్టులో హాజరుపరచినట్లు వెల్లడించారు. దీంతో ఈ కేసులో మొత్తం 12 మంది అరెస్ట్ అయ్యారని ఆయన చెప్పారు. కాగా, జెట్టిపాలెం గ్రామంలో ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో తాజాగా టీడీపీకి చెందిన రామన బోయిన శ్రీను, అంబటి లక్ష్మీనారాయణ, తండా అంకారావు, వైఎస్సార్ సీపీకి చెందిన బాణావత్ తులశ్యా నాయక్, తిక్కా సైదయ్య, దేరంగుల గురవయ్యను అరెస్ట్ చేసి గురజాల కోర్టులో హాజరు పరచగా వారికి జడ్జి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

సునామీ నష్టాన్ని తగ్గించేందుకు యూకేతో ఎంఓఈఎస్ అవగాహన

సాక్షి, హైదరాబాద్: తీరప్రాంతాల్లో సునామీ ముందస్తు హెచ్చరికలకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై యునైటెడ్ కింగ్‌డమ్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ (యూకేఆర్ఐ)తో మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ (ఎంఓఈఎస్) అవగాహన కుదుర్చుకున్నాయి. గురువారం హైదరాబాద్‌లోని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్కాయిస్)లో జరిగిన కార్యక్రమంలో ఈ నూతన ప్రాజెక్టుపై ఎంఓయూ కుదిరింది. డిజాస్టర్ రిస్క్ తగ్గింపులో భాగంగా ఏడు పరిమాణాత్మక లక్ష్యాలకు ఈ ప్రాజెక్ట్ దోహదపడనుంది. విపత్తు మరణాలు తగ్గించడం, ప్రభావిత వ్యక్తుల సంఖ్యతో పాటు ఆర్థిక నష్టాలు తగ్గించడంలో ఈ ప్రాజెక్టు వ్యూహాత్మకంగా మారనుంది. 40 మంది నిపుణులు పాల్గొన్నారు.



ప్రధాన నగరాలు, పట్టణాల్లో గురువారం నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం/పట్టణం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	45.7	32.1
గుంటూరు	44.5	31.0
భీమవరం	44.0	29.0
ఒంగోలు	44.0	30.3
నెల్లూరు	43.6	31.0
తాడేపల్లిగూడెం	43.0	29.0
విజయవాడ	43.0	31.0
రాజమహేంద్రవరం	43.0	29.0
తిరుపతి	42.0	29.0
ఏలూరు	42.0	30.0
కడప	41.6	30.8
విజయనగరం	41.0	39.0
కర్నూలు	41.0	29.2
విశాఖపట్నం	37.4	31.0

ఆ ముగ్గురు అధికారులపై వెంటనే

నిర్ణయం తీసుకోండి

గుంటూరు రేంజి ఐజీ త్రిపాఠీ, ఎస్పీ మలికా గార్గ్, కారంపూడి ఇన్‌స్పెక్టర్‌పై తీవ్రమైన ఆరోపణలున్నాయి

- వారి విషయంలో శుక్రవారం లోగా నిర్ణయం తీసుకోవాలి
- కేంద్ర ఎన్నికల సంఘానికి, డీజీపీకి హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అధికార విధుల నుంచి గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠీ, ఎస్పీ మలికా గార్గ్, కారెంపూడి ఇన్‌స్పెక్టర్ నారాయణ స్వామిని దూరంగా ఉంచేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సమర్పించిన వినతిపత్రంపై రేపటికల్లా (శుక్రవారంలోగా) నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని, డీజీపీని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పోలీసు అధికారులపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నందున, పిన్నెల్లి వినతిపై వెంటనే తగిన నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని ధర్మాసనం స్పష్టంచేసింది.

త్రిపాఠీ, గార్గ్, నారాయణ స్వామిలపై చర్యలు తీసుకోవాలని, వారు పని చేస్తున్న స్థానాల నుంచి మార్చాలంటూ తానిచ్చిన వినతిపత్రంపై ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోకపోవడాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురించి పిన్నెల్లి తరపు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి గురువారం కోర్టు విచారణ మొదలు కాగానే న్యాయమూర్తులు జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ధర్మాసనం ముందు ప్రస్తావించారు. లంచ్‌మోషన్ రూపంలో అత్యవసర విచారణకు అభ్యర్థించారు. లంచ్‌మోషన్ అవసరం లేదని ధర్మాసనం మొదట చెప్పింది. అయితే నిరంజన్‌రెడ్డి అత్యవసరాన్ని వివరించారు. ఈ ముగ్గురు అధికారులు పిన్నెల్లికి వ్యతిరేకంగా ఉన్నారని, ఆయన్ని కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనకుండా చేసేందుకు కోర్టుకు సైతం తప్పుడు సమాచారం ఇచ్చి, తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు. ఈవీఎంల కేసులో పిన్నెల్లికి ముందస్తు బెయిల్ మంజూరు చేసిన తరువాత తిరిగి హత్యాయత్నం కేసులు పెట్టిన విషయాన్ని వివరించారు. ఈ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పిటిషనర్ ఇచ్చిన వినతిపత్రంపై ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. దురుద్దేశపూర్వకంగా వ్యవహరిస్తున్న ఈ అధికారులను పిటిషనర్‌పై నమోదు చేసిన కేసుల దర్యాప్తు నుంచి దూరంగా ఉంచాలన్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు వారిని విధుల నుంచి దూరంగా ఉంచితే సరిపోతుందని వివరించారు. దీంతో ధర్మాసనం లంచ్‌మోషన్ ద్వారా అత్యవసర విచారణకు అనుమతినిచ్చింది.

ఏబీ వెంకటేశ్వరరావు చెప్పినట్లే ఐజీ చేస్తున్నారు

గురువారం సాయంత్రం ఈ వ్యాజ్యం విచారణకు రాగా, పిన్నెల్లి తరపు న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఐజీ త్రిపాఠీ, ఇన్‌స్పెక్టర్ నారాయణస్వామిలపైనే తమకు అభ్యంతరం ఉందన్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు సర్వశ్రేష్ట త్రిపాఠీ అత్యంత సన్నిహిత మిత్రుడుని, ఆయన చెప్పినట్లే చేస్తున్నారని తెలిపారు. అలాగే నారాయణ స్వామి ఓ పార్టీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని చెప్పారు. వీరిద్దరూ పిన్నెల్లి పట్ల దురుద్దేశపూర్వకంగా వ్యవహరిస్తూ తప్పుడు కేసులతో వేధిస్తున్నారని, కోర్టును సైతం తప్పుదోవ పట్టిస్తున్నారని, దీనిని తీవ్రంగా పరిగణించాలని కోరారు. ఈ నెల 4 వరకు పిటిషనర్‌పై ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు చేయకుండా, ఆ కేసుల దర్యాప్తులో వీరు భాగం కాకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఎన్నికల సంఘం, పోలీసుల తీరును చూస్తుంటే రాష్ట్రంలో న్యాయ పాలన ఉందా అన్న సందేహం కలుగుతోందన్నారు. కోర్టు మాత్రమే తమకు రక్షణగా ఉందని, అందుకే మరోసారి కోర్టును ఆశ్రయించామని నిరంజన్‌రెడ్డి వివరించారు.

ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. పిన్నెల్లి వినతిపత్రంపై మీరేం చేస్తున్నారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. దీనికి ఎన్నికల సంఘం తరపున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ స్పందిస్తూ.. తగిన నిర్ణయం తీసుకోవాలని అధికారులకు సూచిస్తానన్నారు. వినతిపత్రం తమకు ఇవ్వలేదని, డీజీపీకి ఇచ్చారని చెప్పారు. దీంతో ధర్మాసనం హోంశాఖ న్యాయవాదిని వివరణ కోరింది. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున డీజీపీ కూడా ఎన్నికల సంఘం పరిధిలోనే పని చేస్తుంటారని తెలిపారు. నిర్ణయం తీసుకోవాల్సింది ఎన్నికల సంఘమేనన్నారు. పిన్నెల్లి తన పిటిషన్‌లో కొందరు పోలీసు అధికారులపై తీవ్రమైన ఆరోపణలు చేశారని, అందువల్ల ఆయన వినతిపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. రేపటికల్లా తగిన నిర్ణయం వెలువరించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని, ఎన్నికల ప్రధాన అధికారిని, డీజీపీని ఆదేశించింది. పిన్నెల్లి దాఖలు చేసిన ఈ వ్యాజ్యాన్ని వినతి పత్రంగా పరిగణించాలని ఎన్నికల సంఘానికి స్పష్టం చేసింది.

సీఈవో గుప్పెట్లో చట్టం

- పోస్టల్ బ్యాలెట్లపై సీఈవో సర్క్యులర్ చట్టవిరుద్ధం
- దీనిని కేంద్ర ఎన్నికల కమిషన్ ఎలా ఆమోదిస్తుంది?
- కోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేస్తే సీఈవో మెమోను వెనక్కి తీసుకున్నారు
- తప్పుడు నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమైంది: పేర్ని నాని



చిలకలపూడి (మచిలీపట్నం): రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనా చట్టాన్ని చేతిలోకి తీసుకొని ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకుంటున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని నాని అన్నారు. గురువారం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పోస్టల్ బ్యాలెట్ల విషయంలో అధికారి సీలు లేకున్నా చెల్లుతుందని సీఈఓ జారీ చేసిన సర్క్యులర్ చట్ట విరుద్ధమన్నారు. సీలు, హోదా(డిజిగ్నేషన్) లేకపోయినా ఫర్వాలేదని, స్పెసిమెన్ సిగ్నేచర్ అనుమానం వస్తే జిల్లా ఎన్నికల అధికారి సమక్షంలో ధ్రువీకరిస్తే సరిపోతుందని చెప్పారని, ఈ లెక్కన ప్రతి జిల్లా నుంచి వెయ్యికి పైగా స్పెసిమెన్ సిగ్నేచర్‌లను ధృవీకరించుకోవడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. 13 ఏ, 13 బి పోస్టల్ బ్యాలెట్‌లు ఇస్తారని, దానికి గెజిటెడ్ ఆఫీసర్ సర్టిఫికెట్ ఇస్తారని, ఫారం 12 ఏ అనేది ఎక్కడ నుండి వచ్చిందని ప్రశ్నించారు. ఎంతో బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న సీఈవో ఎవరికి మేలు చేకూర్చాలని ఇలాంటి నిర్ణయం తీసుకున్నారో చెప్పాలన్నారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తే కేంద్ర ఎన్నికల కమిషన్ కూడా ఓకే చెప్పిందని, దేశంలో ఒకలా.. రాష్ట్రంలో మరోలా నిబంధన ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. చివరికి కోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేస్తే ఆ మెమోను సీఈఓ వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారన్నారు. ఆయన తప్పుడు నిర్ణయం తీసుకున్నట్లు దీనిద్వారా స్పష్టమైందని, ఎవరి కోసం ఆ తొందరపాటు నిర్ణయం తీసుకున్నారని నిలదీశారు. చంద్రబాబు బీజేపీతో కలిసి ఎన్ని కుట్రలు చేసినా ఫలించవని చెప్పారు. టీడీపీ ఎన్డీఏతో కలిసి చట్టాలను చుట్టాలుగా మార్చుకుందని, ప్రజలు దీనిని గమనించాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం అంగీకారంపైనా పోరాటం చేస్తామని, చివరకు న్యాయమే గెలుస్తుందనే నమ్మకం తమకుందని వెల్లడించారు. న్యాయ వ్యవస్థతో సమానంగా బాధ్యతగా మెలగాల్సిన హోదాలో, ఎన్నికల సంఘంలో ప్రమాణం చేసి, ఇలాంటి సొంత నిర్ణయాలు తీసుకోవడం అంటే ఒక పార్టీ వైపు మొగ్గ చూపినట్లు స్పష్టమవుతోందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని, వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. టీడీపీ తప్పులను ఎత్తి చూపిస్తున్నప్పటికీ పట్టించుకోని సీఈవో.. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల్లో వార్తలు వస్తే వెంటనే స్పందించి తమ పార్టీ నాయకులపై కేసులు పెట్టడం అన్యాయమని అన్నారు. టీడీపీ, బీజేపీ నేతలపై కేసులు పెట్టొద్దని కలెక్టర్లు, ఆర్వోలను బెదిరిస్తున్నారని, వైఎస్సార్ సీపీ నాయకులపై సాధ్యమైనంత వరకు కేసులు ఎక్కువ పెట్టాలని ఆదేశాలు ఇస్తున్నారని చెప్పారు.

రెండు, మూడు రోజుల్లో రాయలసీమలోకి రుతుపవనాలు!

సాక్షి, విశాఖపట్నం: ఉక్కపోత, భానుడి భగభగలతో విలవిల్లాడుతున్న రాష్ట్ర ప్రజలకు ఉపశమనం కలిగించే చల్లటి కబురిది. గురువారం కేరళలో ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు జూన్ 2, 3 తేదీలనాటికి రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లోకి విస్తరించే అవకాశాలున్నాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.



మరో రెండు రోజులు అధిక ఉష్ణోగ్రతలు

ఇదిలా ఉంటే.. రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల మేరకు అధికంగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ దిశగా గాలులు వీస్తుండటంతో రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయని తెలిపారు. కాగా, నేడు, రేపు కోస్తా, రాయలసీమలో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు.

కుట్రపూరితం!

▶ మొదటి పేజీ తరువాయి

వాటిని సవరిస్తూ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టుగా మారనున్నాయంటున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తాజా సవరణల వల్ల దొంగ ఓట్లకు ఆస్కారం కల్పించడమే కాకుండా నిజమైన ఓట్లు చెల్లకుండా పోయే అవకాశం ఉందంటున్నారు. కేంద్ర ఎన్నికల సంఘ నిబంధనల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటున్న ఓటరు తన వివరాలు, బ్యాలెట్ నంబర్‌తో డిక్లరేషన్ ఫాం13ఏ సమర్పించాలని, ఈ ఓటరు తనకు తెలుసని ఒక గెజిటెడ్ అధికారి ధృవీకరించి సంతకం చేస్తూ.. పొడి అక్షరాలతో ఆ అధికారి పేరు, హోదా వివరాలు, చిరునామాతో పాటు సీల్ వేయాలని స్పష్టంగా ఉంది. మన రాష్ట్రం విషయానికి వస్తే గెజిటెడ్ అధికారి సంతకం ఉండి, అధికారి హోదా వివరాలు లేదా సీల్.. ఏదో ఒకటి ఉన్నా.. ఆ ఓట్లను పరిగణనలోకి తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా టీడీపీ అడిగిన వెంటనే మెమో జారీ చేయడం తెలిసిందే. దాన్ని ఎండార్స్ చేయడంతో పాటు మరికొంత సడలింపు ఇస్తూ గెజిటెడ్ అధికారి హోదా వివరాలు, సీల్ లేకున్నా కేవలం సంతకం ఉంటే చాలు.. ఓట్లను పరిగణనలోకి తీసుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఏపీ సీఈవోకు లేఖ రాయడం వెంట వెంటనే జరిగిపోవడం గమనార్హం. పోస్టల్ బ్యాలెట్ల చెల్లుబాటు విషయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఇచ్చిన ఆదేశాలను ఉన్నత న్యాయస్థానంలో ఉపసంహరించుకోవడం అంటే.. ఆ ఉత్తర్వులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లుగా అంగీకరించినట్లే. ఈ కేసులో టీడీపీ ఇంప్లీడ్ పిటీషన్ వేయడం ద్వారా పోస్టల్ బ్యాలెట్ల వ్యవహారాన్ని మరింత గందరగోళ పరచాలనే ఉద్దేశం ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

సంతకంలో వ్యత్యాసాలుంటే..

టీడీపీ వినతికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం, ఆ మేరకు ఉత్తర్వులిచ్చి దొంగ ఓట్ల బెడదను సృష్టించిన సీఈవో ఆదేశాలకు అనుగుణంగా కేంద్ర ఎన్నికల సంఘం తందానా అనడం అనుమానాలకు తావిస్తోందని ప్రజాస్వామ్యవాదులఆందోళన. ఈ వ్యవహారం లెక్కింపు సమయంలో తీవ్ర గందరగోళ పరిస్థితులకు దారితీస్తుందని మాజీ ఎన్నికల అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, కేవలం సంతకంతో అతను అటెస్టేషన్ అధికారే అని నిర్ధారించడం ఎలా సాధ్యమని వీరు ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్ణయం దొంగ ఓట్లను ప్రోత్సహించేలా ఉందని కేంద్ర ఎన్నికల సంఘానికి సలహాదారునిగా వ్యవహరించిన అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. వివరాలు లేకుండా కేవలం సంతకంతో రిటర్నింగ్ ఆఫీసర్ ఎలా ఆమోదం తెలుపుతారని, అధికారుల సంతకాల్లో వ్యత్యాసాలు ఉండటం అత్యంత సహజమని వివరించారు. ఈ నేపథ్యంలో స్పెసిమెన్ సంతకంతో సరిపోల్చి చూడటం ఎలా సాధ్యమని రిటైర్డ్ ఆర్డీవో ఒకరు ప్రశ్నిస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లో ఏర్పాటు చేసిన గెజిటెడ్ అధికారుల సంతకాలు అన్నీ కౌంటింగ్ సెంటర్లలోని ఆర్వోలకు పంపిస్తామని, సంతకంపై అభ్యంతరం వ్యక్తం చేస్తే వాటితో సరిపోల్చి చూసుకొని నిర్ణయం తీసుకోవాలనడం విడ్డూరంగా ఉందంటున్నారు. ఇన్ని స్పెసిమెన్ అధికారుల సంతకాలతో వాటిని ఆ సమయంలో సరిపోల్చి చూడటం సాధ్యమయ్యే పనేనా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎవరి లబ్ధి కోసం ఆగమేఘాల మీద ఇటువంటి నిర్ణయాలు తీసకుంటున్నారని ప్రశ్నిస్తున్నారు.

ఈసీ నిష్పాక్షికతపై అనుమానాలకు మరింత బలం

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన అటెస్టింగ్ ఆఫీసర్లు కొంత మంది సీల్ వేయకుండా కేవలం సంతకాలు మాత్రమే చేశారని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని తమ ఓట్లను తిరస్కరించకుండా ఆమోదించేలా చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ నుంచి విజ్ఞాపనలు రాగానే ఎన్నికల సంఘం వెంటనే పలు నిర్ణయాలు తీసుకుంటూ మొత్తం పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియనే గందరగోళంగా మార్చింది. టీడీపీ ఫిర్యాదు చేయగానే ముఖేష్ కుమార్ మీనా ఈ నెల 25న ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం డిక్లరేషన్ ఫారం మీద అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం, పేరు, హోదా (డిజిగ్నేషన్) పూర్తి వివరాలు తప్పనిసరిగా ఉండాలని.. ఇవి ఉండి స్టాంప్ లేకున్నా వాటిని పరిగణనలోకి తీసుకోవచ్చని ఉంది. ఒక వేళ ఏమైనా అనుమానం వస్తే దాన్ని రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా ఎన్నికల అధికారి వద్ద ఉన్న సంబంధిత అటెస్టింగ్ ఆఫీసర్ సంతకంతో సరిపోల్చుకుని పోస్టల్ బ్యాలెట్‌ను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. తాజాగా గురువారం కేంద్ర ఎన్నికల సంఘం మీనాకు రాసిన లేఖలో మరో ముందడుగు వేసి అటెస్టింగ్ ఆఫీసర్ సీల్ వేయకున్నా, అతని హోదా వివరాలు లేకున్నా సంతకం ఉంటే చాలని పేర్కొంది. ఎవరి ప్రయోజనాల కోసం ఎన్నికల సంఘం ఇలాంటి గందరగోళ నిర్ణయాలు తీసుకుంటోందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎప్పటి నుంచో అనుసరిస్తున్న నిబంధనలను ఒక్క ఏపీకే సడలింపునిస్తూ సీఈవో ఆదేశాలివ్వడం విడ్డూరమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసీ మరో అడుగు ముందుకేసి వివరాలు రాయకున్నా, సీల్ వేయకున్నా పోస్టల్ బ్యాలెట్‌ను పరిగణనలోకి తీసుకోవాలనడం తొలి నుంచి ఈసీ నిష్పాక్షికతపై వ్యక్తమవుతున్న అనుమానాలకు మరింత బలం చేకూర్చినట్లయిందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై వైఎస్సార్‌సీపీ న్యాయ పోరాటం

సాక్షి, అమరావతి: పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) తీసుకున్న వివాదాస్పద నిర్ణయంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ న్యాయ పోరాటం ప్రారంభించింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు విరుద్ధంగా సీఈవో ఈ నెల 25, 27వ తేదీల్లో జారీ చేసిన మెమోలను రద్దు చేయాలని కోరుతూ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై లంచ్ మోషన్ రూపంలో అత్యవసరంగా విచారణ జరపాలని అప్పిరెడ్డి తరఫు న్యాయవాది సన్నపురెడ్డి వివేక్ చంద్రశేఖర్ హైకోర్టు ధర్మాసనాన్ని అభ్యర్థించారు. దీంతో న్యాయమూర్తులు జస్టిస్ సత్తిరెడ్డి సుబ్బారెడ్డి, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్‌ల ధర్మాసనం లంచ్ మోషన్ రూపంలో గురువారం అత్యవసర విచారణకు అంగీకరించింది. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫాంపై అటెస్టింగ్ అధికారి సంతకం ఉంటే చాలని, తన పేరు, హోదా వివరాలు చేతితో రాసినా కూడా ఆమోదించాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం గత ఏడాది జూలైలో మార్గదర్శకాలు జారీ చేసింది. అన్ని రాష్ట్రాల్లో ఈ మార్గదర్శకాలు అమలవుతున్నాయి. అయితే తెలుగుదేశం పార్టీ అడిగిందే తడవుగా, సీఈవో ఆ మార్గదర్శకాలకు తూట్లు పొడిచారు. టీడీపీకి అనుకూలంగా వాటిని సడలించారు. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫాంపై అటెస్టింగ్ అధికారి సంతకం ఉండి.. పేరు, హోదా వివరాలు చేతితో రాయకపోయినా కూడా ఆ పోస్టల్ బ్యాలెట్‌ను ఆమోదించాలంటూ ఈ నెల 25, 27వ తేదీల్లో మెమోలు జారీ చేశారు. ఈ నిర్ణయం అత్యంత వివాదాస్పదంగా మారింది. కూటమి తప్ప, అన్నీ రాజకీయ పక్షాలు ఎన్నికల ప్రధాన అధికారి నిర్ణయంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇది అంతిమంగా శాంతిభద్రతల సమస్యగా మారుతుందని భయపడుతున్నాయి.

దేశంలో ఎక్కడా లేని నిబంధన ఏపీలో అమలు

సీఈవో ఇచ్చిన సడలింపుల అమలును నిలిపేసి, కేంద్ర ఎన్నికల సంఘం గత ఏడాది జూలైలో జారీ చేసిన మార్గదర్శకాలను యథాతథంగా, నిజమైన స్ఫూర్తితో అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిటిషన్ దాఖలు చేసింది. ఇందులో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని ప్రతివాదులుగా చేర్చింది. మధ్యాహ్నం ఈ వ్యాజ్యం విచారణకు రాగా, వైఎస్సార్‌సీపీ తరఫున సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి, న్యాయవాది వివేక్ చంద్రశేఖర్ వాదనలు వినిపించారు. దాదాపు రెండు గంటల పాటు వాదనలు కొనసాగాయి. సీఈవో తన పరిధి దాటి మరీ మెమోలు జారీ చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని ఉత్తర్వులను ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే అమలు చేస్తున్నారని తెలిపారు. సీఈవో మెమోల వల్ల వచ్చే నష్టం గురించి ధర్మాసనానికి వివరించారు. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫాంపై అటెస్టింగ్ అధికారి సంతకం ఉంటే చాలని, తన పేరు, డిజిగ్నేషన్ వివరాలు చేతితో రాసినా కూడా ఆమోదించాలని కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు చెబుతున్నాయని, ఇందుకు విరుద్ధంగా పోస్టల్ బ్యాలెట్ ఓటు ఉంటే, దానిని తిరస్కరించవచ్చని తెలిపారు. అయితే ఇప్పుడు సీఈవో ఆ మార్గదర్శకాలకు తిలోదకాలిచ్చారని, కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అమలు చేయడం లేదన్నారు. దీనిని తీవ్రంగా పరిగణించాలని కోరారు. కౌంటింగ్ ప్రక్రియలో నిష్పాక్షికత కోసమే ఈ వ్యాజ్యం దాఖలు చేశామన్నారు. నిబంధనలకు తూట్లు పొడిచే అధికారం సీఈవోకు లేదన్నారు. కొన్ని రాజకీయ పార్టీలకు మేలు చేసేందుకే సీఈవో ఈ మెమో జారీ చేశారని తెలిపారు.

పేరు, హోదా, సీలు లేకపోయినా ఆమోదించాలి

25, 27వ తేదీల్లో జారీ చేసిన మెమోలపై వివరణ ఇవ్వాలని ధర్మాసనం కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలో సీఈవో తమ అభిప్రాయాన్ని కోరారని తెలిపారు. అధికారుల సంతకం విషయంలో ఏదైనా సందేహం ఉన్నా, వెరిఫికేషన్ అవసరం అయినా, ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద ఉన్న అటెస్టింగ్ అధికారుల నమూనా సంతకాలు, పేర్లు, హోదాల వివరాలను తీసుకోవాలంటూ ఈ నెల 25వ తేదీన జారీ చేసిన మెమోలోని రెండో పేరాను ఉపసంహరించుకుంటున్నట్లు అవినాష్ చెప్పారు. ఈ రెండో పేరాకు అనుగుణంగా 27న జారీ చేసిన మెమోను పూర్తిగా ఉపసంహరించుకున్నట్లు ఆయన కోర్టుకు వివరించారు. ఇదే సమయంలో పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫాంపై అటెస్టింగ్ అధికారి సంతకం ఉండి, పేరు, హోదా, సీలు లేకపోయినా కూడా ఆ పోస్టల్ బ్యాలెట్‌లను ఆమోదించాలంటూ తాజాగా (30వ తేదీన) ఆదేశాలు జారీ చేశామని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వీటిని దేశ వ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. ఈ సమయంలో వీరారెడ్డి జోక్యం చేసుకుంటూ, 25న ఇచ్చిన మెమోలోని పేరా 2, 27న ఇచ్చిన మెమోను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు చెప్పిన విషయాన్ని రికార్డ్ చేయాలని కోర్టును కోరారు. ఇందుకు ధర్మాసనం అంగీకరించి, అవినాష్ చెప్పిన విషయాలను రికార్డ్ చేసింది. అవినాష్ జోక్యం చేసుకుంటూ, అసలు ఈ వ్యాజ్యానికి విచారణార్హతే లేదన్నారు. ధర్మాసనం స్పందిస్తూ, ఇది రెగ్యులర్ కేసు కాదని గుర్తు చేసింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది.

తాజా ఉత్తర్వులపై సవరణ పిటిషన్ దాఖలు చేసిన వైఎస్సార్‌సీపీ

సీనియర్ న్యాయవాది వీరారెడ్డి తిరిగి కోర్టు హాలులోకి వచ్చి, ఎన్నికల సంఘం తాజాగా జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సవరణ పిటిషన్ దాఖలు చేస్తున్నామని, ఈ వ్యాజ్యంపై అత్యవసర విచారణ చేపట్టాలని ధర్మాసనాన్ని కోరారు. కొద్దిసేపు తర్జనభర్జనల అనంతరం ధర్మాసనం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన సవరణ పిటిషన్‌పై విచారణకు అంగీకరించింది. దీంతో ఎన్నికల కమిషన్ తాజాగా (30న) జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ ఓ సవరణ పిటిషన్ దాఖలు చేసింది. రాత్రి 9 గంటల సమయంలో ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం వైఎస్సార్‌సీపీ తన ప్రధాన వ్యాజ్యంలో చేసిన సవరణకు అనుమతిస్తామని, దీనిపై అభ్యంతరం ఏమైనా ఉందా? అని అవినాష్‌ను ప్రశ్నించింది. తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన చెప్పడంతో సవరణకు అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ వ్యాజ్యంలో తెలుగు దేశం పార్టీ దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతించే విషయంలో కొద్దిసేపు చర్చ జరిగింది. తాజాగా సవరణ పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో మీ ఇంప్లీడ్ పిటిషన్‌లో కూడా ఆ మేర సవరణలు చేయాలని టీడీపీ న్యాయవాదికి ధర్మాసనం స్పష్టం చేసింది. సవరణ తర్వాతే విచారణ జరుపుతామని, అదే సబబని తెలిపింది. అలా అయితే అన్ని వ్యాజ్యాలపై శుక్రవారం విచారణ జరపాలని వీరారెడ్డి ధర్మాసనాన్ని కోరారు. అలా చేయలేమని, సీజే అనుమతి తీసుకుని హౌజ్‌మోషన్ ద్వారా విచారణ చేపట్టాలని కోరవచ్చునని ధర్మాసనం స్పష్టం చేయగా వీరారెడ్డి అంగీకరించారు.

క్లుప్తంగా...

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులు

ప్రభుత్వానికి టీచర్స్ గిల్డ్ కృతజ్ఞతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 2,150మంది ఎయిడెడ్ ఉపాధ్యాయ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య కార్డుల సదుపాయం కల్పించడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తంచేసింది. ఎయిడెడ్ సిబ్బందికి 1998 నుంచి మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం గానీ, 2008 నుంచి హెల్త్ కార్డులు గానీ గత ప్రభుత్వాలు ఇవ్వలేదని తెలిపారు. ఆరోగ్య కార్డులు లేక కరోనా సమయంలో రాష్ట్రంలో 169 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులు ఇబ్బందిపడ్డారని పేర్కొన్నారు. ఆరోగ్య కార్డులతో ప్రస్తుతం రాష్ట్రంలోని 823 ఎయిడెడ్ స్కూళ్లలో పని చేస్తున్న సిబ్బంది కుటుంబాలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కార్డుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీలు ఎంవీ రామచంద్రారెడ్డి, పర్వత చంద్రశేఖర్‌రెడ్డి, కల్పలతారెడ్డికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి ఎల్‌కే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మాతాశిశు మరణాలు తగ్గించడమే లక్ష్యం

వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మాతాశిశు మరణాల రేటును 2030 నాటికి గణనీయంగా తగ్గించాలన్న లక్ష్యంతో బహుముఖ విధానాన్ని రూపొందించి, అనుసరిస్తున్నామని వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అన్నారు. విజయవాడలో జరిగిన ఎంపీసీడీఎస్ఆర్ సమీక్షా సమావేశం, కన్సల్టేషన్ వర్క్‌షాప్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన ప్రసూతి, శిశు సేవలపై వివరణాత్మక ప్రసంగం చేశారు. అలాగే మెటర్నల్, చైల్డ్ డెత్స్ సర్వేలెన్స్, రెస్పాన్స్ కమిటీ రివ్యూ మీటింగ్‌ను గురువారం విజయవాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణబాబు మాట్లాడుతూ ఐదేళ్లలోపు శిశు మరణాల రేటు 2019లో వెయ్యికి 31 ఉండగా, 2020లో వెయ్యికి 27కు తగ్గించామన్నారు. నవజాత శిశువుల అనారోగ్యం, మరణాలను తగ్గించడానికి, పుట్టినప్పుడు అవసరమైన నవజాత సంరక్షణను అందించడానికి డెలివరీ పాయింట్ల వద్ద 1,364 నవజాత శిశువు సంరక్షణ కార్నర్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్‌ఎస్‌లు, ఎయిమ్స్ మంగళగిరి, ఫెర్నాండెజ్ ఫౌండేషన్, నూరా హెల్త్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాట్ ఉత్తర్వుల అమలుతో ప్రభుత్వానికి నష్టంలేదు

- సీనియర్ ఐపీఎస్ ఏబీవీ కేసులో హైకోర్టు వ్యాఖ్య
- ఆయన్ను విధుల్లోకి తీసుకున్నా క్రిమినల్ చర్యలు కొనసాగించవచ్చు



సాక్షి, అమరావతి: నిఘా పరికరాల కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడి సస్పెండైన సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు (ఏబీవీ)ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) ఇచ్చిన ఉత్తర్వుల వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి నష్టం వాటిల్లదని హైకోర్టు చెప్పింది. క్యాట్ ఉత్తర్వుల అమలును నిలిపేస్తే ఏబీవీకి పెద్ద నష్టం జరుగుతుందని తెలిపింది. ఏబీవీ సర్వీసును, ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు తెలిపింది. ఆయన్ను విధుల్లోకి తీసుకున్నప్పటికీ ప్రభుత్వం క్రిమినల్ చర్యలు కొనసాగించుకోవచ్చునంది. ఏబీవీ కౌంటర్ దాఖలు చేసిన తరువాతనే క్యాట్ ఉత్తర్వుల అమలును నిలిపేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై విచారణ జరుపుతామంది. తదుపరి విచారణను జూన్ 20కి వాయిదా వేసింది. క్యాట్ ఉత్తర్వుల ప్రకారం ఏబీవీని సర్వీసులోకి తీసుకుంటే, అది కేసు ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందన్న ప్రభుత్వ వాదన సరికాదంది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ధర్మాసనం తన ఉత్తర్వుల్లో క్యాట్ ఉత్తర్వుల అమలును నిలిపేస్తున్నట్లు నేరుగా పేర్కొనలేదు.

తెలంగాణ

రెండు వెర్షన్లూ రాష్ట్ర గేయమే!

సాక్షి, హైదరాబాద్: 'జయ జయహే తెలంగాణ' గేయం రెండు వెర్షన్లను తెలంగాణ రాష్ట్ర గీతంగా ఆమోదించినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి దశాబ్దం పూర్తి అవుతున్న సందర్భంగా జూన్ 2న ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లోనే 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని జాతికి అంకితం చేస్తామని చెప్పారు. తెలంగాణ కవి, రచయిత అందెశ్రీ 20 ఏళ్ల క్రితం రాసిన ఈ గీతాన్ని యథాతథంగా ఆమోదించామన్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం.ఎం.కీరవాణి సంగీతంతో పాటు స్వరాలు కూర్చినట్లు తెలిపారు. ఈ మేరకు సీఎంఓ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. జయ జయహే తెలంగాణ గీతాన్ని 2.30 నిమిషాల నిడివితో ఒక వెర్షన్‌గా, 13.30 నిమిషాల పూర్తి నిడివితో మరో వెర్షన్‌గా రూపొందించారు. రెండున్నర నిమిషాల వెర్షన్ ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆలపించేందుకు వీలుగా మూడు చరణాలతో ఉంటుందని సీఎం ప్రకటించారు. ఈ రెండింటినీ రాష్ట్ర గీతంగానే పరిగణిస్తామని స్పష్టం చేశారు.

సాధికారతతో పెరిగిన మహిళా ఓటింగ్

ఆరు దశల పోలింగ్ సరళిపై ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మహిళా సాధికారతకు అనేక కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్రంలోని అక్క చెల్లెమ్మలు వారి కాళ్లపై వారు నిలబడటమే కాకుండా, కుటుంబానికి కూడా ఆర్థికంగా తోడ్పాటునందించడానికి పలు పథకాలు ప్రవేశపెట్టారు. చిన్న వ్యాపారాల నుంచి పరిశ్రమల ఏర్పాటు వరకు వారికి అండదండగా నిలిచారు. దీంతో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొన్నారు. కుటుంబంలో వారి ప్రాబల్యం పెరిగి, కుటుంబ పొదుపు పెరిగింది. రాష్ట్రంలో మహిళలు సాధించిన ఈ సాధికారత పెరిగిన డిపాజిట్ల ఖాతాల రూపంలో, ఈ ఎన్నికల్లో మహిళల ఓట్ల రూపంలో ప్రతిబింబించిందని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక చెబుతోంది. 2019 మార్చి నుంచి 2023 మార్చి వరకు రాష్ట్రంలో, దేశవ్యాప్తంగా మహిళల డిపాజిట్ల ఖాతాల్లో పెరుగుదల, రాష్ట్రంలో జరిగిన ఎన్నికలు, దేశవ్యాప్తంగా ఇప్పటివరకు జరిగిన 6 దశల లోక్‌సభ ఎన్నికల్లో పెరిగిన మహిళల ఓట్లను ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక విశ్లేషించింది. ఆంధ్రప్రదేశ్‌లో 2019 మార్చి నుంచి 2023 మార్చికి మహిళా డిపాజిట్ ఖాతాలు 90.4 లక్షలు పెరిగాయని తెలిపింది. తద్వారా మహిళలు నిర్ణయాత్మకంగా మారారని, దాని ఫలితంగానే 2019 ఎన్నికలను మించి 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో అదనంగా 8.4 లక్షల మంది మహిళలు ఓటు వేశారని నివేదిక వెల్లడించింది. ఈ సంవత్సరం ఎన్నికల్లో పురుషులకన్నా మహిళా ఓటర్లు పోలింగ్‌లో అత్యధికంగా పాల్గొన్నారని తెలిపింది. రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో ఓట్ల పెరుగుదల జనరల్ కేటగిరీ నియోజకవర్గాలకంటే ఎక్కువగా ఉండటం స్వాగతించదగ్గ అంశమని పేర్కొంది. ఆసక్తికరంగా, ప్రతి అదనపు 100 మంది పురుష ఓటర్లకు, ఎస్సీ నియోజకవర్గాల్లో 115 మంది, ఎస్టీ నియోజకవర్గాల్లో 111 మంది మహిళా ఓటర్లు ఉన్నారని, సాధారణ నియోజకవర్గాల్లో 105 మంది మహిళలు ఉన్నారని నివేదిక పేర్కొంది.

6 దశల్లో 54.3 కోట్ల మంది ఓటు వేశారని..

దేశవ్యాప్తంగా జరిగిన ఆరు దశల పోలింగ్‌లోనూ మహిళల ఓట్లు గతంలోకన్నా బాగా పెరిగాయని తెలిపింది. కేరళ, మణిపూర్ మినహా మిగతా అన్ని రాష్ట్రాల్లో 2019 ఎన్నికలకన్నా 2024 ఎన్నికల్లో మహిళా ఓట్లు 1.73 లక్షలు పెరిగినట్లు చెప్పింది. 2019 మార్చి నుంచి 2023 మార్చి నాటికి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో మహిళా డిపాజిట్ ఖాతాల సంఖ్య 30.97 కోట్లు పెరిగినట్లు నివేదిక పేర్కొంది. అత్యధికంగా ఉత్తర ప్రదేశ్‌లో 4.18 కోట్ల మహిళా ఖాతాలు, ఆ తరువాత ఢిల్లీలో 3.32 కోట్ల మహిళా ఖాతాలు పెరిగినట్లు తెలిపింది. 2024లో మొత్తం 57.8 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 2019లో తొలి 6 దశల్లో 54.3 కోట్ల మంది ఓట్లు వేశారని, ఎన్నికల సంఘం లెక్కల ప్రకారం 3.45 కోట్ల మంది ఓటర్లు పెరిగినట్లు నివేదిక వెల్లడించింది. పెరిగిన 3.45 కోట్ల మంది ఓటర్లలో, మహిళా ఓటర్లు 1.73 లక్షలు, పురుష ఓటర్లు 1.62 లక్షలుగా తెలిపింది. ఇలా మహిళా ఓటర్లు పురుషులకంటే నిర్ణయాత్మకంగా ఉన్నారని, ప్రతి 100 మంది పురుష ఓటర్లకు 107 మంది మహిళా ఓటర్లు ఉన్నారని నివేదిక విశ్లేషించింది.

2019తో పోలిస్తే 2024లో పెరిగిన మహిళా ఓటర్లు, మహిళల డిపాజిట్ ఖాతాలు ఇలా..

రాష్ట్రం	పెరిగిన మహిళల ఓట్లు (లక్షల్లో..)	పెరిగిన మహిళా డిపాజిట్ ఖాతాలు (లక్షల్లో..)
ఆంధ్రప్రదేశ్	8.4	90.4
అరుణాచల్	0.4	3.4
అసోం	41.8	86.2
బిహార్	10.3	218.6
ఛత్తీస్‌గఢ్	8.2	36.8
గోవా	0.2	3.0
గుజరాత్	3.4	79.4
హరియాణ	1.7	72.2
జమ్మూ-కశ్మీర్	7.3	13.5
జార్ఖండ్	9.4	74.1
కర్ణాటక	20.6	103.4
కేరళ	- 3.3	61.4
లఢాక్	0.0	1.9
మధ్యప్రదేశ్	5.7	180.6
మహారాష్ట్ర	10.8	243.9
మణిపూర్	-0.3	7.0
మేఘాలయ	1.7	4.0
ఢిల్లీ	1.1	332.6
ఒడిశా	5.1	138.8
పుదుచ్చేరి	0.1	6.0
రాజస్థాన్	1.5	167.4
సిక్కిం	0.2	1.2
తమిళనాడు	2.7	295.2
తెలంగాణ	14.8	67.0
త్రిపుర	0.9	- 0.6
ఉత్తరప్రదేశ్	6.4	418.6
పశ్చిమ బెంగాల్	16.0	266.5

ఆర్వో శ్రీలేఖపై ఈసీ వేటు

- ఆది నుంచి ఆమె తీరు వివాదాస్పదం..
- యర్రగొండపాలెంలో తొలి నుంచి వైఎస్సార్‌సీపీనే టార్గెట్
- ఈవీఎంలో గ్లాస్ గుర్తు మాయం వెనక తెరవెనుక మంత్రాంగం
- బహిరంగంగా టీడీపీ, బీజేపీ జెండాలు రెపరెపలాడినా పట్టించుకోని వైనం
- సీఎం జగన్ స్టిక్కర్ కనిపిస్తే చిందులు తొక్కడమే ఆమె పని
- వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లపై అక్రమ కేసులు

యర్రగొండపాలెం: సార్వత్రిక ఎన్నికల్లో ఏకపక్షంగా వ్యవహరించి వివాదాస్పద అధికారిగా మారిన ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్వో) పి.శ్రీలేఖపై ఎన్నికల కమిషన్ వేటు వేసింది. ఆమెను ఆర్వో బాధ్యతల నుంచి తప్పిస్తూ బుధవారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. వెలిగొండ ప్రాజెక్టు ప్రత్యేకాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఆమెకు ఎన్నికల కమిషన్ యర్రగొండపాలెం నియోజకవర్గ ఆర్వో బాధ్యతలు అప్పచెప్పింది. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వైఎస్సార్‌సీపీని టార్గెట్‌గా చేసుకుని ఆమె తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదంగా మారాయి. ప్రజలకు నీళ్లు సరఫరా చేసి పక్కన పడేసిన పాత ట్యాంకర్లపై ఉన్న సీఎం జగన్ బొమ్మతో కూడిన స్టిక్కర్లను



శ్రీలేఖ

సైతం ఆమె వదల్లేదు. అలాగే, నిబంధనల ప్రకారం వైఎస్సార్‌సీపీ ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు, స్టిక్కరింగ్‌లను సైతం ఆమె తొలగింపజేశారు. కానీ, అదే సమయంలో టీడీపీ కార్యాలయం వద్ద ఉన్న ఫ్లెక్సీలు, జెండాలను తొలగించేందుకు ఆమె శ్రద్ధ వహించలేదు. బస్టాండ్‌కు సమీపంలో జెండా కర్రపై బహిరంగంగా కనిపిస్తున్న ఆ పార్టీ చిహ్నం, అక్కడికి సమీపంలోని బీజేపీ కార్యాలయంపై ఉన్న బోర్డు, జెండాలను పట్టించుకోలేదు. పత్రికల్లో వార్తలు వచ్చినా ఆమె పట్టనట్లు వ్యవహరించారు. ఇదేంటని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నిస్తే కేసులు నమోదు చేస్తామని బెదిరింపులకు దిగారు. టీడీపీ, బీజేపీ ఫ్లెక్సీలు, జెండాలపై వివాదం చెలరేగడంతో వాటిని తొలగించారు. ఇక శ్రీలేఖ పచ్చనేతల ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చారని, ఆర్వో కార్యాలయంలో జరిగే ప్రతి సమాచారం టీడీపీ నేతలకు చేరవేసే వారని ఆమెపై ఆరోపణలున్నాయి. ఎన్నికల ప్రచారం సమయంలో స్టిక్కర్లు పంచారని, భోజనాలు పెట్టించారని వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిపై ఒక కేసు, ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్‌పై మూడు కేసులు, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ నర్రెడ్డి వెంకటరెడ్డిపై మూడు కేసులు నమోదు చేశారు.

గ్లాసు గుర్తుపై తెరవెనుక మంత్రాంగం..

ఇక నామినేషన్లు దాఖలు చేసిన వారిలో ఒక ఇండిపెండెంట్ అభ్యర్థికి గ్లాస్ గుర్తును కేటాయించాల్సి వచ్చింది. గత నెల 29న నామినేషన్ల ఉపసంహరణ సమయంలో ఆమె చివరివరకూ స్వతంత్ర అభ్యర్థులతో చర్చలు జరిపారని, ఆర్వో కార్యాలయం కేంద్రంగా చివరివరకూ నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయని ఆరోపణలు గుప్పుమన్నాయి. గాజు గ్లాస్ గుర్తు కేటాయిస్తే టీడీపీ అభ్యర్థికి ఇబ్బందులు ఎదురవుతాయని, ఆ పార్టీ నుంచి ఒత్తిళ్ల మేరకు ఆమె స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకునేలా చేశారని ఆరోపణలొచ్చాయి. ఈవీఎంలో కూడా ఆ గుర్తు కనిపించకుండా చేశారన్న విమర్శలున్నాయి. పోలింగ్ సమయంలో కూడా ఆర్వో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో అర్ధరాత్రి 12 గంటల నుంచి వేకువజామున 3గంటల వరకు పోలింగ్ నిర్వహించాల్సి వచ్చింది. ఎక్కువగా టీడీపీకి అనుకూలంగా ఉన్న గ్రామాలు కావడంతో పోలింగ్ కొనసాగిస్తూ వచ్చారని విమర్శలు వెల్లువెత్తాయి.

పచ్చ పత్రికలో అసత్య కథనం

ఒంగోలు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి బెదిరింపులకు గురైన మహిళా ఆర్వోపై వేటు.. అంటూ పచ్చపత్రిక ఈనాడులో ప్రచురితమైన కథనంలో ఏమాత్రం నిజంలేదని పలువురు ఖండించారు. ఎన్నికల సమయంలో ఆర్వోతో అభ్యర్థులు కలిసి మాట్లాడటం సహజమని.. అంతమాత్రాన బెదిరించారని ఆరోపించడం సరికాదని వారంటున్నారు. ఎన్నికల నిర్వహణ సక్రమంగా నిర్వహించలేక పోయారని, కౌంటింగ్ నిర్వహణ కూడా అదే విధంగా ఉండవచ్చన్న ఉద్దేశంతో ఆమెను విధుల నుంచి తప్పించి ఉంటారని వారు అభిప్రాయపడుతున్నారు.

స్వతంత్రుల ఏజెంట్లూ 'తమ్ముళ్లే'!

- ఆ మేరకు టీడీపీ బేరసారాలు
- కౌంటింగ్ కేంద్రాల్లో ఎక్కువ మంది తెలుగు తమ్ముళ్లు ఉండేలా ఎత్తుగడ
- అవసరమైతే గొడవలు చేసేందుకు సిద్ధంగా ఉండేలా వ్యూహం

సత్తెనపల్లి: జూన్ 4న కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎక్కువ మంది తెలుగు తమ్ముళ్లను పంపేలా కూటమి నేతలు వ్యూహాలు పన్నుతున్నారు. సార్వత్రిక ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, వారి ప్రతినిధులు, ఏజెంట్ల నియామకానికి గురువారంలోగా వివరాలు పంపాలని పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేశ్ బి లత్కర్ సూచించారు. ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ, ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులతోపాటు మరో 93 మంది అభ్యర్థులు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల బరిలో ఉన్నారు. అభ్యర్థుల తరఫున ఏజెంట్లు నియమించుకోవడానికి ఆధార్ కార్డులతో పాటు గుర్తింపు పత్రాలు, ఫొటోలు ఇస్తే గుర్తింపు కార్డులు జారీ చేస్తారు. గుర్తింపు పొందిన పార్టీలతో పాటు పోటీలో ఉన్న ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కూడా వారి తరఫున ఏజెంట్లను నియమించుకునేందుకు అవకాశం ఉండటంతో స్వతంత్ర అభ్యర్థులకు ఎరవేసి వారి తరఫున కూడా తమవారిని నియమించుకునే వ్యూహాన్ని పల్నాడు జిల్లాలోని ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులు పన్నుతున్నట్లు చర్చ జరుగుతోంది. స్వతంత్రంగా ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో ఉన్న అభ్యర్థుల తరఫున ఉన్న ఏజెంట్లకు బదులు టీడీపీ అభ్యర్థులు సొంత మనుషులను ఏజెంట్లుగా నియమించుకున్నట్లు సమాచారం. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి అభ్యర్థులు వారి ఏజెంట్లకు మాత్రమే ఎన్నికల కమిషన్ అనుమతిస్తుంది. దీంతో స్వతంత్ర అభ్యర్థుల తరఫున తమ అనుచరులను ఏజెంట్లుగా నియమించుకున్నట్టు తెలిసింది. లెక్కింపు కేంద్రం లోపల తమ వారు ఎక్కువ మంది ఉండేలా చూసుకుంటున్నారని, అందుకు ప్రధాన కారణం రౌండ్ల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు అధికారులు ప్రకటించగానే తమకు సమాచారం ఇచ్చేలా నమ్మకస్తులను ఏర్పాటు చేసుకున్నట్లు అనుచర వర్గం బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. అవసరమైతే లోపల గొడవలకు కూడా సిద్ధంగా ఉండేలా ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని రిటర్నింగ్ అధికారులు, పోలీసులు ఇలాంటి ప్రలోభాలను నిలువరిస్తారా! లేక చేతులు ఎత్తేస్తారా అనే చర్చ జోరుగా సాగుతోంది.

వ్యూహాత్మకంగా స్వతంత్రులుగా రంగంలోకి..

టీడీపీకి చెందిన కొందరినీ ముందుగానే వ్యూహం ప్రకారం స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేయించారు. ఇప్పుడు వారి తరఫున కూడా ఏజెంట్లుగా తెలుగు తమ్ముళ్లే వెళ్లబోతున్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో మొత్తం 15 మంది పోటీలో ఉన్నారు. వీరిలో వివిధ పార్టీల నుంచి 9 మంది బరిలో ఉంటే ఆరుగురు స్వతంత్రులున్నారు. స్వతంత్రులతో పాటు కొందరు బరిలో ఉన్న అభ్యర్థులనూ ప్రలోభాలకు గురి చేసి ఎలాగైనా చివరి ఘట్టమైన కౌంటింగ్ కేంద్రాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవాలని, అనుకూలంగా లేకపోతే గొడవలకు దిగాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

భారీగా నగదు, బంగారం పట్టివేత

- కావలి వద్ద రూ.2.62 కోట్ల విలువైన నగదు, బంగారం స్వాధీనం
- టంగుటూరు వద్ద 1.238 కేజీల బంగారం పట్టివేత
- తరలిస్తున్న వారంతా మిర్యాలగూడ వాసులే



నగదు లెక్కిస్తున్న సిబ్బంది

కావలి/టంగుటూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లా పరిధిలో పోలీసుల తనిఖీల్లో భారీగా నగదు, బంగారం దొరికాయి. కావలి వద్ద చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై ఉన్న గౌరవరం టోల్‌ప్లాజా సమీపంలో కావలి రూరల్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా నగదు, బంగారాన్ని పట్టుకున్నారు. వీటిని తరలిస్తూ పట్టుబడిన వారంతా తెలంగాణలోని మిర్యాలగూడకు చెందిన వారే కావడం గమనార్హం. ఈ వివరాలను కావలి డీఎస్పీ వెంకటరమణ మీడియాకు వెల్లడించారు. చెన్నై వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సును తనిఖీ చేయగా.. మిర్యాలగూడకు చెందిన మహిళలు తేజ, సుమతి వద్ద రూ.72.50 లక్షల నగదు బయటపడిందని చెప్పారు. వీటికి సంబంధించి ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే చెన్నై వెళ్తున్న మరో ట్రావెల్స్ బస్సును తనిఖీ చేయగా మిర్యాలగూడకే చెందిన శివమ్మ, యాదమ్మ వద్ద రూ.60 లక్షలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మరో బస్సులో వెళ్తున్న మిర్యాలగూడకే చెందిన పర్వీన్ వద్ద రూ.29 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చెన్నై నుంచి మిర్యాలగూడ వెళ్తున్న కారును తనిఖీ చేయగా.. మోహన్, ప్రభాకర్ అనే వ్యక్తుల వద్ద కిలోన్నర బంగారం బయటపడిందని చెప్పారు. ఈ బంగారానికి సంబంధించి రసీదులు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నగదు, మొత్తం బంగారం విలువ కలిపి రూ.2.62 కోట్లు ఉంటాయని వెల్లడించారు. అలాగే చెన్నై నుంచి మిర్యాలగూడకు కారులో వెళ్తున్న మద్దిశెట్టి మల్లేశ్, చంద్రకళ వద్ద 1.238 కేజీల బంగారు బిస్కెట్లను ప్రకాశం జిల్లా టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద సింగరాయకొండ పోలీసులు పట్టుకున్నారు.

అసైన్డ్ భూములపై రామోజీవి రోత రాతలు

- సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారన్న దుగ్ధతోనే పిచ్చి రాతలు
- దళితులకు భూములపై హక్కులు కల్పించేందుకే సీఎం జగన్ చట్టం తెచ్చారు
- దళితుల భూములు దోచుకుని ఫిలిం సిటీ నిర్మించింది రామోజీరావే
- మంత్రి మేరుగు నాగార్జున

సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కాబోతున్నారనే దుగ్ధతో రామోజీరావు, పచ్చ మీడియా అసైన్డ్ భూములపై రోత రాతలు రాస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున మండిపడ్డారు. ఆయన గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ దళితులకు వారి భూములపై హక్కులు కల్పించాలనే సీఎం జగన్ చట్టం తెచ్చారని, అది కూడా 2003కు ముందు ఉన్న భూములపైనే హక్కులు కల్పించారని తెలిపారు. ఇదంతా పారదర్శకంగానే చేశారన్నారు. అసైన్డ్ భూముల కుంభకోణానికి పాల్పడింది తెలుగుదేశం పార్టీ నేతలు, పచ్చ మీడియానే అని ఆరోపించారు. చంద్రబాబు



అమరావతిలో దళితుల భూములు ఎకరం కేవలం రూ.5 లక్షలకు కొని రూ.కోట్లు దోపిడీ చేశారని చెప్పారు. రామోజీరావు దళితుల భూములు దోచుకుని ఫిలిం సిటీని నిర్మించింది వాస్తవం కాదా.. అని నిలదీశారు. అందరి గురించి లేనివి ఉన్నట్లు, ఉన్నవి లేనట్లు పిచ్చి రాతలు రాసే రామోజీరావు ఈ విషయాలను ఈనాడులో ఎందుకు రాయలేదన్నారు. ఆయన అక్రమాలు చేసినా మంచి, ఇతరులు మంచి చేసినా అక్రమమా.. అని నిలదీశారు. వయస్సు పెరిగినా రామోజీ బుద్ధి మారలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీ అంటూ బడుగు, బలహీన వర్గాలను అక్కున చేర్చుకున్నారని తెలిపారు. చంద్రబాబు దళితవ్యతిరేకి అని చెప్పారు. దళితులలో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా.. అన్న చంద్రబాబును ప్రజలు ఎప్పుడో చెత్తబుట్టలో పడేశారని తెలిపారు. చంద్రబాబుకు, రామోజీకి దళితుల అభ్యున్నతి ఇష్టంలేదని, అందుకే దళితులకు లబ్ధి చేకూర్చే సీఎం జగన్ నిర్ణయంపై విషం కక్కుతున్నారని చెప్పారు. తాము చంద్రబాబులా దళితుల భూములను కొట్టేసి తప్పుడు పనులు ఎన్నటికీ చేయబోమన్నారు. రామోజీ వాస్తవాలు గ్రహించాలని, సీఎం జగన్ ప్రభుత్వంపై పిచ్చి రాతలు మానుకోవాలని అన్నారు.

నన్ను ఇష్టపడుతున్న అమ్మాయి ఎవరైనా ఉన్నారా?

- ఉంటే పెళ్లి చేసుకుంటా.. అంటూ ఫ్లెక్సీ
- చీరాలలో ఓ యువకుడి వినూత్న ర్యాలీ



సైకిల్‌కు ఫ్లెక్సీ కట్టి ప్రచారం చేస్తున్న యువకుడు

చీరాల: పెళ్లి సంబంధాలు రాకపోవడంతో ఓ పెళ్లి కాని ప్రసాద్ వినూత్నంగా ర్యాలీ నిర్వహించాడు. 'నేనంటే ఇష్టం ఉన్న అమ్మాయి ఎవరైనా తన పేరు, మొబైల్ నంబర్ నమోదు చేసుకుని వీలున్న రోజున నన్ను కలవగలరు. కుల పట్టింపుల్లేవు. నమ్మకం ఉన్న వాళ్లు వివరాలివ్వండి' అంటూ ఫ్లెక్సీ సైకిల్‌కు కట్టుకుని మరీ చీరాల ప్రధాన కూడలిలో మకాం వేశాడు. బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గం దేశాయిపేట పంచాయతీ రామన్నపేటకు చెందిన దేవన నీలకంఠ అయ్యప్పకుమార్ డిగ్రీ చదివి.. వయసు పైబడిన బ్యాచిలర్. తనను ఇష్టపడే అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని ఆకాంక్ష మాత్రం ఎక్కువగా ఉంది. తల్లిదండ్రులు లేరు. ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. గతంలో ఇలాగే కరపత్రాలు ముద్రించి వేటపాలెంలో పంచాడు. మళ్లీ గురువారం చీరాలలో ఇలా హల్‌చల్ చేశాడు.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా

సాక్షి, మచిలీపట్నం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమం జూన్ 4న నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నేతలు, ఏజెంట్లు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. కృష్ణాజిల్లా మచిలీపట్నానికి గురువారం వచ్చిన ఆయన కృష్ణా విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. అక్కడ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములు.. భద్రత, కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఇక్కడ చేసిన, చేయనున్న ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ ఆస్మిలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గాల వారిగా లెక్కింపు కేంద్రాలు, టెబుళ్లు, రౌండ్ల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. లెక్కింపు సమయంలో అభ్యర్థి లేదా వారి ఏజెంట్ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిని కౌంటింగ్ హాల్ నుండి బయటకు పంపేస్తామన్నారు. కౌంటింగ్ రోజున ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ముఖేష్‌కుమార్ మీనా అధికారులకు సూచించారు.



కృష్ణా యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ ఏర్పాట్లను తనిఖీ చేస్తున్న సీఈఓ ముఖేష్‌కుమార్ మీనా

పోస్టల్ బ్యాలెట్ల అంశం సీఈసీ పరిధిలో ఉంది..

పోస్టల్ బ్యాలెట్లపై వైఎస్సార్‌సీపీ చేసిన విన్నపాన్ని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని, అది సీఈసీ పరిధిలో ఉందని ముఖేష్‌కుమార్ మీనా వెల్లడించారు. నేడో, రేపో దీనిపై స్పష్టత వచ్చే అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, గన్నవరం రిటర్నింగ్ అధికారి గీతాంజలి శర్మ, డీఆర్‌ఓ కె.చంద్రశేఖరరావు, పలువురు రిటర్నింగ్ అధికారులు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి షాహిద్ బాబు, సర్వే ల్యాండ్ రికార్డుల ఏడీ మనీషా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి ఊరట

- చాపాడు పోలీసులు నమోదు చేసిన కేసులో మధ్యంతర ముందస్తు బెయిల్
- 6వ తేదీ వరకు అరెస్ట్‌తో సహా ఎలాంటి తొందరపాటు చర్యలొద్దని హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: చాపాడు పోలీసులు నమోదు చేసిన కేసులో వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనేందుకు వీలుగా ఈ నెల 6వ తేదీ వరకు పలు షరతులతో మధ్యంతర ముందస్తు బెయిలు మంజూరు చేసింది. అరెస్ట్‌తో సహా ఆయన విషయంలో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని చాపాడు పోలీసులను హైకోర్టు ఆదేశించింది. రఘురామిరెడ్డిపై నిఘా ఉంచేలా పోలీసులను ఆదేశించాలని ఎన్నికల సంఘానికి స్పష్టం చేసింది. ఎలాంటి నేరపూరిత చర్యల్లో పాల్గొనవద్దని, పునరావృతం చేయరాదని రఘురామిరెడ్డిని ఆదేశించింది. జిల్లాలో శాంతిభద్రతల సమస్య సృష్టించరాదని చెప్పింది. ప్రజాశాంతికి, సాక్షుల రక్షణకు ఎలాంటి విఘాతం కలగకుండా, అనుచరులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా చూడాలని ఆదేశించింది. అనుచరుల బాధ్యత రఘురామిరెడ్డిదేనని స్పష్టం చేసింది. ఈ కేసు గురించి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో మాట్లాడవద్దని ఆదేశించింది. సాక్షులు, బాధితులతో సంభాషించవద్దని, వారిని బెదిరించడం వంటివి చేయరాదని ఆదేశించింది. పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో మాత్రమే ఉండాలని, ఒకవేళ కౌంటింగ్ కేంద్రం మరో చోట ఉంటే కౌంటింగ్ రోజున ఆ కేంద్రానికి వెళ్లొచ్చునని తెలిపింది. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 లోపు ఎస్పీ ముందు హాజరు కావాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 6వ తేదీకి వాయిదా వేసింది.

అందరు అభ్యర్థులకిచ్చినట్లే రఘురామిరెడ్డికి కూడా

ఎన్నికల రోజున చాపాడు మండలం పరిధిలో టీడీపీ కూటమికి చెందిన పలువురు వ్యక్తులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో పాటు మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డిపైన కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చాపాడు పోలీసులు ఎస్సీ, ఎస్టీ చట్టంతో పాటు ఐపీసీ సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో బెయిల్ కోరుతూ రఘురామిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ జ్యోతిర్మయి విచారణ జరిపారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. గొడవకు ప్రేరేపించారన్నదే రఘురామిరెడ్డిపై ఉన్న ఆరోపణ అని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేసు చెల్లదన్నారు. ఆయన 4వ తేదీన జరిగే కౌంటింగ్ ప్రక్రియలో పాలుపంచుకోవాల్సి ఉందన్నారు. అందువల్ల ఆయనకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపిస్తూ, 12 మంది సాక్షులను విచారించామని చెప్పారు. ఫిర్యాదుదారు, బాధితులకు చిన్న గాయాలే అయ్యాయని తెలిపారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, ఎన్నికల్లో పోటీ చేస్తున్న కొందరు అభ్యర్థులకు ఇచ్చినట్లే రఘురామిరెడ్డికి సైతం మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేశారు.

సర్వస్తోత్రాలకు అర్హుడు అల్లాహ్ మాత్రమే! ఆకాశాలు మరియు భూమి యొక్క సృష్టికి మూలాధారి. ఆయన తన సృష్టిలో తాను కోరిన దానిని అధికం చేస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ ప్రతీదీ చేయగల సమర్థుడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 31 మే 2024

ప్రకృతి వికృతి

రికార్డులు బద్దలవుతున్నాయి. వారం రోజుల్లోనే అటు రాజస్థాన్‌లో, ఇటు దేశ రాజధానిలో తాపమానం తారాజువ్వలా పైకి ఎగసింది. ఒక్క బుధవారమే రాజస్థాన్‌లో ఉష్ణోగ్రతలు పలుచోట్ల 50 డిగ్రీల సెంటీగ్రేడ్‌ను దాటేశాయి. వాయవ్య ఢిల్లీలోని ముంగేశ్‌పూర్‌లో దేశచరిత్రలోనే అత్యధికంగా 52.9 డిగ్రీలు నమోదైనట్టు స్థానిక వాతావరణ కేంద్రం నుంచి వెలువడ్డ వార్త సంచలనమైంది. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) లెక్కల్లో ఏమన్నా తప్పు దొర్లిందేమో అని అమాత్యులు అత్యుత్సాహమూ చూపారు. సరిచూసుకోవడంలో తప్పు లేదు కానీ, అన్నిటికీ ప్రామాణికమని ప్రభుత్వమే చెప్పే ఐఎండీని పక్కనబెట్టినప్పటికీ ఈ వేసవిలో దేశంలో ఉష్ణోగ్రతలు ఎన్నడెరుగని స్థాయికి చేరిన మాట చెమటలు పట్టిస్తున్న నిజం. క్రమంగా ఈ ప్రచండ ఉష్ణపవనాలు తగ్గుతాయని చెబుతూనే, ఉత్తర భారతావనికి ఐఎండీ 'రెడ్ ఎలర్ట్' జారీ చేయడం గమనార్హం. గత రెండున్నర నెలల్లో దేశవ్యాప్తంగా కనీసం 16.5 వేల మందికి పైగా వడదెబ్బకు గురైతే, పదుల మరణాలు సంభవించాయి. ఒకపక్క ఈశాన్యంలో రెమాల్ తుపాను బీభత్సం, మరోపక్క పశ్చిమ, ఉత్తర భారతావనుల్లో ఉష్ణోగ్రతల నిప్పులగుండం ఒకేసారి సంభవించడం ప్రకృతి వికృతికి చిహ్నం.

ఒక్క మనదేశంలోనే కాదు... ఇవాళ ప్రపంచవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు, అసాధారణ వాతావరణ మార్పులు కనిపిస్తున్నాయి. 2013 నుంచి 2023 మధ్య పదేళ్ళ కాలంలో అంటార్కిటికాతో సహా ప్రపంచంలో దాదాపు 40 శాతం ప్రాంతంలో అత్యధిక రోజువారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరీ ముఖ్యంగా గత రెండు మూడేళ్ళలో వివిధ దేశాల్లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 2021లో యూరప్‌లోకెల్లా అత్యధికంగా ఇటలీలోని సిసిలీలో తాపమానం 48.8 డిగ్రీలు చేరింది. 2022 జూలైలో అమెరికాలో ఉష్ణోగ్రత తొలిసారిగా 40 డిగ్రీలు దాటింది. నిరుడు చైనా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఓ పట్టణంలో 52 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఏడాది మన దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా సాధారణం కన్నా 5 నుంచి 10 డిగ్రీలు పెరగడం ఆందోళనకరం. ఇది మన స్వయంకృతం. పచ్చని చెట్లు, నీటి వసతులు లేకుండా కాంక్రీట్ జనారణ్యాలుగా మారుతున్న నగరాలతో మీద పడ్డ శాపం.

గత 2023 ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన వత్సరమైతే, ఈ 2024 కూడా అదే బాటలో నడుస్తోంది. నిజానికి, ప్రకృతి విపత్తుల స్వరూప స్వభావాలు గత 20 ఏళ్ళలో గణనీయంగా మారాయి. దేశంలో నిరుడు శీతకాలమైన ఫిబ్రవరిలోనే వడగాడ్పులు చూశాం. అనూహ్య వాతావరణ పరిస్థితులు, అందులోనూ తీవ్రమైనవి ఇవాళ దేశంలో తరచూ ఎదురవుతున్నాయి. భరించలేని ఎండలు, భారీ వరదలకు దారి తీసేటంత వానలు, బయట తిరగలేనంత చలి... ఒక దాని వెంట మరొకటిగా బాధిస్తున్నాయి. గతంలో భరించగలిగే స్థాయిలో ఉండే ప్రకృతి సిద్ధమైన వేసవి ఎండ, వడగాడ్పులు ప్రకోపించి... సరికొత్త విపత్తులుగా పరిణమించాయి. ఒకప్పుడు అసాధారణమైన 45 డిగ్రీలు సర్వసాధారణమై, ఇక 50 డిగ్రీల హద్దు తాకుతున్నాం. దేశవ్యాప్త ప్రచండ గ్రీష్మం అందులో భాగమే. పైగా, అధిక వర్షపాతంతో పర్వత ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడడం, లోతట్టున ఆకస్మిక వరదలు రావడం... భరించలేని గ్రీష్మతాపంతో కార్చిచ్చులు రేగడం... ఇలా గొలుసుకట్టు చర్యలా ఒక వైపరీత్యం మరొకదానికి దారి తీయడమూ పెరుగుతోంది.

మరో వారం పదిరోజుల్లో ఋతుపవనాల ప్రభావంతో ఎండలు తగ్గాక అనూహ్యమైన తుపానుల బెడద ఉండనే ఉంది. ఇప్పటికే ఆదివారం బెంగాల్ తీరం తాకిన రెమల్ తుపానుతో నాలుగైదు ఈశాన్య రాష్ట్రాలు దెబ్బతిన్నాయి. పెరుగుతున్న భూతాపం, దరిమిలా వాతావరణ మార్పుల వల్ల రానున్న రోజుల్లో ఇలాంటివి మరింత తీవ్రస్థాయిలో సంభవించే ప్రమాదం ఉంది. అందులోనూ ఇప్పటి తుపానులకు రెండింతల విధ్వంసం సృష్టించగలిగినవి వస్తాయని పలు అధ్యయనాల అంచనా. ఈ ముప్పు నుంచి తప్పించుకొనేందుకు అస్సామ్, మిజోరమ్, మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్ సహా రాష్ట్రాలన్నీ సన్నద్ధం కావాలి. తుపాను వస్తుందంటే ఒడిశా లాంటివి ప్రజల్ని ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు నమూనా ప్రణాళికల్ని సిద్ధం చేసుకొని, ప్రాణనష్టాన్నీ, ఆస్తినష్టాన్నీ తగ్గించుకుంటున్న తీరు నుంచి అందరూ పాఠాలు నేర్వాలి.

అసలు మన దేశంలో జాతీయ విపత్కాల నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) దాదాపు రెండు దశాబ్దాలుగా ఉంది. 1999లో ఒరిస్సాలో భారీ తుపాను, 2004లో సునామీ అనంతరం 2005లో దాన్ని స్థాపించారు. అప్పటి నుంచి జాతీయ విపత్తుల అంచనా, నివారణ, విపత్కాల పరిస్థితుల నిర్వహణ, బాధితుల సహాయ పునరావాసాలకు అది కృషి చేస్తోంది. ఎక్కడ ఏ మేరకు పనిచేస్తున్నాయన్నది పక్కనపెడితే, ప్రస్తుతం దాదాపు ప్రతి రాష్ట్రమూ దేనికది విపత్కాల నిర్వహణ సంస్థ పెట్టుకుంది. అయితే, ఇది చాలదు. అంతకంతకూ పెరుగుతున్న విపత్తుల రీత్యా కొత్త అవసరాలకు తగ్గట్టుగా ఈ వ్యవస్థలలో సమూలంగా మార్పులు చేర్పులు చేయాలి. వేడిమిని తట్టుకొనేందుకు శీతల కేంద్రాల ఏర్పాటు, విస్తృతంగా చెట్ల పెంపకం, పునర్వినియోగ ఇంధనాల వైపు మళ్ళడం లాంటివి ఇక తప్పనిసరి. థానే లాంటి చోట్ల ఇప్పటికే అమలు చేస్తున్న పర్యావరణహిత ప్రణాళికల లాంటివి ఆదర్శం కావాలి. ఎండ, వాన, చలి... ఏది పెచ్చరిల్లినా తట్టుకొనేలా ప్రాథమిక వసతి సౌకర్యాల కల్పన సాగించాలి. వేసవి ఉక్కపోత పోయిందని సంబరపడే లోగా భారీ వర్షాలు విపత్తుగా పరిణమించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇకనైనా ప్రకృతి ప్రమాదఘంటిక వినకుంటే కష్టమే!

బహుజన హితాయ... బహుజన సుఖాయ

అభిప్రాయం



రావెల కిషోర్ బాబు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజ్యాధికారంలో న్యాయబద్ధమైన ప్రాతినిధ్యం లభించాలనీ, తద్వారా అంబేడ్కర్ కలలుగన్న సమ సమాజ నిర్మాణాన్ని సాధించవచ్చుననీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఒక గొప్ప సామాజిక పరివర్తనకు శ్రీకారం చుట్టారు. బహుజన కులాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేలా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను రూపొందించి, భారత దేశ సంక్షేమ పాలనా రంగంలో ఒక గొప్ప విప్లవాన్ని సృష్టించారు. అసమానతలతో నిండివున్న విద్యారంగంలో వినూత్నమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టి, పేద వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ఆధునిక విద్యను అందజేశారు. పేద ప్రజల గుండెల్లో ఒక పెద్దకొడుకు స్థానాన్ని పొందిన జగనే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని బహుజనులు ఎదురుచూస్తున్నారు.

తరతరాలుగా భారత దేశంలోని నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ వలన అణచివేయబడిన వారికి రాజ్యాధికారం సాధించాలని 1935లో ఇండియన్ లేబర్ పార్టీని స్థాపించి జీవితకాలం ఆ రాజ్యాధికార సాధనే లక్ష్యంగా పని చేశారు అంబేడ్కర్. తరువాత కాలంలో ఆ ఆశయ సాధన కోసం మాన్య కాన్షీరాం బహుజన కులాలను ఐక్యం చేయడానికి 1975లో బ్యాక్వార్డ్ క్లాసెస్ అండ్ మైనారిటీస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (బాంసెఫ్) స్థాపించి లక్షలాది మందని సమీకరించారు. వారికి అంబేడ్కరిజాన్ని బోధించి, వారిని భారతదేశ రాజకీయ భవిష్యత్తును మార్చడానికి సమాయత్తం చేశారు. 1985లో కాన్షీరాం బహుజన సమాజ్ పార్టీని స్థాపించి పదేళ్లలోనే దాన్ని జాతీయ పార్టీగా తీర్చిదిద్దారు.

భారత దేశ రాజకీయాలలో కాన్షీరాం తరువాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజ్యాధికారంలో తమకు రావలసిన న్యాయబద్ధమైన ప్రాతినిధ్యం లభించాలనీ, తద్వారా అంబేడ్కర్ కలలుగన్న సమ సమాజ నిర్మాణాన్ని సాధించవచ్చుననీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి (జగనన్న) ఒక గొప్ప సామాజిక పరివర్తనకు శ్రీకారం చుట్టారు. బహుజన కులాలలో ఆత్మ విశ్వాసాన్ని నింపుతూ వారిని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేలా పెద్ద ఎత్తున అనేక సంక్షేమ పథకాలను రూపొందించి, భారత దేశ సంక్షేమ పాలనా రంగంలో ఒక గొప్ప విప్లవాన్ని సృష్టించారు. 'నా ఎస్సీ, నా బీసీ, నా మైనారిటీ'లంటూ బహుజన కులాలను సొంతం చేసుకొని వారిలో ఆత్మ న్యూనతా భావాన్ని తొలగించి మనోబలాన్ని, నూతన ఉత్సాహాన్ని నింపారు.

కనీస గుర్తింపునకు నోచుకోని బీసీ కులాలను గుర్తించి, 56 బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి, పెద్ద ఎత్తున చైర్మన్, డైరెక్టర్ పదవులను బీసీలకు ఇచ్చిన ఘనత జగన్ ప్రభుత్వానిదే. ఇవ్వాళ వైఎస్సార్సీపీ తరపున 11 మంది రాజ్యసభ సభ్యులుండగా వారిలో నలుగురు బీసీలు ఉండటం గమనార్హం. అసెంబ్లీ స్పీకర్, శాసన మండలి చైర్మన్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్, మంత్రి పదవులను బీసీలకు కేటాయించి వారికి రాజకీయంగా సముచిత స్థానాన్ని కల్పించడం జరిగింది. 70 శాతం జిల్లా పరిషత్ చైర్మన్ పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు మైనారిటీలకి కేటాయించడం అనేది బహుజన కులాల పట్ల జగన్ చిత్తశుద్ధి, అంకిత భావాలను సూచిస్తుంది.

భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయనటువంటి అనేక సంక్షేమ పథకాలను బహుజన పేదవర్గాల సాధికారత కోసం అమలు చేస్తూ 'బహుజన సుఖాయ బహుజన హితాయ' అనే మౌలిక సూత్రాన్ని పాటించడం జగన్ మానవతా, సమతావాదాన్ని ప్రతిబింబిస్తుంది. అక్షరాలా రూ.2.70 లక్షల కోట్ల నిధులను అనేక సంక్షేమ పథకాల ద్వారా నేరుగా బహుజన వర్గాల లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లలో



దళారులతో పని లేకుండా పారదర్శకంగా జమ చేయడం సంక్షేమ రంగంలో ఒక నూతన విప్లవాత్మక సంస్కరణగా చెప్పుకోవచ్చు. దీనికి అదనంగా పరోక్షంగా రూ.1.30 కోట్లను గృహనిర్మాణం వంటి ఇతర సంక్షేమ పథకాల కోసం వినియోగించడం కూడా గమనించగలం.

అసమానతలతో నిండి వున్న విద్యారంగంలో వినూత్నమైన సమూల సంస్కరణలకు శ్రీకారం చుట్టి, పేద వర్గాల విద్యార్థులకు నాణ్యమైన మేలైన ఆధునిక విద్యను అందజేసిన ఘనత జగన్ ప్రభుత్వానిదే. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణకు రూ.73,000 కోట్లు వెచ్చించి వాటిని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు. పేద విద్యార్థులకు ఉచిత విద్యనందించేందుకు రూ.46,000 కోట్లను అమ్మ ఒడి పథకం ద్వారా అందించడం మరో గొప్ప అడుగు. ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టడం, డిజిటల్ విద్యాబోధన, విద్యార్థులకు ట్యాబుల పంపిణీ వంటివి అమలు చేసి పేద విద్యార్థుల ప్రగతికి బంగారు బాటలు వేయడం జరిగింది. అర్హులైన పేద విద్యార్థుల విదేశీ విద్యకోసం ఒక్కొక్కరికి 1.25 కోట్ల రూపాయల వరకు వెచ్చించడం ఒక అద్భుతమైన అవకాశంగా గుర్తించాలి.

బహుజన పేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సదుపాయాలను కల్పించడానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికీకరణ చేయడం, కావలసిన నూతన వైద్య పరికరాలను సమకూర్చడం, తగినంత మంది వైద్య సిబ్బందిని నియమించడం, సమర్థవంతమైన పర్యవేక్షణతో మెరుగైన సేవలు అందించడం వంటి అనేక చర్యలను వైసీపీ ప్రభుత్వం తీసుకొంది. ఆరోగ్య శ్రీ పథకాన్ని మరింత విస్తృత పరిచి, ఒక వ్యక్తికి వెచ్చించే గరిష్ఠ పరిమితి ఖర్చును 25 లక్షలకు పెంచారు. ఉచిత కంటి పరీక్షలు, విలేజ్ మరియు వార్డు క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్లు, సంచార హాస్పిటల్స్ వంటి అనేక నూతన పథకాల ద్వారా పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం ఎంతో ఆదర్శవంతమైంది.

సొంత ఇల్లు కావాలనే పేదల స్వప్నాన్ని సాకారం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి, 31 లక్షల మందికి ఇళ్ళను నిర్మించి ఇచ్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే. ఈ కాలనీలలో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించి, కుల వివక్ష అనే సామాజిక మహమ్మారికి తావు లేకుండా సకల జనుల సహజీవనానికి నాంది పలికింది. నా అన్నవారు లేక ఆర్థికంగా నిస్సహాయ స్థితిలో వుండే వృద్ధులకు నెలకు రూ.3,000 పెన్షన్ రూపంలో వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఇంటి వద్దనే ఇచ్చే పద్ధతిని అవలంబించడం అనేది నిజంగా ఒక గొప్ప పథకం. మానవతా దృక్పథంతో వృద్ధులకు జగన్ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం భారతదేశానికే ఒక ఆదర్శంగా నిలిచింది. 66 లక్షల మంది వృద్ధుల జీవితాల్లో వెలుగు నింపి వారి గుండెల్లో ఒక పెద్దకొడుకు స్థానాన్ని శాశ్వతంగా పొందడం జగనన్నకే దక్కింది.

మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించి ప్రభుత్వ పరిపాలనను గ్రామ స్థాయికి తెచ్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే అని చెప్పాలి. గ్రామ సచివాలయాలు గ్రామ పరిపాలనకు కేంద్ర బిందువుగా మారి అన్ని రకాల పౌర సేవలను అందిస్తూ ప్రజల వద్దకు పరిపాలన అన్న ఉన్నత ఆశయాన్ని సాధించడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విజయవంతమైంది. గ్రామాలలో నివసించే రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా మెరుగైన సేవలను అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దింది. సమాజంలో అన్ని రకాల అణచివేతకు, అవమానాలకు గురి అయిన స్త్రీ జాతి సాధికారతకు, రక్షణకు, ఆత్మ గౌరవానికి అనేక సంక్షేమ పథకాలలో పాటు 'దిశ' పోలీస్ స్టేషన్ల వ్యవస్థను జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి నైపుణ్యాల అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా అనేక చర్యలు తీసుకొని నిరుద్యోగ సమస్యను సమర్థవంతంగా జగన్ ప్రభుత్వం పరిష్కరించింది. ఒక్క సచివాలయ వ్యవస్థ ద్వారానే 2.5 లక్షల ఉద్యోగాలను, ఆ యా రంగాలలో మరొక 2.5 లక్షల ఉద్యోగావకాశాలను కల్పించి మొత్తం 5 లక్షల మందికి ఉద్యోగావకాశాలను కల్పించడం జరిగింది. నాలుగు నౌకాశ్రయాలు, 14 సముద్ర పోర్టులు, ఒక పెద్ద విమానాశ్రయం, 17 మెడికల్ కాలేజీల వంటి అనేక ప్రాజెక్టులను చేపట్టి ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం అందరికీ తెలిసిన విషయమే.

బహుజనుల కోసం తన జీవితాన్ని అంకితం చేయడానికి జగన్ సిద్ధంగా ఉన్న విషయం గ్రహించిన బహుజనులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు మరలా ఆయన్నే ముఖ్యమంత్రిగా చూడాలనీ, సమసమాజం నిర్మాణం జరగాలనీ వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారు.

వ్యాసకర్త మాజీ మంత్రి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వందే భారతం



జూన్ 2న జరగనున్న మెక్సికన్ జాతీయ ఎన్నికల్లో ఇప్పటివరకూ 36 మంది అభ్యర్థులు హత్యకు గురయ్యారు. ప్రపంచ వ్యాప్త ఎన్నికల ప్రజాస్వామ్యాలను మనం ఎంతగా అధ్యయనం చేస్తే, ఇండియా అంత అద్భుతంగా కనబడుతుంది. అన్నట్టూ, మెక్సికో తలసరి ఆదాయం ఇండియా కంటే రెండున్నర రెట్లు ఎక్కువ.

– శమికా రవి, ఆర్థికవేత్త

నవ్వకూడదా?



దౌత్యకార్యాలయాల్లో పనిచేసేవారిని నవ్వడానికి, మర్యాదగా వ్యవహరించడానికి, దయగా ఉండటానికి ఎందుకు అనుమతించరో అర్థం కాదు. అక్కడికొచ్చే చాలా మంది టెన్షన్‌లో, అనిశ్చితిలో, ఆఖరికి ఒకింత భయంతో కూడా ఉంటారు. మానసికంగా వారిని కొంచెం తేలికపరిస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. కానీ మన దౌత్య సిబ్బంది అలా చేయరు.

– హర్ష భోగ్లే, క్రికెట్ కామెంటేటర్

మీ ఓటు వల్లే...



జనులారా, మీ ఓటు నిజంగా లెక్కలోకి వస్తుందా అని ఎవరైనా ఆశ్చర్యపోతుంటే, ఇది గుర్తుంచుకోండి. నల్లజాతి అమెరికన్లు ఓటు వేయడం వల్లనే... నేను అధ్యక్షుడినయ్యాను. కమలా హ్యారిస్ చారిత్రకంగా ఉపాధ్యక్షురాలయ్యారు. ఇక డోనాల్డ్ ట్రంప్ ఓడిపోయారు.

– జో బైడెన్, అమెరికా అధ్యక్షుడు

అలసట



నాకు 26 ఏళ్లు. ఉద్యోగం చేయడం మొదలుపెట్టాను. నాన్న ఎందుకు ప్రతిరోజూ రాత్రి తొమ్మిదిన్నర, పదికల్లా నిద్రపోయేవారో ఇప్పుడు అర్థమవుతోంది.

– అనుభా పాండే, జర్నలిస్ట్

ఉష్ణ ప్రపంచం




50 డిగ్రీల ఉష్ణోగ్రతల ప్రపంచానికి స్వాగతం. మిమ్మల్ని చల్లబరుచుకోవడానికి బిగించుకున్న ఏసీల్లో ఈ భరించలేని అధిక వేడిలో మంటలు రేగుతాయి. వేగంగా ఉద్గారాలు తగ్గకపోతే 60 డిగ్రీల ప్రపంచం ఎంతో దూరంలో లేదు. కర్బన ఇంధన వినియోగం మానేయడం తప్ప మరేదీ అధిక వేడి నుంచి ఈ భూగ్రహాన్ని మరొకటి కాపాడ లేదు.

– నీలిమ వల్లంగి, కాలమిస్ట్

చిత్రం చెక్కిలిపై చెదరని సంతకం!

1968 మే నెలలో, ఇటువంటి రాళ్ళు పగిలే ఎండల్లోనే ఒక ప్రభుత్వ బృందం అనంతపురం జిల్లా బయలుదేరింది. అక్కడి లేపాక్షి, తాడిపత్రి తదితర ప్రాంతాలను సందర్శించి అప్పటి ప్రభుత్వ పత్రిక 'ఆంధ్రప్రదేశ్' లో వ్యాసాలు రాయడానికి, ఒక రిపోర్ట్ తయారు చేయడానికని. అందుకోసం ఆ జట్టులో రాసేవాళ్ళు, ఫోటోలు తీసేవాళ్లు, బొమ్మలు వేయడానికి కూడా ఒక ఆర్టిస్ట్ ఉన్నారు. తెలుగు చిత్రకళ చెదరని సంతకాలలో ఒకరైన శీలా వీర్రాజు (శీలావీ) ఆ బృంద సభ్యుల్లో ఒకరు. ఆయన లేపాక్షి సందర్శన ఒక చిత్రకారుడి హోదాలో కాదు, సమాచారశాఖలో ఒక ఉద్యోగిగా మాత్రమే. అయినా చిత్రకళ మీద ఉన్న అభిరుచి కారణంగా తన స్కెచ్ బుక్ పట్టుకుని కదిలారు ఆ పురాతన శిథిలాలయ క్షేత్రానికి.

లేపాక్షి చేరి దేవాలయ చరిత్ర గురించి, శిల్పాల గురించి పూజారి చెబుతున్న వివరాలను ఒక చెవిన వింటూ, తన చేతనున్న స్కెచ్ బుక్‌ని బొమ్మలతో నింపేశారు శీలావీ. ఆయనకు ఆ దేవతలు, వారి కథలు – గాథలు, భక్తి, కైవల్యం, కైంకర్యం, ఏమీ పట్టలేదు. ఆయన అక్కడ చూసిందల్లా ఆ శిల్పాలనూ, కఠినమైన నల్లరాయికి ఉలి అంచు పరుసవేది తాకించి ఆ రాయీ రప్పా, బండలను వెన్న చేసి శిల్ప మూర్తులుగ మలచిన సంతకం తెలియని కళాకారుడి దప్పి మాత్రమే. పెద్ద శిలను లేపాక్షినందిగా మలచి, దాని మెడను చుట్టిన మంజీర శబ్దాలు మాత్రమే ఆయనకు వినపడ్డాయి. మోచేయి వంపులో స్కెచ్ పుస్తకాన్ని ఇరికించుకుని గంటల తరబడి బొమ్మను గీస్తే ఏం వస్తుంది. ఉద్యోగంలో ఉన్నత స్థానానికి ఎక్కగలిగే కాలి కింది మెట్టుగా పనికి వచ్చేనా? నలుగురు మనుషుల కళ్ల గుమ్మం గుండా వెళ్ళి గుండెను పలకరించేనా ఆర్ట్? కర్ట్ వానెగట్ అనే అమెరికన్ రచయిత బడి పిల్లలకోసం ఒక అద్భుతమైన లేఖను రాశారు. గుండెపొరలలో దాచుకుని పదేపదే తడుముకోవాల్సిన లేఖ అది. ఆ ఉత్తరంలో ఆయన పిల్లలను ఉద్దేశించి అన్నా, మనమందరం నేర్చుకోవలసిన పాఠం ఉంది. 'నాయనలారా మీరు ఏదైనా కళను అభ్యసించండి. అది పాడటం కావచ్చు. రాయడం కావచ్చు, బొమ్మలు గీయడం కావచ్చు, ఏదయినా కావచ్చు, కానీ కళలను అభ్యసించండి. డబ్బుకోసం, కీర్తికోసం, పెద్దపేరు కోసం కాదు. అనుభూతి చెందడం, మీలో ఏముందో తెలుసుకోవడం, టు మేక్ యువర్ సోల్ గ్రో వంటివాటి కోసం కళను తెలుసుకోండి'. జీవితాంతం శీలావీ అదే పని చేశారు. ఆయన కళ ద్వారా తన హృదయంలో దీపం వెలిగించుకున్నారు. దీపం దీపాన్ని వెలిగిస్తుంది అని నమ్మారు.



లేపాక్షిలో... శీలా వీర్రాజు (1968)

రాయి ప్రకృతిది, రాయిని చెక్కిన ఉలి లోహం ప్రకృతిది. బొమ్మను గీసుకున్న కాగితం ప్రకృతిది; పెన్సిల్ ముక్క తాలుకు బొగ్గు, దానిని ఇముడ్చుకున్న కలప ప్రకృతిలో భాగాలే. కాగితం మీద బొమ్మ వేయడం అంటే ప్రకృతి ప్రకృతిని కౌగిలించుకోవడమే. శీలా వీర్రాజు లేపాక్షిలో రెండు రోజులు ఉన్నారు. ఆ రెండు రోజుల్లో దాదాపు యాభై స్కెచ్‌లు గీసుకున్నారు. మండే సూర్యుడి కింద నిలబడి, కాలే రాళ్ళ మీద కూచుని బొమ్మలు గీశారు. ఈ బొమ్మలన్నీ దాదాపుగా 30 సెంటీ మీటర్ల వెడల్పు, 42 సెంటీ మీటర్ల కొలతల్లో వేసిన పెద్ద బొమ్మలు. ఫౌంటెన్ పెన్ గీతల బొమ్మలివి. ఎదురుగా కనిపిస్తున్న దృశ్యాన్ని బొమ్మ వేస్తున్నప్పుడు చిత్రకారుడి చూపు వస్తువు వైపే ఉంటుంది. చేతి వేళ్ళు, ఇంకు పెన్ను ముక్కు మాత్రమే కాగితాన్ని చూస్తుంటాయి. మంచి చిత్రకారుడి దృష్టి ఏమాత్రం కాగితాన్ని చూడదు. అంత పెద్ద కాగితం పై తొట్రుపడకుండా పరుగెత్తిన వీర్రాజు గీత తీవ్రత మనల్ని విస్మయుల్ని చేస్తుంది. తోటి చిత్రకారులను కొంచెం భయపెడుతుంది కూడా. కేవలం రెండు రోజుల్లో అంత పెద్ద బొమ్మలను, అంత నైపుణ్యంగా వేయడం మాట కాదు అనుకుంటామా, శీలావీ ఇంకోలా అంటారు: 'నేను అక్కడి శిల్పాలకు మాత్రమే స్కెచ్‌లు గీసుకున్నాను. గోడల మీద, పైకప్పు మీద రంగుల్లో చిత్రించిన పురాతన చిత్రాలు కూడా ఉన్నాయి. అచ్చమైన దేశీయ శైలి చిత్రాలవి. నేను వాటి జోలికి పోలేదు. సమయం చాలకపోవటం ఒక కారణమైతే, తీసుకెళ్లిన స్కెచ్ బుక్ పూర్తయిపోయి ఆ పల్లెటూళ్ళో డ్రాయింగ్ పేపర్లు దొరక్కపోవడం మరో కారణం'. ఈ రోజుల్లోలా విరివిగా దొరికే కాలమై ఉంటే ఈ బొమ్మలు చెప్పే కథ ఇంకోలా ఉండేది.

కాలం గడిచి కథలు కంచికి చేరుతాయి. గాలిపటాన్ని దారం వదిలేస్తుంది. రెండు సంవత్సరాల క్రితం శీలా వీర్రాజు కాలం చేశారు. ఆయన ఎగురవేసిన గాలిపటాన్ని తెగిపడనీయకుండా ఆయన సహచరి శీలా సుభద్రాదేవి ఎత్తిపట్టుకున్నారు. ఆయన చిత్రించిన ప్రతి బొమ్మల గాలిపటాన్నీ ఆకాశం ఎత్తుకు తీసుకు వెళ్ళి ప్రపంచానికి చూపించే పని ఆరంభించారు. శీలావీ లేపాక్షి స్కెచ్‌లతో పాటు రామప్ప, అజంతా–ఎల్లోరా, కోణార్క్ స్కెచ్‌లన్నీ కలిపి ఒక పెద్ద గాలిపటమంత పుస్తకం ప్రచురించారు. జూన్ ఒకటవ తేదీ శనివారం హైదరాబాదు రవీంద్రభారతిలో ఆ పుస్తక ఆవిష్కరణ, వీర్రాజు గారి సంస్మరణ.

– అన్వర్ । ఆర్టిస్ట్

(హైదరాబాదులో రేపు శీలా వీర్రాజు సంస్మరణ సభ)

గొప్ప పరిపాలనా దక్షురాలు

దేశమంతా ఈ నెల 31 నుంచి వచ్చే ఏడాది మే 31 దాకా అహిల్యాబాయి త్రిశత జయంతి ఉత్సవాలు జరుపుకుంటోంది. సాధారణ రైతు కుటుంబంలో జన్మించినప్పటికీ తెలివి, మేధస్సు, ధైర్యసాహసాలతో ఆమె మహారాణిగా ఎదిగారు. సువిశాల భూభాగంలో పరిపాలన చేసి ఎన్నెన్నో సంస్కరణలు తెచ్చారు. మహిళలకు ఆస్తి హక్కు, బాలిక విద్య కోసం కృషి చేసిన సంఘ సంస్కర్త ఆమె.

మహారాష్ట్రలోని అహ్మద్ నగర్ వద్ద గల చోండి గ్రామంలో అహిల్యాబాయి 1725 మే 31న జన్మించారు. ఆమె తల్లి సుశీలా షిండే, తండ్రి మంకోజీ షిండే. నేటి రాజకీయ భాషలో సంచార తెగల కుటుంబం ఆమెది. చిన్న నాటనే ఆమెకు గల భక్తి, నిర్భీతి చూసి మల్హార రావు హోల్కర్(మరాఠా సుబేదారు) ముగ్ధుడయ్యారు. తన కుమారుడు ఖాండేరావు హోల్కర్‌కు ఇచ్చి వివాహం చేశారు. అప్పుడామె వయస్సు పదేళ్లు, పెళ్లి కొడుకు వయస్సు పన్నెండేళ్లు. అలా రాజ కుటుంబంలోకి ప్రవేశించింది. అక్కడే యుద్ధ విద్యలు, ప్రజా పాలనా విద్యలు నేర్చింది. వారి మామగారి వెంట అనేక యుద్ధాలకు వెళ్లి, యుద్ధ విద్యలో నైపుణ్యం సంపాదించింది. గెరిల్లా యుద్ధ విద్యలో ఆరితేరింది.

అయితే, భర్త ఖాండే రావు 1754లో, తండ్రి వంటి మామ మల్హార రావు 1766లో, తర్వాతి ఏడాది కుమారుడు మాలే రావు... ఇలా ముఖ్యులందరూ అకాలంగా తనువు చాలించారు. ఈ పిడుగుపాటు ఘటనలతో అహిల్య కుంగిపోలేదు. 16 యేండ్ల కుమారుణ్ణి కోల్పోయిన దుఃఖంలోనే 1767లో సింహాసనం అధిరోహించారు. శివ భక్తురాలుగా శివుని ప్రతినిధిగా పరిపాలన చేపట్టారు. ఇండోర్‌కు దూరంగా, నర్మదా నదీ తీరాన ఉన్న మహేశ్వర్ (మధ్య ప్రదేశ్) గ్రామాన్ని తన ముఖ్య పట్టణంగా నిర్మించారు. అది సమగ్ర పట్టణాభివృద్ధి యోజనకు మంచి ఉదాహరణ.



కాశీ విశ్వనాథ ఆలయ ఆవరణలోని అహిల్యాబాయి హోల్కర్ విగ్రహం

గొప్ప సంస్కరణ వాది

మహిళలకు విద్య, భర్తను కోల్పోయిన మహిళలకు భర్త ఆస్తిపై హక్కు, వితంతువులకు పునర్వివాహం చేసుకునే అవకాశం, బాల్య వివాహాల పట్ల ఆంక్షలు... ఇలా ఎన్నో సాహసోపేత నిర్ణయాలు ఆమె తీసుకున్నారు. ఆమె పాలనలో అడవుల నరికివేతను నిషేధించారు. ఆదాయం ఇచ్చే చెట్లను నాటించారు. త్రాగుడును నిషేధించారు. వరకట్నాన్ని నిషేధించారు. ఆమె కోట తలుపులు సామాన్యులు తమ గోడు చెప్పుకోడానికి ఎప్పుడూ తీసే ఉండేవి. వ్యవసాయం కొరకు నూతన చెరువుల నిర్మాణం, నీటి నిల్వకు ట్యాంకులు, నదులపై ఘాట్‌లు నిర్మించారు. వస్త్ర పరిశ్రమ, పట్టు పరిశ్రమ ఉత్పత్తుల అమ్మకాలకు వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేశారు. మహేశ్వరీ చీరలు అంటే ఇప్పటికీ మంచి పేరే ఉంది!

భిల్లులు, గోండులు వంటి గిరిజనులకు భూములను ఇచ్చి వారిని వ్యవసాయం వైపు మళ్లించారు. అటవీ ప్రాంతంలో ప్రజలకు దారి చూపుతూ ఉండే భిల్లులకు ప్రజల నుండి భిల్ కావడి వంటి పన్నును సేకరించుకునేట్లు ప్రోత్సహించారు. ఆ ఆదాయంతో గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, అభివృద్ధి పథకాలు చేపట్టారు.

హిందూ ఆలయాల పునరుజ్జీవనం కోసం...

తన రాజ్యం పైకి ఇతరులు దాడికి వస్తే, గుర్రం ఎక్కి, ఖడ్గం చేతపట్టి రణరంగంలో స్వయంగా నేతృత్వం చేపట్టిన ధీర వనిత ఆమె. 1783లో జైపూర్ రాజ కుటుంబానికి చెందిన చంద్రావంత్‌ను అణిచి వేయడంలో ఆమె చూపిన యుద్ధ నైపుణ్యాన్ని నానా ఫడ్నవీస్ పొగుడుతూ ఆనాడు పూనాలో గాలిలో శతఘ్నులను పేల్చాడు.

ఆమె హిందూధర్మ పునరుజ్జీవనానికి ఎంతగానో కృషి చేశారు. విదేశీ పాలకుల వల్ల దేశ వ్యాప్తంగా ధ్వంసం అయిన 82 మందిరాలను తిరిగి నిర్మించారు. సోమనాథ్, రామేశ్వరం, కాశీ, గయ, పూరి, శ్రీశైలం... ఇలా అనేక మందిరాలను పునర్నిర్మాణం చేశారు. అన్నదాన సత్రాలను కట్టించారు. తన రాజ్యంలో అన్ని కులాల, మతాల ప్రజల పట్ల సమ భావంతో వ్యవహరించారు. కనుకనే టిప్పు సుల్తాన్ వంటి ముస్లిం రాజులు సైతం ఆమె ధార్మిక నిర్మాణాలకు అడ్డు చెప్ప లేకపోయారు. ఆమె సంస్థానంలో దేశంలోని 13 రాజ్యాలకు చెందిన ప్రతినిధులు ఉండేవారు. వివిధ రాజులతో మిత్రత్వం నడిపి, నూతన దౌత్య విధానాలకు దారి చూపారు. కనుకనే దేశ వ్యాప్తంగా వివిధ రాజుల రాజ్యాలలోని హిందూ దేవాలయాలను పునర్నిర్మాణం చేయగలిగారు.

సాధారణంగా కవులు... రాజులను పొగిడి ధన సేకరణ చేసుకుంటూ ఉంటారు. కవులు ఆమెను పొగుడుతూ కవిత్వం రాయడాన్ని ఆమె అంగీకరించేది కాదు. 'నన్ను పొగుడుతూ కవిత్వం చెబితే మీకు ఆదాయం ఉండదు. ఆ శివుడిని పొగడండి లేదా దేశాన్ని కాపాడుతున్న సైనికులను పొగుడుతూ కవిత్వం రాయండి' అనేది. అయినా ఆమెను లోకమాత, సాధ్వి, పుణ్యశ్లోక, మాతృశ్రీ వంటి బిరుదులతో ప్రజలు గౌరవించారు. 1795 ఆగస్ట్ 13న తన 70వ ఏట తనువు చాలించిన ఆమెను ధార్మిక ప్రవృత్తి కల్గిన పరిపాలకురాలిగా పాశ్చాత్య చరిత్రకారులు కొనియాడారు. ఆమె జన్మించి 300 ఏళ్లయింది. కర్మ యోగిగా, మాతృత్వం నిండిన రాణిగా ఆమెను పేర్కొనడం సముచితం.

– శ్యాంప్రసాద్ జీ । అఖిల భారతీయ సంరసతా ప్రముఖ్

(నేటి నుంచి అహిల్యాబాయి హోల్కర్ త్రిశత జయంతి ఉత్సవాలు ప్రారంభం)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: బ.అష్టమి ఉ.8.47 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: శతభిషం ఉ.5.50 వరకు, తదుపరి పూర్వాభాద్ర తె.4.08 వరకు (తెల్లవారితే శనివారం), వర్జ్యం: ఉ.11.46 నుండి 1.15 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.04 నుండి 8.56 వరకు, తదుపరి ప.12.24 నుండి 1.16 వరకు, అమృతఘడియలు: రా.8.41 నుండి 10.11 వరకు: రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం : 5.28, సూర్యాస్తమయం : 6.26.

పొగాకుకు రికార్డు ధర

కొండపిలో తొలిసారి కిలో రూ.325



సింగరాయకొండ: ప్రకాశం జిల్లా కొండపి పొగాకు వేలం కేంద్రంలో గురువారం రికార్డు స్థాయిలో ధర పలికింది. బోర్డు చరిత్రలోనే తొలిసారి అత్యధికంగా కిలో పొగాకు ధర రూ.325లు పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. ముప్పవరం, చోడవరం గ్రామాలకు చెందిన రైతులు 816 బేళ్లను వేలానికి తీసుకురాగా, వ్యాపారులు 712 బేళ్లను కొనుగోలు చేశారు. అత్యధిక ధర రూ.325, కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.261.96 పలికింది.

కూటమికి అనుకూలంగా ఈసీ వైఖరి

జీపీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్

కొరిటిపాడు(గుంటూరు): ఏపీ ఎన్నికల కమిషన్ పక్షపాతంగా, ఏకపక్షంగా కూటమికి మేలు జరిగేలా వ్యవహరిస్తున్నదని గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్ గురువారం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. దేశమంతా ఎన్నికల నిబంధనలు ఒక విధంగా ఉంటే ఏపీలో మాత్రం ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఎన్నికల కమిషన్ కూటమికి అనుకూలంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి డిక్లరేషన్ ఫారంపై గెజిటెడ్ ఆఫీసర్ ఆర్వో సంతకం లేకున్నా.. కౌంటింగ్ చేయాలని ఏపీ ఎన్నికల కమిషన్ నిబంధనలను సడలించడం బాధాకరమని పేర్కొన్నారు. తెలుగుదేశం కూటమి ఎన్ని అక్రమాలు చేసయినా అధికారంలోకి రావాలని చూస్తున్నదని ధ్వజమెత్తారు. వాళ్లు ఎన్ని కుట్రలు చేసినా కచ్చితంగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని స్పష్టం చేశారు.

ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి దారుణ హత్య

స్థల వివాదమే కారణం



సంపత్‌కుమార్ (ఫైల్)

ధర్మవరం అర్బన్: యువ న్యాయవాది, ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి సంపత్‌కుమార్ (32) దారుణ హత్య హిందూపురం పట్టణంలో సంచలనం సృష్టించింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డికి సీనియర్ న్యాయవాది కృష్ణారెడ్డికి మధ్య ఓ స్థల వివాదం నడుస్తున్నది. రూ.కోట్ల విలువజేసే ఈ స్థలం తనదేనని.. కృష్ణారెడ్డి తన పలుకుబడి ఉపయోగించి కబ్జా చేశాడని శ్రీకాంత్‌రెడ్డి స్నేహితుల వద్ద చెబుతుండేవాడు. శ్రీకాంత్‌రెడ్డికి స్నేహితుడైన యువ న్యాయవాది, ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి సంపత్‌కుమార్ ఈ పంచాయితీలో కలగజేసుకున్నాడు. శ్రీకాంత్‌రెడ్డికి మద్దతుగా న్యాయవాది కృష్ణారెడ్డితో పలుమార్లు వాగ్వాదానికి దిగేవాడు. ఈ క్రమంలోనే సీనియర్ న్యాయవాది కృష్ణారెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని సంపత్‌కుమార్ పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నాలుగురోజుల క్రితమే హిందూపురం రాక..

ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శిగా ఉన్న సంపత్‌కుమార్‌ను ఆ పార్టీ కేరళ ఎలక్షన్ ఇన్‌చార్జ్‌గా నియమించడంతో కొన్నిరోజులుగా అతను అక్కడే ఉన్నాడు. పార్టీ వ్యవహారాలు ముగించుకుని నాలుగురోజుల క్రితమే హిందూపురం వచ్చాడు. బుధవారం రాత్రి హిందూపురం పట్టణంలోని కోర్టు ఎదురుగా ఉన్న పాన్ షాప్‌లో రెండు పాన్‌బీడాలు కట్టించుకుని వెళ్లాడు. అనంతరం తన అక్క భాగ్యలక్ష్మికి ఫోన్ చేసి తన స్నేహితులు వచ్చారనీ, మళ్లీ ఫోన్ చేస్తానని చెప్పాడు.

ధర్మవరం చెరువులో మృతదేహం

నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి సంపత్‌కుమార్ కోసం హిందూపురం వచ్చినట్లు తెలుస్తున్నది. వారే అతన్ని కారులో ఎక్కించుకుని దారి మధ్యలో ఎక్కడో హత్య చేసి గురువారం తెల్లవారుజామున ధర్మవరం చెరువు రెండో మరువ వద్ద కంపచెట్లలో మృతదేహాన్ని పారేసి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఉదయం అటుగా వస్తున్న ప్రజలు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారాన్ని అందించారు. ధర్మవరం వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ప్యాంటు జేబులో ఉన్న పాన్‌బీడా కవర్‌పై ఉన్న అడ్రస్, షర్ట్‌మీద ఉన్న లేబుల్ ఆధారంగా విచారించి సంపత్‌కుమార్‌గా గుర్తించారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సంపత్‌కుమార్ తండ్రి రాజశేఖర్, అక్క భాగ్యలక్ష్మి ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. తన కుమారుడు సంపత్‌కుమార్ హత్యకు హిందూపురం సీనియర్ న్యాయవాది కృష్ణారెడ్డి, అతని కుమారుడు నాగార్జున, మరికొంతమంది అనుచరులే కారణమని సంపత్ తండ్రి రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, సంపత్‌కుమార్ హత్యకు ఉపయోగించిన కారును పోలీసులు అనంతపురంలో స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

నిందితులను అరెస్టు చేయాలి

మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజనాథ్, పలువురు కాంగ్రెస్ నాయకులు సంపత్‌కుమార్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

కిందపడేసి.. కాళ్లతో తొక్కి

- ఓ తల్లి, బాలింత అయిన కుమార్తెపై టీడీపీ నాయకుల అరాచకం
- అనంతపురం జిల్లా కంబాలపల్లిలో దారుణం
- అన్నదమ్ముల పంచాయితీలో దూరి చావగొట్టిన టీడీపీ గూండాలు
- వైఎస్సార్‌సీపీలోకి వెళ్లినందుకే తమపై దాడి చేశారంటూ బాధితుల ఆవేదన



చికిత్స పొందుతున్న జయమ్మ

శెట్టూరు: అనంతపురం జిల్లాలో టీడీపీ నాయకుల అరాచకాలు కొనసాగుతున్నాయి. ఎన్నికల సమయంలో తమ దౌర్జన్యాలను అడ్డుకున్నారన్న కక్షతో అమాయకులపై దాడులకు తెగబడుతున్నారు. మహిళలపై దాష్టీకాలకు ఒడిగడుతున్నారు. తాజాగా టీడీపీ గూండాలు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైన ఓ వ్యక్తి ఇంట్లోకి చొరబడి అతని భార్య, బాలింత అయిన కుమార్తెపై దారుణంగా దాడి చేశారు. ఈ ఘటన శెట్టూరు మండలం కంబాలపల్లిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. కంబాలపల్లికి చెందిన గొల్ల బాగూరప్ప, గొల్ల ఈరన్న అన్నదమ్ములు. ఆస్తుల విషయమై వీరి మధ్య కొంతకాలంగా చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. బుధవారం కూడా అన్నదమ్ములిద్దరి మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఈ క్రమంలో అన్నదమ్ముల సమస్య పరిష్కరిస్తానంటూ వచ్చిన టీడీపీ నాయకుడు చిత్తప్ప తన అనుచరులైన శంకరన్న, ధనుంజయతో కలిసి రాత్రి వేళ బాగూరప్ప ఇంట్లోకి చొరబడ్డాడు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న బాగూరప్ప భార్య జయమ్మపై విచక్షణ రహితంగా దాడి చేశారు. బాలింత అయిన కుమార్తె జయలక్ష్మిని కిందపడేసి కాళ్లతో కొట్టారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తల్లిని కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు తలకు బలమైన గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పార్టీ మారినందుకే మాపై దాడులు

బాధితుడు గొల్ల బాగూరప్ప మాట్లాడుతూ.. 'గతంలో నేను టీడీపీలో క్రియాశీలకంగా పనిచేశా. సీఎం జగన్ పాలన నచ్చి స్థానిక నాయకుడు ఉమామహేశ్వరనాయుడుతో కలిసి మా కుటుంబసభ్యులమంతా వైఎస్సార్‌సీపీలో చేరాం. దీంతో కక్ష గట్టిన టీడీపీ నాయకుడు చిత్తప్ప 'కొన్నాళ్లాగు.. నీఅంతు చూస్తా' అంటూ నన్ను బెదిరించాడు. నాతో గొడవ పడాలంటూ మా అన్నను ప్రోత్సహించాడు. నేను పార్టీ మారడం వల్లే మాపై దాడి చేశారు' అని వాపోయాడు. టీడీపీ నేతల దాడిలో గాయపడ్డ బాగూరప్ప భార్యను కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ తలారి రంగయ్య అనంతపురం ఆస్పత్రిలో పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఉప్పు రైతుకు ధరల తీపి

- 75 కేజీల బస్తా ధర రూ.200
- తమిళనాడులో తీరంలో భారీ వర్షాల ప్రభావమే కారణం
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 4 వేల ఎకరాల్లో ఉప్పు సాగు



తయారైన ఉప్పును సేకరిస్తున్న రైతు

సింగరాయకొండ: వాతావరణం అనుకూలించడం, ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఉప్పు రైతుల్లో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి. తమిళనాడులోని ఉప్పు పండించే ట్యుటికోరన్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఫలితంగా ఆ ప్రాంతాల్లో ఉప్పు తయారీ నిలిచిపోయింది. దీంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లో పండించే ఉప్పుకు గిరాకీ ఏర్పడింది. ఆ ఏడాది ఫిబ్రవరిలో ఉప్పు తయారీ ప్రారంభం కాగా.. నిన్న మొన్నటివరకు 75 కేజీల బస్తా ఉప్పు ధర రూ.100 నుంచి రూ.150 పలికింది. తమిళనాడు నుంచి భారీఎత్తున వ్యాపారులు ఇక్కడికి వచ్చి ఉప్పు కొనుగోలు చేస్తుండటంతో బస్తా రూ.200 ధర పలుకుతోంది.

9 నెలలూ ఉప్పు సాగే

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని చినగంజాం, కనపర్తి, పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లి పంచాయతీల పరిధిలోని సుమారు 4 వేల ఎకరాల్లో ఉప్పు పండిస్తున్నారు. వర్షాకాలం తప్ప మిగిలిన కాలాల్లో సుమారు 9 నెలలపాటు ఉప్పు సాగు చేస్తారు. ఎకరాకు 800 నుంచి 900 బస్తాల వరకు ఉప్పు దిగుబడి వస్తోంది. ఈ ఏడాది వాతావరణం బాగా అనుకూలించడంతో 1,300 నుంచి 1,400 బస్తాల వరకు దిగబడి వస్తోంది. ప్రతినెలా ఇక్కడ 20 వేల టన్నుల వరకు ఉప్పు ఉత్పత్తి అవుతోంది. తయారీ బాగా ఉండటంతో ఉమ్మడి జిల్లాలో 7 వేల మంది వరకు రైతులు, 10 వేలకు పైగా కూలీలు లబ్ధి పొందుతున్నారు.

ధరలు బాగున్నాయి



10 ఎకరాలను కౌలుకు తీసుకుని ఉప్పు సాగు చేస్తున్నాను. ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ధరలు పెరుగుతుండటంతో ఉప్పు నిల్వ చేశాను. తమిళనాడు వ్యాపారులు నేరుగా వచ్చి నన్ను కలవటంతో మంచి ధర లభించింది.

– పురిణి శ్రీనివాసులరెడ్డి, ఉప్పు రైతు, ఊళ్లపాలెం

దిగుబడి బాగా వచ్చింది



ఐదెకరాల్లో ఉప్పు సాగు చేస్తున్నాను. ఏడాది ప్రారంభంలో ధరలు తక్కువగా ఉన్నా దిగుబడి బాగా వచ్చింది. ప్రస్తుతం తమిళనాడు వ్యాపారుల రాకతో ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా ఉప్పు కొనుగోలు చేస్తే రైతుకు మంచి ధరలు లభిస్తాయి.

– గౌరవరపు శ్రీనివాసులరెడ్డి, ఉప్పు రైతు, ఊళ్లపాలెం

'ఎర్ర' బంగారు తీరం



కృష్ణాజిల్లా హంసలదీవి వద్ద సాగర తీరంలో ఎర్ర పీతలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. ఇసుక తిన్నెల వెంట రంధ్రాలు చేసుకుని వాటిలో నివాసముంటూ సముద్ర స్నానాలు ఆచరించేందుకు వచ్చే పర్యాటకులతో దాగుడుమూతలు ఆడుతున్నాయి. చిన్న అలికిడికే రంధ్రాల్లోకి పరిగెడుతూ... అక్కడ నుంచి మళ్లీ తలభాగాన్ని పైకెత్తి వచ్చినవారు ఉన్నారా.. లేరా.. అని దీర్ఘంగా పరిశీలిస్తుంటాయి. బీచ్ దగ్గర నుంచి కృష్ణా సాగర సంగమం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారి పొడవునా ఈ పీతలు కనిపించడంతో చిన్నారులు, యువత వీటిని ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– కోడూరు

విశాఖ తీరంలో 'సముద్ర కప్ప'



భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ బీచ్ వద్ద గురువారం మత్స్యకార వలకు పఫర్ ఫిష్ చిక్కింది. దీన్ని మత్స్యకారులు సముద్ర కప్పగా పిలుస్తారు. సముద్రంలో చాలా లోతులో సంచరించే ఈ జీవులు వలకు చిక్కుకున్నప్పుడు గాని, ఏదైనా వస్తువు తాకిడికి గురైన సమయంలో తమను తాము రక్షించుకునేందుకు బెలూన్ తరహాలో ఇవి మారుతుంటాయి. ఇది తినడానికి పనికిరాదని మత్స్యశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్ చెప్పారు.

– కొమ్మాది (విశాఖపట్నం)

అత్యాచార ఘటనపై సుమోటోగా కేసు

సూళ్లూరుపేటలో దారుణంపై మహిళా కమిషన్ ఆదేశం

సాక్షి, అమరావతి/సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలో యువతిపై అత్యాచారం చేసిన ఘటనపై సుమోటోగా కేసు నమోదు చేసి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి ఆదేశించారు. ఈ విషయమై గురువారం తిరుపతి ఎస్పీకి ఫోన్ చేసిన ఆమె ఘటన వివరాలు తెలుసుకున్నారు. సూళ్లూరుపేట మండలం దామరాయి గ్రామ పరిసరాల్లో ప్రేమికుడిని కట్టేసి.. ప్రియురాలిపై అతడి స్నేహితుడే అత్యాచారానికి పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. నెల్లూరులోని వైఎస్సార్ నగర్ ప్రాంతానికి చెందిన యువకుడు, ఉదయగిరిలోని సీతారామపురం ప్రాంతానికి చెందిన ఓ యువతి ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. వారిద్దరూ సూళ్లూరుపేటలో సహజీవనం సాగిస్తున్నారు. ఆ సంస్థలోనే తడ ప్రాంతానికి చెందిన ఏడుమలై, బాలాజీ అనే స్నేహితులు కూడా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం ఆ యువకుడు, అతని స్నేహితులు ఏడుమలై, బాలాజీ మద్యం తాగారు. అదేరోజు రాత్రి 7.30 గంటలకు ఆ యువకుడికి ఫోన్‌చేసి.. 'నీ ప్రియురాలి పుట్టినరోజు కాబట్టి ఆమెను కొరిడి శివాలయానికి తీసుకెళ్దాం' అంటూ నమ్మబలికారు. కంపెనీలో పనికి వెళ్లిన యువతి సూళ్లూరుపేటకు రాగానే స్థానిక వై.జంక్షన్ వద్ద అందరూ కలుసుకుని పులికాట్ తీరంలోని దామరాయి ప్రాంతానికి వెళ్లారు. ఏడుమలై, బాలాజీ కలిసి స్నేహితుడి చొక్కాను బలవంతంగా విప్పి.. ఆ చొక్కాతోనే అతని చేతులు కట్టేశారు. బాలాజీ అతడికి కాపలా ఉండగా.. ఏడుమలై ఆ యువతిని బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఆమె నుంచి రూ.పది వేల నగదు, సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయారు. బాధితుల కుటుంబ సభ్యులు శ్రీహరికోట పోలీసులు ఫిర్యాదు చేశారు. ఇలాంటి కామాంధులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీని కోరినట్టు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి తెలిపారు.

తల్లి మృతి.. అనాథలైన ముగ్గురు చిన్నారులు

అండగా నిలిచిన మహిళా కమిషన్

సాక్షి, అమరావతి: అనంతపురం జిల్లా శెట్టూరు గ్రామానికి చెందిన చంద్రకళ అనే మహిళ బుధవారం గుండెపోటుతో మృతి చెందింది. అప్పులపాలైన ఆమె భర్త తిమ్మరాజు కొన్ని నెలల కిందట బెంగళూరు పారిపోయాడు. భార్య చనిపోయిందని తెలిసినా.. ఆమెను కడసారి చూసేందుకు కూడా రాలేదు. దీంతో వారి పిల్లలు ప్రభాని(10 ఏళ్లు), అనుశ్రీ(6 ఏళ్లు), బాబు(6 నెలలు) అనాథలుగా మారారు. గురువారం ఈ విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి.. ఆ పిల్లలను హాస్టల్‌లో చేర్పించి చదువు చెప్పించాలని అధికారులను ఆదేశించారు. దీంతో అనంతపురం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆ పిల్లల ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి వివరాలు తెలుసుకున్నారని కమిషన్ చైర్‌పర్సన్ తెలిపారు. వారిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు.

సైకిల్ కొనివ్వలేదని బాలుడి ఆత్మహత్య

రాచర్ల: సైకిల్ కొనివ్వలేదని పదమూడేళ్ల బాలుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర ఘటన ప్రకాశం జిల్లా రాచర్ల మండలంలోని చోళ్లవీడులో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన కట్టా కృష్ణయ్య పెద్ద కుమారుడు పవన్‌కుమార్(13) రెండు రోజులుగా తనకు సైకిల్ కొనివ్వాలని తండ్రిని అడుగుతున్నాడు. ఈ విషయమై గురువారం కూడా మారం చేయడంతో పొలం నుంచి వచ్చాక కొంటానంటూ కుమారుడికి బుజ్జగించాడు. అయినప్పటికీ పవన్ కుమార్ తండ్రిపై అలకతో గదిలోకి వెళ్లి తలుపులు బిగించుకున్నాడు. అయితే గతంలో ఏదైనా కొనివ్వకపోతే బాలుడు గదిలోకి వెళ్లి తలుపులు వేసుకొనేవాడు. ఈసారి కూడా అలాగే చేశాడని తల్లిదండ్రులు భావించారు. కృష్ణయ్య పొలం నుంచి వచ్చాక కూడా గది నుంచి బయటికి రాకపోవడంతో అనుమానం వచ్చి చూడగా పవన్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సాయంతో తలుపులు పగలగొట్టి బయటికి తీసుకొచ్చేలోపే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని రాచర్ల ఎస్సై పి.సుబ్రహ్మణ్యం పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

తిరుమలకు చేరిన అమిత్ షా

తిరుమల: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా శుక్రవారం వేకువజామున తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఈ మేరకు ఆయన గురువారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. అమిత్‌షాకు వకుళమాత అతిథిగృహం వద్ద టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఘన స్వాగతం పలికారు. అమిత్‌షా రాకతో తిరుమలలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటుచేశారు.

మావోయిస్టులారా.. మా జిల్లాకు రావొద్దు...

- ప్లకార్డులు ప్రదర్శిస్తూ అల్లూరి జిల్లా వాసుల ర్యాలీ
- మావోలు లేకుంటేనే అభివృద్ధి అంటూ నినాదాలు



మద్దిగరువు వారపుసంతలో మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

జి.మాడుగుల(అల్లూరి సీతారామరాజు జిల్లా): 'మావోయిస్టులారా.. మా అల్లూరి సీతారామరాజు జిల్లాకు రావొద్దు'.. అంటూ మండలంలోని మద్దిగరువులో గురువారం జరిగిన వారపుసంతలో గిరిజనులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం బొయితిలి పంచాయతీ మద్దిగరువు వారపుసంతలో పెదబయలు, జి.మాడుగుల మండలాల్లో ఇంజరి, గిన్నెలకోట, జామిగూడ, కుంతుర్ల, పంచాయతీలకు చెందిన మావోల చేతిలో బలైన వ్యక్తుల కుటుంబాలతో పాటు 500 మంది గిరిజనులు వారికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగకుండా గతంలో మావోలు అడ్డుకునే వారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది నుంచి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో జరుగుతున్న సెల్ టవర్లు, రోడ్ల నిర్మాణాలపై వారు సంతోషం వ్యక్తం చేశారు. మావోలు లేకుంటేనే అభివృద్ధి జరుగుతుందని భావించి ఈ ర్యాలీ నిర్వహించినట్టు వారు వివరించారు.

'వాగు'లో గల్లంతైన నలుగురి మృతి

- మృతదేహాలకు పోస్టుమార్టం
- కుటుంబ సభ్యులకు అప్పగింత



సునీల్‌కుమార్, అతని కుమారుడు అనురాజ్ (ఫైల్)

బాపట్లటౌన్: విహారయాత్రలో భాగంగా హైదరాబాద్ నుంచి బాపట్ల ప్రాంతానికి వచ్చిన 12 మందిలో బుధవారం నల్లమడవాగులో నలుగురు గల్లంతైన విషయం తెలిసిందే. వీరిలో సునీల్ కుమార్ (36), అతని కొడుకు అనురాజ్ (13) మృతదేహాలు బుధవారం రాత్రి ఏరియా వైద్యశాలకు తరలించారు. మరో ఇద్దరు ఆచూకీ లభించకపోవడంతో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు రంగంలోకి ఎన్‌డీఆర్ఎఫ్, సూర్యలంక తీరంలోని గజఈతగాళ్లు, అగ్నిమాపక అధికారులు టీమ్‌లుగా ఏర్పడి నల్లమడ వాగులో సుమారు 3 కిలోమీటర్ల మేర గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపులో భాగంగా వడ్లకొండ కిరణ్‌గౌడ్ (35) మృతదేహాన్ని గురువారం ఉదయం 6.30 గంటల సమయంలో గుర్తించి వెలికి తీశారు. అదే సమయంలో బండా నందు (35) మృతదేహం మూలపాలెం గ్రామ శివారులోని తుమ్మచెట్ల మధ్యలో ఉన్నట్లు గుర్తించి వెలికి తీశారు. నలుగురు మృతదేహాలకు గురువారం బాపట్ల ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుల కుటుంబసభ్యులు మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. రూరల్ సీఐ శ్రీహరి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హుండీ లెక్కింపులో ఓ ప్రైవేటు బ్యాంకు అప్రైజర్ చేతివాటం

- బంగారు బిస్కెట్, రింగ్ మాయం చేసిన వైనం

కాణిపాకం (చిత్తూరు జిల్లా): సత్య ప్రమాణాల స్వామికి కానుకగా వచ్చిన ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. హుండీ లెక్కింపులో రూ.8 లక్షల విలువ చేసే బంగారు బిస్కెట్, ఒక రింగ్, రూ.500 మాయమయ్యాయి. సీసీ ఫుటేజీల పరిశీలనతో నిందితుడెవరో నిర్ధారణ అయ్యింది. కాణిపాకం ఎస్ఐ రామమోహన్ తెలిపిన వివరాల మేరకు.. కాణిపాకం దేవస్థానంలో గురువారం జరిగిన హుండీ లెక్కింపులో ఓ అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్, ప్రైవేటు బ్యాంకు అప్రైజర్ ప్రకాష్ కూడా పాల్గొన్నారు. తొలి రౌండ్‌లో రూ.55 లక్షలను కట్టకట్టి ఆలయాధికారులు బ్యాంకు అధికారికి అప్పగించారు. బ్యాంకు మేనేజర్ వెనుక కూర్చున్న అప్రైజర్ నగదు కట్టల పక్కన ఉన్న 22 క్యారెట్ల 100 గ్రాముల బంగారు బిస్కెట్, 1.5 గ్రాముల రింగ్, రూ. 500ను కొట్టేసి.. కట్టుకున్న పంచలో వేసుకున్నాడు. కొద్ది దూరం వచ్చాక ఆ ఆభరణాలను గోనె సంచిలో వేసుకున్నాడు. ఇవన్నీ సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. కంట్రోల్ రూమ్‌లోని ఆపరేటర్ కరుణకుమార్ ఈ చోరీని పసిగట్టాడు. వెంటనే ఈఓ వెంకటేశుకు సమాచారమిచ్చాడు. ఆయన హుండీ లెక్కింపు మండపానికి చేరుకున్నారు. అప్రైజర్ సంచిని సిబ్బందితో కలిసి పరిశీలించగా అందులో బంగారు బిస్కెట్, రింగ్, రూ.500 నోటు బయటపడ్డాయి. ఏఈఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాణిపాకం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

ప్రేమోన్మాది చేతిలో యువతి దారుణ హత్య



రోడ్డుపై రక్తపు మడుగులో రత్నగ్రేస్, ఏసురత్నం

ఏలూరు టౌన్: ప్రేమోన్మాది చేతిలో యువతి దారుణ హత్యకు గురైంది. ఆమెకు నిశ్చితార్థం కావడంతో ప్రేమ పేరుతో ఆమెను వేధిస్తున్న యువకుడే ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఆమె పనిచేస్తున్న కాలేజీకి సమీపంలోనే అత్యంత దారుణంగా కత్తితో పొడిచి హతమార్చాడు. ఆపై తనూ గొంతు కోసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు యువకుడిని ఏలూరు సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తీసుకెళ్లారు. వివరాలివీ..

సర్టిఫికెట్ల కోసమని వచ్చి..

ఏలూరు ఎంఆర్‌సీ కాలనీకి చెందిన జక్కుల రత్నగ్రేస్ (22) సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కాలేజీలో బీఎస్సీ పూర్తిచేసింది. అక్కడే జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తోంది. ముసునూరుకు చెందిన తొట్టిబోయిన ఏసురత్నం (23) కొంతకాలంగా ఆమెను ప్రేమిస్తున్నానంటూ వెంటబడుతున్నట్లు సమాచారం. గురువారం మ.12.30 గంటల సమయంలో ఏసురత్నం తన డిగ్రీ సర్టిఫికెట్లు తెచ్చుకునేందుకు ఏలూరు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వచ్చినట్లు తెలిసింది. రత్నగ్రేస్ తను పనిచేస్తున్న కాలేజీ సమీపంలోకి రాగానే.. ఆమెతో మాట్లాడేందుకు వచ్చానంటూ చెప్పి పక్కనే ఉన్న సందులోకి ఏసురత్నం ఆమెను తీసుకెళ్లాడు. పెళ్లి చేసుకుందామని ఒత్తిడి తేవడంతో ఆమె నిరాకరించింది. ఇద్దరం చనిపోదామని చెబుతూ కత్తి తీసి కోసుకోవాలన్నాడు. కానీ, ఆమె వద్దని వారించడంతో ఆమెపై కత్తితో దాడిచేశాడు. ఆమె జుట్టు పట్టుకుని గొంతు వద్ద ఇష్టారాజ్యంగా పొడిచాడు. దీంతో ఆమె తీవ్ర రక్తస్రావంతో రోడ్డుపై పడిపోయింది. అక్కడికక్కడే విగత జీవిగా మారిన రత్నగ్రేస్‌ను చూస్తూ నిందితుడు కూడా పీక కోసుకున్నాడు. రక్తపు మడుగులో ఆమె పక్కనే పడిపోయాడు. ఏలూరు త్రీటౌన్ సీఐ కె. శ్రీనివాసరావు, ఎస్ఐ రామారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాలతో ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు విజయవాడలో వెంటిలేటర్‌పై ఉన్నట్లు సమాచారం. యువతికి ఈ నెల 26న వివాహ నిశ్చితార్థం జరిగినట్లు తెలిసింది. ఆమె పనిచేస్తున్న విద్యాసంస్థలో తనతో పాటు ఫ్యాకల్టీగా పనిచేసే వ్యక్తితో వివాహం నిర్ణయించారని సమాచారం.

ఎన్నిసార్లు వారించినా..

నిందితుడు ఏసురత్నం గతంలో తన కుమార్తెను ప్రేమ పేరుతో వేధించేవాడని.. తన కుమార్తెను వేధించవద్దని ఆమె తండ్రి పలుమార్లు హెచ్చరించాడు. అయినా అతను లెక్కచేయకుండా తనను పెళ్లి చేసుకోవాలంటూ వెంటపడి వేధించేవాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రత్నగ్రేస్, ఏసురత్నం ఇద్దరూ డిగ్రీలో కలిసి చదువుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇటీవల ఆమెకు నిశ్చితార్థం కావడంతో నిందితుడు ఈ ఘాతుకానికి ఒడిగట్టాడని యువతి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మరో 17 రోజుల్లో పెళ్లి జరగాల్సి ఉందని.. ఇంతలో తమ కుమార్తె హత్యకు గురికావటంతో వారు భోరున విలపిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు ఘటన వివరాలు సేకరిస్తున్నట్లు ఏలూరు త్రీటౌన్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసరావు చెప్పారు.

పొగాకు కాదది.. ఆరోగ్యానికి పగాకు..!

- పొగాకు ఉత్పత్తులతో ఆరోగ్యానికి హాని
- పురుషుల్లో 50 శాతం.. మహిళల్లో 20 శాతం క్యాన్సర్
- ఈ వ్యసనం నుంచి విముక్తికి వైద్య శాఖ చర్యలు
- టుబాకో సిసేషన్ సెంటర్లలో కౌన్సెలింగ్
- చికిత్సలో భాగంగా శరీరానికి నికోటిన్ ప్యాచెస్
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

సాక్షి, అమరావతి: పొగాకు వినియోగంతో వచ్చే జబ్బుల బారిన పడి దేశంలో రోజుకు సగటున 3,669 మంది మరణిస్తున్నారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న ప్రధానమైన సమస్యల్లో పొగాకు వాడకమూ ఒకటని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. ఈ క్రమంలో నేడు 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం' సందర్భంగా ఆరోగ్య సంస్థలు, సామాజిక సంఘాలు పొగాకుకు వ్యతిరేకంగా పోరాడాలని నినదిస్తున్నాయి.

ఆరోగ్యానికి పొగ బెట్టే పొగాకు...

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ చేపట్టిన సర్వే ప్రకారం దేశంలో 38 శాతం పురుషులు, 8.9 శాతం మహిళలు పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. ఏపీలో 22.6 శాతం పురుషులు, 3.8 శాతం మహిళలు వ్యసనానికి అలవాటు పడ్డారు. పొగాకు మనిషి ఆరోగ్యాన్ని అన్ని రకాలుగా గుల్ల చేస్తోంది. దీర్ఘకాలిక ఊపిరితిత్తులు, మధుమేహం, కార్డియోవాస్క్యులర్ జబ్బులు, క్యాన్సర్ సహా ఇతర అనారోగ్య సమస్యలకు పొగాకే అనర్థంగా ఉంది. పురుషుల్లో 50 శాతం, మహిళల్లో 20 శాతం క్యాన్సర్‌కు కారణమని వైద్య శాఖ అంచనా వేస్తోంది.

వ్యసనం నుంచి విముక్తి కల్పించేలా చర్యలు ...

రాష్ట్రంలో ధూమపానం, ఇతర పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని నియంత్రించడానికి వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు చేపడుతోంది. పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని వ్యసనంగా మార్చుకున్న వారిలో మార్పు తెచ్చేందుకు 13 టుబాకో సిసేషన్ సెంటర్ (టీసీసీ) లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాలను సంప్రదించే బీడీ, చుట్ట, సిగరెట్లను కాల్చే వారితో పాటు, గుట్కా, ఖైనీ, సహా ఇతర పొగాకు ఉత్పత్తుల వినియోగించే వారికి ఉచితంగా కౌన్సెలింగ్, ఇతర వైద్య సేవలు, చికిత్సలు చేయడంతో పాటు మందులు ఇస్తున్నారు. ఒక్కో సెంటర్‌లో మానసిక వైద్యుడు, ఇద్దరు సోషల్ వర్కర్లు ఉంటారు. బోధనాసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో ఈ సెంటర్లను నిర్వహిస్తున్నారు. వీటికి వచ్చే వారికి ఉచితంగా కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు, పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని క్రమంగా తగ్గిస్తూ, పూర్తిగా మానేయడానికి అవసరమైన చర్యలను తీసుకుంటారు. గత ఏడాది వ్యవధిలో 30,957 మంది ఈ సెంటర్లకు వచ్చి చికిత్స పొందారు. వీరిలో 6,290 మంది పొగాకు వినియోగాన్ని పూర్తిగా మానేశారు.

నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ...

కొన్నేళ్ల నుంచి ధూమపానం, ఇతర పొగాకు ఉత్పత్తుల వినియోగానికి అలవాటుపడిన వారు ఒక్కసారిగా వినియోగం మానుకోవడం సాధ్యం కాదు. ప్రత్యామ్నాయ పద్ధతిలో ఈ టీసీసీల్లో నికోటిన్‌ను అందించే నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీని అందిస్తున్నారు. ఈ చికిత్సలో భాగంగా ప్లాస్టర్ రూపంలో ఉండే నికోటిన్ పాచ్‌ను చర్మంపై అమరుస్తారు. ఈ పాచ్ రక్తనాళాల్లోకి నికోటిన్‌ను ప్రవిస్తుంది. ఈ పరిణామంతో బీడీ, సిగరెట్, చుట్ట వంటి వాటిని కాల్చడం, గుట్కా, ఖైనీ నమలడం నుంచి వ్యసనపరుల దృష్టి మళ్లుతుంది. రోజుకు 20 సిగరెట్లను కాల్చే వ్యక్తికి 21 ఎంజీ మోతాదులో పాచ్‌ను అమరుస్తారు. ఇదే మోతాదులో నెల రోజుల పాటు పాచ్‌ను కొనసాగిస్తారు. అనంతరం క్రమంగా మోతాదును తగ్గిస్తూ వస్తారు. సైకాలజిస్ట్ సూచన మేరకు సైక్రియాట్రిస్ట్ సమక్షంలోనే నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ చేపడుతున్నారు.

సత్ఫలితాలు వస్తున్నాయి...



పొగాకు ఉత్పత్తులను వినియోగించే అనేకమంది టీసీసీలకు వస్తున్నారు. పని ఒత్తిడి, వృత్తి, వ్యాపార, కుటుంబ సమస్యల నేపథ్యంలో కొందరు, మరికొందరు సరదాగా మొదలు పెట్టి వ్యసనంగా మార్చుకున్న వారు ఉంటున్నారు. కౌన్సెలింగ్ చేయడం, మందులు ఇవ్వడం ద్వారా చికిత్స అందిస్తున్నాం. నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ సత్ఫలితాలు ఇస్తోంది.

– డాక్టర్ ప్రశాంత్, టుబాకో కంట్రోల్ ప్రోగ్రాం రాష్ట్ర ప్రత్యేక అధికారి

● హిమాచల్‌ప్రదేశ్‌లో..

బీజేపీకి పరీక్ష!

4 స్థానాలకు రేపు పోలింగ్‌

అన్నీ బీజేపీ సిట్టింగ్‌ స్థానాలే ● గట్టి పోటీ ఇస్తున్న కాంగ్రెస్‌



హిమాచల్‌ప్రదేశ్‌లోని 4 లోక్‌సభ స్థానాలనూ గత రెండు సార్వత్రిక ఎన్నికల్లోనూ బీజేపీ క్లీన్‌స్వీప్‌ చేసింది. కానీ ఈసారి హ్యాట్రిక్‌ కొట్టాలన్న కమలనాథుల యత్నాలకు కాంగ్రెస్‌ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. ఉత్తరాదిన కాంగ్రెస్‌ అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం ఇదే. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో కచ్చితంగా ఖాతా తెరవాలని ఆ పార్టీ పట్టుదలతో ఉంది. కాంగ్రా, మండి, సిమ్లా, హమీర్‌పూర్‌ స్థానాలకు శనివారం తుది విడతలో పోలింగ్‌ జరగనుంది. ప్రధాన పోటీ కాంగ్రెస్‌, బీజేపీ మధ్యే అయినా బీఎస్పీ కూడా అన్నిచోట్లా బరిలో ఉంది. ప్రముఖ అభ్యర్థుల్లో కేంద్ర మంత్రి అనురాగ్‌ సింగ్‌ ఠాకూర్‌, మాజీ మంత్రి ఆనంద్‌ శర్మ, బాలీవుడ్‌ నటి కంగనా రనౌత్‌ తదితరులున్నారు. కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలపై వేటు ఫలితంగా 6 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. వాటి ఫలితాలు సుఖ్విందర్‌ సింగ్‌ సుఖు సర్కారు భవితవ్యాన్ని నిర్దేశించనున్నాయి...

- సాక్షి, నేషనల్‌ డెస్క్‌

కాంగ్రా

ఇక్కడ అభ్యర్థిని మార్చే ఆనవాయితీని బీజేపీ ఈసారి కూడా కొనసాగించింది. సీనియర్‌ నేత, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు రాజీవ్‌ భరద్వాజ్‌కు టికెటిచ్చింది. కాంగ్రెస్‌ నుంచి సీనియర్‌ నేత ఆనంద్‌ శర్మ బరిలో ఉన్నారు. ఈ లోక్‌సభ పరిధిలోని 17 అసెంబ్లీ స్థానాల్లో 11 కాంగ్రెస్‌ చేతిలోనే ఉన్నాయి. తన ఏడాదిన్నర పాలన చూసి శర్మను గెలిపించాలని ఓటర్లను సీఎం సుఖు కోరుతున్నారు. ఇక్కడ 10 మంది పోటీలో ఉన్నారు.

సిమ్లా

2009 నుంచీ బీజేపీయే గెలుస్తోంది. సిట్టింగ్‌ ఎంపీ సురేశ్‌ కుమార్‌ కాశ్యప్‌కే టికెటిచ్చింది. 15 ఏళ్ల క్రితం చేజారిన ఈ స్థానాన్ని సొంతం చేసుకోవాలని కాంగ్రెస్‌ పట్టుదలతో ఉంది. కసోలి ఎమ్మెల్యే వినోద్‌ సుల్తాన్‌పురికి టికెటిచ్చింది. ఈ లోక్‌సభ పరిధిలోని 17 అసెంబ్లీ స్థానాల్లో 13 కాంగ్రెస్‌ చేతిలో ఉన్నాయి. ఇక్కడ యాపిల్‌ రైతులు కీలకం. హట్టి సామాజిక వర్గానికి కేంద్రం ఎస్టీ హోదా కల్పించడాన్ని బీజేపీ ప్రముఖంగా ప్రచారం చేసుకుంది.

మండి

2021 ఉప ఎన్నికలో నెగ్గిన పీసీసీ చీఫ్‌ ప్రతిభాసింగ్‌ ఈసారి పోటీకి అనాసక్తి చూపారు. బాలీవుడ్‌ నటి కంగనా రనౌత్‌ను బీజేపీ పోటీకి పెట్టింది. దాంతో ప్రతిభాసింగ్‌ కుమారుడు, మంత్రి విక్రమాదిత్య సింగ్‌కు కాంగ్రెస్‌ టికెటిచ్చింది. అభ్యర్థులిద్దరూ హోరాహోరీ ప్రచారం చేశారు. మండిలో విజయం బీజేపీ, కాంగ్రెస్‌ మధ్య చేతులు మారుతూ ఉంటుంది. మొత్తమ్మీద కాంగ్రెస్‌దే పై చేయి.

హమీర్‌పూర్‌

కేంద్ర మంత్రి అనురాగ్‌సింగ్‌ ఠాకూర్‌ మళ్లీ బీజేపీ నుంచి బరిలోకి దిగారు. కాంగ్రెస్‌ నుంచి మాజీ ఎమ్మెల్యే సత్పాల్‌ సింగ్‌ రజ్దా పోటీ చేస్తున్నారు. ఇది బీజేపీ కంచుకోట. ఎనిమిదిసార్లుగా గెలుస్తూ వస్తోంది. ఈసారి బీజేపీ ఫోర్‌, సిక్స్‌ కొడుతుందని అనురాగ్‌ ఠాకూర్‌ ప్రచారం చేశారు. అంటే మొత్తం 4 లోక్‌సభ, 6 అసెంబ్లీ స్థానాలనూ కైవసం చేసుకుంటుందన్నది ఆయన ధీమా. ఉప ఎన్నికలు జరుగుతున్న 6 అసెంబ్లీ స్థానాల్లో 4 ఈ లోక్‌సభ సీటు పరిధిలోనే ఉన్నాయి.

ప్రధానాంశాలు

- అయోధ్య రామమందిర నిర్మాణాన్ని, జమ్మూ కశ్మీర్లో ఆర్టికల్‌ 370 రద్దును బీజేపీ ప్రముఖంగా ప్రచారం చేసింది.
- పాత పింఛను విధానం పునరుద్ధరణ, 2023 భారీ వరదల అనంతరం చేపట్టిన సహాయక చర్యలను కాంగ్రెస్‌ గుర్తు చేసింది.
- బీజేపీ వస్తే రిజర్వేషన్లు రద్దేనంటూ ప్రచారం చేసింది. కేంద్రంలో అధికారంలోకొస్తే అగ్నిపథ్‌ పథకాన్ని రద్దు చేస్తామని రాహుల్‌ గాంధీ హామీ ఇచ్చారు.
- కాంగ్రా, హమీర్‌పూర్‌ వాసులు ఆర్మీలో ఎక్కువగా చేరుతుంటారు. అగ్నిపథ్‌ పథకాన్ని రద్దు చేస్తామన్న కాంగ్రెస్‌ హామీ వారిపై ప్రభావం చూపొచ్చు.
- వరదలు ఇక్కడి ప్రజల ప్రధాన సమస్యల్లో ఒకటి.
- రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయడమే గాక అసెంబ్లీలో బడ్జెట్‌పై ఓటింగ్‌కు హాజరు కాకుండా విప్‌ను ధిక్కరించినందుకు ఆరుగురు కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడింది. ఉప ఎన్నికల్లో ఆ ఆరుగురికి బీజేపీ టికెటిచ్చింది.

ఎమర్జెన్సీలో రాజ్యాంగం గొంతు నొక్కారు



గురువారం కన్యాకుమారిలోని వివేకానంద రాక్‌ మెమోరియల్‌కు నమస్కరిస్తున్న ప్రధాని మోదీ

- 1984లో సిక్కులను హత్య చేస్తుంటే రాజ్యాంగం గుర్తుకురాలేదు
- కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన మోదీ

హోషియార్‌పూర్‌: ఎమర్జెన్సీ సమయంలో రాజ్యాంగం గొంతు పిసికిన కాంగ్రెస్‌ పార్టీ ఇప్పుడు రాజ్యాంగ పరిరక్షణ అంటూ గొంతు చించుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. 1984 నాటి అల్లర్లలో సిక్కుల మెడలకు టైర్లు బిగించి, నిప్పంటించి కాల్చి చంపుతుంటే కాంగ్రెస్‌కు రాజ్యాంగం గుర్తుకు రాలేదని ధ్వజమెత్తారు. గురువారం పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌లో ఎన్నికల ప్రచార సభలో మోదీ ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో మోదీకి ఇదే చివరి సభ. రిజర్వేషన్లపై కాంగ్రెస్‌తోపాటు విపక్ష 'ఇండియా' కూటమి ఉద్దేశాలు చాలా ప్రమాదకరంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లలో కోత విధించి, బడుగు బలహీనవర్గాలకు అన్యాయం చేసిన చరిత్ర ప్రతిపక్షాలకు ఉందన్నారు. ముస్లింలకు రిజర్వేషన్లు కట్టబెట్టేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని దుయ్యబట్టారు. రాజ్యాంగ స్ఫూర్తిని, డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ మనోభావాలను ప్రతిపక్షాలు కించపరుస్తున్నాయని ఆక్షేపించారు.

అవినీతిలో కాంగ్రెస్‌ డబుల్‌ పీహెచ్‌డీ

కాంగ్రెస్‌ పార్టీ అవినీతికి తల్లిలాంటిదని ప్రధానమంత్రి నిప్పులు చెరిగారు. అవినీతిలో ఆ పార్టీ డబుల్‌ పీహెచ్‌డీ చేసిందని ఎద్దేవా చేశారు. మరో అవినీతి పార్టీ(ఆమ్‌ ఆద్మీ పార్టీ) కాంగ్రెస్‌తో చేతులు కలిపిందన్నారు. ఢిల్లీలో కలిసికట్టుగా, పంజాబ్‌లో విడివిడిగా పోటీ చేస్తూ ఆ రెండు పార్టీలు డ్రామాలాడుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్‌ గర్భంలోనే ఆమ్‌ ఆద్మీ పార్టీ ఊపిరి పోసుకుందని అన్నారు. కాంగ్రెస్‌ నుంచే అవినీతి పాఠాలు చేర్చుకుందని చెప్పారు. కాంగ్రెస్‌ పార్టీ బుజ్జగింపు రాజకీయాల్లో మునిగి తేలుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ అధికారంలో ఉన్నప్పుడు సైనిక దళాలను బలహీనపర్చిందని ఆరోపించారు. సైన్యంలో సంస్కరణలు చేపట్టడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదన్నారు.

ఓటింగ్‌లో కొత్త రికార్డు సృష్టించాలి

వారణాసి ప్రజలకు ప్రధాని పిలుపు

లక్నో: సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నియోజకవర్గం నుంచి వరుసగా మూడోసారి పోటీ చేస్తున్నారు. వారణాసిలో శనివారం పోలింగ్‌ జరగనుంది. తన నియోజకవర్గ ప్రజలకు మోదీ గురువారం ఒక వీడియో సందేశం విడుదల చేశారు. భారతదేశ అభివృద్ధి కోసం వారణాసి ఓటింగ్‌లో కొత్త రికార్డు సృష్టించాలని పిలుపునిచ్చారు. కాశీ విశ్వనాథుడితో పాటు అక్కడి ప్రజల ఆశీర్వచనాలతోనే పార్లమెంట్‌లో వారణాసికి ప్రాతినిధ్యం వహించే అవకాశం తనకు దక్కిందని పేర్కొన్నారు. పవిత్ర గంగామాత తనను దత్తత తీసుకుందన్నారు. నవకాశీతోపాటు 'అభివృద్ధి చెందిన భారత్‌'ను సాకారం చేసుకోవడానికి ఈ ఎన్నికలు చాలా కీలకమని వివరించారు. జూన్‌ 1న జరిగే ఓటింగ్‌లో వారణాసి ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొనాలని, ఓటింగ్‌లో కొత్త రికార్డు సృష్టించాలని మోదీ విజ్ఞప్తి చేశారు. కాశీని ఎంతో అభివృద్ధి చేశామని, రాబోయే రోజుల్లో ఈ అభివృద్ధిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తామని మోదీ హామీ ఇచ్చారు.

కన్యాకుమారిలో మోదీ ధ్యానముద్ర

సాక్షి, చెన్నై: తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారిలో వివేకానంద రాక్‌ మెమోరియల్‌లోని ధ్యాన మండపంలో ప్రధాని మోదీ గురువారం సాయంత్రం ధ్యానం ప్రారంభించారు. దాదాపు 45 గంటపాటు ఆయన ధ్యానం కొనసాగించనున్నారు. మోదీ తొలుత కేరళలోని తిరువనంతపురం నుంచి హెలికాప్టర్‌లో కన్యాకుమారికి చేరుకున్నారు. సంప్రదాయ ధోతీ, తెల్ల రంగు కండువా ధరించి భగవతి అమ్మన్‌ ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం మోదీ సముద్ర తీరం నుంచి పడవలో రాక్‌ మెమోరియల్‌కు చేరుకున్నారు. ధ్యాన మండపం మెట్లపై కాసేపు కూర్చుకున్నారు. తర్వాత ధ్యాన మండపంలో సుదీర్ఘ ధ్యానానికి శ్రీకారం చుట్టారు.

భార్య భోజనం వడ్డించలేదని..

తల నరికి, చర్మం ఒలిచి..!



నిందితుడు

తుంకూర్‌: భోజనం వడ్డించ లేదని భార్యతో తగవుపెట్టుకున్నాడు. పట్టరాని కోపంతో ఆమె తలను నరికేశాడు. అంతటితో ఆగక చర్మం ఒలి చేయడం మొదలుపెట్టాడు. తెల్లవారేదాకా ఒలుస్తూనే ఉన్నాడు. ఉదయం తాము ఉంటున్న ఇంటి యజమానికి ఈ ఘోరం వివరించాడు. దీంతో దారుణం వెలుగులోకి వచ్చింది. కర్ణాటక రాష్ట్రం తుంకూరు జిల్లా కునిగల్‌ తాలుకాలోని హళియూరుదుర్గ పట్టణంలో సోమవారం రాత్రి ఘటన చోటుచేసుకుంది. శివరామ, పుష్పలత(35)లకు పదేళ్ల క్రితం కులాంతర వివాహమైంది. వారికి ఎనిమిదేళ్ల కుమారుడున్నాడు. శివరామ కోత మిల్లులో కార్మికుడు. తరచూ దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి కోతమిల్లు నుంచి ఇంటికి వచ్చిన భర్తకు పుష్పలత భోజనం వడ్డించలేదు. ఇద్దరిమధ్య మొదలైన గొడవ తీవ్రమైంది. శివరామ ఆగ్రహంతో కొడవలితో భార్య తలనరికాడు. తర్వాత ఇతర అవయవాలను వేరు చేశాడు. చర్మం ఒలిచేయడం మొదలుపెట్టాడు. ఇల్లంతా రక్తపు మడుగులా మారింది. పేగులు చెల్లాచెదురుగా పడిపోయాయి. తెల్లవారేదాకా చర్మం ఒలుస్తూనే ఉన్నాడు. కుమారుడు అటు పక్కనే నిద్రిస్తుండగానే ఇదంతా జరిగిపోయింది. ఉదయం తాము ఉంటున్న యజమానికి శివరామ విషయం తెలిపాడు. అతడు పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులొచ్చి ఈ బీభత్సాన్ని స్వయంగా చూసిన తర్వాతే దారుణం బయటకు వచ్చింది. శివరామను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు నేరం అంగీకరించాడని తుంకూర్‌ ఎస్పీ అశోక్‌ వెంకట్‌ గురువారం తెలిపారు.

కశ్మీర్‌లో లోయలో పడిన బస్సు..

22 మంది తీర్థయాత్రికులు మృతి

మరో 57 మందికి గాయాలు..ఆరుగురి పరిస్థితి విషమం


జమ్మూ: తీర్థయాత్రికులతో వెళ్తున్న బస్సు అదుపు తప్పి లోయలో పడిన ఘటనలో తొమ్మిదిమంది మహిళలు, ఇద్దరు చిన్నారులు సహా 22 మంది ప్రాణాలు కోల్పోయారు. 25 మంది మహిళలు, 12 మంది చిన్నారులు సహా మరో 57 మంది గాయాలపాలయ్యారు. జమ్మూ జిల్లా చోరా ప్రాంతంలోని తుంగి-మోర్హ్‌ వద్ద గురువారం మధ్యాహ్నం 12.35 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్‌, హరియాణాలకు చెందిన మొత్తం 79 మంది ప్రయాణికులు జమ్మూకశ్మీర్‌లోని రియాసి జిల్లా పౌని ప్రాంతంలో ఉన్న శివ్‌ ఖోరి ఆలయానికి బస్సులో బయలుదేరారు. ప్రమాదకర మలుపులో ఎదురుగా వేగంగా వస్తున్న కారును తప్పించే క్రమంలో డ్రైవర్‌ బస్సుపై అదుపు కోల్పోయాడు. దీంతో, బస్సు సుమారు 150 అడుగుల లోయలోకి దూసుకెళ్లిందని ఓ ప్రయాణికుడు తెలిపారు. సమాచారం తెల్సుకున్న వెంటనే ఆర్మీ, పోలీసులు, స్థానికులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను బయటకు తీసుకువచ్చారు.

ఇజ్రాయెల్‌ దాడుల్లో 53 మంది మృతి

గాజా: ఇజ్రాయెల్‌ ఆర్మీ యథేచ్ఛగా కొనసాగిస్తున్న దాడులతో 24 గంటల వ్యవధిలో గాజాలో 53 మంది మృతి చెందగా మరో 357 మంది గాయపడ్డారని స్థానిక ఆరోగ్య శాఖ తెలిపింది. వీరిలో ఇద్దరు పాలస్తీనా రెడ్‌ క్రీసెంట్‌ సొసైటీకి చెందిన పారా మెడికల్‌ సిబ్బంది కూడా ఉన్నారని వివరించింది. టాల్‌ అస్‌-సుల్తాన్‌ ప్రాంతంలో జరిగిన బాంబుదాడిలో బాధితులకు సాయం అందించేందుకు వెళ్లగా వీరు గాయపడినట్లు వెల్లడించింది. తాజా మరణాలతో గతేడాది అక్టోబర్‌ 7వ తేదీ నుంచి ఇప్పటి వరకు కనీసం 36,224 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోగా మరో 81,777 మంది క్షతగాత్రులైనట్లు అంచనా. ఇలా ఉండగా, ఈజిప్టుతో సరిహద్దులు పంచుకుంటున్న గాజా ప్రాంతం మొత్తాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకున్నట్లు ఇజ్రాయెల్‌ ఆర్మీ గురువారం తెలిపింది.

జవాన్లను కార్మికులుగా మార్చేశారు

మేమొస్తే అగ్నివీర్‌ను రద్దుచేస్తాం: రాహుల్‌



బాలాసోర్‌(ఒడిశా): అగ్నివీర్‌ పథకం ద్వారా ప్రధాని మోదీ జవాన్లను కార్మికులుగా మార్చేశారని కాంగ్రెస్‌ నేత రాహుల్‌ గాంధీ ఆరోపించారు. ఒడిశాలోని భద్రక్‌ లోక్‌సభ నియోజకవర్గంలోని సిమూలియా పట్టణంలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారర్యాలీలో రాహుల్‌ ప్రసంగించారు. '' విపక్షాల ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రైతు రుణాలను మాఫీచేస్తాం. అగ్నివీర్‌ పథకం తెచ్చి ప్రధాని మోదీ జవాన్లను కార్మికులుగా మార్చేశారు. మేం అగ్నివీర్‌ను రద్దు చేసి ఆ కార్మికులను మళ్లీ జవాన్లుగా మారుస్తాం. వారికి పెన్షన్‌, క్యాంటీన్‌ సౌకర్యాలు కల్పిస్తాం. విధి నిర్వహణలో మరణిస్తే గౌరవప్రద 'అమరుడు' హోదా దక్కేలా చేస్తాం . పంటకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తాం' అని అన్నారు.

నవీన్‌ బాబుపై కేసులేవి?: ''ఒడిశాలో బీజేడీ పార్టీ బీజేపీ కోసం పనిచేస్తోంది. నాపై మోపిన 24 పరువునష్టం, క్రిమినల్‌ కేసులను న్యాయంగా ఎదుర్కొంటున్నా. ఈడీ నన్ను 50 గంటలు విచారించింది. బీజేపీ నా లోక్‌సభ సభ్యత్వాన్ని, నాకు కేటాయించిన అధికారిక ఎంపీ బంగ్లానూ లాగేసుకుంది. నవీన్‌ బాబు(పట్నాయక్‌) నిజంగా బీజేపీకి వ్యతిరేకంగా పోరాడితే ఆయన మీద కూడా ఇలాగే కేసులు ఉండాలికదా. మరి లేవెందుకు?' అని అన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్‌ వాళ్లకు అంతకుమించి తెలీదు

హాలీవుడ్‌ 'గాంధీ' సినిమా తర్వాతే గాంధీజీ విశేషాలు ప్రపంచానికి తెలిశాయంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై రాహుల్‌ స్పందించారు. '' ఆర్‌ఎస్‌ఎస్‌ వాళ్లకు గాంధీజీ గురించి అంతకుమించి ఏం తెలీదు. ఎందుకంటే ఆర్‌ఎస్‌ఎస్‌ 'శాఖ'లో శిక్షణపొందిన వాళ్లు గాడ్సేను ఆరాధిస్తారు. గాంధీజీ గురించి వాళ్లకు తెలిసింది శూన్యం. హిందుస్తాన్‌, సత్యం, అహింసా మార్గం వంటి చరిత్ర వాళ్లకు బొత్తిగా తెలీదు. మోదీ అలా మాట్లాడతారని ఊహించిందే' అని అన్నారు.

దూసుకెళ్లిన 'అగ్నిబాణ్‌'

బుల్లి రాకెట్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించిన ప్రైవేట్‌ సంస్థ అగ్నికుల్‌

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): నాలుగు వరుస వాయిదాల అనంతరం ప్రైవేట్‌ అంతరిక్ష స్టార్టప్‌ కంపెనీ అగ్నికుల్‌ కాస్మోస్‌కు చెందిన చిన్న తరహా రాకెట్‌ 'అగ్నిబాణ్‌ సబ్‌ ఆర్బిటల్‌ ప్రయోగం (ఎస్‌ఓటీడీ) ఎట్టకేలకు విజయవంతమైంది. సతీశ్‌ ధవన్‌ అంతరిక్ష కేంద్రంలోని ధనుష్‌ రాకెట్‌ కాంప్లెక్స్‌ నుంచి గురువారం ఉదయం 7.45 గంటలకు రాకెట్‌ విజయవంతంగా రోదసిలోకి దూసుకెళ్లింది. సింగిల్‌ స్టేజ్‌లో రెండు నిమిషాల్లో ప్రయోగం జరిగింది. రాకెట్‌ సామర్థ్యాన్ని, ప్రపంచంలోనే తొలిసారిగా అగ్నికుల్‌ సంస్థ తయారు చేసుకున్న పూర్తి దేశీయ సింగిల్‌ పీస్‌ త్రీడీ ప్రింటెడ్‌ సెమీ క్రయోజనిక్‌ ఇంజన్తో పాటు ఇస్రో అందించిన సెమీ క్రయోజనిక్‌ ఇంజన్ల సామర్థ్యాన్ని నిర్ధారించుకునేందుకు ప్రయోగాత్మకంగా ఈ పరీక్ష నిర్వహించారు. 100 కిలోలు బరువున్న ఎక్స్‌పరమెంటల్‌ పేలోడ్‌ను భూమికి 700 కిలోమీటర్ల ఎత్తులోని లియో అర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టి రాకెట్‌ సామర్థ్యాన్ని నిర్ధారించుకున్నారు. అనంతరం రాకెట్‌ సురక్షితంగా సముద్రంలో కూలిపోయింది. ఇది మన దేశంలో ప్రైవేట్‌ లాంచ్‌ప్యాడ్‌ మీద చేసిన తొలి ప్రయోగం కావడం విశేషం. అలాగే సెమీ క్రయోజనిక్‌ ఇంజన్‌ అభివృద్ధి తర్వాత ఇస్రోకు కూడా ఇది తొలి ప్రయోగమే. 300 కిలోల లోపు బుల్లి ఉపగ్రహాల ప్రయోగాలకు అగ్నికుల్‌ రాకెట్‌ అత్యంత అనుకూలం. దేశంలో ఇది రెండో ప్రైవేట్‌ అంతరిక్ష ప్రయోగం.

అగ్నిబాణ్‌ విశేషాలు
రాకెట్‌ ఎత్తు 18 మీటర్లు
వెడల్పు 1.3 మీటర్లు
బరువు 14,000 కిలోలు
రాకెట్‌ దశలు 2
700 కిలోమీటర్లు ఎత్తులోని లియో ఆర్బిట్‌

ఒకరోజు ముందే..

కేరళను తాకిన నైరుతి

సాక్షి, న్యూఢిల్లీ: వరుణదేవుడు ఒక రోజు ముందుగానే కర్షకులను కరుణించాడు. అంచనాల కంటే ఒక రోజు ముందుగానే నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించినట్లు గురువారం భారత వాతావరణ శాఖ 'ఎక్స్‌' ద్వారా ప్రకటించింది. సాధారణంగా కేరళలోకి నైరుతి రుతుపవనాలు ఏటా జూన్‌ ఒకటిన ప్రవేశిస్తాయి. కేరళలో ఇప్పటికే కురుస్తున్న వర్షాలకు తోడు రుతుపవనాల రాకతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడనున్నాయి. ఈశాన్య ప్రాంతాల్లోనూ రుతుపవనాలు ప్రవేశించాయి. ఈ రెండు ప్రాంతాలు ఒకేసారి తాకడం అరుదైన విషయమని వాతావరణ శాఖ తెలిపింది. గతంలో 2017, 1997, 1995, 1991లో ఒకేసారి తాకాయని పేర్కొంది.

లాక్కొచ్చిన రేమాల్‌!

అంచనాలకంటే ముందుగా రుతుపవనాల రాకకు రేమాల్‌ తుపాను కూడా కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గత ఆదివారం పశ్చిమ బెంగాల్‌, బంగ్లాదేశ్‌లలో భీకర వర్షాలతో బీభత్సం సృష్టించిన రేమాల్‌ తుపానుతో బంగాళాఖాత జలాల ఉపరితల వాతావరణంలో మార్పులు సంభవించాయి. ఈ మార్పులు నైరుతి రుతుపవనాలను ఈ దిశగా త్వరగా లాగాయి. దీంతో ముందుగానే రుతుపవనాల ఆగమనం సాధ్యమైందని శాస్త్రవేత్తలు విశ్లేషించారు. రాబోయే మూడు, నాలుగు రోజుల్లో రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉందని తెలుస్తోంది.

వడదెబ్బ... 108 డిగ్రీల జ్వరం

ఢిల్లీలో మధ్యవయస్కుడి హఠాన్మరణం

న్యూఢిల్లీ: ఢిల్లీని చుట్టుముట్టిన వడగాలులు ఒక మధ్యవయస్కుడి ప్రాణం తీశాయి. వడదెబ్బతో ఆస్పత్రిలో చేరిన అతడి శరీర ఉష్ణోగ్రత చూసి వైద్యులు హుతాశులయ్యారు. అతని శరీర ఉష్ణోగ్రత సాధారణం కంటే 10 డిగ్రీలు ఎక్కువ ఉండటం గమనార్హం. సోమవారం రాత్రి జరిగిన ఘటన వివరాలను రామ్‌ మనోహర్‌ లోహియా ఆస్పత్రి డాక్టర్‌ రాజేశ్‌ శుక్లా వెల్లడించారు. '' బిహార్‌లోని దర్భాంగా పట్టణానికి చెందిన 40 ఏళ్ల వ్యక్తి సోమవారం ఢిల్లీలో వడదెబ్బకు గురయ్యారు. వెంటనే ఆర్‌ఎంఎల్‌ ఆస్పత్రిలో చేరారు. ఆయన శరీర ఉష్ణోగ్రత 108 డిగ్రీ ఫారన్‌హీట్‌కు చేరుకోవడం చూసి ఆందోళనకు గురయ్యాం. ఆయనను ఎలాగైనా కాపాడాలని శతథా ప్రయత్నించాం. కానీ శరీరంలో అతివేడి కారణంగా ఆయన మూత్రపిండాలు, కాలేయం విఫలమయ్యాయి. ఇలా వెంటవెంటనే పలు అవయవాలు వైఫల్యం చెందడంతో ఆయన కన్నుమూశారు' అని డాక్టర్‌ వివరించారు.

ఒకే ఆస్పత్రిలో 2 గంటల్లో 16 మరణాలు

పట్నా: ఉగ్ర ఉష్ణోగ్రత బిహార్‌లోని ఒకే ఆస్పత్రిలో 16 మంది ప్రాణాలను బలితీసుకుంది. గురువారం ఔరంగాబాద్‌లోని జిల్లా ఆస్పత్రిలో ఈ విషాద ఘటన జరిగింది. గురువారం అక్కడ 44, బుధవారం 48.2 డిగ్రీ సెల్సియస్‌ ఉష్ణోగ్రత నమోదైంది. ఇంతటి వేడికి తాళలేక జనం పిట్టల్లా రాలిపోయారు. చాలా మంది అక్కడి జిల్లా ఆస్పత్రిలో చేరగా గురువారం రెండు గంటల వ్యవధిలో 16 మంది చనిపోయారు.

ఎలక్షన్‌ బీట్‌

ప్రచారం పరిసమాప్తం

జూన్‌ ఒకటిన తుది దశలో 57 స్థానాలకు పోలింగ్‌

సాక్షి, న్యూఢిల్లీ: అధికార పీఠాధిరోహణమే పరమావధిగా రాజకీయ పార్టీలు మొదలెట్టిన సార్వత్రిక ఎన్నికల ప్రచారపర్వానికి తెరపడింది. చివరిదైన ఏడో దశ పోలింగ్‌కు సంబంధించిన ప్రచారం గురువారంతో ముగిసింది. జూన్‌ ఒకటో తేదీన చండీగఢ్‌ కేంద్రపాలిత ప్రాంతంసహా ఏడు రాష్ట్రాల్లోని 57 స్థానాలకు పోలింగ్‌ జరగనుంది. పంజాబ్‌లోని మొత్తం అన్ని సీట్లకు ఒకేదఫాలో జూన్‌ ఒకటో తేదీనే పోలింగ్‌ జరుగుతోంది. తుది దశ ఎన్నికలు జరుగుతున్న 57 సీట్లలో గత 2019 ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 32, యూపీఏ కూటమి 9 సీట్లు గెలుచుకోగా, మిగతా స్థానాలను ఇతర పార్టీలు గెలుచుకున్నాయి.

రాష్ట్రం	సీట్లు
పంజాబ్‌	13
ఉత్తరప్రదేశ్‌	13
బెంగాల్‌	9
బిహార్‌	8
ఒడిశా	6
హిమాచల్‌ ప్రదేశ్‌	4
జార్ఖండ్‌	3
చండీగఢ్‌	1

పోటీలో కీలక నేతలు

ప్రధాని మోదీ పోటీ చేస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి, తృణమూల్‌ కాంగ్రెస్‌ చీఫ్‌ మమతా బెనర్జీ మేనల్లుడు, పార్టీలో నంబర్‌2 నేత అభిషేక్‌ బెనర్జీ పోటీ చేస్తున్న డైమండ్‌ హార్బర్‌, ఆర్‌జేడీ చీఫ్‌ లాలూప్రసాద్‌ యాదవ్‌ కుమార్తె మీసా భారతి పోటీ చేస్తున్న బిహార్‌లోని పాటలీపుత్ర స్థానాలకూ ఈ చివరి దశలో పోలింగ్‌ జరగనుంది.

మోదీ @ 200 సభలు, రోడ్‌షోలు

సాక్షి, న్యూఢిల్లీ: ముచ్చటగా మూడోసారి బీజేపీని అధికారంలోకి తీసుకుని రావడమే లక్ష్యంగా ప్రధాని మోదీ ఈ ఎన్నికల ప్రచారంలో సుడిగాలి పర్యటనలు చేశారు. ఒక్కో రోజు మూడు నుంచి ఐదు సభలు, రోడ్‌షోల్లో పాల్గొన్నారు. మార్చి 16న ఈసీ ఎన్నికల షెడ్యూల్‌ ప్రకటించాక మొత్తంగా మోదీ 206 సభలు, సమావేశాలు, రోడ్‌షో, ర్యాలీల్లో పాల్గొన్నారు. ఒక్క మేలో 96 ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు.అత్యధిక ఎంపీ స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌లో ప్రధాని ఏకంగా 31 సభల్లో పాల్గొన్నారు. బిహార్‌లో 20, మహారాష్ట్రలో 19, పశ్చిమబెంగాల్‌లో 16 సభలకు హాజరయ్యారు. కేవలం ఈ 4 రాష్ట్రాల్లోనే 86 సభల్లో మోదీ పాల్గొనడం గమనార్హం. దక్షిణాదిన కర్ణాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో గెలుపే లక్ష్యంగా విస్తృత ప్రచారం చేశారు. అత్యధికంగా కర్ణాటక, తెలంగాణల్లో 11, తమిళనాడులో 7 ప్రచార కార్యక్రమాల్లో మోదీ పాల్గొన్నారు. 2019 ఎన్నికల్లో మోదీ 145 సభలు, సమావేశాలు, రోడ్‌షో, ర్యాలీల్లో పాల్గొన్నారు. 2019లో 68 రోజులు ప్రచారంచేయగా ఈసారి 76 రోజులపాటు ప్రచారంచేశారు. ఈసారి ఆయన మొత్తం 80 మీడియా ఇంటర్వ్యూలు ఇచ్చారు. అంటే సగటున రోజుకు ఒకటి కంటే ఎక్కువ.

రాహుల్‌ 107..ప్రియాంక 108

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ విజయావకాశాలను మెరుగుపరిచేందుకు ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌ గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ దేశవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. ర్యాలీలు, రోడ్‌ షోలు కలిపి మొత్తంగా రాహుల్‌ గాంధీ 107, ప్రియాంక 108 ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇవేకాకుండా, 16 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పర్యటన సమయంలో టీవీ ఇంటర్వ్యూ ఒకటి, ప్రింట్‌ మీడియాకు ఐదు ఇంటర్వ్యూలు ఇచ్చారు. కాంగ్రెస్‌ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 100పైగా ఎన్నికల ర్యాలీల్లో పాల్గొన్నారు. 20 మీడియా సమావేశాల్లో మాట్లాడారు. 70సార్లు మీడియాకు ఇంటర్వ్యూలిచ్చారు.

ప్రధాని ప్రతిష్టను దిగజార్చారు

మోదీపై మాజీ ప్రధాని మన్మోహన్‌ మండిపాటు

న్యూఢిల్లీ: ప్రధాని మోదీపై కాంగ్రెస్‌ నేత, మాజీ ప్రధాని మన్మోహన్‌ సింగ్‌ నిప్పులు చెరిగారు. ఎన్నికల వేళ విద్వేష ప్రసంగాలతో ప్రధాని పదవికున్న ప్రతిష్టను, బహిరంగ సభల గౌరవాన్ని ఆయన దిగజార్చారని మండిపడ్డారు. ఆఖరు విడతలో భాగంగా పంజాబ్‌లో జూన్‌ ఒకటో తేదీన జరగనున్న పోలింగ్‌ వేళ గురువారం మన్మోహన్‌ ప్రజలకు ఒక బహిరంగ లేఖ రాశారు. 'ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ సభల్లో చేసే రాజకీయ ప్రసంగాలను క్షుణ్నంగా పరిశీలిస్తూ వచ్చాను. మోదీ అత్యంత దుర్మార్గమైన విద్వేష పూరిత ప్రసంగాలు చేస్తున్నారు. ప్రజల మధ్య విభజనలను తెచ్చేవిగా ఉన్నాయి. బహిరంగ సభల్లో ప్రసంగాల గౌరవాన్ని, తద్వారా ప్రధాని కుర్చీకున్న ప్రతిష్టను పలుచన చేసిన మొదటి ప్రధాని మోదీ. ప్రధానమంత్రులెవరూ గతంలో ఒక నిర్దిష్ట వర్గాన్ని, ప్రతిపక్షాన్ని లక్ష్యంగా చేసుకుని ఇలాంటి విద్వేషపూరిత, అసభ్యకర, మొరటు మాటలు మాట్లాడలేదు. జీవితంలో ఎన్నడూ ఇలాంటి ప్రసంగాలు నేను చేయలేదు. అలాంటిది, మోదీ నాకు కూడా కొన్నిటిని ఆపాదించారు. ఇలాంటివి బీజేపీ నేతలకు మాత్రమే సాధ్యం'అని మన్మోహన్‌ వ్యాఖ్యానించారు. దేశ వనరులపై మొదటి హక్కు ముస్లింలకే ఉందంటూ గతంలో మన్మోహన్‌ అన్నారని మోదీ ఆరోపించడం తెల్సిందే.

అనారోగ్యమైతే ప్రచారం ఎలా చేశారు?

అరవింద్‌ కేజ్రీవాల్‌కు బెయిలు ఇవ్వొద్దు : ఈడీ వాదన

సాక్షి, న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం మనీ లాండరింగ్‌ కేసులో ఢిల్లీ సీఎం, ఆప్‌ జాతీయ కన్వీనర్‌ కేజ్రీవాల్‌ అనారోగ్యంగా ఉంటే ఎన్నికల ప్రచారం ఎలా నిర్వహించారని ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌(ఈడీ) ప్రశ్నించింది. అనారోగ్యం దృష్ట్యా రెగ్యులర్‌ బెయిల్‌తోపాటు వారం పాటు మధ్యంతర బెయిల్‌ ఇవ్వాలంటూ కేజ్రీవాల్‌ దాఖలు చేసిన పిటిషన్లపై ఢిల్లీ రౌజ్‌ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ కావేరి బవేజా గురువారం విచారణ చేపట్టారు. ఈడీ తరఫున అదనపు సొలిసిటర్‌ జనరల్‌ ఎస్‌.వి.రాజు వాదనలు వినిపించారు కేజ్రీవాల్‌కు బెయిల్‌ ఇవ్వొద్దని కోర్టును కోరారు. ''ప్రస్తుతం కేజ్రీవాల్‌ కస్టడీలో లేరు. సుప్రీంకోర్టు ఆయన మధ్యంతర బెయిల్‌ మంజూరు చేసింది. గురువారం కూడా పంజాబ్‌లో ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు'' అని ఎస్‌.వి.రాజు పేర్కొన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. కేజ్రీవాల్‌ రెగ్యులర్‌ పిటిషన్‌పై కౌంటరు దాఖలు చేయాలని ఈడీని ఆదేశించారు.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

శుక్రవారం : 31 : మే : 2024

ఏ క్షణమైనా ప్రజ్వల్ రాక?

బనశంకరి: అత్యాచారం, నగ్నవీడియోల కేసులో నిందితుడు, హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ ఓ క్షణమైనా బెంగళూరుకు వస్తారని కెంపేగౌడ విమానాశ్రయంలో సిట్ అధికారులు మకాం వేశారు. జర్మనీ మ్యూనిచ్ నుంచి బెంగళూరు ఎయిర్‌పోర్టుకు ప్రజ్వల్ కచ్చితంగా రానున్నట్లు సమాచారం. శుక్రవారం తెల్లవారుజామునకల్లా చేరుకోవచ్చని సిట్ పోలీసులు భావిస్తున్నారు. విమానాశ్రయంలోనే ప్రజ్వల్‌ను అదుపులోకి తీసుకుంటారని హోంమంత్రి పరమేశ్వర్ తెలిపారు. ఆయన బెంగళూరులో మాట్లాడుతూ విదేశాలకు వెళ్లి అరెస్ట్ చేయడం సాధ్యం కాదు. ప్రజ్వల్ భారత్‌కు వస్తానని ఇప్పటికే వీడియోలో తెలిపారు. అతను రాగానే న్యాయపరమైన ప్రక్రియ ప్రారంభమౌతుందని అన్నారు. మరోవైపు ప్రజ్వల్‌తో పాటు ఇతర నిందితులపై కఠిన చర్యలను తీసుకోవాలని గురువారం హాసన్‌లో ప్రజాసంఘాలు భారీ ర్యాలీ జరిపాయి.

న్యూస్‌రీల్

వృద్ధులకు ఫుట్ థెరపీ



ఫుట్ థెరపీ చేయించుకొంటున్న దృశ్యం

గౌరిబిదనూరు: దేహంలో రక్తప్రసరణ సక్రమంగా జరిగేలా, ప్రత్యేకించి వృద్ధులు, మధుమేహ రోగుల్లో పాదాల్లో సాఫీ రక్త ప్రసారం కోసం ఎక్స్‌పల్స్ ఫుట్ థెరపీ శిబిరాన్ని నిర్వహించారు. నగరంలో బిహెచ్ రోడ్డులో వున్న శనిమహాత్మ దేవాలయం ఆవరణలో శిబిరానికి పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. మోకాళ్లు, పాదాలకు వచ్చే అనేక రోగాలకు ఫుట్ థెరపీ మంచి చికిత్స అని శిబిరం నిర్వాహకుడు ఆర్య శెట్టి తెలిపారు. ఈ శిబిరం జూన్ నెల 15 వరకు జరుగుతుంది. ఒక యంత్రం మీద కాళ్లను ఉంచితే విద్యుత్ ప్రచోదనాల ద్వారా రక్త ప్రసరణ మెరుగయ్యేలా చేస్తుందని చెప్పారు. రోజూ అరగంట పాటు ఈ థెరపీ చేయించుకొంటే ఉత్తమ ఫలితాలు కనిపిస్తాయన్నారు. అలాగే ఈ యంత్రంపై చేతులను ఉంచి హ్యాండ్ థెరపీ కూడా చేసుకోవచ్చని తెలిపారు. మొదటి రోజు 300 మంది పాల్గొన్నారు.

లోకాయుక్తకు చిక్కిన మహిళా ఎస్ఐ

మైసూరు: వాహనం విడుదలకు ఓ వ్యక్తి వద్ద నుంచి మహిళా సబ్ ఇన్స్‌పెక్టర్ రూ. 50 వేల లంచం తీసుకుంటూ లోకాయుక్తకు చిక్కిన సంఘటన మైసూరులో జరిగింది. వివరాలు.. కువెంపు నగర ఎస్ఐ రాధ.. ఒక కేసులో సీజ్ చేసిన వాహనాన్ని విడిచి పెట్టేందుకు యజమానికి రూ. లక్ష లంచం డిమాండ్ చేశారు. దాంతో బాధితుడు లోకాయుక్త అధికారులకు ఫిర్యాదు చేశాడు. గురువారం బాధితుని నుంచి పోలీసు స్టేషన్‌లో లంచం తీసుకుంటున్న సమయంలో లోకాయుక్త అధికారులు దాడి చేసి ఎస్ఐ రాధాని అరెస్టు చేశారు. రూ. 50 వేల నగదు జప్తు చేసి విచారణ చేపట్టారు.

గిరిజన రైతు ఆత్మహత్య



స్వామి నాయక్ (ఫైల్)

తుమకూరు: భూమిని గుత్తకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న రైతు నష్టాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన తుమకూరు జిల్లాలోని పావగడ తాలూకాలోని వై.ఎన్.హొసకోటె వద్ద మేగళపాళ్య తాండాలో జరిగింది. స్వామి నాయక్ (40) అనే గిరిజన రైతు సొంతంగా పొలం లేకున్నా ఇతర రైతుల వద్ద భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు. ఇందుకోసం రెండు మైక్రో ఫైనాన్స్ కంపెనీలలో రూ. 4 లక్షలకు పైగా అప్పులు తీసుకున్నాడు. వ్యవసాయంలో లాభాలు రాక అప్పులు తీర్చలేకపోయాడు. దీంతో ఫైనాన్స్ సిబ్బంది నిత్యం ఇంటికి వచ్చి అప్పులు కట్టాలని పీడించేవారు. ఇది భరించలేక ఇంటి దగ్గర చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దాబస్‌పేట పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

ప్రసాదం తిని భక్తులు ఆస్పత్రిపాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దృశ్యం

యశవంతపుర: జాతరలో ప్రసాదం తిని 50 మందికి పైగా అస్వస్థతకు గురైన ఘటన బెళగావి జిల్లా చిక్కోడి తాలూకా కెరూర గ్రామంలో జరిగింది. కెరూరు గ్రామంలో బుధవారం బాళుమామ జాతర జరిగింది. వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ప్రసాదం తిన్న వారికి వాంతుల, విరేచనాలు అయ్యాయి. వెంటనే వారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. మధ్యాహ్నం మిగిలిన అన్న ప్రసాదాన్ని రాత్రి పంపిణీ చేయటం వల్ల అస్వస్థతకు గురయ్యారు.

ఇంట్లోకి చొరబడి అత్యాచారయత్నం

మైసూరు: ఇంటిలో మహిళ ఒంటరిగా ఉండగా ఒక దుండగుడు చొరబడి అత్యాచారయత్నం చేశాడు, ఆమె అడ్డుకోవడంతో దాడి చేసి పరారయ్యాడు. ఈ సంఘటన మైసూరు నగరంలోని మండి మొహల్లాలో జరిగింది. వివరాలు.. త్రిపుర రాష్ట్రానికి చెందిన అజయ్ మారక్ భార్య (28) బాధితురాలు. అజయ్ మారక్ ఒక హోటల్లో జ్యూస్ మాస్టర్‌గా పనిచేసేవాడు, ఆమె మరో హోటల్లో పని చేస్తుంది. ఆమె బుధవారం మధ్యాహ్నం పని ముగించుకుని ఇంటికి వచ్చింది. ఈ సమయంలో ఓ వ్యక్తి ఇంటిలోకి చొరబడి అఘాయిత్యం చేయబోగా ఆమె ప్రతిఘటించింది. దీంతో ఆమెను కొట్టి గాయపరిచి పారిపోయాడు. నరసింహరాజు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

కలిసి ఉద్యోగం కలేనా?



బెంగళూరులో ఓ వేడుకలో మహిళా పోలీసుల కవాతు (ఫైల్)



- దూరదూరంగా పోలీస్ దంపతుల డ్యూటీలు
- కుటుంబ నిర్వహణలో ఇక్కట్లు
- ఒకేచోట బదిలీకి దీర్ఘకాలంగా వినతులు

బనశంకరి: పోలీసుల బదిలీల అంశం చిక్కుముడి బిగుసుకుంటోందే తప్ప పరిష్కారమయ్యేలా కానరావడం లేదు. భార్యాభర్తలు ఇద్దరూ పోలీసులై ఉండి, వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తూ కుటుంబ నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కలతలు మొదలై కొందరు విడాకుల వరకూ వెళ్లినట్లు వార్తలున్నాయి. ఈ నేపథ్యంలో దంపతులు ఒకేచోట పనిచేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అందులో కానిస్టేబుల్స్ ను మాత్రమే బదిలీచేసి హెడ్ కానిస్టేబుల్స్‌ను పక్కన పెట్టడంపై వారు ఆగ్రహంతో ఉన్నారు. మరో పక్క అంతర్ జిల్లా బదిలీకి దరఖాస్తు చేసుకుని ఏడాదిన్నర నుంచి వేచిచూస్తున్న 7 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న పోలీసులు నిరాశలో మునిగిపోయారు.

కొందరికే అమలు

రాష్ట్ర ప్రభుత్వం ఈ మార్చి 5 తేదీన భార్యాభర్తల కేసులో సర్వీసు ఆధారంగా 86 మంది కానిస్టేబుల్స్‌ను కోరిన చోటుకు బదిలీ చేసింది. కానీ హెడ్‌కానిస్టేబుల్స్ డిమాండ్‌కు స్పందించకపోవడం ప్రస్తుతం వివాదానికి కారణమైంది. బదిలీ చేయాలని ప్రభుత్వం చెప్పినప్పటికీ పోలీస్ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని సిబ్బంది అసమాధానం వ్యక్తం చేశారు. న్యాయం కోసం కోర్టుకెళ్లాలని భావిస్తున్నారు. పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి ఆదేశాలు రానున్నాయని, పరిశీలనలో ఉందని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారికి సమాధానం వస్తోంది. బదిలీల వల్ల సిబ్బంది కొరత, సేవలకు అడ్డంకి ఉండబోదని పోలీసులు చెబుతున్నారు.



బదిలీల కోసం వేచి చూసి.. చూసి.. అలసిపోయామంటున్న కానిస్టేబుళ్లు

ఏడేళ్ల సర్వీసువారికీ అదే ఇబ్బంది

మరోపక్క లోక్‌సభ ఎన్నికలకు ముందు 7 ఏళ్ల సర్వీసు పూర్తయిన పోలీసులకు అంతరజిల్లా బదిలీలు చేయకపోతే పోలింగ్‌ను బహిష్కరిస్తామని పోలీస్ కుటుంబాలు హెచ్చరించాయి. కానీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఏడేళ్లు పూర్తయిన 4 వేలకు పైగా సిబ్బంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో జనరల్, మూడేళ్లు, మాజీ సైనికులకు పలు నిబంధనలు జారీచేశారు. దీంతో 4 వేల మంది కేఎస్‌పీ యాప్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 500 మందికి బదిలీ అర్హత ఉన్నట్లు నిర్ధారించారు. అనేకమంది పోలీసు కుటుంబాలు బెంగళూరులో సీఎం సిద్దరామయ్యకు జనతాదర్శనలో అంతరజిల్లా బదిలీ కోరుతూ వినతిపత్రాలను ఇచ్చారు.

హెడ్‌క్వార్టర్స్ పనేనా?

భార్యాభర్తలు పోలీసులై ఉండి, దూరదూరంగా పనిచేస్తున్నవారిని ఒకేచోటకు బదిలీ చేయాలని హోం మంత్రి పరమేశ్వర్ గతంలో లిఖితపూర్వక ఆదేశాలు జారీచేశారు. కానీ పోలీస్ ప్రధాన కార్యాలయం.. కానిస్టేబుల్స్‌ను బదిలీచేసి హెడ్‌కానిస్టేబుల్స్‌ను పక్కన పెట్టిందని ఆరోపణలున్నాయి.

ప్రభుత్వం ఏమి చెబుతోంది?

- బెంగళూరుతో పాటు అనేక జిల్లాల్లో ఉత్తర కర్ణాటక ప్రాంతం నుంచి వచ్చిన సిబ్బంది అధికంగా ఉన్నారు.
- ఒకేసారి బదిలీచేస్తే పోలీస్ స్టేషన్లలో సిబ్బంది కొరత ఏర్పడుతుంది.
- విధి నిర్వహణకు సమస్య లేకుండా బదిలీలు చేపడతామని చెబుతోంది.



వర్షాల రాకతో నెమళ్లలో ఆనందం తాండవిస్తోంది. గురువారం చిక్కమగళూరులో కనిపించిన ఓ మయూరం

మంత్రి నాగేంద్ర రాజీనామాకు బీజేపీ డెడ్‌లైన్





అశోక్, సీటీ.రవి, నిరసనకారుల అరెస్టు

- రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు



గురువారం బెంగళూరులో.. ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి వెళ్లినవారిని ఈడ్చుకెళుతున్న పోలీసులు

బనశంకరి: మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో కోట్లాది రూపాయలు కుంభకోణానికి సంబంధించి క్రీడలు, యువజన సర్వీసులశాఖ మంత్రి బీ.నాగేంద్ర రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. మంత్రి బీ.నాగేంద్ర రాజీనామా కోరుతూ బీజేపీ కార్యకర్తలు, బెంగళూరుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ధర్నాకు దిగారు. వాల్మీకి అభివృద్ధి మండలి అధికారి చంద్రశేఖర్ ఆత్మహత్య కేసును సీబీఐ విచారణకు అప్పగించాలని డిమాండ్ చేశారు. బెంగళూరులో విలేకరులతో బీజేపీ పక్షనేత ఆర్.అశోక్ మాట్లాడుతూ... జూన్ 6 తేదీలోగా మంత్రి నాగేంద్ర రాజీనామా చేయాలని లేనిపక్షంలో బీజేపీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కుంభకోణంలో మంత్రి నాగేంద్ర హస్తం ఉందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. చంద్రశేఖర్ డెత్‌నోట్‌లో మంత్రి సూచన మేరకు అక్రమంగా నగదు బదిలీ కాబడిందని ప్రస్తావించడంతో మంత్రి నాగేంద్ర రాజీనామా చేయాలని కోరారు. ఎస్టీ మోర్చా కార్యకర్తలు సీఎం సిద్దరామయ్య నివాసం ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు నిలువరించి లాక్కెళ్లారు.

అధికారులపై చర్యలు షురూ

చంద్రశేఖర్ ఆత్మహత్య, అవినీతి నేపథ్యంలో మహర్షి వాల్మీకి మండలి ఎండీ జీజే.పద్మనాభ్, లెక్కాధికారి పరశురామ్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. యూనియన్ బ్యాంక్ సీఈఓతో పాటు ఆరుగురిపై హైగ్రౌండ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

చంద్రశేఖర్ కేసును సీబీఐకి ఇవ్వాలి

- విజయేంద్ర డిమాండ్

శివమొగ్గ: వాల్మీకి కార్పొరేషన్ అధికారి పి. చంద్రశేఖర్ ఆత్మహత్య కేసును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీబీఐ విచారణకు అప్పగించాలని, మంత్రి నాగేంద్ర వెంటనే రాజీనామా చేయాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర డిమాండ్ చేశారు. గురువారం ఆయన శివమొగ్గలో చంద్రశేఖర్ నివాసానికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మీడియాతో మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆత్మహత్యను రాష్ట్రం మొత్తం నిరసిస్తోందన్నారు. వాల్మీకి మండలిలోనే కాదు మొత్తం ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని ఆయన తెలుసుకుని, దానిని నిలువరించలేక ఆత్మహత్య చేసుకొన్నారని చెప్పారు. వాల్మీకి మండలిలోనే అన్ని కోట్ల రూపాయల అక్రమాలు జరిగితే ఇక ప్రభుత్వంలో ఎంత పెద్దఎత్తున అవినీతి జరుగుతోందో అర్థం చేసుకోవాలన్నారు.

బెంగళూరులో సోదాలు.. బంగ్లాదేశీల నిర్బంధం

బనశంకరి: బెంగళూరు నగరంలో పలుచోట్ల బుధవారం అర్ధరాత్రి నుంచి దాడులు నిర్వహించిన సీసీబీ పోలీసులు అక్రమంగా మకాం వేసిన వంద మందికిపైగా బంగ్లాదేశ్ వలసవాసులను అరెస్ట్‌చేశారు. పెద్దసంఖ్యలో బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా బెంగళూరుకు చేరుకుని కూలి పనులు చేసుకుంటూ తలదాచుకున్నట్లు సమాచారం అందింది. ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా గురువారం తెల్లవారుజామున 5 గంటల వరకు సోదాలు చేపట్టారు. వందకు పైగా అక్రమ వలసవాసులు ఇళ్లు, గుడిసెలలో నివసిస్తున్నట్లు కనిపెట్టారు. అనేకమంది అక్రమ వలసదారులు ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులు తయారుచేసుకున్నట్లు తేలిందని సీసీబీ జాయింట్ పోలీస్ కమిషనర్ చంద్రగుప్త తెలిపారు. సుమారు వంద మందికిపైగా వలసదారులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి ఆధారాలు పరిశీలించకుండా ఇళ్లను అద్దెకు ఇచ్చిన వారిని కూడా సీసీబీ ప్రశ్నిస్తోంది. వీరిలో చాలామంది ఫ్యాక్టరీ, నిర్మాణ కూలి పనులు, హోటల్స్‌లో పనిచేస్తున్నవారే అధికంగా ఉన్నారు.

చైత్ర మృతి కేసు సీసీబీకి



బనశంకరి: హైకోర్టు న్యాయవాది, కేఏఎస్ అధికారి సతీమణి చైత్రా గౌడ (34) అనుమానాస్పద మృతి కేసును గురువారం సీసీబీకి అప్పగిస్తూ నగర పోలీస్ కమిషనర్ బీ దయానంద్ ఆదేశించారు. కేఐడీబీ అధికారి శివకుమార్ సతీమణి చైత్రాగౌడ హైకోర్టు న్యాయవాది, ఆమె ఈ నెల 11 తేదీన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మరణించారు, సంజయనగర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆమె క్రీడాకారిణిగా, ఔత్సాహిక మోడల్‌గానూ రాణించారు. వారికొక చిన్నారి కూతురు ఉంది. చైత్ర స్వస్థలం మండ్య జిల్లా మేలుకోటె కాగా, భర్తతో కలిసి బెంగళూరులో నివసించేవారు. భర్త ఆఫీసు నుంచి సాయంత్రం ఇంటికి రాగా ఆమె ఉరివేసుకున్న స్థితిలో శవమై తేలారు. మృతిపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. నగర న్యాయవాదుల సంఘం పోలీస్ కమిషనర్‌కు లేఖ రాసి చైత్ర ధైర్యవంతురాలు అని, ఆత్మహత్య ఘటన పట్ల అనుమానం ఉందని ఫిర్యాదు చేసింది.

లంచగొండికి అరదండాలు

హుబ్లీ: లంచం తీసుకుంటూ ఓ అధికారి లోకాయుక్త వలలో చిక్కిన ఘటన ధార్వాడలోని కర్ణాటక రాష్ట్ర ఆర్థిక మండలి (కేఎస్ఎఫ్‌సీ) కార్యాలయంలో గురువారం జరిగింది. వివరాలు.. రాయాపురలోని సదరు సంస్థలో డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.రమేష్‌కు.. హావేరివాసి ప్రవీణ్ మాళగి వాహన కొనుగోలుకు రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. రుణ మంజూరుకు రమేష్ లంచం అడిగాడు. అయితే ఈ విషయంపై ప్రవీణ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు పక్కా పథకంతో ప్రవీణ్ రూ.8 వేలు లంచం ఇస్తుండగా దాడి చేసి రమేష్‌ను పట్టుకున్నట్లు లోకాయుక్త పోలీసులు తెలిపారు.

చిన్నారిపై కామాంధుని దాడి

మైసూరు: చామరాజనగర జిల్లాలోని కొళ్లేగాల తాలూకాలోని ఒక గ్రామంలో 4వ తరగతి చదివే బాలిక పైన ఓ కామాంధుడు అత్యాచారం చేశాడు. దుండగుడు భద్ర అలియాస్ పైకాని (40) ని పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరు పిల్లల తండ్రి ఆయన ఇతడు బాలిక తల్లిదండ్రులు పనులకు వెళ్ళిన సమయంలో ఒంటరిగా ఉన్న బాలిక పైన అత్యాచారం చేసి గాయపరిచాడు. బాలిక తల్లిదండ్రులు వచ్చిన వెంటనే బాలిక ఏడుస్తుండడంతో కొళ్లేగాల ఆస్పత్రికి తరలించారు. పోలీసులు వచ్చి విచారించి పోక్సో కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్టు చేశారు.

ప్రేమికునిపై పెట్రోలు పోసి నిప్పు

- యువతి కుటుంబీకుల దాడి







ప్రియురాలితో రాహుల్, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ

యశవంతపుర: ప్రేమ విషయంపై రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగి యువకునిపై పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటన విజయపుర జిల్లా ముద్దేబిహాళ పట్టణంలో జరిగింది. వివరాలు.. రాహుల్ రామనగౌడ బిరాదర – ఐశ్వర్య మూడేళ్ల నుంచి ప్రేమించుకొంటున్నారు. ఇది తెలిసి ఐశ్వర్య తండ్రి, రాహుల్ కుటుంబసభ్యులను పిలిపించి పెళ్లి విషయమై చర్చించారు. కానీ అతని ప్రవర్తన సరిగా లేదని ఐశ్వర్య పెళ్లికి నిరాకరించింది.

ఫోటోలు పోస్ట్ చేస్తానని

ఇక అప్పటినుంచి రాహుల్ తననే పెళ్లాడాలని, లేదంటే తమ పాత ఫోటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానని యువతిని బెదిరించినట్లు ఆరోపణలున్నాయి. ఇలా బెదిరిస్తుండటంతో ఇరు కుటుంబాల మధ్య రాజీ ప్రయత్నాలు జరిగినా ఫలించలేదు. చివరికి బుధవారం యువతి కుటుంబ సభ్యులు రాహుల్ ఇంటికి వెళ్లి అతనిపై పెట్రోలు పోసి నిప్పంటించారు. కాలిన గాయాలైన అతడు స్థానిక ఆస్పత్రిలో విషమ పరిస్థితిలో చికిత్స పొందుతున్నాడు. తన కొడుకును హత్య చేయడానికే యువతి కుటుంబం దాడి చేసిందని అతని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ మేరకు ముద్దేబిహాళ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

హేమావతి నీటిని తరలించొద్దు

- తుమకూరులో హోంమంత్రి ఇంటి ముట్టడికి నేతల యత్నం



వివాదం రేకెత్తించిన హేమావతి నీటి తరలింపు

తుమకూరు: జిల్లాలో జల వివాదం క్రమంగా రాజుకుంటోంది. పార్టీలు, సంఘాలు నిత్యం ఆందోళనలతో కల్పతరునాడులో అశాంతి ఏర్పడుతోంది. హేమావతి ఎక్స్‌ప్రెస్ లింక్ కెనాల్‌ను వ్యతిరేకిస్తూ హోం మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జీ పరమేశ్వర్ ఇంటిని బీజేపీ సహా పలు పార్టీల నేతలు ముట్టడించేందుకు యత్నించారు. గురువారం తుమకూరులోని గొల్లహళ్ళిలోని హోంమంత్రి నివాసం ముందు ధర్నా చేయాలని వెళ్లగా మాజీ మంత్రి సొగడు శివణ్ణ, బీజేపీ ఎమ్మెల్యేలు ఎం.టి. కృష్ణప్ప, బీ.సురేష్‌గౌడతో పాటు కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఎమ్మెల్యే బీ.సురేష్ గౌడ ఇంటివైపు పరుగులు తీస్తుండగా పోలీసులు అడ్డుకుని ఎత్తుకెళ్లారు. డిఆర్ మైదానానికి తీసుకెళ్లి కొంతసేపటికి విడిచిపెట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ తుమకూరు జిల్లా నీటిని రామనగరకు తీసుకెళ్లడం తగదని, ఎక్స్‌ప్రెస్ లింక్ కెనాల్ అభివృద్ధి పనులను వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పోటీ నిరసన

హోంమంత్రి ఇంటి వద్ద ధర్నాను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు పోటీ ధర్నా చేశారు. సిద్ధార్థ ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రం ఆవరణలో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు శివణ్ణ, ఎమ్మెల్యేల పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీకి విరుద్ధంగా నినాదాలు చేస్తూ వారి పైకి దూసుకెళ్లే యత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు.



తుమకూరులో... ఓ ఎమ్మెల్యేను ఎత్తుకెళ్తున్న పోలీసులు



పోటీగా కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళన

క్లుప్తంగా

సత్వర నివేదికల కోసం ఆందోళన



ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: రాయచూరు వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్) ఆసుపత్రిలో సత్వరంగా వైద్య నివేదికలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడాన్ని రోగుల కుటుంబ సభ్యులు, సహాయకులు ఖండించారు. గురువారం ఆసుపత్రిలో రోగులకు సంబంధించిన రక్త, మూత్ర, బీపీ, షుగర్ పరీక్షలు చేసిన నివేదికలు ఇవ్వడానికి గంటల తరబడి వేచి ఉంచడాన్ని తప్పుబట్టారు. వైద్యులు రోగులను చూడడానికి వచ్చేలోపు ఆ నివేదికలు అందుబాటులో లేకపోతే తిరిగి వైద్యులు మరుసటి రోజు ఉదయం వచ్చే వరకు రోగులకు వైద్యం అందదని రోగుల బంధువులు ఆరోపించారు.

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు



మైసూరు: మైసూరు– కొడగు లోక్‌సభ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు జూన్ 4వ తేదీన మైసూరులోని మహారాణి మహిళా కాలేజీలో జరగనుంది. అక్కడి స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలను భద్రపరిచారు. గురువారం జిల్లా కలెక్టర్ కేవి రాజేంద్ర, పోలీస్ కమిషనర్ బానోత్ రమేశ్‌లు కాలేజీని పరిశీలించారు. ఓట్ల లెక్కింపు ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చించారు.

మైసూరులో ల్యాప్‌టాప్ దొంగల హల్‌చల్

మైసూరు: మైసూరు నగరంలోని హెబ్బాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకేరోజు 7 ల్యాప్‌టాప్‌లు, 2 మొబైల్‌ఫోన్లు చోరీ అయ్యాయి. వివరాలు.. ప్రైవేటు ఉద్యోగి అయిన శమంత్, స్నేహితులు లింగేష్, మహేందర్‌తో కలిసి హెబ్బాళలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. గురువారం ఉదయం అందరూ బయటకు వెళ్లగా దొంగలు పడి మూడు ల్యాప్‌టాప్‌లు, ఒక మొబైల్ ఫోన్ చోరీ అయ్యాయి. అలాగే హెబ్బాళలోని మొదటి స్టేజ్‌లో ప్రైవేటు ఉద్యోగులైన ప్రమోద్, మోహన్ కుమార్, పృథ్వి పవన్ అనే వారుంటున్న గదిలో దొంగలు దూరి 2 ల్యాప్‌టాప్‌లను ఎత్తుకెళ్లారు. మరో ఘటనలో మాదెగౌడ సర్కిల్‌లో సెల్వం, గణపతి, శ్రీకాంత్ అనే ప్రైవేటు ఉద్యోగుల ఇంట్లో 2 ల్యాప్‌టాప్‌లు, ఒక మొబైల్‌ను ఎత్తుకెళ్లారు. అన్ని కేసుల్లోను హెబ్బాళ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బేకరీ ధ్వంసం కేసులో ఏడుగురిపై ఎఫ్‌ఐఆర్

మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా నహురా గ్రామంలో ఓ బేకరీపై దాడి చేసి కేసులో పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. దాదాపు రూ.3 లక్షలు నష్టం జరిగినట్లు బేకరీ యజమాని తెలిపాడు. దాడి ఘటనకు సంబంధించి పోలీసులు విచారణ చేపట్టారు.

వృద్ధులకు నృత్య థెరపీ



నృత్య థెరపీలో వృద్ధులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

బనశంకరి: వృద్ధాప్యం కారణంగా వచ్చే వ్యాధులతో బాధపడుతున్న వృద్ధులకు శారీరక ఆరోగ్యం కోసం నృత్య థెరపీ విధానాన్ని అతుల్యా సీనియర్ కేర్ సంస్థ నిర్వహించింది. జాతీయ వృద్ధుల ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కసవనహళ్లిలోని వృద్ధాశ్రమంలో డ్యాన్స్ మూమెంట్ థెరపీ కార్యక్రమాన్ని అతుల్యా సీనియర్ కేర్ సంస్థ చేపట్టింది.డ్యాన్స్ మూమెంట్ థెరపీ నిర్వహించడం ద్వారా వృద్ధులు నిత్యం ఎదుర్కొంటున్న కీళ్లు, నడుము, చేతులు, కాళ్ల నొప్పులు నియంత్రణలోకి వస్తాయని సంస్థ సంచాలకుడు శ్రీనివాసన్ తెలిపారు. మానసిక, శారీరక ఆరోగ్యం కోసం వృద్ధాశ్రమాల్లో డ్యాన్స్ మూమెంట్ థెరపీ వృద్ధులకు నేర్పిస్తున్నామని తెలిపారు.

సీఎం రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి అశ్వత్థ నారాయణ

మైసూరు: మహర్షి వాల్మీకి గిరిజన తెగల అభివృద్ధి మండలి అధికారి చంద్రశేఖర్ ఆత్మహత్య కేసులో ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో పాటు మంత్రి నాగేంద్ర తమ పదవులకు రాజీనామా చేయాలని మాజీ మంత్రి అశ్వత్థ నారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మైసూరు నగరంలోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ...సీఎంకు తెలియకుండా ఒక ప్రభుత్వ శాఖలో ఏకంగా కోట్ల రూపాయలు తరలిపోవడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ఈ కేసును వెంటనే సీబీఐకి అప్పగించాలని, నైతిక బాధ్యత వహిస్తూ సీఎం సిద్దరామయ్య తన పదవికి రాజీనామా చేయాలని అన్నారు.

ఉపాధి హామీతో జీవనభృతికి ధీమా

- నిరుద్యోగులు సైతం పాలుపంచుకుంటున్న వైనం
- కాలువలకు నీరు వదిలేదాకా ఈ పనులే శరణ్యం



ఉపాధి హామీ పనుల్లో నిమగ్నమైన కూలీలు



ఉపాధి హామీ పనుల కొలత వేస్తున్న దృశ్యం

సాక్షి,బళ్లారి: గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పెట్టిన పంటలు పూర్తిగా నష్టపోవడంతో రైతన్నలతో పాటు వ్యవసాయ కూలీలకు ఉపాధి కరువైంది. ఈనేపథ్యంలో ఉపాధి హామీ పనులే అందరికీ ఉపాధి కల్పిస్తున్నాయి. కూలీలే కాదు, రైతు కుటుంబాలకు చెందిన వారు కూడా పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొని ఉపాధి పొందుతున్నారు. గ్రామంలోని నూటికి 80 శాతంపైగా ఉపాధి హామీ పనులు చేస్తూ ఉపాధి పొందుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. బళ్లారి తాలూకా సంగనకల్లు గ్రామంలో ప్రతి రోజు వందలాది మంది ఉదయమే పలుగు, పార, గడారలు పట్టుకుని పొలాల బాట పడుతున్నారు. ఉపాధి హామీ పనుల్లో రైతు పొలాల్లో కాలువల్లో పూడికను సైతం తీసుకునేందుకు అవకాశం కల్పించడంతో ఎటు చూసినా రైతుల పొలాల్లో వ్యవసాయ పనుల్లో భాగంగా ఉపాధి హామీ పనులు చేస్తూ అటు ఉపాధి పొందడంతో పాటు కాలువలకు నీరు వదిలేలోపు కాలువల్లో ఉన్న చెత్తా చెదారం, మట్టిని తొలగించి నీటిని బాగా పారేందుకు పూడికను తొలగిస్తున్నారు.

కూలీలుగా ప్రైవేట్ ఉపాధ్యాయులు

వ్యవసాయ కూలీలు, రైతన్నలే కాకుండా డిగ్రీ పట్టాలు పొంది, ప్రైవేటు ఉపాధ్యాయులుగా పని చేస్తున్న ఎందరో ఉపాధి హామీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత రెండు నెలల నుంచి ప్రభుత్వ సెలవులు కావడంతో ఉపాధి హామీ పనులే తమకు ఉపాధి కల్పిస్తున్నాయని నిరుద్యోగులు పేర్కొంటున్నారు. సంగనకల్లు గ్రామానికి చెందిన ఈశ్వర్ అనే పట్టభద్రుడు నగరంలోని ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు. సెలవులు కావడంతో ఇంట్లో పనిపాట లేకుండా ఊరికే కూర్చొవడానికి ఇష్టం లేక ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్నారు. నెల రోజుల నుంచి ఉపాధి హామీ పనులను ప్రతి రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చేస్తూ నెలకు కనీసం రూ.6 వేల నుంచి రూ.8 వేలు దాకా సంపాదిస్తూ ఉపాధి పొందుతున్నారు.

చిన్న, పెద్ద, మోతుబరి రైతులు కూడా

కులమతాలకతీతంగా చిన్న, పెద్ద, మోతుబరి రైతులు కూడా ఉపాధి హామీ పనులు చేస్తుండటం విశేషం. ప్రతి రోజు క్యూబిక్ మీటర్ల ప్రకారం మట్టిని తీయడంతో రోజు రూ.280 నుంచి రూ.380ల వరకు కూలీ లభిస్తోందని శకుంతల అనే ఉపాధి హామీ మహిళా కూలీ పేర్కొన్నారు. ప్రతి రోజు గ్రామాల్లో వందలాది మంది పలుగు, పార, గడార పట్టుకుని, నెత్తిన సద్దిమూట కట్టుకుని ఉపాధి హామీ పనుల్లో పాల్గొనేందుకు బయలుదేరుతున్నారు. బళ్లారి జిల్లాలో తుంగభద్ర ఆయకట్టు విస్తారంగా ఉండటంతో కాలువలకు నీరు వదిలే వరకు ఉపాధి హామీ పనులను కొనసాగించాలని, అంత వరకు పనులు ఎక్కడా దొరకవని కూలీలు పేర్కొంటున్నారు. నెల రోజులకు పైగా ఉపాధి హామీ పనులతో జీవనం సాగిస్తున్నామని, తమకు కనీసం రూ.2 వేలకు పైగా కూలీ లభిస్తోందన్నారు.

జూన్ 6 లోపు మంత్రి రాజీనామా చేయాలి

- లేకుంటే 7 నుంచి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం
- మండలి అక్రమాలపై సీబీఐ దర్యాప్తు చేయించాలి
- విధాన పరిషత్ సభ్యుడు రవికుమార్ డిమాండ్



మాట్లాడుతున్న రవికుమార్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు తదితరులు

సాక్షి,బళ్లారి: వాల్మీకి అభివృద్ధి మండలిలో కోట్లాది రూపాయల అక్రమాలు జరిగినందునే చంద్రశేఖర్ అనే అధికారి డెత్‌నోట్ రాసిపెట్టి మరీ ఆత్మహత్యకు పాల్పడ్డారని, మంత్రి మౌఖిక ఆదేశాలతోనే నిధుల మళ్లింపు జరిగిందని స్పష్టంగా తెలియజేసినా సంబంధిత మంత్రి నాగేంద్రను మంత్రి పదవి నుంచి ఎందుకు తప్పించడం లేదని, ఆయనను సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు ఎందుకు వెనకేసుకుని వస్తున్నారని విధాన పరిషత్ సభ్యుడు రవికుమార్ ధ్వజమెత్తారు. ఆయన గురువారం నగరంలోని వాజ్‌పాయి లేఅవుట్‌లో మాజీ ఎమ్మెల్యేలు గాలి సోమశేఖరరెడ్డి, సోమలింగప్ప, టీ.హెచ్. సురేష్‌బాబు తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వాల్మీకి మండలిలో వంద కోట్లకు పైగా నిధులు దారి మళ్లాయని, ఆ నిధులన్ని తెలంగాణకు తరలించినట్లు స్పష్టమైన రికార్డులు ఉన్నాయని, అక్కడ ఎన్నికల కోసం కర్ణాటక డబ్బులు వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాల్మీకి మండలిలో అక్రమాలు జరిగిన నేపథ్యంలో మంత్రిని కేబినెట్ నుంచి తొలగించేందుకు సీఎం ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని మండిపడ్డారు. అవినీతి మంత్రి నాగేంద్రను జూన్ 6వ తేదీలోపు తొలగించకపోతే 7వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు.

కలిసికట్టుగా పోరాడతాం

బెంగళూరుతో పాటు అన్ని నియోజకవర్గాల్లో తమ పార్టీ ఎమ్మెల్యేలతో పాటు ఆయా తాలూకా స్థాయి నాయకులు కలిసికట్టుగా పని చేసి, పోరాటానికి దిగుతామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న లూటీలను అరికకట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. గతంలో ఇదే తరహా ఆరోపణలతో మంత్రి ఈశ్వరప్పను మంత్రి పదవి నుంచి తొలగించి తాము నిజాయితీని నిరూపించుకున్నామని గుర్తు చేశారు. అవినీతిపై సమగ్ర విచారణకు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న అధికారి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మంత్రిని తక్షణం పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలతో పాటు జిల్లా బీజేపీ అధ్యక్షుడు అనిల్, కార్పొరేటర్లు కోనంకి తిలక్, హనుమంతప్ప, గోవిందు, శ్రీనివాస్ మోత్కూరు, సురేఖ మల్లనగౌడ, బీజేపీ నాయకులు కే.ఎస్.దివాకర్, రామలింగప్ప, ఎర్రంగళి తిమ్మారెడ్డి, గుత్తిగనూరు విరుపాక్షిగౌడ, ఓబుళేసు, గురులింగనగౌడ తదితరులు పాల్గొన్నారు.

అధిక విద్యుత్ బిల్లులతో జనం జేబుకు చిల్లు



మాట్లాడుతున్న శరత్ కళస

రాయచూరు రూరల్: మీటర్ రీడింగ్‌లో లోపాలను సవరించకుండా ఇష్టానుసారంగా అధిక మొత్తంలో బిల్లులు చెల్లించాలని వినియోగదారులకు విద్యుత్ శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారని హైదరాబాద్ కర్ణాటక విద్యుత్ వినియోగదారుల వేదిక సంచాలకుడు శరత్ కళస పేర్కొన్నారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటికి మీటర్లు బిగించకుండానే బిల్లులు చెల్లించాలని పేర్కొనడాన్ని ఖండించారు. 3 నెలలకు రూ.8759 బిల్లు కట్టాలని అధికారులు చెప్పడంతో చివరికి కోర్టుకు వెళ్లడంతో జెస్కాం ఇంజినీర్‌కు అంబుడ్స్‌మెన్ రూ.26 వేలు జరిమానా విధించారన్నారు. అధికారులు ఇష్టం వచ్చినట్లు మీటర్ రీడింగ్ చేయడంలో బిల్లులు వేస్తున్నారన్నారు. శివకుమార్, దానప్పలున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

హుబ్లీ: కార్పొరేటర్ అరీఫ్ భద్రపుర్‌పై హత్యాయత్నానికి ప్రయత్నించి ఎనిమిదేళ్లుగా తప్పించుకొని తిరుగుతున్న నిందితుడిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. సైఫ్ అలీ అనే వ్యక్తి 2016లో అరీఫ్ భద్రపుర హత్యకు యత్నించాడన్న ఆరోపణలపై జైలుకు చేరారు. అనంతరం బెయిల్ పొంది బయటకు వచ్చాడు. అప్పటి నుంచి కోర్టుకు హాజరు కాకుండా పోలీసుల కళ్లుగప్పి ఇతర రాష్ట్రాల్లో తలదాచుకునేవాడు. తమకు అందిన సమాచారం మేరకు టౌన్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి జుడీషియల్ కస్టడీకి అప్పగించారు.

అభ్యర్థి గెలుపు.. అభివృద్ధికి మలుపు



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ

మాలూరు: రాష్ట్రంలో మన ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేస్తే తాలూకా అభివృద్ధికి మలుపు అవుతుందని ఎమ్మెల్యే కేవై నంజేగౌడ అన్నారు. గురువారం తాలూకాలోని లక్కూరు, టేకల్, మాస్తి ఫిర్కాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. తాలూకా అభివృద్ధి దృష్ట్యా ఆగ్నేయ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి డీటీ శ్రీనివాస్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఉపాధ్యాయులకు విన్నవించారు. తాలూకాలో ఉన్న 527 మందికి పైగా ఉపాధ్యాయులకు గాను ప్రతి ఉపాధ్యాయుడు కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలన్నారు. పలు పాఠశాలల ఉపాధ్యాయులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మండలి నిధులు తెలంగాణకు మళ్లింపు?

రాయచూరు రూరల్: మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన రూ.187 కోట్ల అవినీతి భాగోతానికి సంబంధించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జరిగిన తెలంగాణ లోక్‌సభ ఎన్నికలకు మళ్లించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.14 మంది అనామధేయుల ఖాతాల్లోకి వర్చువల్ విధానం ద్వారా నిధులను మళ్లించారని సమాచారం. మండలి నిధులను పీడీ ఖాతా నుంచి ఖర్చు చేయకుండా మండలి బ్యాంక్ ఖాతాను 2024 మార్చి 5 నుంచి 23 వరకు బెంగళూరు వసంత్ నగర్ యూనియన్ బ్యాంక్ శాఖ ఖాతా నుంచి కాకుండా ఎంజీ రోడ్డులోని శాఖలో బ్యాంక్ కొత్త ఖాతాను ప్రారంభించి నిధులు డ్రా చేసినట్లు తేలింది. వివిధ బ్యాంక్ ఖాతాల నుంచి రూ.94.73 కోట్లు బదిలీ అయ్యాయి. ఈ విషయంలో యూనియన్ బ్యాంక్ సీఈఓతో పాటు ఆరుగురు మండలి అధికారులు మణి మేకలై, నితీష్ రంజన్, రామసుబ్రమణ్యం, సంజయ్ రుద్ర, పంకజ్ ద్వివేది, సుచిత్‌లపై కేసు నమోదైనట్లు తెలిసింది.

కొత్తిమీర ధరకు రెక్కలు

- కట్ట రూ.80 చొప్పున విక్రయం



మార్కెట్లో కొత్తిమీర కట్టలు

కోలారు: కొత్తిమీర కట్ట ధరలు మార్కెట్‌లో ఉన్నఫళంగా పెరిగి పోయి కట్ట కొత్తిమీరను ఏకంగా రూ.80 చొప్పున విక్రయిస్తున్నారు. నెల రోజుల క్రితం 150 కట్టలు కలిగిన ఒక కొత్తిమీర మూట ధర రూ.1500 ఉండగా, నేడు దీని ధర రూ.12 వేలకు చేరుకుంది. బెంగళూరు, చెన్నై, ఈరోడ్, హైదరాబాద్, తిరుపతి వ్యాపారుల నుంచి నాణ్యమైన నాటు కొత్తిమీరకు డిమాండ్ అధికంగా ఉంది. కొత్తిమీర దిగుబడి తక్కువగా ఉండడమే ధరలు పెరగడానికి కారణమని వ్యాపారులు అంటున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎండలు ఎక్కువగా ఉన్నందున కొత్తిమీర నాటడానికి రైతులు వెనకడుగు వేశారు. కొంతమంది రైతులు కొత్తిమీర పండించినా దిగుబడి సరిగా రాలేదు. కొంతమంది మామిడి తోపుల్లో కొత్తిమీర పండించారు. మే నెలలో కురిసిన వానలకు కొత్తిమీర పంట బాగా నష్టమైంది. దీని వల్ల మార్కెట్‌కు కొత్తిమీర రావడం తగ్గి ధర పెరుగుదలకు కారణమైంది.

కోలారు వార్తలు...

సమస్యల పరిష్కారానికి గెలుపు అనివార్యం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే ఎన్‌డీఏ అభ్యర్థి వైఏ నారాయణస్వామికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సహ్యాద్రి కళాశాల పాలనాధికారి ఉదయ కుమార్ తెలిపారు. గురువారం నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఎన్‌డీఏ అభ్యర్థి తరఫున చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. మూడు సార్లు ఎమ్మెల్సీగా విధులు నిర్వహించిన నారాయణస్వామి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో అపార అనుభవం కలిగి ఉన్నారన్నారు. నారాయణస్వామి సహోదరుడు వీరభద్రప్ప మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంతో పాటు విద్యా వ్యవస్థను సరిచేయడానికి అనుభవజ్ఞుడైన నారాయణస్వామి గెలుపు అనివార్యమన్నారు. ఉపాధ్యాయులను తన కుటుంబ సభ్యులుగా భావించే నారాయణస్వామికి సదా ఉపాధ్యాయుల సమస్యలపై స్పందించే మనోభావం ఉందన్నారు. ప్రిన్సిపాల్ గంగాధర రావ్, మహిళా కళాశాల ఉపన్యాసకులు, మద్దతుదారులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తన ధరలు తగ్గించరూ



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: పెరిగిన విత్తనాలు, ఎరువుల ధరలను తగ్గించి రైతులకు అందుబాటులోకి తీసుకు రావాలని, రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలని కోరుతూ రైతు సంఘం పదాధికారులు గురువారం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ ముంగారులో విత్తనాలు వేయడానికి సిద్ధంగా ఉన్న రైతులకు పెరిగిన ఎరువులు, విత్తనాల ధరలు అశనిపాతంగా మారాయన్నారు. పెరిగిన ధరలతో ఎరువులను కొనలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ పెట్టుబడి తడిసిమోపెడయ్యే అవకాశం ఉన్నందున పెంచిన విత్తనాలు, ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎరువులు, విత్తనాల ధరలు పెంచి రైతు వ్యతిరేక నీతిని అవలంభిస్తోందని ఆరోపించారు. ప్రగతిశీల రైతు ధర్మఘట్ట నంగలి నాగేష్, జుబేర్ బాషా, అంబ్లికల్ మంజునాథ్, రాజేష్, ఫారూక్ పాషా, విజయపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత ఓటుతో గెలిపించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంజునాథ్

కోలారు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. గురువారం తాలూకాలోని వివిధ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులతో ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి డీటీ శ్రీనివాస్ తరఫున ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 2013లో సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 6వ వేతన కమిషన్‌ను అమలు చేసిందని గుర్తు చేశారు. ఇచ్చిన మాట మీద నిలబడేది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. ఆగ్నేయ పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే ప్రామాణిక ప్రయత్నం చేస్తారన్నారు. ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సీసంద్ర గోపాలగౌడ, మైలాండహళ్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎన్నికలకు సర్వం సిద్ధం

హొసపేటె: ఈశాన్య కర్ణాటక పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ జూన్ 3న విజయనగర జిల్లాలోని 6 తాలూకాల్లోని 21 పోలింగ్ స్టేషన్లలో నిర్వహించనున్నట్లు జిల్లాధికారి దివాకర్ తెలిపారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఎన్నికల సన్నాహాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. గత ఎన్నికల్లో 15 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మొత్తం ఓటర్ల సంఖ్య 5,880 మంది మాత్రమే ఉండేవారన్నారు. కానీ ప్రస్తుత ఎన్నికల్లో విజయనగర జిల్లాలోని 6 తాలూకాల్లో 21 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 18,235 మంది ఓటర్లకు గాను 11,899 మంది మహిళలు, 6,336 మంది పురుష ఓటర్లు ఉన్నారన్నారు. ఓటింగ్ ప్రక్రియ జూన్ 3న ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. అదనపు జిల్లాధికారిణి అనురాధ పాల్గొన్నారు.

రైతులకు భూపరిహారం చెల్లించండి



సమావేశంలో పాల్గొన్న జిల్లాధికారి తదితరులు

రాయచూరు రూరల్: రాయచూరు–గిణిగేర రహదారిలోని రైతుల భూములకు ప్రభుత్వం పరిహారం అందించాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం గౌరవాధ్యక్షుడు చామరస మాలి పాటిల్ విన్నవించారు. ఆయన గురువారం జిల్లాధికారి కార్యాలయంలో జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 1990లో రైతుల నుంచి కుడి ఎడమ వైపులలో 75 అడుగుల మేర భూమిని స్వాధీనం చేసుకొని రహదారిని నిర్మించారన్నారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించాలన్నారు. రూ.1600 కోట్లతో చేపట్టే చతుష్పథ రహదారి నిర్మాణంతో గిణిగెర, గంగావతి, కారటిగి, సింధనూరు, మాన్వి, కుర్డి, సాత్ మైలు వరకు భూములను స్వాధీనం చేసే రైతులకు జాతీయ రహదారుల శాఖ అధికారులు పరిహారం అందించాలన్నారు. సమావేశంలో శరణబసవ, బూదయ్య స్వామి, ప్రభాకర్ పాటిల్, బసవరాజ, లింగారెడ్డి, సూగూరయ్యలున్నారు.

హీరో రవిచంద్రన్ పుట్టినరోజు

యశవంతపుర: కన్నడ సినీ నటుడు రవిచంద్రన్ 63వ పుట్టిన రోజు వేడుకలను భార్య, పిల్లలతో కలిసి రాజాజీనగరలోని నివాసంలో సరళంగా జరుపుకొన్నారు. గత వారం రవిచంద్రన్ హీరోగా నటించిన ది జడ్జిమెంట్ సినిమా విడుదలైంది. ప్రేమలోక-2 షూటింగ్ చేపట్టే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రేమలోక-2లో కొడుకు మనోరంజన్‌ను హీరోగా పరిచయం చేస్తున్నట్లు తెలిసింది.

వంచనపై అప్రమత్తంగా ఉండాలి



బ్యాంకు ముందు అవగాహన కలిగిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: ప్రజల దృష్టిని మరల్చి డబ్బు, నగలు దోచుకు వెళుతున్న వారిపై అప్రమత్తంగా ఉండాలని కేజీఎఫ్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నగరంలోని బ్యాంకులు, పోస్టాఫీసులు, బస్టాండు తదితర ప్రాంతాల్లో ప్రజలను జాగృతం చేయడానికి జన జాగృతి కార్యక్రమాలను నిర్వహించారు. కేజీఎఫ్ పోలీస్ జిల్లా వ్యాప్తిలోని అన్ని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయం, బస్టాండు, మార్కెట్, ఏటీఎం తదితర పబ్లిక్ ప్రాంతాల్లో దొంగలపై అప్రమత్తంగా ఉండాలని జాగృతి కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని సీఐ, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది జాగృతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపు రద్దుకు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కేజీఎఫ్ : నిబంధనలకు వ్యతిరేకంగా ఎక్కువ మంది విద్యార్థులను చేర్చుకుంటూ వారి తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న నగరంలోని జైన్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ దళిత సంఘర్ష సమితి కార్యకర్తలు బీఈఓకు వినతి పత్రం సమర్పించారు. సంఘం సంచాలకుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ రాబర్ట్‌సన్ పేటలో మహావీర జైన్ విద్యా సంస్థ పాలక మండలి 1 నుంచి 7వ తరగతి వరకు అనుమతి తీసుకుని ప్రతి తరగతికి 40 మంది పిల్లల ప్రకారం, 8 నుంచి 10వ తరగతి వరకు ప్రతి తరగతికి 70 మంది పిల్లలు చొప్పున చేర్చుకోవాల్సి ఉండగా అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులను చేర్చుకుంటున్నారు. అంతేకాకుండా నిర్ణీత ఫీజుల కంటే ఎక్కువ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాసంస్థపై చర్యలు తీసుకోకుంటే పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు. ఈసందర్భంగా సమితి తాలూకా అధ్యక్షుడు లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వైభవంగా గ్రామ దేవతల ప్రతిష్ఠాపన



ఎమ్మెల్యే తదితరులను సన్మానించిన దృశ్యం

గౌరిబిదనూరు: తాలూకా తొండేబావి హోబళీ కదిరి దేవరపల్లి గ్రామంలో గ్రామ దేవతలు పెద్దమ్మ, సప్పలమ్మ, మద్దూరమ్మ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన వేడుక బుధవారం వైభవంగా జరిగింది. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పుట్టస్వామి సహా పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో కొచిముల్ డైరెక్టర్ కాంతరాజు, అశోక్‌కుమార్, శ్రీనివాసగౌడ, యూత్ బ్రిగేడ్ సభ్యులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై బ్యాగు కలకలం



కృష్ణరాజపురం: నగరంలోని కృష్ణరాజపురం నియోజక వర్గంలోని రామ్మూర్తినగర వద్ద ఉన్న వంతెన ఫుట్‌పాత్‌పై అనుమానాస్పద బ్యాగ్ ఉండగా, పోలీసులు పరిశీలించారు. గురువారం ఉదయం నుంచి ఒక బ్యాగు ఉంది. స్థానికులు అనుమానంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా దానిని తనిఖీ చేయగా బట్టలు వంటివి ఉన్నాయని, అనుమానాస్పద వస్తువులు లేవని తెలిపారు.

పార్కింగ్ వాహనాల ధ్వంసం



కారు అద్దాలు ధ్వంసం చేసిన దృశ్యం

శివమొగ్గ: శివమొగ్గ నగరంలోని హోసమనె లేఔట్ మూడో క్రాస్‌లో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగుల గ్యాంగ్ వేట కొడవళ్లతో పార్కింగ్ చేసిన కార్లు, బైక్‌లను ధ్వంసం చేసిన ఘటన భయాందోళనకు గురిచేసింది. ఈ ఘటనలో నాలుగు కార్లు, బైక్, రెండు ఆటోలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలు మొత్తం అక్కడి సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వేడుకగా సీతారాముల కల్యాణం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి దంపతులు

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి పరిధి హోంగసంద్ర గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామ దేవతల జాతర సందర్భంగా గురువారం శ్రీ సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులు శ్రీనివాసరెడ్డి, బాబురెడ్డి, నాగభూషన్ రెడ్డి తదితరులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బొమ్మసంద్రలో అగ్ని ప్రమాదం



బనశంకరి: బెంగళూరు ఆనేకల్ సమీపంలోని బొమ్మసంద్ర పారిశ్రామికవాడలో ప్లాస్టిక్ గమ్ టేప్ తయారీ పరిశ్రమలో అగ్నిప్రమాదం సంభవించింది. గురువారం ఉదయం 11 గంటల సమయంలో బెంగళూరు నగర శివారులోని ఆనేకల్ బొమ్మసంద్ర పారిశ్రామికవాడలో టెక్నీవాటెప్స్ ప్రైవేటు లిమిటెడ్ అనే పరిశ్రమలో ఆకస్మికంగా అగ్నిప్రమాదం సంభవించడంతో సమీపంలోని వారు అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. తక్షణం వారు అక్కడికి చేరుకుని మంటలను అతికష్టమీద ఆర్పివేశారు. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. హెబ్బగోడి పోలీసులు ప్రమాదానికి కారణాలు ఆరా తీస్తున్నారు.


కార్యాలయం ప్రారంభం

తుమకూరు: తుమకూరు నగరంలోని ఎంజీ రోడ్డులో ఉన్న గురుకుల సౌహార్ద ప్రభుత్వ సంఘం ప్రధాన కార్యాలయాన్ని గురువారం బీహెచ్ రోడ్డులో గురుకుల విద్యార్థుల నిలయం ఆవరణంలో గురుకుల ఆర్కెడ్‌కు తరలించారు. దీంతో ఇక్కడి నుంచే అధికారిక విధులు ప్రారంభించారు. ఈ నూతన శాఖను తుమకూరు నగర ఎమ్మెల్యే జీ.బీ.జ్యోతిగణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...సహకార రంగంలో గురుకుల సౌహార్ద సహకార సంఘం మంచి పేరు వచ్చిందని, ఈ శాఖను ఇక్కడ ఏర్పాటు చేయడం ప్రజలకు అనుకూలమన్నారు.

ఫొటోగ్రఫీ ఆయన ఊపిరి

- వృత్తి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, ప్రవృత్తి ఫొటోగ్రఫీ
- ప్రకృతి అందాలను క్లిక్‌మనిస్తున్న మహేశ్‌రెడ్డి
- ఉత్తమ చిత్రాలకు పురస్కారాలు

బనశంకరి: వెయ్యి పదాల్లో చెప్పలేని విషయాన్ని ఒక ఛాయాచిత్రం చెబుతుంది. ఫొటోగ్రఫీ అనేది చక్కని అభిరుచి. బెంగళూరు నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మహేశ్‌రెడ్డికి చిన్నప్పటి నుంచి ఫొటోగ్రఫీ అంటే అంటే ప్రాణం. తాను కంటితో చూసేదాన్ని కెమెరాలో బంధించడం అంటే ఎంతో ఇష్టం. ఉద్యోగం చేస్తూనే సెలవు దొరికితే తక్షణం అటవీ ప్రాంతాలకు వెళ్లిపోతారు. గత పుష్కరకాలంలో బండీపుర, నాగరహొళె, దాండేలి, మడికేరి, భద్ర, కొత్తగిరి, కబిని తదితర ప్రాంతాల్లో తన కెమెరాలో బంధించిన చిత్రాలకు కొదవ లేదు. తన అభిరుచికి అనుగుణంగా మలుచుకుని ప్రకృతి పారవశ్యాన్ని సమాజానికి చూపే ప్రయత్నం చేస్తున్నారు. దేశంలో పేరొందిన జిమ్ కార్బెట్, మదుమలై, రణంతోంబర్, తడోబా, పంగాట్, సౌతాల్ అటవీ ప్రాంతాలను ఆయన ఇప్పటికే సందర్శించారు. కోస్టారికా, ఆఫ్రికా, మధ్య అమెరికా దేశాల్లోని ప్రకృతి ప్రాణులు సౌందర్యాన్ని ఆస్వాదించి కెమెరాలో బంధించి ఆ ఆనందాన్ని అందరికీ పంచారు. వన్య ప్రాణులు, పక్షుల జీవనశైలిని అధ్యయనం చేసేందుకు తనకు ఫొటోగ్రఫీ సహకరిస్తుందని మహేశ్‌రెడ్డి తెలిపారు. పని ఒత్తిడి నుంచి కొంత విశ్రాంత, సరికొత్త ఉత్సాహాన్ని పొందేందుకు ఫొటోగ్రఫీ, పర్యటనలు సహకరిస్తాయన్నారు. బెంగళూరుతో పాటు దేశ విదేశాల్లోని ఫొటోగ్రఫీ సందర్శనల్లో ఫొటోలు ప్రదర్శనకు ఉంచారు. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ పత్రికల్లో తాజాగా మహేశ్‌రెడ్డి తీసిన చిత్రాలకు చోటు దక్కింది. ఉత్తమ చిత్రాలు తీసినందుకు పలు పురస్కారాలు లభించగా అందులో శాంక్చురీ ఆసియా అవార్డు 2012 తనకు ప్రత్యేకమైందన్నారు.



ఫొటోగ్రఫీపై మక్కువతో రాణిస్తున్న మహేశ్‌రెడ్డి









మహేశ్‌రెడ్డి తన కెమెరాలో బంధించిన అరుదైన పక్షులు, వన్యజీవుల చిత్రాలు

పెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి బెయిల్

బనశంకరి: ప్రజ్వల్ పెన్‌డ్రైవ్ కేసులో చేతన్‌గౌడ, లిఖిత్‌గౌడకు గురువారం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. పెన్‌డ్రైవ్ కేసులో 6, 7 నిందితులుగా ఉన్న చేతన్‌గౌడ, లిఖిత్‌గౌడ బెయిల్‌పై నగర ఏసీఎంఎం కోర్టులో వాద ప్రతివాదనలు విన్న న్యాయమూర్తి ఇరువురికి బెయిల్ మంజూరు చేశారు.

ప్రభుత్వం కూల్చటానికి పూజలు !

యశవంతపుర: తమ ప్రభుత్వాన్ని కూల్చడానికి శత్రు భైరవి యాగం చేస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి డికే శివకుమార్ ఆరోపించారు. తమ రాజకీయ ప్రత్యర్థులు శత్రు భైరవి యాగం చేయటానికి అఘోరీ వద్దకు వెళ్లినట్లు తెలిపారు. గురువారం బెంగళూరులోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. తనపై, ముఖ్యమంత్రి, ప్రభుతాన్ని పడగొట్టడానికి పెద్ద స్థాయిలో పూజలు జరుగుతున్నాయన్నారు. ఏ పూజ చేస్తున్నారో, ఎక్కడ చేయిస్తున్నారో అనే విషయాలు తనకు తెలిసిందని బాంబు పేల్చారు.

3న ఎమ్మెల్సీ ఎన్నికలు..

- పోలింగ్ రోజు ప్రత్యేక సెలవు

యశవంతపుర: జూన్ 3న విధాన పరిషత్‌లోని ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలకు ఓటింగ్ జరగనుండగా, ఆరోజు ఓటు వేసేందుకు వీలుగా అర్హులైన ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్లకు సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అర్హులైన వారు ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రభుత్వం పేర్కొంది.

వీధి కుక్కలకు విషం, వ్యక్తి అరెస్ట్

మైసూరు: చామరాజనగర జిల్లా కొళ్ళెగాళ తాలూకా హిత్తలదొడ్డి గ్రామంలో వీధి కుక్కలకు విషం ఇచ్చి చంపిన ఘటనలో పోలీసులు గ్రామానికి చెందిన రాజన్న అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. విషం పెట్టడంతో వీధిలో ఏడు కుక్కలు మృతి చెందాయి. స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

మలెమహదేశ్వరుడికి రూ. 2.58 కోట్ల ఆదాయం

మైసూరు: చామరాజనగర జిల్లా హనూరు తాలూకాలో ప్రసిద్ధి చెందిన మలె మహదేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. నెల రోజుల వ్యవధిలో స్వామి వారికి హుండీ ఆదాయం రూ. 2.58 కోట్లు వచ్చింది. ఇందులో 93 గ్రాముల బంగారు, మూడు కిలోలకు పైగా వెండి, ఇతర దేశాలకు చెందిన కరెన్సీ భక్తులు హుండీలో వేశారు. దాదాపు 200 మంది ఆలయ సిబ్బందితో పాటు భక్తులు కూడా హుండీ కానుకలు లెక్కించారు.

నివృత్త ఉపాధ్యాయురాలికి సన్మానం

చిక్కబళ్లాపురం: తమకు విద్యా బుద్ధులు నేర్పించిన నివృత్త ఉపాధ్యాయురాలిని గురువారం పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. 1973–76లో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న 20 మంది పూర్వ విద్యార్థులు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయురాలు రాజమ్మ (86) ఇంటికి వెళ్లి ఆమెను ఘనంగా సన్మానించి నాటి మధుర స్మృతులను ఆమెతో పంచుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులు నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, నివృత్త ఉపాధ్యాయుడు గేరెహళ్లి మోహన్ మాట్లాడుతూ... నాడు తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయురాలు రాజమ్మను సన్మానించడం తమకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. నాడు తాను చదువు చెప్పిన విద్యార్థులను చూసి రాజమ్మ భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్ఎస్ విశ్వేశ్వర్, దేవదాస్, నిరంజన్, సుధాకర్ ప్రకాశ్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ రావ్, నాగరాజు, రామకృష్ణ విల్సన్ కెనడి తదితరులు పాల్గొన్నారు.



రాజమ్మను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

డొనేషన్లను అరికట్టండి

చింతామణి: పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల యజమాన్యం ఇష్టానుసారంగా విద్యార్థుల నుంచి పెద్ద ఎత్తున డోనేషన్లను వసూలు చేస్తున్నారని కరవే పదాధికారులు ఆరోపించారు. ఈ మేరకు వారు బీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రజలు కరువు కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సమయంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని, దీంతో తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కార్యాలయ అధికారి నారాయణగౌడకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో శంకర్, యూనిస్‌ఖాన్, ఇలియాస్, గురుప్రసాద్ తదితరులు ఉన్నారు.



అధికారికి వినతిపత్రం ఇస్తున్న కరవే పదాధికారులు

ప్రజ్వల్‌ను అరెస్ట్ చేయాలి



యశవంతపుర: పెన్‌డ్రైవ్ కేసులో విదేశాల్లో తలదాచుకున్న ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను వెంటనే అరెస్ట్ చేయాలని సాహితీవేత్తలు, ప్రజా సంఘాల నేతలు దాదాపు ఐదు వేల మంది గురువారం చలో హాసన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలో ప్రధాన రోడ్లలో ర్యాలీగా జిల్లా కలెక్టర్ ఆఫీసుకు చేరుకుని ప్రజ్వల్‌ను అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

హాసన్‌లో సాహితీవేత్తల ఆందోళన



హాసన్ బస్టాండ్ నుంచి ర్యాలీగా వెళ్తున్న సాహితీవేత్తలు, వివిధ సంఘాల నేతలు, ప్రజలు

హోసూరు వార్తలు..

కార్మికులకు రెండేళ్ల జైలు

హోసూరు: ప్రైవేట్ పరిశ్రమలో చెక్కులను దొంగలించి రూ. 31 లక్షలు కాజేసిన ముగ్గురు వ్యక్తులకు క్రిష్ణగిరి కోర్టు రెండేళ్ల జైలుశిక్ష విధించింది. హోసూరు పారిశ్రామికవాడలోని అశోక్‌లైల్యాండ్ పరిశ్రమకు చెందిన 21 చెక్కులను ఆ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు గత 2003లో రూ. 31 లక్షలు కాజేశారు. ఈ ఘటనపై పరిశ్రమ మేనేజర్ రంగనాథ్ సిఫ్‌కాట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. ఈ కేసు క్రిష్ణగిరి కోర్టులో జరుగుతూ వచ్చింది. బుధవారం సాయంత్రం కేసును విచారణ జరిపిన న్యాయమూర్తి శ్రీవాస్తువా నిందితులు మహారుద్రమూర్తి, షణ్ముగం, క్రిష్ణకుమార్‌లకు రెండేళ్ల జైలు శిక్షతో పాటు తలా రూ. 3 వేలు జరిమానా విధించారు.

దోపిడీ దొంగ అరెస్ట్

హోసూరు: పాదచారి వద్ద నగదు దోచుకున్న దొంగను పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... హోసూరు కార్పొరేషన్ పరిధిలోని తేరుపేట ప్రాంతానికి చెందిన విజయ్ (23) ఉదయం అదే ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తుండగా ఓ దుండుగుడు అడ్డుకుని అతని వద్ద ఉన్న రూ. 2 వేల నగదు లాక్కెళ్లాడు. బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని శేఖర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు.

దోపిడీ కేసులో నలుగురి అరెస్ట్



అరెస్టయిన నిందితులు

యశవంతపుర: బెంగళూరు నగరంలో సీసీబీఅధికారుమంటూ విద్యార్థులను బెదిరించి వసూళ్లకు పాల్పడిన నలుగురిని బెంగళూరు నగర పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... సోలదేవనహళ్లి పోలీసుస్టేషన్ పరిధిలోని హెసరట్ట మెయిన్ రోడ్డు ఏజీబీ లేఔట్ నివాసంలో కొందరు స్నేహితులు కలిసి ఇంటిలో ఉండగా ముగ్గురు వ్యక్తులు వచ్చి సీసీబీ అధికారులమంటూ పిస్తోల్ చూపించి ముందుగానే తెచ్చుకున్న గంజాయిని వారి చేతిలో పెట్టి వీడియోలు తీసుకున్నారు. అనంతరం అందరిని అరెస్ట్ చేయాలని బెదిరించి వారి వద్దనుంచి మూడు లక్షలు డబ్బులను వసూలు చేసుకుని పరారయ్యారు. ఘటనకు సంబంధించి బాధితులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నిందితులు ఆదర్శ్, అనంతకృష్ణ, దీపక్ ఆర్ చంద్ర, ప్రమోద్‌లను అరెస్ట్ చేశారు.

యువకుడి మృతదేహం లభ్యం

మైసూరు: మైసూరు తాలూకా వరుణ కాలువ వద్ద యువకుడి మృతదేహం లభించింది. ఎవరో హత్య చేసి ఇక్కడ పడేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడిని తాలూకాలోని మావినహళ్లి గ్రామానికి చెందిన రాఘవేంద్ర (35)గా గుర్తించారు. కూలి పనులు చేసుకునే రాఘవేంద్ర ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించలేదు. ముఖంపై గాయాలు ఉన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కరెంటు షాక్‌తో ఏనుగు మృతి

కెలమంగలం: డెంకణీకోట సమీపంలోని బాలతోటనపల్లి వద్ద విద్యుదాఘాతానికి గురై ఏనుగు మరణించిన ఘటన వెలుగు చూసింది. డెంకణీకోట సమీపంలోని బాలతోటనపల్లి ప్రాంతంలో గత కొద్దిరోజులుగా మూడు ఏనుగులు సంచరిస్తూ స్థానిక ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్న విషయం తెలిసిందే. బుధవారం రాత్రి మేత వెతుక్కొంటూ వెళ్లిన ఒంటి ఏనుగు బాలతోటనపల్లి– సావరబత్తం రోడ్డులోని లోకేష్ అనే రైతుకు చెందిన గ్రీన్‌షెడ్ వద్ద వేలాడుతున్న విద్యుత్ తీగను తాకడంతో షాక్ కొట్టి చనిపోయింది. గురువారం ఉదయం స్థానికులు చూసి అటవీశాఖాధికార్లకు సమాచారం అందజేశారు. అటవీశాఖ సిబ్బంది, పశువైద్యులతో చేరుకొని మృతి చెందిన ఏనుగుకు శవపరీక్షలు నిర్వహించి అక్కడే పాతిపెట్టారు. ఇదే మాదిరిగా ఈ నెల 6వ తేదీ డెంకణీకోట సమీపంలోని సందనపల్లి వద్ద ఓ ఏనుగు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. విద్యుత్ శాఖాధికార్ల నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయకపోవడమే ఏనుగుల మృతికి కారణమని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. తళి పోలీసులు కేసు నమోదు చేశారు.



ఏనుగు కళేబరం

ఆలయంలో విశేష పూజలు



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

కెలమంగలం: కెలమంగలం పట్టణ పంచాయతీలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశ్వరస్వామి ఆలయంలో గురువారం సుదర్శన పూజలు జరిపించారు. వేకువజాము నుంచి మూలవిరాట్‌కు అభిషేకం, అలంకరణ, గణపతి పూజ, నవగ్రహ హోమం, శాంతి హోమం తదితరాలను నిర్వహించారు. దాత దుబాయ్ వెంకటేష్ వెండి నగలను విరాళమిచ్చారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రూ. 4 లక్షల గుట్కా సీజ్

హోసూరు: హోసూరు– బెంగళూరు జాతీయ రహదారి జూజువాడి సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద కారును, భారీగా గుట్కాను స్వాధీనపరుచుకొన్నారు. సిఫ్‌కాట్ ఇన్స్‌పెక్టర్ ప్రకాష్ నేతృత్వంలో పోలీసులు గురువారం వేకువజాము తమిళనాడు– కర్ణాటక సరిహద్దు జూజువాడి చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో కారు ఆపకుండా వెళ్లిపోయింది, పోలీసులు కారును వెంబడించి పట్టుకొన్నారు. కారులో రూ. 4 లక్షల విలువ చేసే గుట్కా పట్టుబడింది. రాజస్థాన్‌కు హరిశ్చంద్రసింగ్ అనే వ్యక్తి బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ నుంచి క్రిష్ణగిరికి గుట్కా తరలిస్తున్నట్లు తెలిసింది. అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

తీరని కలగా తారు రోడ్డు



గ్రామంలో మట్టి రోడ్డు

క్రిష్ణగిరి: సూళగిరి యూనియన్‌లోని కెంబీరనపల్లి గ్రామానికి తారురోడ్డు వసతి కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సామనపల్లి గ్రామపంచాయతీలోని ఈ గ్రామంలో సుమారు 35 కుటుంబాలున్నాయి. ఈ గ్రామానికి తారురోడ్డు వేయాలని అనేక ఏళ్లుగా గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నా అధికార్లు పట్టించుకోవడం లేదని తెలిపారు. గ్రామం నుంచి ఎక్కువ మంది పిల్లలు సూళగిరి తదితర ప్రాంతాలకు పై చదువుల కోసం వెళ్తారు, తారురోడ్డు లేకపోవడంతో ప్రయాణాలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని చెప్పారు.

తాగునీటి కొరత రాకూడదు

హోసూరు: జిల్లావ్యాప్తంగా తాగునీటి సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే పరిష్కారం చేయాలని గురువారం జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ శరయు, అదనపు కలెక్టర్ వందనాకార్గ్ ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. పాఠశాల భవన నిర్మాణ పనులు, మరమ్మతులను పూర్తి చేయాలని, గ్రామ పంచాయతీల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని, మురికికాల్వల శుద్ధీకరణ, తాగునీటి సరఫరా, వీధిదీపాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రామజయం, మహాదేవన్, ఇంజినీర్లు, బీడీఓలు పాల్గొన్నారు.

సిలిండర్ పేలి ఐదుగురికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రురాలు





గాయపడిన చిన్నారులు (కింది ఫొటో)



మదన్, ప్రేమ్ జ్వాల

కృష్ణరాజపురం/బనశంకరి: వంటగ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడిన ఘటన సంపిగేహళ్లి పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సంపిగేహళ్లిలోని ఎంఎస్.నగరలో నేపాల్‌కు చెందిన మదన్‌చౌహరా (32), భార్య ప్రేమ్‌జ్వాల (28), కుమారులు హీరద్ (12), ప్రశాంత్ (6), కుమార్తె అనితా (8) కుటుంబం అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. అర్ధరాత్రి సమయంలో సిలిండర్ లీకై ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో ఇంటిలో ఉన్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. సంపిగేహళ్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

తగ్గిన ఉత్పత్తి, పెరిగిన టమాటా ధరలు

- రైతులకు కాసుల పంట

క్రిష్ణగిరి: హోసూరు ప్రాంతంలో టమాటా సాగు తగ్గడంతో ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రతి సంవత్సరం హోసూరు, డెంకణీకోట, సూళగిరి, అంచెట్టి తాలూకా రైతులు మార్చి, ఏప్రిల్ నెలల్లో టమాటాను సాగు చేస్తారు. గత ఏడాది వర్షాలు అంతంత మాత్రంగానే ఉండడంతో భూగర్భ జలవనరులు అడుగంటిపోయి బోరుబావుల్లో నీరు ఇంకిపోవడంతో టమాటా సాగు తగ్గింది. మార్కెట్‌కు టమాటాలు తక్కువగా రావడంతో 20 కిలోల టమాటా బాక్స్ రూ. 1300 నుంచి రూ. 1500 వరకు ధర పలుకుతోంది. ప్రస్తుతం టమాటా ధరలు పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



టమాటాలను మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్న దృశ్యం

ఖాతా తెరిస్తే రూ.లక్ష!

- బెంగళూరు జనరల్ పోస్టాఫీస్‌కు పోటెత్తుతున్న మహిళలు
- కాంగ్రెస్ 'మహాలక్ష్మి' హామీయే కారణం

అది బెంగళూరులోని జనరల్ పోస్టాఫీస్. సాధారణంగా ఓ మోస్తరు రద్దీయే ఉంటుంది. కానీ కొన్ని రోజులుగా జనం ఇసుకేస్తే రాలనంతగా వస్తున్నారు! ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతా తెరిచేందుకు చాంతాడంత క్యూలు కడుతున్నారు. ఆశ్చర్యపోయిన సిబ్బంది సంగతేమిటని ఆరా తీస్తే, కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకొస్తే మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి పేద మహిళకు ఏడాదికి రూ.లక్ష అందిస్తామన్న హామీ ప్రభావమని తెలిసి ఆశ్చర్యపోయారు. ప్రతి మహిళ ఖాతాలో నెలకు రూ.8,500 జమ చేస్తామని ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్ గాంధీ హామీ ఇవ్వడం తెలిసిందే. దాంతో కేంద్రంలో ఇండియా కూటమి వస్తే తమకు ప్రయోజనం దక్కుతుందని భావించిన స్థానికులు బెంగళూరు జనరల్ పోస్టాఫీస్ వద్ద బారులు తీరుతున్నారు. తాను పొద్దున ఎప్పుడో వచ్చానని క్యూలో నిల్చున్న ఓ మహిళ చెప్పడం గమనార్హం. ఖాతా తెరిచిన తొలి రోజు నుంచే డబ్బులు జమవుతాయని పొరుగింటావిడ చెప్పడంతో వచ్చానని మరో మహిళ వెల్లడించింది. శివాజీనగర్, చామరాజపేట చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఎక్కువ మంది ఇలా వస్తున్నారు!

నిజం కాదు...

తపాలా శాఖ ఒక్కో ఖాతాలో రూ.2,000 నుంచి రూ.8,500 వరకు జమ చేస్తుందన్న నమ్మకంతో ఎక్కువ మంది ఖాతా తెరిచేందుకు వస్తున్నట్టు బెంగళూరు జీపీవో చీఫ్ పోస్ట్‌మాస్టర్ హెచ్‌ఎం మంజేశ్ చెప్పారు. ''నిజానికి ఇదో వదంతి. తపాలా శాఖ ఎలాంటి చెల్లింపులు చేయడం లేదు. కాకపోతే ఆన్‌లైన్ నగదు బదిలీ ప్రయోజనానికి ఈ ఖాతా ఉపకరిస్తుంది'' అని వెల్లడించారు. పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతా తెరిచేందుకు రద్దీ విపరీతంగా పెరిగిపోవడంతో, అందులో వెంటనే డబ్బులు జమవడం మొదలవుతుందన్న వార్తలు వదంతులేనంటూ కార్యాలయం ఆవరణలో పోస్టర్లు కూడా అంటించారు. అయినా రద్దీ మాత్రం తగ్గడం లేదు. దీంతో చేసేది లేక అదనపు కౌంటర్లు తెరిచారు. గతంలో రోజుకు కనాకష్టంగా 50 నుంచి 60 కొత్త ఖాతాలే తెరిచేవారు. ఇప్పుడు రోజుకు కనీసం 1,000 ఖాతాలకు పైగా తెరుస్తున్నట్టు మంజేశ్ తెలిపారు. ఇండియా కూటమి అధికారంలోకొస్తే ప్రతి నెలా రూ.8,500 ఖాతాలో జమ చేస్తామని స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే చెప్పడమే ఈ రద్దీకి కారణమని అక్కడి సిబ్బంది అంటున్నారు!

– సాక్షి, నేషనల్ డెస్క్

ఏడో విడతలో టఫ్ ఫైట్

లోక్‌సభ ఎన్నికల పోరు చివరి అంకానికి చేరుతోంది. ఇప్పటిదాకా ఆరు విడతల్లో 486 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ పూర్తయింది. మిగతా 57 సీట్లకు ఆఖరిదైన ఏడో విడతలో శనివారం పోలింగ్ జరగనుంది. ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతం చండీగఢ్ పరిధిలో 904 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు తేల్చనున్నారు. పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్‌లో మొత్తం సీట్లకూ ఈ విడతలోనే పోలింగ్ జరుగుతోంది. బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లోని మిగిలిన సీట్లలో ఎన్నికల క్రతువు ముగియనుంది. చివరి విడత నియోజకవర్గాలను విశ్లేషిస్తే గత ఫలితాలకు సంబంధించి ఆసక్తికరమైన అంశాలు తెరపైకొచ్చాయి...

– సాక్షి, నేషనల్ డెస్క్



- 57 సీట్లకు జూన్ 1న పోలింగ్
- సగం బీజేపీ సిట్టింగ్ స్థానాలే

చివరి విడతలో పోలింగ్ జరగనున్న 57 స్థానాల్లో గత రెండు లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీయే చక్రం తిప్పింది. ఈ 57 స్థానాల్లో రెండుసార్లూ 25 సీట్ల చొప్పున కొల్లగొట్టింది. కాంగ్రెస్ 2014లో కేవలం 3, 2019లో 8 స్థానాలతో సరిపెట్టుకుంది. ఓట్లపరంగానూ బీజేపీదే పైచేయి. బీజేపీకి 28 సీట్లలో 40 శాతం ఓట్లు రాగా 12 సీట్లలో 30 నుంచి 40 శాతం దక్కాయి. కాంగ్రెస్‌కు 18 సీట్లలో 10 శాతం ఓట్లు కూడా రాలేదు. మొత్తమ్మీద ఈ 57 సీట్లలో 24 చోట్ల పలు పార్టీలు పటిష్టంగా ఉన్నాయి. తృణమూల్, బీజేపీలకు చెరో 8 సీట్లు కంచుకోటలు. మూడింట బిజూ జనతాదళ్, రెండేసి చోట్ల కాంగ్రెస్, అకాలీదళ్, ఒక చోట జేడీ(యూ) పటిష్టంగా ఉన్నాయి. ఈ స్థానాల్లో గత మూడు ఎన్నికల్లోనూ ఆ పార్టీలే గెలిచాయి. మరో 14 సీట్లలో ప్రత్యర్థులకు బీజేపీ గట్టి సవాలు విసురుతోంది. వాటిలో 2009 నుంచి కనీసం రెండుసార్లు బీజేపీ గెలిచింది. ఆ లెక్కన 22 చోట్ల బీజేపీదే జోరు. కాంగ్రెస్ బలంగా ఉన్న సీట్లు 6 మాత్రమే.

క్లీన్‌స్వీప్‌లన్నీ కమలానివే...

ఏడో విడత పోలింగ్ జరిగే స్థానాల్లో గత ఎన్నికల్లో ఐదు చోట్ల క్లీన్‌స్వీప్‌లు నమోదయ్యాయి. అంటే గెలిచిన, ఓడిన పార్టీ మధ్య ఓట్ల తేడా 35 శాతం పైగా నమోదైంది. వీటిలో హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి, హమీర్‌పూర్, సిమ్లా, కాంగ్రా, ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి ఉన్నాయి. ఇవన్నీ బీజేపీ ఖాతాలోనే పడటం విశేషం. ప్రధాని మోదీ గత ఎన్నికల్లో వారణాసిలో 45.2 శాతం ఓట్ల మెజారిటీ సాధించారు!

ఏడో విడత స్థానాల్లో కాంగ్రెస్, బీజేపీ పరిస్థితి



ఆ స్థానాల్లో హోరాహోరీ...

ఏడో విడత స్థానాల్లో గత ఎన్నికల్లో పలు స్థానాల్లో నువ్వానేనా అనేలా టఫ్ ఫైట్ జరిగింది. అవి జలంధర్ (పంజాబ్), బలియా, చందౌలీ (యూపీ), బాలాసోర్ (ఒడిశా), జహానాబాద్ (బిహార్). ఈ స్థానాల్లో గెలుపు మార్జిన్ 2 శాతం లోపే! వీటితో పాటు ఏ పార్టీకీ స్పష్టమైన మొగ్గు లేని స్వింగ్ సీట్లు 11 ఉన్నాయి. గడచిన మూడు ఎన్నికల్లో వీటిలో ఏ పార్టీ కూడా రెండోసారి గెలవకపోవడం విశేషం. గాజీపూర్, ఘోసి, రాబర్ట్స్‌గంజ్, మీర్జాపూర్ (యూపీ), ఆనంద్‌పూర్ సాహిబ్, ఫరీద్‌కోట్, ఫతేగఢ్ సాహిబ్, పటియాలా (పంజాబ్), బాలాసోర్ (ఒడిశా), జహానాబాద్, కరాకట్ (బిహార్) ఈ స్వింగ్ సీట్ల జాబితాలో ఉన్నాయి.

గోరఖ్‌పూర్‌లో స్టార్ వార్!



ఉత్తరప్రదేశ్‌లో శనివారం పోలింగ్ జరగనున్న స్థానాల్లో గోరఖ్‌పూర్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ రవికిషన్ శుక్లా, ఇండియా కూటమి తరఫున బరిలో ఉన్న ఎస్పీ అభ్యర్థి కాజల్ నిషాద్ ఇద్దరూ భోజ్‌పురి స్టార్లే కావడం అందుకు కారణం...

రవికిషన్‌కు పీఠం మద్దతు...

భోజ్‌పురి సినిమాల్లో సూపర్ స్టార్‌గా వెలుగొందుతున్న రవి కిషన్ అసలు పేరు రవీంద్ర శుక్లా. కాంగ్రెస్ సభ్యునిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో జౌన్‌పూర్ నుంచి పోటీ చేసి ఓడారు. 2017లో బీజేపీలో చేరారు. 2019లో 3 లక్షల పైచిలుకు మెజారిటీతో గెలిచారు. కానీ ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో కనిపించనే లేదనే విమర్శలున్నాయి. ప్రతిపక్షాలు ఆయనను 'బయటి వ్యక్తి'గా అభివర్ణిస్తున్నాయి. దాంతో పీఎం మోదీ, సీఎం యోగి చరిష్మానే నమ్ముకున్నారు. గోరఖ్‌పూర్‌లో తనకు ఇల్లుందని, ఇక్కడే ఉంటున్నానని చెప్పుకొస్తున్నారు. యువకులతో కుస్తీ పడుతూ, స్థానికులతో సెల్ఫీలు దిగుతూ ప్రచారం జోరుగా చేశారు. రవి కిషన్‌కు గోరక్షనాథ్ పీఠం మద్దతు కూడా ఉంది.

నిషాద్ ఓట్లను నమ్ముకున్న కాజల్

భోజ్‌పురి నటి, ఎస్పీ అభ్యర్థి కాజల్ నిషాద్‌కు ఇది నాలుగో ఎన్నిక. రెండుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో గోరఖ్‌పూర్ రూరల్ నుంచి కాంగ్రెస్ టికెట్‌పై, కాంపియర్‌గంజ్ నుంచి ఎస్పీ తరఫున పోటీ చేసి ఓడారు. మేయర్ ఎన్నికల్లోనూ ఓటమి చవి చూశారు. రాజకీయాల్లో చురుకుగా ఉండే ఆమెకు ఈసారి గెలుపు ప్రతిష్టాత్మకంగా మారింది. తన సామాజికవర్గమైన నిషాద్ ఓట్లనే నమ్ముకున్నారు. అయితే 2019 మాదిరిగా ఈసారి కూడా ఎస్పీ ఓట్లను బీఎస్పీ గట్టిగానే చీల్చేలా కన్పిస్తోంది.

కీలకం

కుల సమీకరణాలదే కీలకపాత్ర..

గోరఖ్‌పూర్‌లో అగ్రవర్ణ ఓట్లు 6 లక్షలున్నాయి. 9 లక్షల ఓబీసీ, 4 లక్షల నిషాద్, 2 లక్షలకు పైగా యాదవ ఓట్లున్నాయి. 2.5 లక్షల దళిత ఓట్లు, 2 లక్షల ముస్లిం ఓట్లూ తనకేనని కాజల్ చెబుతున్నారు. నిషాద్‌లూ తన వెంటే ఉన్నారంటున్నారు. బీజేపీ కూడా నిషాద్‌ల ఓట్ల కోసం ముమ్మర ప్రయత్నాలు చేసింది.

1990ల నుంచి బీజేపీ హవా..

గోరఖ్‌పూర్ స్థానంలో 1984 దాకా కాంగ్రెస్‌దే హవా. రామమందిర ఉద్యమ నేపథ్యంలో 1989 నుంచీ గోరక్షనాథ్ పీఠం ఆధిపత్యం మొదలైంది. అప్పటినుంచి 1996 దాకా వరుసగా మూడుసార్లు గోరక్షనాథ్ పీఠాధిపతి మహంత్ అవైద్యనాథ్ ఇక్కడినుంచి గెలిచారు. 1998 నుంచి 2014 దాకా ఐదుసార్లు ప్రస్తుత పీఠాధిపతి యోగి గెలిచారు. సీఎం అయ్యాక ఆయన రాజీనామాతో 2018లో జరిగిన ఉప ఎన్నికలో విపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా ఎస్పీ నేత ప్రవీణ్ నిషాద్ బీజేపీ అభ్యర్థి ఉపేంద్ర శుక్లాను ఓడించారు. కానీ ఈ ఆధిపత్యాన్ని ఎస్పీ నిలబెట్టుకోలేకపోయింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

కటాకట్ ఫటాఫట్

ప్రచారంలో నేతల ఛలోక్తులు

నేతల నినాదాలు ఓట్ల వర్షం కురిపించిన సందర్భాలు దేశ ఎన్నికల చరిత్రలో ఎన్నో! గరీబీ హటావో అంటూ దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ఇచ్చిన నినాదం అప్పట్లో దుమ్ము రేపింది. ఈసారి మాత్రం నినాదాల కంటే కూడా ముఖ్య నేతల నోటి నుంచి వెలువడ్డ వింత పదబంధాలు అందరినీ ఆకర్షించాయి. వాటి అర్థం ఏమై ఉంటుందా అని ఓటర్లలో ఆసక్తి రేపాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సోదరి ప్రియాంక తమ ప్రసంగాల్లో 'కటాకట్' అని విరివిగా వాడారు. అదే పదాన్ని ప్రధాని మోదీ తిరిగి కాంగ్రెస్‌పైకి సంధించారు. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కూడా వెరైటీ హిందీ పదాలను ప్రయోగించారు.

రాహుల్ ఆద్యుడు

కటాకట్ అనే హిందీ పదాన్ని తొలుత ప్రయోగించింది రాహులే. మిగతా వారు దాన్ని అందిపుచ్చుకున్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ప్రతి పేద మహిళకు ఏటా రూ.లక్ష ఇస్తామని, ధనవంతుల సంపదను పేదలకు పంచుతామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొనడం తెలిసిందే. రాహుల్ తన ప్రచారంలో ఈ హామీలను తరచూ ప్రస్తావించారు. పేదల బ్యాంకు ఖాతాలకు డబ్బులు 'కటాకట్ కటాకట్' బదిలీ చేస్తామని ప్రకటించారు. చకచకా అనే అర్థంలో కటాకట్ పదాన్ని ప్రయోగించారు. దీనిపై ప్రజల్లో బాగా స్పందన రావడంతో ప్రియాంక కూడా అందిపుచ్చుకున్నారు. దాంతో కటాకట్ అంటే ఏమై ఉంటుందా అని గూగుల్‌లో శోధన కూడా పెరిగింది. మోదీ కూడా అదే పదాన్ని తనదైన శైలిలో కాంగ్రెస్‌పైకి తిరిగి ప్రయోగించారు. ''ఈ యువరాజులు ప్యాలెసుల్లో పుట్టారు. కష్టపడిందీ లేదు, ఫలితాలు సాధించిందీ లేదు. అందుకే దేశం తనంతట తానే అభివృద్ధి చెందుతుందని వారు అలవోకగా చెబుతుంటారు. ఎలా? 'కటాకట్, కటాకట్'' అని చెప్పుకొచ్చారు. రాయ్‌బరేలీ లోక్‌సభ నియోజకవర్గ ప్రజలు వారిని 'కటాకట్, కటాకట్' ఇంటిదారి పట్టిస్తారంటూ రాహుల్‌పై చెణుకులు విసిరారు.

తేజస్వీ 'ఫటాఫట్'

తేజస్వీ యాదవ్ కూడా రాహుల్‌తో కలసి ఓ సభలో మాట్లాడుతూ నిరుద్యోగులను ఉద్దేశించి.. ''మీకు ఉద్యోగాలు ఫటాఫట్ వచ్చేస్తాయి. ఫటాఫట్. బీజేపీ సఫాచట్, సఫాచట్ (తుడిచి పెట్టుకుపోతుంది). కాంగ్రెస్, లాంతర్‌కు ఓట్లు తకాతక్ పడిపోతాయి'' అని చెప్పుకొచ్చారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా గమ్మత్తైన పదాలను ప్రయోగించారు. ''తాము అవినీతి చేసేది లేదు, ఎవరినీ చేయనిచ్చేది లేదని గొప్పలు చెప్పేవారు టీకాల తయారీదారుల నుంచి విరాళాలు, ఎన్నికల బాండ్ల రూపంలో భారీ మొత్తాలు అందుకుంటారు. అలాంటి వారు గటాగట్, గటాగట్, అని చెబుతుంటారు. కానీ ప్రజలు ఓటు ద్వారా వారిని ఫటాఫట్ ఫటాఫట్ ఇంటికి పంపిస్తారు'' అని బీజేపీపై వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

బ్యాంకులకే కుచ్చుటోపీ

- ఒక్క ఏడాదిలో 36,075 కేసుల నమోదు
- రూ.13,930 కోట్లు కొల్లగొట్టిన ముఠాలు
- అత్యధికంగా మోసపోయింది ప్రైవేటు బ్యాంకులే
- ఆర్‌బీఐ తాజా నివేదికలో వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలో రోజురోజుకూ బ్యాంకింగ్ మోసాలు పెరుగుతున్నాయి. సైబర్ నేరగాళ్లు ప్రధానంగా బ్యాంకులనే లక్ష్యంగా చేసుకుని చెలరేగిపోతున్నారు. 2023–24లో దేశం మొత్తమ్మీద 36,075 మోసాలు సంభవించినట్టు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) తాజా నివేదిక వెల్లడించింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల కంటే ప్రైవేటు బ్యాంకుల్లోనే ఎక్కువ మోసాలు జరిగినట్టు నివేదిక పేర్కొంది. 2023–24లో 36,075 కేసులు నమోదవ్వగా, 2021–22లో 9,046, 2022–23లో 13,564 కేసులు నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం కంటే 2023–24లో 166 శాతం అధికంగా కేసులు నమోదు కావడం గమనార్హం. అయితే కోల్పోయిన నగదు మాత్రం 2022–23లో కంటే 2023–24లో తగ్గడం ఊరట కలిగించే అంశం. 2022–23లో రూ.26,127 కోట్లు కొల్లగొట్టగా... 2023–24లో కోల్పోయిన మొత్తం రూ.13,930కోట్లకు తగ్గింది. బ్యాంకింగ్ మోసాల్లో సంఖ్యాపరంగా మొదటి స్థానంలో డిజిటల్ చెల్లింపు(కార్డ్, ఇంటర్నెట్) మోసాలే ఉన్నాయి. అందులోనూ లోన్ పోర్ట్‌ఫోలియో మోసాలే అధికం.

ఫిర్యాదు చేయడంలోనూ అలసత్వమే

బ్యాంకుల్లో జరిగిన మోసాలను చాలా నెలల వరకూ బ్యాంకులు గుర్తించడం లేదని ఆర్‌బీఐ పేర్కొంది. మోసాలకు పాల్పడిన తేదీకి... ఫిర్యాదు తేదీకి మధ్య కొన్ని నెలల సమయం ఉంటోందని తెలిపింది. అంటే మోసాన్ని గుర్తించినా దానిని పరిష్కరించేందుకో... లేక కప్పిపుచ్చేందుకో ప్రయత్నిస్తూ వెంటనే ఫిర్యాదు చేయడం లేదని, ఇక తమవల్ల కాదనుకున్న తరువాతే ఫిర్యాదు చేస్తున్నారని వివరించింది. అందుకే 2023–24లో నమోదైన కేసుల్లో 2022–23లో పాల్పడిన నేరాలకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నట్టు తెలిపింది.

గడచిన మూడేళ్లలో నమోదైన కేసులు

సంవత్సరం	నమోదైన కేసులు
2021-22	9,046
2022-23	13,564
2023-24	36,075

తొలి ఫలితం కొవ్వూరు.. నరసాపురం

ఈ రెండుచోట్ల అత్యల్పంగా 13 రౌండ్లలోనే లెక్కింపు పూర్తి

- రంపచోడవరం, చంద్రగిరిలలో ఆలస్యంగా లెక్కింపు పూర్తి
- ఈ రెండు నియోజకవర్గాల్లో 29 రౌండ్ల చొప్పున ఓట్ల లెక్కింపు
- భీమిలి, పాణ్యం ఫలితాల కోసం రాత్రి వరకు వేచిచూడాల్సిందే
- ఇక్కడ 25 రౌండ్ల చొప్పున ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు



సాక్షి, అమరావతి: వచ్చే జూన్ 4న కొన్ని నియోజకవర్గాల అభ్యర్థుల భవితవ్యం ఓట్ల లెక్కింపు మొదలైన కొన్ని గంటల్లోనే తేలిపోనుండగా.. మరికొన్ని నియోజకవర్గాల తుది ఫలితం కోసం రాత్రి వరకు వేచిచూడాల్సి ఉంటుంది. పోలైన ఓట్లు, కౌంటింగ్ హాళ్లలో ఏర్పాటు చేసిన టేబుళ్ల ఆధారంగా ఎన్నికల సంఘం నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపునకు అవసరమైన రౌండ్లను నిర్ధారించింది. దీని ప్రకారం.. రాష్ట్రంలో అన్నింటికంటే ముందుగా తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు (ఎస్సీ), పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గాల తుది ఫలితాలు మధ్యాహ్నంలోపే ప్రకటించే అవకాశముందని ఎన్నికల సంఘం అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో కేవలం 13 రౌండ్లలోనే లెక్కింపు పూర్తికానుంది. ఇదే సమయంలో రంపచోడవరం (ఎస్టీ), చంద్రగిరి నియోజకవర్గాల్లో అత్యధికంగా 29 రౌండ్ల లెక్కింపు జరుగుతుంది. ఆ తర్వాత పాణ్యం, భీమిలి నియోజకవర్గాల్లో 25 రౌండ్ల లెక్కింపు జరుగుతుంది. ఈ రెండు నియోజకవర్గాల్లో తుది ఫలితాల వెల్లడికి రాత్రి 7 గంటల వరకు వేచిచూడాల్సి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

111 చోట్ల 20, అంత కంటే తక్కువ రౌండ్లలోనే పూర్తి

రాష్ట్రంలోని మొత్తం 175 నియోజకవర్గాల్లో అత్యధికంగా 111 నియోజకవర్గాల్లో 20కంటే తక్కువ రౌండ్లలోనే లెక్కింపు పూర్తికానుంది. ఈ నియోజకవర్గాల ఫలితాలను మధ్యాహ్నం 2 గంటల్లోగా పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. దీని ప్రకారం.. కౌంటింగ్ హాళ్లల్లో తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. 60 నియోజకవర్గాల్లో 21 నుంచి 25 రౌండ్ల వరకు ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నియోజకవర్గాల ఫలితాలను సాయంత్రంలోగా వెల్లడిస్తారు. ఎటువంటి గందరగోళం లేకుండా అందరి అనుమతితోనే సువిధ యాప్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాతే ఫలితాలను ప్రకటించనున్నట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రకటనకు సంబంధించిన ఫారం–21సీ, 21ఈలను అదేరోజు ఫ్లైట్‌లో కేంద్ర ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉంటుంది.

ఏపీలో ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏర్పాటుకు చర్యలు

- విశాఖలో ఎన్‌సీసీ అకాడమీ ఏర్పాటు చేయాలని నిర్ణయం
- ఎన్‌సీసీ ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి,పక్కన సంజయ్‌గుప్తా, చంద్రశేఖర్

గుంటూరు (ఎడ్యుకేషన్): ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు ఎన్‌సీసీ ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వి.మధుసూదన్‌రెడ్డి చెప్పారు. ఎన్‌సీసీ గ్రూప్ వార్షిక తనిఖీల కోసం ఆయన గురువారం గుంటూరు వచ్చారు. ఈ సందర్భంగా శ్యామలానగర్‌లోని ఎన్‌సీసీ కార్యాలయంలో మధుసూదన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఏపీలో గుంటూరు, తిరుపతి, కర్నూలు, కాకినాడ, విశాఖలలో ఎన్‌సీసీ గ్రూప్‌లు ఉన్నాయని, వీటిలో గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ అతి పెద్దదని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 2,500కు పైగా విద్యాసంస్థలు ఎన్‌సీసీ శిక్షణ గుర్తింపును కలిగి ఉండగా, మరో 1,600 విద్యాసంస్థలు గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్నాయని తెలిపారు. ఎన్‌సీసీ శిక్షణతో విద్యార్థులకు సమాజం, దేశంపై బాధ్యత, గౌరవం పెరుగుతాయని, క్రమశిక్షణ కలిగిన పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. ఎన్‌సీసీ శిక్షణ పొందిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటా ఉందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఎన్‌సీసీ గ్రూప్‌లను విస్తరించి, మరింత విస్తృతంగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఎన్‌సీసీ గ్రూప్ కలిగి ఉన్నట్లు కేవలం బోర్డులకే పరిమితమై, విద్యార్థులకు ఎటువంటి శిక్షణ ఇవ్వని విద్యాసంస్థలకు ఎన్‌సీసీ గుర్తింపు రద్దు చేస్తామని ఆయన స్పష్టంచేశారు. కడప జిల్లాలోని ఎన్‌సీసీ గ్రూప్ అకాడమీ స్థాయిలో సేవలు అందిస్తోందన్నారు. విశాఖలో ఎన్‌సీసీ అకాడమీ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు మధుసూదన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలోని గుంటూరు, ఒంగోలు ప్రాంతాల్లో ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏర్పాటుకు పరిశీలన చేశామని, త్వరలోనే గవర్నర్‌తోపాటు జూన్ 4వ తేదీ తర్వాత కొలువుదీరనున్న కొత్త ప్రభుత్వంలో సీఎం, సీఎస్‌లను కలిసి వారి దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకువెళ్తామని వివరించారు. ఈ సమావేశంలో ఎన్‌సీసీ ప్లానింగ్ అండ్ కో–ఆర్డినేషన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కల్నల్ సంజయ్‌గుప్తా, గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రూ. 200 కోట్ల మోసం కేసులో నిమ్మగడ్డ వాణి అరెస్టు

- ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ కేసులో టెస్కాబ్ జీఎం, ఆమె భర్త కుమారుడిని అరెస్ట్ చేసిన సీసీఎస్ పోలీసులు
- 24 శాతం వడ్డీ ఇస్తామని ఆశచూపి రూ. కోట్లలో డిపాజిట్ చేయించుకున్న కుటుంబం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్‌లో (టెస్కాబ్) జనరల్ మేనేజర్‌గా పనిచేస్తూ శ్రీ ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ ముసుగులో రూ. 200 కోట్ల మేర డిపాజిట్లు వసూలు చేసి మోసానికి పాల్పడిన నిమ్మగడ్డ వాణీబాల, ఆమె భర్త, కుమారుడిని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంస్థ చేతిలో మోసపోయిన 532 మందిలో 147 మంది టెస్కాబ్ ఉద్యోగులేనని డీసీపీ ఎన్.శ్వేత గురువారం తెలిపారు. వాణీబాలతోపాటు ఆమె భర్త మేక నేతాజీ, కుమారుడు మేక శ్రీహర్షలను సైతం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అధిక వడ్డీ ఆశచూపి..

ఏపీలోని ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన మేక నేతాజీ 1985లో హైదరాబాద్‌లోని తిలక్ రోడ్‌లో శ్రీ ప్రియాంక ఫైనాన్స్ అండ్ చిట్‌ఫండ్స్ పేరుతో సంస్థను ఏర్పాటు చేశారు. ఇతర వ్యాపారాలు కూడా చేసిన ఆయన.. వాటి నిర్వహణ కోసం ప్రియాంక సంస్థ ద్వారా డిపాజిట్లు సేకరించడం మొదలుపెట్టారు. తమ వద్ద నగదు డిపాజిట్ చేస్తే నెలకు 24 శాతం చొప్పున వడ్డీ చెల్లిస్తానంటూ నమ్మబలికాడు. అలాగే ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ పేరుతో మరో సంస్థ ఏర్పాటు చేసి ముద్రణ రంగంలో వినియోగించే ప్లేట్లు, రంగులు తదితరాలను కంపెనీల నుంచి కొని ప్రింటింగ్ ప్రెస్‌లకు విక్రయించడం మొదలెట్టారు. నేతాజీ భార్య నిమ్మగడ్డ వాణీబాల ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్‌లో ఉద్యోగంలో చేరారు. రాష్ట్ర విభజన తర్వాత టెస్కాబ్‌గా మారిన ఈ సంస్థలో కొనసాగారు. రాష్ట్ర స్థాయి పోస్టు అయిన జనరల్ మేనేజర్ వరకు వెళ్లారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన శ్రీహర్ష తన తండ్రి నిర్వహిస్తున్న సంస్థలోనే డైరెక్టర్‌గా చేరారు. వాణీబాల టెస్కాబ్‌లో పనిచేసే ఉద్యోగులను భర్త సంస్థలో పెట్టుబడులు పెట్టాలని హుకుం జారీ చేసింది. దీంతో 147 మంది రూ. 26 కోట్ల డిపాజిట్లు చేశారు. అలాగే టెస్కాబ్‌లో డబ్బు డిపాజిట్ చేయడానికి వచ్చే వారిని సైతం మాయమాటలతో నమ్మించి పెద్ద మొత్తంలో డిపాజిట్ చేయించుకుంది.

రశీదులన్నీ వేరే సంస్థ పేరుతో..

తమ వద్ద పెట్టుబడులు పెట్టిన డిపాజిట్‌దారులకు ఇవ్వడానికి మేక నేతాజీ, శ్రీహర్షలు ప్రత్యేకంగా శ్రీ ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ పేరుతో రశీదులు తయారు చేయించారు. దీనిపై వివరాలు రాసి రూపాయి విలువైన రెవెన్యూ స్టాంప్ అతికించి సంతకాలు చేసిచ్చారు. కరోనా తర్వాత కాస్త ఒడుదొడుకులు ఎదురైనా గతేడాది నవంబర్, డిసెంబర్ నుంచి వినియోగదారులకు వడ్డీ చెల్లింపులు ఆపేశారు. ఈ నెల 3న సిటీ సివిల్ కోర్టులో ఏకంగా దివాలా పిటిషన్ (ఐపీ) దాఖలు చేసి ముగ్గురూ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీనిపై బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న ఏసీపీ కేఎం కిరణ్‌కుమార్ నేతృత్వంలోని బృందం గురువారం ముగ్గురినీ అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించింది. తదుపరి విచారణ నిమిత్తం 14 రోజుల కస్టడీకి కోరాలని నిర్ణయించింది.

ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్ పోటీల్లో విజేతల ఎంపిక

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్‌గా నియమితులైన వారికి నిర్వహించిన పోటీల్లో జిల్లాకు ఒకరు చొప్పున 26 మందిని విజేతలుగా ఎంపిక చేశామని పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో 1451మంది పాల్గొన్నారన్నారు. మన్యం జిల్లాకు చెందిన వి.మోహన్ కృష్ణ, ఏలూరు జిల్లాకు చెందిన ఎస్.భాను తేజస్విని, కర్నూలు జిల్లాకు చెందిన జి. జయంతి మొదటి మూడు స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. వీరికి రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు ఆయన వివరించారు.

నిందితుడి వాదనలు విన్నాకే.. బెయిల్ రద్దుపై ఉత్తర్వులు

- అతనికి నోటీసులు ఇవ్వండి
- సీఎం జగన్‌పై దాడి కేసులో పోలీసులకు హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, అమరావతి :ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎన్నికల ప్రచారం సందర్భంగా పదునైన రాయితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో నిందితుడు వేముల సతీష్‌కుమార్ అలియాస్ సత్తికి బెయిల్ మంజూరు చేస్తూ విజయవాడ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలిపివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. నిందితుడు సతీష్‌కు నోటీసులు జారీచేయకుండా, అతని వాదనలు వినకుండా ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు జారీచేయడం సాధ్యంకాదని హైకోర్టు స్పష్టం చేసింది. అంతకుముందు.. సతీష్ బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ పోలీసులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై లంచ్‌మోషన్ రూపంలో అత్యవసరంగా విచారణ జరపాలని రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) యర్రంరెడ్డి నాగిరెడ్డి హైకోర్టును అభ్యర్థించారు. ఇందుకు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి సానుకూలంగా స్పందించి అత్యవసర విచారణకు అంగీకరించారు. సాయంత్రం ఇది విచారణకు రాగా, నాగిరెడ్డి వాదనలు వినిపిస్తూ.. సతీష్ బెయిల్‌పై బయటకొస్తే దర్యాప్తుపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందన్నారు. ఈ కేసులో రెండో నిందితుడు ఇప్పటికే పరారీలోనే ఉన్నందున సతీష్ బెయిల్ అమలును నిలిపివేయాలని అభ్యర్థించారు. అయితే, ఇందుకు న్యాయమూర్తి నిరాకరించారు. ఇరువైపుల వాదనలు విన్న తరువాతే తగిన ఉత్తర్వులు జారీచేస్తామని న్యాయమూర్తి చెప్పారు. నిందితునికి నోటీసులు జారీచేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఆదేశించారు.



శ్రుతికుమార్



హార్వర్డ్ వేదికపై శ్రుతికుమార్

తెలియనితనంలో ఉండే బలం ప్రతిఘటనే!

నోరు మూయించి పెత్తనం చేసే పాలకులు
నోరు మూసుకుని బతికే పౌరులు
చరిత్ర నిండా ఉంటారు.
కాని నోరు మూసుకొని ఉండటం చేతగాక
అన్యాయాన్ని చూస్తూ ఉండలేక
గొంతెత్తి గర్జించేవాళ్లు చరిత్రలో నిలబడిపోతారు.
మన దేశ మూలాలున్న
హార్వర్డ్ యూనివర్సిటీ విద్యార్థిని
శ్రుతి కుమార్- ఆ ప్రతిష్టాత్మక ప్రాంగణంలో
గాజా మీద ఇజ్రాయిల్ చేస్తున్న పాశవిక దాడులకు
వ్యతిరేకంగా నోరు విప్పింది.
ప్రపంచవ్యాప్త ప్రశంసలు పొందింది.
వెనుకంజ వేయని మానవత్వం చాటిన
శ్రుతి కుమార్ పరిచయం, నేపథ్యం.

హార్వర్డ్ యూనివర్సిటీ తన విద్యార్థుల గురించి సరిగ్గా అధ్యయనం చేసినట్టు లేదు. చేసి ఉంటే బహుశా శ్రుతి కుమార్‌కు ఆ యూనివర్సిటీ గ్రాడ్యుయేషన్ వేదిక మీద మాట్లాడే అవకాశం ఇచ్చి ఉండేది కాదు. ప్రస్తుతం అమెరికా వ్యాప్తంగా యూనివర్సిటీల్లో గ్రాడ్యుయేషన్ సెరెమొనీలు జరుగుతున్నాయి. తల్లిదండ్రులు, బంధుమిత్రులు విశేషంగా హాజరయ్యి వేదిక మీద పట్టా అందుకుంటున్న తమ పిల్లలను హర్షధ్వానాలతో ఉత్సాహపరుస్తారు. హార్వర్డ్ యూనివర్సిటీలో ప్రతి ఏటా ఈ సెర్మనీలో పట్టా పొందుతున్న ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి వారికి ప్రసంగించే అవకాశం ఇస్తారు. ఈసారి ప్రసంగం చేసే అవకాశం శ్రుతి కుమార్‌కు వచ్చింది. అక్కడే ఆమెకు గొంతెత్తే అవకాశం లభించింది.

నిరసనల నేపథ్యం

అక్టోబర్ 7, 2023న హమాస్ సంస్థ ఇజ్రాయిల్ మీద దాడి చేసి 1400 ఇజ్రాయిలీల మరణానికి కారణం కావడంతో బదులు తీర్చుకోవడానికి రంగంలో దిగిన ఇజ్రాయిల్ నేటికీ ఆగని బాంబుల వర్షం కురిపిస్తూ ఉంది. ఇప్పటికి 35,000 మంది పాలస్తీనియన్లు మృతి చెందగా వీరిలో కనీసం ఇరవై వేల మంది స్త్రీలు, పసి పిల్లలు. ఈ దాడులు మొదలైనప్పటి నుంచి అమెరికా యూనివర్సిటీల్లో నిరసనలు మొదలైనా ఇజ్రాయిల్ మరింత దుర్మార్గంగా గాజాలోని ఆస్పత్రుల పై, స్కూళ్లపై దాడులు చేస్తుండటంతో ఇక విద్యార్థులు ఆగలేకపోయారు. ఏప్రిల్ నుంచి అమెరికా విశ్వవిద్యాలయాలు 'యాంటీ ఇజ్రాయిల్' నిరసనలతో హోరెత్తాయి. యూనివర్సిటీలు దిక్కుతోచక పోలీసులను ఆశ్రయిస్తే ఇప్పటికి 900 మంది విద్యార్థులు అరెస్ట్ అయ్యారు. వారిలో ఒక భారతీయ విద్యార్థిని కూడా ఉంది. అమెరికా యూనివర్సిటీలు తమ దగ్గర పోగయ్యే ఫండ్స్‌ను ఇజ్రాయిల్‌కు వంత పాడే బహుళ జాతి వ్యాపార సంస్థల్లో పెట్టుబడులు పెట్టడం మానేయాలని, ఆ డబ్బును వెనక్కు తీసుకోవాలనేది విద్యార్థుల ప్రధాన డిమాండ్. అంతే కాదు టెల్ అవివ్ (ఇజ్రాయిల్) యూనివర్సిటీతో కోర్సుల ఆదాన ప్రదానాలు చేసుకోవడం బంద్ చేయాలని కూడా డిమాండ్. ఏప్రిల్ 18న ఇదే విషయంలో హార్వర్డ్ యూనివర్సిటీలో భారీ నిరసన జరిగింది. విద్యార్థులు ఏకంగా మూడు చోట్ల పాలస్తీనా జెండాను ఎగురవేశారు. దాంతో యూనివర్సిటీ కన్నెర్ర చేసి 'వయొలేషన్ ఆఫ్ యూనివర్సిటీ పాలసీ' కింద 13 మంది విద్యార్థులను గ్రాడ్యుయేట్లు కాకుండా శిక్షించింది. అదే యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన శ్రుతి కుమార్ ఈ అంశం మీద నిరసన వ్యక్తం చేసేందుకు గ్రాడ్యుయేషన్ సెర్మనీని ఎంచుకుంది.

ఆమె ఒక టోర్నడో

బీభత్సమైన పిడుగుపాట్లకూ, టోర్నడోలకు పేరు పెట్టిన నెబ్రాస్కా (అమెరికా) రాష్ట్రంలో పుట్టిన కన్నడ మూలాలున్న అమ్మాయి శృతి కుమార్. అక్కడ విస్తారంగా సాగు చేసే జొన్న రైతుకు పెద్ద కూతురు ఆమె. చదువుతో పాటు ఆట, పాట, మాటలో కూడా ఆసక్తి చూపింది. మంచి వక్త. 'నేషనల్ స్పీచ్ అండ్ డిబేట్ -2019'లో పాల్గొని ఐదవ ర్యాంకులో నిలిచింది. 2020లో 'వాయిస్ ఆఫ్ డెమొక్రసీ' పోటీలో మొదటి విజేతగా నిలిచి 30 వేల డాలర్లు గెలుచుకుంది. అంతేకాదు తన చదువుకు స్పాన్సర్‌ని కూడా. యోగాలో దిట్ట. ముందు నుంచి అన్యాయాల, అపసవ్యతల మీద వ్యతిరేకత తెలిపే అలవాటున్న శ్రుతి కుమార్‌కు హార్వర్డ్ అవకాశం ఇవ్వడంతో ఆ యూనివర్సిటీనే హెచ్చరించి ఖంగు తినిపించింది.

తెలియనితనపు బలం

హార్వర్డ్ గ్రాడ్యుయేషన్ సెర్మనీలో శ్రుతి కుమార్ తన ప్రసంగానికి పెట్టుకున్న పేరు 'తెలియనితనంలో ఉండే బలం'. ఆమె తన ప్రసంగం చేస్తూ 'ప్రపంచంలో ఆర్గనైజ్డ్‌గా జరుగుతున్న అన్యాయాల గురించి అన్నీ తెలిసి నోరు మెదపని వారి కంటే ఏమీ తెలియకనే అది అన్యాయమనే కేవలం గ్రహింపుతో బరిలోకి దిగి ఎదిరించే నాలాంటి విద్యార్థులకు ఉండే బలం పెద్దది' అని అంది. 'పసిపిల్లల వంటి అమాయకత్వంతో కొత్త జన్మెత్తి అన్యాయాలను ప్రతిఘటించడానికి ముందుకు రావాలనే' అర్థంలో శ్రుతి కుమార్ మాట్లాడి హర్షధ్వానాలు అందుకుంది. 'మన విశ్వవిద్యాలయ ప్రాంగణంలో భావ ప్రకటనా స్వేచ్ఛపట్ల వ్యక్తమైన అసహనాన్ని చూసి నేను చాలా నిరాశకు గురవుతున్నాను. 13 మంది విద్యార్థులను గ్రాడ్యుయేట్లు కాకుండా ఆపారు. దీనిని వ్యతిరేకిస్తూ పదిహేను వందల మంది విద్యార్థులం, ఐదు వందల మంది అధ్యాపకులం ఖండించాం. విశ్వవిద్యాలయ యాజమాన్యానికి అభ్యర్థనలు పంపాం. అయినా సరే వినలేదు. హార్వర్డ్, మా మాటలు నీకు వినబడుతున్నాయా? హార్వర్డ్, మా మాటలు వింటున్నావా?' అని శ్రుతి గర్జించింది. 'ఇప్పుడు గాజాలో జరుగుతున్న ఘటనల మీద క్యాంపస్ మొత్తంగా దుఃఖం, అనిశ్చితి, అశాంతి చూస్తున్నాను. సరిగ్గా ఇప్పుడే ఇటువంటి క్షణంలోనే తెలియనితనపు శక్తి కీలకమైనదవుతుంది' అందామె.

పర్యవసానాలను గురించి వెరవక శ్రుతి ఈ ప్రసంగం చేసింది. యూనివర్సిటీకి తాను ఇచ్చిన ప్రసంగం పేజీలలో లేనిదాన్ని మధ్యలో ఇమిడ్చి ధైర్యంగా మాట్లాడింది. నిజం చెప్పాలంటే శ్రుతి అన్ని దేశాల విద్యార్థులకు, ప్రజలకు పిలుపునిస్తోంది. అన్నీ తెలిసి ఊరికే ఉండటం కన్నా, ఏమీ తెలియకనే 'అన్యాయం' అనిపించినప్పుడు వెంటనే గొంతెత్తాలని సందేశం ఇస్తోంది.

ఆమె ప్రసంగంలో కొంత

'నేడు ఈ ఉత్సవం మనకు తెలిసినదాని కోసం చేస్తున్నారు. మనకు ఏం తెలుసో దానిని ప్రశంసిస్తున్నారు. కాని తెలియనితనపు బలం ఒకటుంటుంది. నేనిక్కడికి (హార్వర్డ్) వచ్చేవరకూ 'విజ్ఞానశాస్త్ర చరిత్ర' అనే పాఠ్యాంశం ఉన్నదనేదే నాకు తెలియదు. ఇదిగో ఇప్పుడు ఇక్కడ ఆ శాఖ నుంచి నేను గ్రాడ్యుయేట్ నయ్యాను. చరిత్రంటే మనకు తెలిసిన కథల గురించి ఎంత చదవాలో... తెలియని కథల గురించి కూడా అంత చదవాలని ఇక్కడే తెలుసుకున్నాను'

(మరికొంతసేపు మాట్లాడి తన దుస్తులలో నుంచి చిన్న కాగితం తీసి ప్రధాన ప్రసంగానికి విరామం ఇచ్చి, ఇలా మాట్లాడింది)

'నా నాల్గవ సంవత్సరం చదువులో యూనివర్సిటీలో మా భావ ప్రకటనా స్వేచ్ఛ, మా నిరసన ప్రదర్శనా స్వేచ్ఛ నేరాలుగా మారిపోయాయి. నేనిక్కడ ఇవాళ మీ ముందు నిలబడి నా సహ విద్యార్థులైన పదమూడు మంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులను గుర్తు చేసుకోవాలి. ఆ పదమూడు మంది అండర్ గ్రాడ్యుయేట్లు ఇవాళ పట్టభద్రులు కాలేకపోతున్నారు. మన విశ్వవిద్యాలయంలో భావ ప్రకటనా స్వేచ్ఛ పట్ల వ్యక్తమైన అసహనం ఫలితం ఇది. దీనికి నేను చాలా నిరాశ చెందుతున్నాను. పదిహేను వందల మంది విద్యార్థులం, ఐదువందల మంది అధ్యాపకులం ఈ అసహనాన్ని ఖండించాం. యాజమాన్యానికి అభ్యర్థనలు పంపాం. విద్యార్థులు మాట్లాడినా అధ్యాపకులు మాట్లాడినా అదంతా ఈ క్యాంపస్‌లో స్వేచ్ఛ గురించే. పౌరహక్కుల గురించే. హార్వర్డ్... మా మాటలు నీకు వినబడుతున్నాయా? హార్వర్డ్... మా మాటలు వింటున్నావా?'

(అని మళ్లీ ప్రధాన ఉపన్యాసంలోకి వచ్చింది)

'ఒక జాతి అయిన కారణాన తనను లక్ష్యంగా చేసి దాడులకు గురి చేయడం అంటే ఏమిటో బహుశా మనకు తెలియదు. హింసా, మృత్యువూ మన కళ్లలోకి కళ్లు పెట్టి చూడడం అంటే ఏమిటో బహుశా మనకు తెలియదు. మనకు తెలియవలసిన అవసరం కూడా లేదు. మనం కూడగట్టి మాట్లాడటం అనేది మనకు తెలిసి ఉన్న విషయాల గురించే కానక్కరలేదు. మనకు తెలియనిదాని గుండా కూడా ప్రయాణించాలి' అందామె.

ప్రసంగం చివర ఎమిలీ డికిన్సన్ కవితా వాక్యాన్ని కోట్ చేసింది.

'ప్రభాతం ఎప్పుడొస్తుందో తెలియదు. అందుకే ప్రతి తలుపూ తెరిచి పెడతాను'.

చూపులను కట్టడి చేసేలా!

ఫ్యాషన్

హ్యాండ్ పెయింట్స్‌లో మనదైన ఆత్మ కనిపిస్తుంటుంది.
ఫ్యాబ్రిక్‌నే కాన్వాస్‌గా మలిచి, రంగుల కలయికతో కూర్చి
తీర్చిదిద్దిన డిజైన్స్ ఎప్పుడూ ట్రెండ్‌లో ఉంటాయి.
ఏ డిజైన్‌కి అదే ప్రత్యేకత.
ఇక అవి గతం నుంచి ప్రేరణ పొందినవైతే
అలనాటి హుందాతనాన్నీ, గాంభీర్యాన్నీ
ఆహ్లాదాన్ని మనకూ పంచుతాయి.

సాగరిక ఘాట్గే భారతీయ నటి, మోడల్ కూడా. ఆమె తన తల్లి ఊర్మిళ ఘాట్గేతో కలిసి ఫ్యాబ్రిక్‌పై చేసిన హ్యాండ్ పెయింట్ అందాన్ని కిందటేడాది డిసెంబర్ నుంచి 'అకుటీ' ద్వారా మన కళ్లకు కడుతున్నారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఉండే ఊర్మిళ ఘాట్గే, సాగరిక ఘాట్గే, తమ సొంత లేబుల్‌తో హ్యాండ్‌పెయింట్ చీరలు, బ్లేజర్లు, దుపట్టాలు, సల్వార్‌సెట్‌లు డిజైన్ చేస్తున్నారు. ప్రకృతి సంబంధించిన మోటిఫ్‌లతో మన కళ్లకు కడుతున్నారు ఈ తల్లీకూతుళ్లు.

తల్లి పెయింటింగ్స్ నుంచి ప్రేరణ పొంది అందరి ముందుకు వాటిని తీసుకు రావడంలో చేసిన ప్రయత్నాన్ని ఎంతో ఆనందంగా మనకు పరిచయం చేస్తారు సాగరిక.

'నా చిన్నతనంలో మా కుటుంబంలో స్త్రీలు షిఫాన్లు, టిష్యూలు, బ్రోకేడ్‌లను ధరించే విధానం, వారి ఆభరణాలు.. ఎంతో అందంగా కనిపించేవి. మా అమ్మ మహారాష్ట్రలోని రాచకుటుంబానికి చెందిన వ్యక్తి. కొల్హాపూర్‌లో తన గార్డెన్‌లో ఆమె పెంచిన పూల తోటలో ఎన్నో పూలు ఆమె అభిరుచికి అద్దం పట్టేలా ఉండేవి. నా చిన్నతనంలో మా అమ్మ వేసే పెయింటింగ్స్, బట్టల ముక్కలను కళాత్మక కళాఖండాలుగా మార్చే విధానం ఆశ్చర్యాన్ని కలిగించేది. ప్రకృతిని ఇష్టపడి ఆమె చేతితో చేసిన పెయింట్ పూల నమూనాలు ఆమె ధరించిన వస్త్రాలపైకి వచ్చేవి. కొన్నాళ్లకు అవి ఆమె బ్రాండ్‌గా పేరొందాయి. దానికి జీవం పోయడానికి కొంతమంది కళాకారులకు శిక్షణ ఇచ్చింది. ఈ రోజు 'అకుటి' పేరుతో రిచ్ టెక్స్‌టైల్స్, హ్యాండ్‌పెయింటెడ్ గార్మెంట్స్‌తో కొలువుదీరింది. నా కుటుంబంలోని ప్రసిద్ధ మహిళల చుట్టూ రూపొందించబడిన ఈ బ్రాండ్ మా మూలాలకు కట్టుబడి ఉంటుంది. నిజమైన అందం, గాంభీర్యం ఈ డిజైన్లలో ప్రతిఫలిస్తుంటుంది. అకుటీలో చీరలు, కో-ఆర్డ్ సెట్‌లు, బ్లేజర్లు, దుపట్టాలు, సల్వార్ సెట్స్ ఉన్నాయి. అన్నీ ప్రకృతికి సంబంధించిన మోటిఫ్‌లతో చేతితో పెయింట్ చేయబడ్డాయి' అంటూ తమ ఫ్యాబ్రిక్ కళను పరిచయం చేస్తున్నారు.



ఊర్మిళ ఘాట్గే, సాగరిక ఘాట్గే





టేస్టీ స్నాక్స్

వంటిల్లు

క్యాలెండర్ పేజీ తిప్పమంటోంది.
జూన్‌కి స్వాగతం పలకాల్సిందే.
కొత్త టైమ్‌టేబుల్‌నీ స్వాగతించాల్సిందే.
లంచ్ బాక్సు... స్కూల్‌కి రెడీ అయిపోతుంది.
పిల్లలు సాయంత్రం వచ్చేటప్పటికి ఏం చేయాలి?
ఇవిగో వీటిని మన వంటింట్లో ట్రై చేయండి.



బ్రెడ్ పొటాటో రోల్

కావలసినవి: బంగాళదుంపలు- 3 (మీడియం సైజువి); క్యారట్ తురుము లేదా పచ్చి బఠాణీలు - అర కప్పు ; మిరప్పొడి- అర టీ స్పూన్; గరం మసాలా పొడి- అర టీ స్పూన్; పసుపు - చిటికెడు; నిమ్మరసం - పావు టీ స్పూన్; కొత్తిమీర తరుగు - 2 టేబుల్ స్పూన్‌లు; ఉప్పు - అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; బ్రెడ్ స్లయిస్‌లు - 10; వెన్న - టేబుల్ స్పూన్ - 2 టేబుల్ స్పూన్‌లు; పాలు- అర కప్పు; మొక్కజొన్న పిండి లేదా మైదా లేదా శనగపిండి- 2 టేబుల్ స్పూన్‌లు (బ్రెడ్ స్లయిస్‌లను రోల్ చేసి అతికించడానికి).

తయారీ: ● బంగాళదుంపలను శుభ్రంగా కడిగి ఉడికించాలి. వేడి తగ్గిన తరవాత తొక్క తీసి చిదిమి ఒక పాత్రలో వేసుకోవాలి ● క్యారట్ లేదా బఠాణీలను ఉడికించి పక్కన పెట్టాలి ● ఇప్పుడు చిదిమిన బంగాళదుంప గుజ్జులో మిరప్పొడి, గరం మసాలా, ఉప్పు, పసుపు, కొత్తిమీర, నిమ్మరసం, ఉడికించిన క్యారట్ లేదా బఠాణీలను వేసి సమంగా కలిసే వరకు వేళ్లతో చిదమాలి. ఉప్పు, కారం సరి చూసుకుని అవసరమైతే మరికొంత చేర్చుకోవచ్చు ● ఈ మిశ్రమాన్ని పది సమభాగాలుగా చేయాలి. ఒక్కో భాగాన్ని ఓవల్ షేప్ (దొండకాయ ఆకారం)లో చేయాలి ● బ్రెడ్ అంచులు కట్ చేసి తీసేసిన తర్వాత బ్రెడ్ స్లయిస్‌ని పూరీల పీట మీద పెట్టి రోలర్‌తో వత్తాలి. ఇలా చేయడం వల్ల గుల్లబారి ఉన్న బ్రెడ్ చపాతీలాగ పలుచగా వస్తుంది. పాలలో బ్రష్ ముంచి ఈ స్లయిస్‌ల మీద చల్లాలి లేదా పాలలో వేళ్లు ముంచి బ్రెడ్ స్లయిస్ మీద చల్లి తడిపొడిగా ఉండేటట్లు మునివేళ్లతో అద్దాలి ● బ్రెడ్ చివర్లు అతికించడం కోసం తీసుకున్న పిండిలో నీరు పోసి గరిట జారుడుగా కలుపుకోవాలి ● ఇప్పుడు బ్రెడ్ స్లయిస్ మీద బంగాళదుంప మిశ్రమాన్ని ఉంచి అంచులకు పిండి ద్రవాన్ని అద్దుతూ అతికిస్తే బ్రెడ్‌రోల్ రెడీ. వీటిని ఒక గిన్నెలో పెట్టి మూత పెట్టాలి. బయటే ఉంచినప్పుడు ఒక వేళ కాల్చడం ఆలస్యం అయితే బ్రెడ్ అంచులు ఎండిపోయి రోల్ ఊడిపోతుంది ● పెనం వేడి చేసి వెన్న రాసి బ్రెడ్ రోల్స్‌ను ఒకదాని పక్కన ఒకటిగా అమర్చాలి. దోరగా కాలేకొద్దీ మరొక వైపుకు తిప్పుతూ అన్ని వైపులా కాలేటట్లు చూడాలి. పెనం మీద కాల్చినప్పుడు నూనెలో రోస్ట్ చేసినట్లు రోల్ అంతా సమంగా ఒకే రంగులో ఉండదు. కానీ లోపల మిశ్రమం ఉడికిపోతుంది. రోల్ పై భాగం కరకరలాడుతూ రుచిగా ఉంటుంది. మొత్తంగా ఒకేరంగులో ఉండాలంటే బాణలిలో నాలుగు టేబుల్ స్పూన్‌ల నూనె లేదా నెయ్యి మరిగించి అందులో నాలుగు రోల్స్ వేసి అవి కాలిన తర్వాత మరికొన్ని వేస్తూ కాల్చుకోవచ్చు. ఇలా చేసినప్పుడు నూనెలో నుంచి తీసిన వెంటనే టిష్యూ పేపర్ మీద వేస్తే అదనంగా ఉన్న నూనెను పేపర్ పీల్చుకుంటుంది ● ఓవెన్‌లో అయితే... 200 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో వేడి చేసి బేకింగ్ ట్రేలో రోల్స్‌ను అమర్చి పది నుంచి పన్నెండు నిమిషాల సేపు బేక్ చేయాలి.



చీజ్ బాల్స్

కావలసినవి: బంగాళదుంపలు - పావు కేజీ; వెల్లుల్లి పేస్ట్ - టీ స్పూన్; ఉప్పు - పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి; రెడ్ చిల్లీ ఫ్లేక్స్ లేదా పచ్చిమిర్చి తరుగు లేదా మిరప్పొడి - అర టీ స్పూన్; మిరియాల పొడి - పావు టీ స్పూన్; కొత్తిమీర తరుగు - టీ స్పూన్; బ్రెడ్ క్రంబ్స్ - 6 టేబుల్ స్పూన్‌లు; నూనె - వేయించడానికి తగినంత.

స్టఫింగ్ కోసం: చీజ్ - 100 గ్రాములు; ఎండిన పుదీన - అర టీ స్పూన్ (ఆకులను అరచేతిలో వేసి వేళ్లతో నలిపి పొడి చేయాలి); రెడ్ చిల్లీ ఫ్లేక్స్ లేదా పచ్చిమిర్చి తరుగు లేదా మిరప్పొడి - పావు టీ స్పూన్; మిరియాల పొడి- పావు టీ స్పూన్, గరం మసాలా పొడి- చిటికెడు.

కోటింగ్ కోసం: కార్న్ ఫ్లోర్ - 2 టేబుల్ స్పూన్‌లు ; ఎగ్ - ఒకటి (ఎగ్ వేయనట్లయితే మరో 2 టేబుల్ స్పూన్‌ల కార్న్‌ఫ్లోర్ తీసుకోవాలి); బ్రెడ్ క్రంబ్స్- అర కప్పు.

తయారీ: ● బంగాళదుంపలను శుభ్రంగా కడిగి ఉడికించి, వేడి తగ్గిన తర్వాత తొక్క తీసి చిదమాలి ● అందులో వెల్లుల్లి పేస్ట్, కొత్తిమీర తరుగు, ఉప్పు, చిల్లీ ఫ్లేక్స్, మిరియాల పొడి, బ్రెడ్ క్రంబ్స్ వేసి సమంగా కలిసేటట్లు చిదిమి ఒకసారి రుచి చూసుకుని అవసరమైతే ఉప్పు, కారం కలుపుకుని మిశ్రమం మొత్తాన్ని బాల్స్ చేసి ఆరిపోకుండా ఒక గిన్నెలో వేసి మూత పెట్టుకోవాలి ● స్టఫింగ్ కోసం తీసుకున్న వాటిలో చీజ్ తప్ప మిగిలిన అన్నింటినీ ఒక పాత్రలో వేసి కలపాలి. అందులో చీజ్ ని అర అంగుళం ముక్కలుగా కట్ చేసి వేసి పాత్రను కొద్దిగా కదిలిస్తూ మసాలా పొడులు చీజ్ ముక్కలకు పట్టేలా చేసి వేడి తగలకుండా స్టవ్‌కు దూరంగా ఉంచాలి ● ఇప్పుడు బంగాళదుంప బాల్స్ ఒక్కొక్కటిగా తీసుకుని అరచేతిలో పెట్టి వేళ్లతో చిన్న పూరీలా వత్తి అందులో మసాలా పట్టించిన చీజ్ ఒక ముక్క పెట్టి బంగాళాదుంప మిశ్రమం పూరీ అంచులను మూసేస్తూ బాల్ చేయాలి. ఇలా అన్నింటినీ చేసిన తర్వాత ఒక ప్లేట్‌లో కార్న్‌ఫ్లోర్ వేసి అందులో ఒక్కో బాల్‌ని వేస్తూ మెల్లగా వేళ్లతో కదిలిస్తూ పిండి అన్ని వైపులా సమంగా పట్టేటట్లు చేయాలి ● మరొక ప్లేట్‌లో బ్రెడ్ క్రంబ్స్ వేసుకుని కార్న్‌ఫ్లోర్ పట్టించిన బాల్స్‌ని వేసి అన్ని వైపులా సమంగా పట్టేటట్లు చేయాలి ● కోడిగుడ్డు సొనను ఒక గిన్నెలో వేసి గిలక్కొట్టాలి. ఎగ్ వాడనట్లయితే రెండు టేబుల్ స్పూన్‌ల కార్న్‌ఫ్లోర్‌ను తగినంత నీటితో గరిటజారుడుగా కలుపుకోవాలి. పొడి కార్న్‌ఫ్లోర్ పట్టించిన బంగాళాదుంప- చీజ్ బాల్స్‌ని కార్న్‌ఫ్లోర్ ద్రవం లేదా కోడిగుడ్డు సొనలో ముంచి తీసి పదినిమిషాల సేపు ఆరనివ్వాలి ● ఈ లోపు బాణలిలో నూనె వేడి చేయాలి. ఒక్కో బాల్‌ను జాగ్రత్తగా నూనెలో వేసి మీడియం మంట మీద బాల్ అన్ని వైపులా సమంగా కాలిన ఒక ప్లేట్‌లోకి తీసుకోవాలి. బాల్స్ మీద టిష్యూ పేపర్‌ని కప్పి ఉంచితే అదనపు ఆయిల్ వదులుతుంది. బంగాళాదుంప- చీజ్ బాల్స్‌ని టొమాటో సాస్ లేదా కెచప్‌తో తింటే చాలా రుచిగా ఉంటాయి.

యువర్స్

● మ్యూజిక్ వరల్డ్

వో బేబీ... యూ బ్లేమ్ మీ అండ్ ఐ బ్లేమ్ యూ

'బిల్‌బోర్డ్ హాట్ 100'లో అమెరికన్ ర్యాపర్, సింగర్ పోస్ట్ మెలాన్ పాట 'ఐ హ్యాడ్ సమ్ హెల్ప్' ఫస్ట్ ప్లేస్‌లో నిలిచింది. సంక్లిష్టమైన మానవ సంబంధాలకు అద్దం పట్టే పాట ఇది.



పార్ట్‌నర్ హిపోక్రసి గురించి ప్రస్తావిస్తూ పాట మొదలుపెడతాడు మెలాన్. రిలేషన్‌షిప్ ట్రబుల్స్ చుట్టూ తిరిగే ఈ పాటను ఎలాంటి ట్రబుల్ లేకుండా 'ఇట్ టేక్స్ టు బ్రేక్ ఏ హార్ట్ ఇన్ టూ, వో బేబీ/యూ బ్లేమ్ మీ అండ్, ఐ బ్లేమ్ యూ' అంటూ హాయిగా పాడుకోవచ్చు.

● ఇంగ్లిష్ ఇడియమ్స్

గెట్ వన్స్ ఫీట్ వెట్

కొత్త పనిలోకి అడుగు పెట్టినప్పుడు లేదా రిస్క్ అయినా సరే ఏదైనా కొత్తగా ట్రై చేసే సందర్భంలో వాడే మాట... గెట్ వన్స్ ఫీట్ వెట్.

ఉదా: ది హార్డెస్ట్ పార్ట్ ఆఫ్ ది స్కైడైవింగ్ ఎక్స్‌పీరియెన్స్ వాజ్ గెట్టింగ్ అవర్ ఫీట్ వెట్. ఆఫ్టర్ దట్, ఎవ్రీథింగ్ వాజ్ ఓకే అండ్ ఈజీ.



బారెల్ ఆఫ్ మంకీస్

హాస్యాస్పదమైన పరిస్థితి, అస్తవ్యస్త పరిస్థితి, కంట్రోల్ తప్పి గందరగోళంగా మారడంలాంటి సందర్భాలలో వాడే మాట... బారెల్ ఆఫ్ మంకీస్.

ఉదా: ది ట్రాఫిక్ జామ్ వాజ్ ఏ టోటల్ బ్యారెల్ ఆఫ్ మంకీస్

● సక్సెస్ స్టోరీ

అద్భుతాల ఆర్యన్



ఆర్యన్ చౌహాన్

అద్భుతాలు ఆకాశం నుంచి ఊడిపడవు. ఆలోచనల్లో నుంచి పుడతాయి. దిల్లీకి చెందిన ఆర్యన్ చౌహాన్ చిన్న వయసులోనే ఎంటర్‌ప్రెన్యూర్‌గా పెద్ద విజయం సాధించడానికి ఆ ఆలోచనలే కారణం. కొత్తదనాన్ని ఆవిష్కరించే ఆలోచనలు అవి. కొత్త తరం ఆలోచనలు అవి...

ఇరవై రెండు సంవత్సరాల ఆర్యన్ చౌహాన్ ట్రాక్ రికార్డ్ 'ఆహా' అనేలా ఉంటుంది. పద్నాలుగు సంవత్సరాల వయసులోనే స్టార్టప్‌లకు సహాయపడే స్టార్టప్‌ను మొదలుపెట్టాడు. యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలో ప్రసిద్ధ జెరోమ్ ఫిషర్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీకి ఎంపికైన తక్కువ మందిలో ఆర్యన్ ఒకడు.

కోవిడ్ సమయంలో స్వదేశానికి తిరిగి వచ్చాడు ఆర్యన్.

ఆ సమయంలో అతడి మనసు నిండా కొత్త స్టార్టప్ ఆలోచనలు నిండి ఉన్నాయి.

అయితే ఏమీ చేయలేని అనిశ్చితి బయట నెలకొని ఉంది.

ఇండియన్ స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను లోతుగా అర్థం చేసుకోవడానికి ఈ సమయాన్ని ఉపయోగించుకున్నాడు ఆర్యన్.

2021లో 'జీవోవ్'పై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాడు.

తన తల్లితో కలిసి గురుగ్రామ్ కేంద్రంగా 'జీవోవ్' పేరుతో రెండో కంపెనీ స్టార్ట్ చేశాడు. టెక్-ఫస్ట్ అప్రోచ్‌తో డయాబెటిస్ సమస్యను అదుపులో ఉంచే కంపెనీ ఇది. పర్సనలైజ్ రెమిషన్ ప్లాన్స్ నుంచి నిరంతర గ్లూకోజ్ మానిటరింగ్ (సీజీఎం) పరికరాల వరకు కంపెనీలో ఎన్నో ఉంటాయి.

ఇంతకీ ఆర్యన్‌కు 'జీవోవ్' ఆలోచన ఎలా వచ్చింది?

'డయాబెటిస్ బాధితులను దగ్గరి నుంచి చూశాను. మా తాతయ్యలు ఇద్దరూ డయాబెటిస్‌తో బాధలు పడ్డారు. ఆ సమయంలోనే ఏదైనా పరిష్కార మార్గం ఆలోచించాలనుకున్నాను' అంటాడు ఆర్యన్.

క్రానిక్ కేర్ బిజినెస్‌గా ప్రారంభమైన 'జీవోవ్' కంపెనీ న్యూట్రిషనిస్ట్, ఫిట్‌నెస్ ట్రైనర్స్, సైకాలజిస్ట్‌లను పేషెంట్లకు అందుబాటులోకి తీసుకువచ్చింది.

తక్కువ సమయంలోనే కంపెనీ 70,000లకు పైగా వినియోగదారులతో విజయపథంలోకి వచ్చింది.

'ప్రాడక్ట్‌ను క్రియేట్ చేయడం నుంచి మార్కెట్‌లో విజయవంతం చేయడం వరకు ఆర్యన్‌లో అద్భుత సామర్థ్యం ఉంది. వేగంగా నేర్చుకునే తత్వం, నిర్మాణాత్మక పనివిధానం అతడి సొంతం. ఏ ప్రాజెక్ట్ చేపట్టినా విజయవంతం చేయాలనే పట్టుదలతో పనిచేస్తాడు. నెవర్-సే-డై స్పిరిట్ ఆర్యన్‌ను క్వాలిటీ ఫౌండర్‌ని చేసింది' అంటాడు 'స్నాప్‌డీల్ అండ్ టైటాన్ క్యాపిటల్' ఫౌండర్ కునాల్ బహల్.

కునాల్ బహల్ జెరోమ్ ఫిషర్ ప్రోగ్రామ్ పూర్వ విద్యార్థి.

'జీవోవ్'కు ముందు కునాల్‌తో కలిసి పని చేశాడు ఆర్యన్.

'స్నాప్‌డీల్ అండ్ టైటాన్ క్యాపిటల్'లో ఫిన్‌టెక్, హెల్త్‌టెక్, డీ2సీ సెగ్మెంట్‌లను లీడ్ చేశాడు.

'ఇది చాలు' అనుకోవడం లేదు ఆర్యన్ చౌహాన్.

'జాయిన్ ది రెవల్యూషన్' నినాదంతో నెక్స్ట్ గ్రోత్ పేస్‌పై దృష్టి పెట్టాడు.

● టెక్.. టాక్

యాపిల్ ఐపాడ్ ప్రో 11



బాడీ: 249.7×177.5×5.3 ఎంఎం; బరువు: 466 గ్రా.; డిస్‌ప్లే: 11.00
వోఎస్/సాఫ్ట్‌వేర్: ఐపాడ్‌వోఎస్ 17.5; రిజల్యూషన్: 1668×2420;
బ్యాటరీ: 7,606 ఎంఏహెచ్; మెమోరీ: 256జీబి 8జీబి ర్యామ్/ 512జీబి 8జీబి ర్యామ్/ 1టీబి 16జీబి ర్యామ్/ 2టీబి 16జీబి ర్యామ్

పోకో ఎఫ్ 6



సైజ్: 6.67 అంగుళాలు
రిజల్యూషన్: 1220×2712 పిక్సెల్స్
బరువు: 179 గ్రా; బ్యాటరీ: 5000 ఎంఏహెచ్
ఇంటర్నల్: 256జీబి 8జీబి ర్యామ్/ 512జీబి 12జీబి ర్యామ్
కలర్స్: బ్లాక్, గ్రీన్, టైటానియం

గూగుల్ మ్యాజిక్ ఎడిటర్



పాత పిక్సెల్ ఫోన్‌లకు 'మ్యాజిక్ ఎడిటర్'ను తీసుకురానున్నట్లు గూగుల్ ప్రకటించింది. 'మ్యాజిక్ ఎడిటర్'లో రకరకాల ఇమేజ్ ఎడిటింగ్, ఎన్‌హాన్స్‌మెంట్ టూల్స్ ఉంటాయి. ఫొటో రిసైజ్ చేయడానికి, ఎరేజ్ చేయడానికి, యూనిక్ ఫిల్టర్‌లను అప్లై చేయడానికి మ్యాజిక్ ఎడిటర్ ఉపయోగపడుతుంది. కొత్త ఫ్రీ మ్యాజిక్ ఎడిటర్ ఫీచర్‌లు ప్రస్తుతం కొన్ని పిక్సెల్స్ 7, పిక్సెల్స్ 6 సిరీస్ ఫోన్‌లలో అందుబాటులో ఉన్నాయి. 'మ్యాజిక్ ఎడిటర్'తో పాటు ఫొటోఅన్‌బ్లర్, మ్యాజిక్ ఎరేజర్, పోట్రాయిట్ లైట్‌లాంటి ఏఐ-పవర్డ్ ఫొటో-ఎడిటింగ్ ఫీచర్‌లు అన్ని ఆండ్రాయిడ్ డివైజ్‌లకు అందుబాటులోకి రానున్నాయి.

ప్లే, సింగ్ ఆర్ హమ్ ఏ సాంగ్



పాట చరణాలు గుర్తు లేవు...కానీ ట్యూన్ హమ్ చేస్తుంటాం. గుర్తుకు రాని ఇష్టమైన పాటను వెదికిపట్టుకోవడానికి పెద్దగా కష్టపడనక్కర్లేదు. హమ్ చేయడం ద్వారా యూట్యూబ్ మ్యూజిక్‌లో ఇష్టమైన పాటను వినవచ్చు. యాపిల్ 'షాజమ్'ను పోలిన ఈ ఫీచర్ పేరు...ప్లే, సింగ్ ఆర్ హమ్ ఏ సాంగ్. 'ప్లే, సింగ్ ఆర్ హమ్'ను ఉపయోగించడానికి.. ● ఆండ్రాయిడ్ ఫోన్‌లో యూట్యూబ్ ఓపెన్ చేయాలి ● టాప్ రైట్‌లోని సెర్చ్ ఐకాన్‌ను క్లిక్ చేయాలి. ● 'మ్యూజిక్ వేవ్'లా కనిపించే ఐకాన్‌ను సెలెక్ట్ చేయాలి ● హమ్మింగ్ స్టార్ట్.

యూట్యూబ్‌లో కామెంట్ ఎడిట్, డిలీట్ చేయడానికి...

YouTube

మనం చూసిన వీడియోలు, చేసిన కామెంట్స్‌ను యూట్యూబ్ సేవ్ చేస్తుంది. కామెంట్ హిస్టరీని చూడాలనుకుంటున్నారా? ఎడిట్ లేదా డిలీట్ చేయాలనుకుంటున్నారా? అయితే ఇలా చేయండి... ■ యూట్యూబ్ లోగోకు లెఫ్ట్‌లో ఉన్న హంబర్గర్ మెనూ బటన్‌ను క్లిక్ చేయాలి ■ 'యూ' సెక్షన్ కింద ఉన్న 'హిస్టరీ'ని క్లిక్ చేయాలి ■ రైట్‌లో ఉన్న 'మేనేజ్ ఆల్ హిస్టరీ' క్లిక్ చేయాలి ■ కామెంట్స్-ట్యాప్

డిలిట్, ఎడిట్ చేయడానికి...

■ 'ఎక్స్' ఐకాన్‌ను నొక్కితే కామెంట్ ఆటోమేటిక్‌గా డిలీట్ అవుతుంది ■ ఎడిట్ చేయడానికి వీడియో లింక్‌ను నొక్కాలి. లోడ్ అయిన పేజీ మీ కామెంట్‌ను హైలైట్ చేస్తుంది. ఎడిట్ చేయాలనుకుంటున్న కామెంట్ పక్కన ఉన్న త్రీడాట్ మెనూ బటన్‌పై క్లిక్ చేసి 'సేవ్' బటన్ నొక్కాలి; ■ గమనించాల్సిన విషయం ఏమిటంటే మార్పులు చేసిన తరువాత కామెంట్ ఎడిట్ చేసినట్లు యూట్యూబ్ చూపిస్తుంది.

● గేమింగ్

సముద్ర సాహసం



'బారెంట్స్ అండ్ ఫిషింగ్: నార్త్ అట్లాంటిక్ ఫ్రాంఛైజీలకు సీక్వెల్‌గా వచ్చిన గేమ్ షిప్స్ ఎట్ సీ. ఈ బ్రాండ్-న్యూ గేమ్‌ప్లేలో రకరకాల కొత్త ఫీచర్‌లు ఉన్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. చాలాకాలంగా ఎదురు చూస్తున్న మల్టీప్లేయర్ మోడ్‌లో వచ్చిన ఈ గేమ్ ద్వారా మహా సముద్రాలకు సంబంధించి రియలిస్టిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను సొంతం చేసుకోవచ్చు. నెక్స్ట్ జనరేషన్ షిప్ స్టిమ్యులేషన్‌గా వచ్చిన ఈ గేమ్‌లో మొదటిసారిగా సర్వీస్, కార్గో నౌకలను పరిచయం చేశారు. వీటిలో సరికొత్త గేమ్‌ప్లే ఫీచర్‌లో ఉంటాయి.

'స్నేహితులతో కలిసి నార్వేజియన్ సముద్రంలోకి వెళ్లండి. సినిమాటిక్-క్వాలిటీ ఓషన్ స్టిమ్యులేషన్ దీని సొంతం. సముద్ర సాహసాలు చేయాలనే ఉత్సాహం మీలో ఉందా? అయితే షిప్స్ ఎట్ సీలోకి వచ్చేయండి' అంటుంది గేమ్ డెవలపర్ మిస్క్ గేమ్స్.

జానర్స్: ఎర్లీ యాక్సెస్, స్ట్రాటజీ వీడియో గేమ్
ప్లాట్‌ఫామ్: మైక్రోసాఫ్ట్ విండోస్
ఇంజిన్: అన్‌రియల్ ఇంజిన్ 5

సినిమా

అండమాన్‌లో యాక్షన్



● సూర్య

కొద్ది రోజుల పాటు అండమాన్‌కు మకాం మార్చనున్నారు హీరో సూర్య. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో సూర్య హీరోగా ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా చిత్రీకరణలో భాగంగానే సూర్య అండమాన్ వెళ్లనున్నారు. 2డీ ఎంటర్‌టైన్మెంట్స్, స్టోన్ బెంచ్ ఫిలింస్ నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ అండమాన్‌లో ప్రారంభం కానుంది. నవ్వు, యుద్ధం, ప్రేమ అంశాల నేపథ్యంలో రూపొందనున్న ఈ సినిమాను జూన్‌లో ప్రారంభించనున్నట్లు 'ఎక్స్'లో ఓ వీడియోను షేర్ చేశారు కార్తీక్ సుబ్బరాజ్. అండమాన్‌లో ఆరంభించే ఈ తొలి షెడ్యూల్‌లో ఓ యాక్షన్ ఎపిసోడ్ చిత్రీకరించడానికి ప్లాన్ చేశారు. ఇక ఈ మూవీలో హీరోయిన్‌గా పూజా హెగ్డే పేరు వినిపిస్తోంది.

సినిమా విడుదలకి ముందే యానిమేషన్ రిలీజ్ ప్రయోగమే



''కల్కి 2898 ఏడీ' సినిమా విడుదల కాకముందే యానిమేషన్ సిరీస్‌ను రిలీజ్ చేయడం మా ప్రొడక్షన్ హౌస్ ధైర్యంగా తీసుకున్న నిర్ణయం.. చెప్పాలంటే ఇదొక ప్రయోగమే. నాలుగైదేళ్లుగా దీని కోసం పని చేస్తున్నాం'' అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. **- నాగ్ అశ్విన్**

ప్రభాస్ హీరోగా నటించిన పాన్ ఇండియన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర పాత్రలు పోషించారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ సినిమా జూన్ 27న రిలీజ్ కానుంది. ఈ సినిమాలో భైరవగా ప్రభాస్ కనిపించనున్నారు. ఈ చిత్రంలో ఆయన వాడిన కారు పేరు బుజ్జి. కాగా బుజ్జి-భైరవ 2డీ యానిమేషన్ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో నేటి నుంచి ప్రసారం కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ సిరీస్ ట్రైలర్ లాంచ్ వేడుకలో నాగ్ అశ్విన్ మాట్లాడుతూ – ''కల్కి 2898 ఏడీ' మూవీ రిలీజ్‌కి ముందే ఒక యానిమేషన్ సిరీస్ లాంచ్ చేయాలనే ఐడియా నచ్చింది. ఇందుకోసం 'ఛోటా భీమ్'తో పాటు ఎన్నో యానిమేషన్ సిరీస్‌లను రూపొందించిన గ్రీన్ గోల్డ్ సంస్థతో కలిసి పని చేశాం. ఈ ఐదేళ్లలో వైజయంతీ ఆటోమొబైల్స్, వైజయంతీ యానిమేషన్, వైజయంతీ మూవీస్ అనే మూడు డిఫరెంట్ కంపెనీలను నడిపించాం'' అన్నారు.

ఆధ్యాత్మిక ప్రయాణం



● రజనీకాంత్

ఒక సినిమా షూటింగ్ ఆరంభించే ముందు... లేదా సినిమా పూర్తయ్యాక ఆధ్యాత్మిక యాత్ర చేస్తుంటారు రజనీకాంత్. ఆయన ఎక్కువగా హిమాలయాలకు వెళ్లే విషయం తెలిసిందే. అక్కడి మహావతార్ బాబాజీ గుహలో రజనీ ధ్యానం చేస్తుంటారట. తాజాగా రజనీకాంత్ మరోసారి ఆధ్యాత్మిక యాత్రలో ఉన్నారు. దాదాపు పది రోజులు హిమాలయాల్లో గడిపి, తిరిగి వచ్చేలా ప్లాన్ చేసుకున్నారట. చెన్నై చేరుకున్న వెంటనే తన తాజా చిత్రం 'కూలీ' చిత్రీకరణలో పాల్గొంటారు రజనీకాంత్. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో ఈ సినిమాను సన్ పిక్చర్స్ సంస్థ నిర్మించనుంది. మరోవైపు రజనీకాంత్ నటించిన చిత్రం 'వేట్టయాన్'. టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'వేట్టయాన్'లో రజనీకాంత్ పాత్రకు సంబంధించిన చిత్రీకరణ మొత్తం పూర్తయింది. ఈ ఏడాది అక్టోబరులో ఈ చిత్రం విడుదల కానుంది.

టప్పా టప్పా.. పెళ్లి పాటప్పా



● శర్వానంద్, కృతీ శెట్టి

టప్పా టప్పా.. అంటూ పాట అందుకున్నారు శర్వానంద్, కృతీ శెట్టి. ఈ ఇద్దరూ జంటగా నటించిన 'మనమే' చిత్రంలో పెళ్లి సమయంలో వచ్చే 'టప్పా టప్పా..' అంటూ సాగే పాట విడుదల అయింది. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో విక్రమ్ ఆదిత్య కీలక పాత్ర చేశారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 7న రిలీజ్ కానుంది. కాగా చిత్ర సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి ఇప్పటికే రెండు పాటలు విడుదల చేసిన యూనిట్ గురువారం 'టప్పా టప్పా..' అంటూ సాగే మూడవ పాటని విడుదల చేసింది. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటను రామ్ మిరియాల, హేషమ్ అబ్దుల్ వహాబ్ పాడారు. ''అందరూ ఎంజాయ్ చేసే వెడ్డింగ్ సాంగ్‌ని అందించారు హేషమ్. ఈ పాటలో శర్వానంద్, కృతీ గ్రేస్‌ఫుల్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను అలరిస్తాయి'' అని యూనిట్ పేర్కొంది.



● త్రిష

నయనతార ప్లేస్‌లో త్రిష?

తమిళ ఫ్యాంటసీ కామెడీ డ్రామా 'మూకుత్తి అమ్మన్'కు సీక్వెల్‌గా 'మూకుత్తి అమ్మన్ 2' సెట్స్ పైకి వెళ్లేలా సన్నాహాలు జరుగుతున్నాయనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. 'మూకుత్తి అమ్మన్' చిత్రంలో నయనతార టైటిల్ రోల్ చేయగా, ఆర్‌జే బాలాజీ మరో లీడ్‌లో నటించారు. ఎన్‌జే శరవణన్‌తో కలిసి ఆర్‌జే బాలాజీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2020లో డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదలైంది. వీక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. తాజాగా 'మూకుత్తి అమ్మన్ 2' పనులను మొదలు పెట్టారట ఆర్‌జే బాలాజీ. అయితే సీక్వెల్‌లో నయనతార కాకుండా త్రిష నటించనున్నారనే ప్రచారం జరుగుతోంది. అంతేకాదు.. ఈసారి ఆర్‌జే బాలజీయే పూర్తి స్థాయిలో దర్శకత్వ బాధ్యతలు తీసుకోనున్నారట. మరి.. సీక్వెల్‌లో త్రిష నటిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

బాహుబలిలా వెపన్



● సత్యరాజ్

''ప్రస్తుతం భాష అనేది హద్దుగా లేదు. 'బాహుబలి' సినిమా ఎన్నో భాషల్లో విడుదలైంది. మా 'వెపన్' మూవీ కూడా అలాంటి చిత్రమే. సూపర్ హ్యూమన్ సాగా కాన్సెప్ట్‌తో రానున్న ఈ మూవీ కొత్త ట్రెండ్ కావడంతో పాటు పెద్ద హిట్టవుతుంది'' అని నటుడు సత్యరాజ్ అన్నారు. గుహన్ సెన్నియప్పన్ దర్శకత్వంలో సత్యరాజ్, వసంత్ రవి, తాన్యా హోప్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'వెపన్'. ఎంఎస్ మన్సూర్ సమర్పణలో మిలియన్ స్టూడియో బ్యానర్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో గుహన్ సెన్నియప్పన్ మాట్లాడుతూ– ''ఇదొక సైకో థ్రిల్లర్, యాక్షన్ మూవీ'' అన్నారు. ''వెపన్' లాంటి మంచి సినిమాలో నటించినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు వసంత్ రవి, తాన్యా హోప్, రాజీవ్ పిళ్లై.

నా కెరీర్‌లో ఇదో కొత్త ప్రయత్నం

- కాజల్ అగర్వాల్



''సత్యభామ' కంటే ముందు నాకు లేడీ ఓరియంటెడ్ మూవీస్‌కి చాన్స్ వచ్చింది. కానీ ఈ తరహా సినిమాలు చేసే ఆత్మవిశ్వాసం నాలో ఉన్నప్పుడే ఒప్పుకోవాలనుకున్నాను. ఇప్పుడు కాన్ఫిడెంట్‌గా 'సత్యభామ' చేశాను. లేడీ ఓరియంటెడ్ మూవీస్ చేస్తున్నప్పుడు నాపై ఒత్తిడి ఉందనుకోను. బాధ్యతగా తీసుకుంటాను. ఫుల్ లెంగ్త్ యాక్షన్ మూవీ చేయాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను. అది 'సత్యభామ'తో నెరవేరింది'' అని కాజల్ అగర్వాల్ అన్నారు. ఆమె టైటిల్ రోల్‌లో నటించిన క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'సత్యభామ'. ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో నవీన్‌చంద్ర నటించారు. 'మేజర్' చిత్రదర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరించి, స్క్రీన్‌ప్లే అందించారు. సుమన్ చిక్కాలను దర్శకుడిగా పరిచయం చేస్తూ బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించిన ఈ చిత్రం జూన్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– ''సత్యభామ' సినిమాతో ఓ కొత్త ప్రయత్నం చేశాను. ఫస్ట్ టైమ్ నా కెరీర్‌లో భారీ స్టంట్స్ చేసిన సినిమా ఇది. వాటి కోసం చాలా కష్టపడ్డాను. క్రిమినల్స్ గేమింగ్, వర్చ్యువల్ రియాలిటీ వంటి టెక్నాలజీ ద్వారా పోలీసులు నేరాలను ఎలా పరిష్కరిస్తారో ఓ పోలీస్ అధికారిని అడిగి తెలుసుకున్నాను. ఆ విషయాలు ఈ సినిమాలో ఉన్నాయి'' అని అన్నారు. ''సత్యభామ' పూర్తిగా హైదరాబాద్ బేస్డ్ కథ. అందుకే ముందుగా తెలుగులో పర్ఫెక్ట్‌గా విడుదల చేసి, ఆ తర్వాత మిగతా భాషల గురించి ఆలోచించాలని అనుకున్నాం'' అన్నారు శశికిరణ్ తిక్క. ''ప్రతి పోలీసాఫీసర్ జర్నీలో ఓ స్పెషల్ కేసు ఉంటుంది. అలా సత్యభామ ఒక కేసును ఎందుకు పర్సనల్‌గా తీసుకుంటుంది అనేది ఈ చిత్రకథ'' అన్నారు సుమన్ చిక్కాల. ''సత్యభామ' అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు నిర్మాత బాబీ. ఈ చిత్ర సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల మాట్లాడారు.

కృష్ణగారు యాక్షన్ సినిమాలు చేయమనేవారు

- సుధీర్‌బాబు



● మాళవికా శర్మ, సుధీర్‌బాబు

''సూపర్‌స్టార్ కృష్ణగారి జయంతి (మే 31) సందర్భంగా 'హరోం హర' మూవీ ట్రైలర్‌ని లాంచ్ చేయడం హ్యాపీగా ఉంది. యాక్షన్ సినిమాలు చేయమని కృష్ణగారు చెప్పేవారు. 'హరోం హర' విషయంలో ఆయన ఆనందపడతారని నమ్ముతున్నాను. తెలుగు, ఇండియన్ సినిమాలో ఇప్పటివరకూ 'హరోం హర'లాంటి నేపథ్యం ఉన్న సినిమా రాలేదనుకుంటున్నాను'' అన్నారు సుధీర్‌బాబు. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుధీర్‌బాబు, మాళవికా శర్మ జంటగా నటించిన చిత్రం 'హరోం హర'. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ జి. నాయుడు నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో మహేశ్‌బాబు గురువారం సోషల్ మీడియాలో రిలీజ్ చేసి, 'ట్రైలర్ ఆసక్తిగా ఉంది. సుధీర్‌బాబు, టీమ్‌కు శుభాకాంక్షలు' అన్నారు. అనంతరం నిర్వహించిన ట్రైలర్ లాంచ్ వేడుకకి దర్శకులు అనిల్ రావిపూడి, సంపత్ నంది అతిథులుగా హాజరయ్యారు. సుధీర్‌బాబు మాట్లాడుతూ–''హరోం హర'లో హీరో పాత్ర గురించి సింగిల్ లైన్‌లో చెప్పాలంటే జేమ్స్ బాండ్ ఇన్ కుప్పం లేదా రాంబో ఇన్ కుప్పం అనొచ్చు'' అన్నారు. ''ఈ సినిమా సుధీర్ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్టవుతుంది'' అన్నారు అనిల్ రావిపూడి. ''ఈ మూవీ ట్రైలర్ టెరిఫిక్‌గా అనిపించింది'' అన్నారు సంపత్ నంది. ''హరోం హర'లో రెండు వేల మందితో షూట్ చేసిన ఓ సీక్వెన్స్ థియేటర్స్‌లో అద్భుతంగా ఉంటుంది'' అన్నారు జ్ఞానసాగర్ ద్వారక. ''నేనిప్పటి వరకూ చేయని పాత్రను ఈ సినిమాలో చేశాను'' అన్నారు మాళవికా శర్మ. ''మా సినిమా అందర్నీ ఎంటర్‌టైన్ చేస్తుంది'' అన్నారు సుమంత్ జి. నాయుడు. నిర్మాతలు సుబ్రహ్మణ్యం, కేఎల్ దామోదర్ ప్రసాద్, బెక్కం వేణుగోపాల్, సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 617	73,886
నిఫ్టీ ▽ 216	22,489

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	16,862	▽ 59
డోజోన్స్	38,183	▽ 258
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,231	△ 48
డాక్స్	18,497	▽ 23
షాంఘై	3,092	▽ 19
నికాయ్	38,054	▽ 503

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,115	▽ 298
బంగారం (99.5 స్వచ్ఛత)	71,826	▽ 297
వెండి (కేజీ)	92,673	▽ 1,445

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.02	83.87
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.76	107.31
€	యూరో	ఎస్‌బీఐ	89.01	91.37
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.39	53.55
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.23	56.17
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.59	63.56
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.34	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.81	23.58
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.36	12.36

బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.78,213 కోట్లు

- వార్షికంగా 26% అప్ • బ్యాంకింగ్ మోసాల సంఖ్య పెరిగినా..విలువల్లో కట్టడి
- 2024–25లోనూ 7% పైన వృద్ధి! • ఇదే జరిగితే వరుస మూడేళ్లలో పురోగతి
- చెక్కు చెదరని 'వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎకానమీ' ట్యాగ్
- వార్షిక నివేదికలో సెంట్రల్ బ్యాంక్ కీలకాంశాలు...



▸ బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల విలువ 2024 మార్చితో గడచిన ఒక్క ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 26 శాతం పెరిగి రూ.78,213 కోట్లకు చేరింది. ఖాతాదారులు లేదా వారసుల కోసం ఒకవైపు ప్రయతిస్తూనే... మరోవైపు ఇలా ఎవ్వరూ క్లెయిమ్ చేయకుండా మిగిలిపోయిన మొత్తాలను డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎవేర్‌నెస్ ఫండ్‌లో (డీఈఏ) బదలాయించడం జరుగుతుంది. ఈ ఫండ్ ఇలాంటి నిధుల మొత్తం 2023 మార్చి నాటికి రూ.62,225 కోట్లు ఉంది. బ్యాంకులు 10 లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలుగా తమ ఖాతాలలో ఉన్న క్లెయిమ్ చేయని డిపాజిట్లను ఆర్‌బీఐ పర్యవేక్షణలోని డీఈఏకు బదలాయిస్తాయి.



▸ భారత్ ఆర్థిక వ్యవస్థ ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సరంలోనూ 7 శాతం వృద్ధి నమోదుచేసుకుంటుంది. కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ, వాటిని సమతౌల్యం చేసే సానుకూల పరిస్థితులూ ఉన్నాయి. 2022–23లో ఎకానమీ 7 శాతం పురోగమిస్తే, 2023–24లో వాస్తవిక జీడీపీ వృద్ధి రేటు 7.6 శాతంగా నమోదుకానుంది. 2024–25లో వృద్ధి రేటు 7 శాతంగా నమోదయ్యే వీలుంది. తద్వారా ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎకానమీగా భారత్ తన హోదాను కొనసాగించనుంది.



▸ 2023–24 ఆర్థిక సంవత్సరంలో సావరిన్ గోల్డ్ బాండ్లలో ఇన్వెస్టర్ల పెట్టుబడుల విలువ భారీగా పెరిగి రూ.27,031 కోట్లకు చేరింది. పరిమాణంలో ఈ విలువ 44.34 టన్నులకు ప్రాతినిధ్యం వహిస్తోంది. 2022–23లో ఈ విలువ, పరిమాణం వరుసగా రూ.6,551 కోట్లు, 12.26 టన్నులుగా ఉంది. 2015లో ఈ పథకం ప్రవేశపెట్టిన నాటి నుంచి 67 విడతల్లో విక్రయాలు జరిగాయి. రూ.72,274 కోట్లు సమకూరగా, పరిమాణంలో 146.96 టన్నులకు ఈ విలువ ప్రాతినిధ్యం వహిస్తోంది.



▸ ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీట్ 2024 మార్చి 31 నాటికి 11.08 శాతం వృద్ధితో రూ.70.48 లక్షల కోట్లకు చేరింది (దాదాపు 845 బిలియన్ డాలర్లు). పాకిస్తాన్ జీడీపీ 340 బిలియన్ డాలర్లకంటే ఇది 2.5 రెట్లు అధికం.

▸ అంతర్జాతీయంగా దేశీయ కరెన్సీ రూపీని మరింత చలామణీలోకి తేవడంలో భాగంగా భారత్ వెలుపల నివసిస్తున్న వ్యక్తులు (పీఆర్‌వోఐ) విదేశాల్లోనూ రూపీ అకౌంట్లను తెరిచేందుకు అనుమతి.





▸ బ్యాంకింగ్ రంగంలో మోసాల సంఖ్య మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో భారీగా 13,564 నుంచి 36,075కు ఎగసింది. అయితే మోసాలకు సంబంధించిన విలువ మాత్రం 46.7 శాతం పడిపోయి రూ.13,930కోట్లకి చేరింది.

ఫోన్‌పేలో గృహ, వాహన రుణాలు..


సీఈవో హేమంత్ గాలా

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే తాజాగా తమ ప్లాట్‌ఫాంపై ఆరు రకాల రుణ ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చింది. ఇకపై యూజర్లు మ్యుచువల్ ఫండ్ లోన్స్, బంగారం, బైక్, కార్, హోమ్ లోన్/ప్రాపర్టీపై రుణాలు, విద్యా రుణా లు తమ ప్లాట్‌ఫాంపై పొందవచ్చని సంస్థ తెలిపింది. ఇందుకోసం టాటా క్యాపిటల్, హీరో ఫిన్‌కార్ప్, ముత్తూట్ ఫిన్‌కార్ప్, డీఎంఐ హౌసింగ్ ఫైనాన్స్, హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ వంటి ఆర్థిక సంస్థలతో జట్టు కట్టినట్లు ఫోన్‌పే లెండింగ్ సీఈవో హేమంత్ గాలా తెలిపారు.

క్రీమ్‌లైన్ నుంచి మై ఫార్మ్ ప్రీమియం ఆవు పాలు


భూపేంద్ర సూరి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గోద్రెజ్ ఆగ్రోవెట్‌లో భాగమైన క్రీమ్‌లైన్ డెయిరీ ప్రొడక్ట్స్ తాజాగా మై ఫార్మ్ పేరిట ప్రీమియం ఆవు పాలను ఆవిష్కరించింది. అరలీటరు ప్యాకెట్ ధర రూ. 50గా ఉంటుంది. తమ సొంత ఫార్మ్‌ల నుంచి సేకరించే ఈ పాలు ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లో మాత్రమే అందుబాటులో ఉంటాయని గోద్రెజ్ జెర్సీ సీఈవో భూపేంద్ర సూరి గురువారమిక్కడ తెలిపారు. హైదరాబాద్‌లో 90 పైచిలుకు స్టోర్స్‌లో ఇవి లభిస్తాయని, ఈ ఏడాది ఆఖరు నాటికి ఈ సంఖ్యను 500 పైచిలుకు స్టోర్స్‌కి పెంచుకోనున్నామని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులకి ఇంటి దగ్గరే అందించేందుకు వచ్చే నెలలో యాప్‌ను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. వచ్చే మూడేళ్లలో ప్రీమియం పాల మార్కెట్లో 10–15 % వాటా దక్కించుకోవాలని నిర్దేశించుకున్న ట్లు చెప్పారు. ఈ సందర్భంగా పాల వినియోగ ధోరణులపై మిల్క్ రిపోర్ట్‌ను ఆవిష్కరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

31-5-2024 ఫామ్ ధర...	
విశాఖ	500–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485–00
విజయవాడ	490–00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.65

46% క్షీణించిన సువెన్ లాభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీలో ఉన్న సువెన్ ఫార్మాస్యూటికల్స్ మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 46 శాతం క్షీణించి రూ.67 కోట్లకు వచ్చి చేరింది. ఎబిటా రూ.191 కోట్ల నుంచి రూ.86 కోట్లుగా ఉంది. టర్నోవర్ రూ.381 కోట్ల నుంచి రూ.270 కోట్లకు పడిపోయింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,113 కోట్ల టర్నోవర్‌పై రూ.313 కోట్ల నికరలాభం ఆర్జించింది. ఫార్మా సీడీఎంవో విభాగంలో ఫేజ్–1 నుంచి ఫేజ్–3 వరకు 100కుపైగా ప్రాజెక్టులు ఉన్నాయని కంపెనీ వెల్లడించింది. ఇందులో ఫేజ్–3లో ఏడు మాలిక్యూల్స్, 13 ఇంటర్మీడియేట్స్ ఉన్నట్టు తెలిపింది. కోహెన్స్ లైఫ్‌సైన్సెస్‌తో సువెన్ ఫార్మా విలీనం సంబంధించి సెబీ నుంచి అనుమతి కోసం వేచిచూస్తున్నట్టు వివరించింది. విలీన ప్రక్రియ ఏడాదిలో పూర్తి అవుతుందని సంస్థ అంచనా వేస్తోంది.

సువెన్ ఫార్మాస్యూటికల్స్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో గురువారం 2.45 శాతం క్షీణించి రూ.631.15 వద్ద స్థిరపడింది.

అపోలో డివిడెండ్ రూ.10



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైద్య సేవల సంస్థ అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైస్ 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.10 తుది డివిడెండ్ చెల్లించాలని నిర్ణయించింది. ఇప్పటికే కంపెనీ రూ.6 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 76 శాతం దూసుకెళ్లి రూ.254 కోట్లు సాధించింది. ఎబిటా 31 శాతం ఎగసి రూ.640 కోట్లు నమోదైంది. టర్నోవర్ 15 శాతం వృద్ధి చెంది రూ.4,944 కోట్లు పొందింది. 2023–24లో రూ.19,059 కోట్ల టర్నోవర్‌పై రూ.899 కోట్ల నికరలాభం అందుకుంది.

అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైస్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో గురువారం 2.47 శాతం క్షీణించి రూ.5,761 వద్ద స్థిరపడింది.

అయిదో రోజూ అమ్మకాలే..



ముంబై: స్టాక్ మార్కెట్లో అయిదో రోజూ అమ్మకాలు కొనసాగాయి. జీడీపీ గణాంకాలు, సార్వత్రిక ఎన్నికలు తుది దశకు చేరుకోవడం, జూన్ 4న ఫలితాల వెల్లడి నేపథ్యంలో ఇన్వెస్టర్ల అప్రమత్తత వహించారు. మే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ కాంట్రాక్టుల గడువు నేపథ్యంలో ట్రేడర్లు తమ పొజిషన్లను కొనసాగించేందుకు ఆసక్తి చూపలేదు. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 617 పాయింట్ల నష్టంతో 73,886 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 216 పాయింట్లు కోల్పోయి 22,489 వద్ద నిలిచింది.

ఎన్‌ఎస్‌ఈ 'నిఫ్టీ ఈవీ-కొత్త తరం ఆటోమోటివ్ ఇండెక్స్'

ఎన్‌ఎస్‌ఈ ఎక్స్ఛేంజీ అనుబంధ సంస్థ ఎన్‌ఎస్‌ఈ ఇండీసెస్ 'నిఫ్టీ ఈవీ–కొత్త తరం ఆటోమోటివ్ ఇండెక్స్' ప్రారంభించింది. ఈ సూచీ విద్యుత్ వాహన పరిశ్రమ కంపెనీల పనితీరును సూచిస్తుంది. అసెట్ మేనేజర్లు, ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్లు, స్ట్రక్చర్డ్ ఉత్పత్తులు వంటి వాటికి ఈ సూచీ ప్రమాణికంగా నిలిచే వీలుంది. సూచీ బేస్ తేదీ 2018 ఏప్రిల్ 2. బేస్ విలువ 1000. ఏడాదిలో రెండు సార్లు మార్పులు చేర్పులు చేస్తారు. త్రైమాసికంగా రీ బ్యాలెన్సింగ్ ఉంటుంది.

జియో ఫైనాన్షియల్ నుంచి యాప్



న్యూఢిల్లీ: జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ తమ 'జియోఫైనాన్స్' యాప్ బీటా వెర్షన్‌ను ఆవిష్కరించింది. ఒకే ప్లాట్‌ఫాంపై యూపీఐ, డిజిటల్ బ్యాంకింగ్, బిల్లుల చెల్లింపులు, అన్ని ఖాతాల కన్సాలిడేషన్ మొదలైన సర్వీసులకు ఇది ఉపయోగపడనుంది. తక్షణం అకౌంటును తెరిచేందుకు ఇందులో జియో పేమెంట్స్ బ్యాంక్ అకౌంటు ఫీచరు ఉంటుంది. రాబోయే రోజుల్లో దీని ద్వారా మ్యూచువల్ ఫండ్స్ లోన్స్‌తో ప్రారంభించి గృహ రుణాల వరకు వివిధ రకాల రుణాలు కూడా అందించే యోచనలో ఉన్నట్లు జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ ఒక ప్రకటనలో తెలిపింది.

నష్టాల్లోకి శ్రీ రేణుకా షుగర్స్

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ కంపెనీ శ్రీ రేణుకా షుగర్స్ చివరి త్రైమాసికంలో లాభాల నుంచి నష్టాలలోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 112 కోట్ల నికర నష్టం ప్రకటించింది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 45 కోట్ల నికర లాభం ఆర్జించింది. అధిక వ్యయాలు ప్రభావం చూపాయి. మొత్తం ఆదాయం మాత్రం రూ. 2,370 కోట్ల నుంచి రూ. 3,476 కోట్లకు జంప్‌చేసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 2,320 కోట్ల నుంచి రూ. 3,520 కోట్లకు పెరిగాయి. ఇక పూర్తి ఏడాదికి నికర నష్టం భారీగా పెరిగి రూ. 627 కోట్లకు చేరింది. 2022–23లో కేవలం రూ. 197 కోట్ల నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 9,107 కోట్ల నుంచి రూ. 11,367 కోట్లకు బలపడింది.

శ్రీ రేణుకా షేరు బీఎస్‌ఈలో 2.5 శాతం పతనమై రూ. 40.4 వద్ద ముగిసింది.

టైమ్ జాబితాలో రిలయన్స్, టాటా

100 అత్యంత ప్రభావవంతమైన కంపెనీల లిస్టులో చోటు






న్యూఢిల్లీ: దేశీ దిగ్గజాలు రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా గ్రూప్, సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతిష్టాత్మకమైన టైమ్ మ్యాగజైన్ లిస్టులో చోటు దక్కించుకున్నాయి. 2024కి గాను ప్రపంచంలోనే 100 అత్యంత ప్రభావవంతమైన కంపెనీలతో టైమ్ దీన్ని రూపొందించింది. ఈ లిస్టులో రిలయన్స్ చోటు దక్కించుకోవడం ఇది రెండోసారి. 2021లో కూడా ఈ జాబితాలో రిలయన్స్ ఉంది. కంపెనీలను అయిదు విభాగాలుగా వర్గీకరించగా టైటాన్స్ కేటగిరీలో రిలయన్స్, టాటాలను టైమ్ చేర్చింది. పయొనీర్స్ కేటగిరీలో సీరమ్ ఉంది. 58 ఏళ్ల క్రితం టెక్స్‌టైల్, పాలీయెస్టర్ కంపెనీగా ఏర్పాటైన రిలయన్స్ ఇండస్ట్రీస్ నేడు 200 బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో దేశంలోనే అత్యంత విలువైన కంపెనీగా ఎదిగిందని టైమ్ పేర్కొంది. 1868లో ప్రారంభమైన టాటా గ్రూప్.. సాల్ట్ (ఉప్పు) నుంచి సాఫ్ట్‌వేర్ వరకు వివిధ రంగాల్లో విస్తరించిందని తెలిపింది. 2023లో ఐఫోన్లను అసెంబుల్ చేసే తొలి భారతీయ కంపెనీగా నిల్చిందని వివరించింది. అటు సీరమ్ ఏటా 3.5 బిలియన్ డోసుల టీకాలను ఉత్పత్తి చేస్తూ ప్రపంచంలోనే అతి పెద్ద వేక్సిన్ల తయారీ సంస్థగా ఉందని టైమ్ పేర్కొంది.



షణ్ముగ శ్రీనివాస్‌కు స్వర్ణం... శిరీషకు కాంస్యం

ఇండియన్ గ్రాండ్‌ప్రి–2 అథ్లెటిక్స్ మీట్‌లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు పతకాలతో మెరిశారు. గురువారం చెన్నైలో జరిగిన పురుషుల 200 మీటర్ల విభాగంలో నలబోతు షణ్ముగ శ్రీనివాస్ స్వర్ణ పతకం సాధించగా... మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో ముగద శిరీష కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. 21 ఏళ్ల షణ్ముగ శ్రీనివాస్ అందరికంటే వేగంగా 21.18 సెకన్లలో గమ్యానికి చేరి విజేతగా నిలిచాడు. ఇదే నెలలో భువనేశ్వర్‌లో జరిగిన ఫెడరేషన్ కప్ చాంపియన్‌షిప్‌లో షణ్ముగ రజత పతకం సాధించాడు. మూడేళ్ల క్రితం కెన్యాలో జరిగిన అండర్–20 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో శ్రీనివాస్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 400 మీటర్ల హర్డిల్స్ ఫైనల్ రేసును 20 ఏళ్ల శిరీష 1ని:03.06 సెకన్లలో ముగించి మూడో స్థానంలో నిలిచింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన శిరీష ఖేలో ఇండియా గేమ్స్‌లోనూ కాంస్య పతకం సాధించింది.





జొకోవిచ్ అలవోకగా...

- మూడో రౌండ్‌లోకి టాప్ సీడ్
- మెద్వెదెవ్, జ్వెరెవ్ కూడా

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్ వరుసగా 19వ ఏడాది మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో ఈ సెర్బియా దిగ్గజం 6–4, 6–1, 6–2తో రొబెర్టో కార్బెలెస్ బేనా (స్పెయిన్)పై విజయం సాధించాడు. 2 గంటల 4 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రపంచ నంబర్‌వన్ జొకోవిచ్ ఐదు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేశాడు. కెరీర్‌లో 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన జొకోవిచ్ 43 విన్నర్స్ కొట్టడంతోపాటు నెట్ వద్ద 20 పాయింట్లు సాధించాడు. మరోవైపు నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా), ఎనిమిదో సీడ్ హుర్కాజ్ (పోలాండ్) కూడా మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో జ్వెరెవ్ 7–6 (7/4), 6–2, 6–2తో డేవిడ్ గాఫిన్ (బెల్జియం)పై, హుర్కాజ్ 6–7 (2/7), 6–1, 6–3, 7–6 (7/5)తో నకషిమా (అమెరికా)పై గెలుపొందారు. కెచ్‌మనోవిచ్ (సెర్బియా)తో జరిగిన మ్యాచ్‌లో మెద్వెదెవ్ తొలి సెట్‌ను 6–1తో నెగ్గి, రెండో సెట్‌లో 5–0తో ఆధిక్యంలో ఉన్నపుడు కెచ్‌మనోవిచ్ గాయం కారణంగా వైదొలిగాడు.

సబలెంకా ముందుకు...

మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సబలెంకా (బెలారస్), నాలుగో సీడ్ రిబాకినా (కజకిస్తాన్) మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో సబలెంకా 6–2, 6–2తో ఉచిజిమా (జపాన్)పై, రిబాకినా 6–3, 6–4తో అరంటా రుస్ (నెదర్లాండ్స్)పై గెలిచారు. డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) 7–6 (7/1), 1–6, 7–5తో నయోమి ఒసాకా (జపాన్)పై, మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6–3, 6–4తో తమారా జిదాన్‌సెక్ (స్లొవేనియా)పై నెగ్గారు.

నిఘా నీడలో...

భారత్-పాకిస్తాన్ టి20 ప్రపంచకప్ మ్యాచ్‌కు కట్టుదిట్టమైన భద్రత

తీవ్రవాదుల నుంచి పొంచి ఉన్న ముప్పు • పోలీసుల ఆధీనంలో మైదానం


ముస్తాబైన నాసా కౌంటీ స్టేడియం

న్యూయార్క్: అమెరికా గడ్డపై తొలిసారి జరగనున్న టి20 ప్రపంచకప్‌లో మ్యాచ్‌ల కోసం పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యంగా జూన్ 9న భారత్, పాకిస్తాన్ మధ్య ఇక్కడి 'నాసా కౌంటీ క్రికెట్ స్టేడియం'లో జరిగే మ్యాచ్ భద్రతకు సంబంధించి అదనపు దృష్టి పెట్టారు. ఈ మ్యాచ్‌కు తీవ్రవాద ముప్పు ఉన్నట్లు సమాచారం ఉంది. దాంతో అన్ని వైపుల నుంచి పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 'గతంలో ఎన్నడూ చూడని భద్రతా ఏర్పాట్లు ఇక్కడ కనిపించబోతున్నాయి' అని ఒక పోలీస్ ఉన్నతాధికారి చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో పెద్ద సంఖ్యలో జనాలను లక్ష్యంగా చేస్తూ ఏకవ్యక్తి చేసే 'వుల్ఫ్ అటాక్' తరహా దాడులకు ఆస్కారం ఉందని భావిస్తుండటంతో వాటిని నివారించేందుకు అడుగడుగునా పోలీసులను మోహరిస్తున్నారు. మ్యాచ్ జరిగే రోజు ఐసన్ హోవర్ పార్క్ పరిసరాలన్నీ పోలీసుల ఆధీనంలో ఉంటాయి. ఈ వివరాలను నాసా కౌంటీ ఎగ్జిక్యూటివ్ బ్రూస్ బ్లేక్‌మన్, పోలీస్ కమిషనర్ ప్యాట్రిక్ రైడర్ వెల్లడించారు. తాము ఏ విషయంలో కూడా ఉదాసీనత ప్రదర్శించబోమని వారు స్పష్టం చేశారు. 'ప్రతీ రోజూ నాసా కౌంటీ సహా ఇతర నగరాలకు కూడా బెదిరింపు కాల్స్ వస్తుంటాయి. మేం ఏ ఒక్కదాన్ని తేలిగ్గా తీసుకోం. అన్నింటినీ సీరియస్‌గా పరిశీలిస్తాం. అందుకే భారత్, పాక్ మ్యాచ్ జరిగే రోజు అదనంగా పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా నియమించాం. ఆ రోజు స్టేడియంలో కనీవినీ ఎరుగని భద్రతతో అభిమానులంతా సురక్షితంగా ఉంటారని హామీ ఇస్తున్నా' అని రైడర్ చెప్పారు. మరోవైపు ఐసీసీ కూడా ప్రేక్షకుల భద్రతే తమకు ముఖ్యమని, ఈ విషయంలో స్థానిక పోలీసులతో కలిసి పని చేస్తున్నామని పేర్కొంది.

సుదీర్ఘ సాధన...



తొలి రోజు ఫిట్‌నెస్ ట్రెయినింగ్‌పైనే దృష్టి పెట్టిన భారత క్రికెట్ జట్టు రెండో రోజు పూర్తి స్థాయి నెట్ ప్రాక్టీస్‌కు హాజరైంది. ఆటగాళ్లంతా దాదాపు మూడు గంటల పాటు సాధన చేశారు. నాసా కౌంటీ గ్రౌండ్‌కు దాదాపు ఐదు మైళ్ల దూరంలో ఉన్న కాంటియాగ్ పార్క్‌లో ఈ ప్రాక్టీస్ సాగింది. ఇక్కడ ఆరు డ్రాప్ ఇన్ పిచ్‌లు ఉండగా భారత్ మూడు పిచ్‌లను వినియోగించుకుంది. రెండు పిచ్‌లపై బ్యాటర్లు సాధన చేయగా, మరో పిచ్‌ను బౌలింగ్ కోసమే టీమిండియా కేటాయించింది. రోహిత్, గిల్, సూర్యకుమార్, పాండ్యా, దూబే, పంత్, జడేజా బ్యాటింగ్‌లో శ్రమించారు. కోహ్లి ఇంకా జట్టుతో చేరకపోగా... ఆలస్యంగా అమెరికాకు వచ్చిన యశస్వి జైస్వాల్, సంజూ సామ్సన్, రింకూ సింగ్, యుజువేంద్ర చహల్ మాత్రం సాధనకు దూరంగా ఉన్నారు.

కార్ల్‌సన్‌కు ప్రజ్ఞానంద 'చెక్'

ప్రపంచ నంబర్‌వన్‌పై నెగ్గిన భారత టీనేజ్ గ్రాండ్‌మాస్టర్



స్టావెంజర్: భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద తన కెరీర్‌లోనే చిరస్మరణీయ విజయాన్ని సాధించాడు. గతంలో చెస్‌లోని మూడు ఫార్మాట్‌లలో (క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్) ఏకకాలంలో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన నార్వే దిగ్గజం, ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌పై ప్రజ్ఞానంద సంచలన విజయం నమోదు చేశాడు. కార్ల్‌సన్ సొంతగడ్డలో జరుగుతున్న నార్వే చెస్ టోర్నీ పురుషుల విభాగం మూడో రౌండ్‌లో 18 ఏళ్ల ప్రజ్ఞానంద ఈ అద్భుతం చేశాడు. తెల్లపావులతో ఆడిన ప్రజ్ఞానంద 37 ఎత్తుల్లో కార్ల్‌సన్ ఆట కట్టించాడు. ఈ గెలుపుతో మూడో రౌండ్ తర్వాత ప్రజ్ఞానంద 5.5 పాయింట్లతో అగ్రస్థానంలోకి వచ్చాడు. గతంలో ఆన్‌లైన్, ర్యాపిడ్, బ్లిట్జ్ ఫార్మాట్‌లలో కార్ల్‌సన్‌పై భారత యువ గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, గుకేశ్, అర్జున్ గెలిచినా... క్లాసికల్ ఫార్మాట్‌లో మాత్రం ప్రజ్ఞానంద తొలిసారి కార్ల్‌సన్‌ను ఓడించాడు. టైమ్ లిమిట్ ఉండని క్లాసికల్ ఫార్మాట్‌లో కార్ల్‌సన్ ప్రపంచ నంబర్‌వన్, ప్రపంచ చాంపియన్ అయ్యాక అతడిని ఓడించిన రెండో భారతీయ ప్లేయర్‌గా ప్రజ్ఞానంద గుర్తింపు పొందాడు. అంతకుముందు భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ ఈ ఘనత సాధించాడు.

వైశాలి, హంపి గెలుపు



ఇదే టోర్నీ మహిళల విభాగంలో ప్రజ్ఞానంద సోదరి వైశాలి కూడా 5.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండటం విశేషం. మూడో రౌండ్‌లో వైశాలితోపాటు భారత స్టార్ కోనేరు హంపి కూడా అర్మగెడాన్ గేమ్‌లలో గెలిచారు. క్లాసికల్ ఫార్మాట్‌లో వైశాలి–అనా ముజిచుక్ (ఉక్రెయిన్) గేమ్ 50 ఎత్తుల్లో... హంపి–లె టింగ్లీ (చైనా) గేమ్ 36 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. విజేతను నిర్ణయించేందుకు అర్మగెడాన్ గేమ్‌లు నిర్వహించగా... హంపి తెల్లపావులతో ఆడి 49 ఎత్తుల్లో లె టింగ్లీపై నెగ్గగా... అనా ముజిచుక్‌తో నల్ల పావులతో ఆడిన వైశాలి 70 ఎత్తుల్లో గేమ్‌ను 'డ్రా'గా ముగించింది. అర్మగెడాన్ నిబంధనల ప్రకారం నల్లపావులతో 'డ్రా' చేసుకున్న ప్లేయర్‌ను విజేతగా ఖరారు చేస్తారు.

గాయత్రి–ట్రెసా జోడీ సంచలనం

ప్రపంచ రెండో ర్యాంక్ జంటకు షాక్ • మారిన్ చేతిలో మళ్లీ ఓడిన సింధు



సింగపూర్: భారత మహిళల డబుల్స్ జోడీ పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీలో సంచలన విజయంతో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. అయితే సింగిల్స్‌లో సీనియర్ షట్లర్, రెండు ఒలింపిక్ పతకాల విజేత పీవీ సింధుకు ప్రిక్వార్టర్ ఫైనల్లోనే చుక్కెదురైంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి–ట్రెసా జంట చక్కని పోరాటపటిమతో దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచ రెండో ర్యాంక్ జోడీ బేక్ హన–లీ సో హీని కంగుతినిపించింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్‌లో భారత ద్వయం 21–9, 14–21, 21–15తో కొరియన్ జంటకు ఊహించని షాక్ ఇచ్చింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ కిమ్ సో యోంగ్–కాంగ్ హీ యోంగ్ (దక్షిణ కొరియా)లతో గాయత్రి–ట్రెసా తలపడతారు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధుకు కొరకరాని కొయ్య, స్పెయిన్ స్టార్ కరోలినా మారిన్ చేతిలో మరోసారి పరాజయం ఎదురైంది. సింధు 21–13, 11–21, 20–22తో మూడో సీడ్ మారిన్ ధాటికి చేతులెత్తేసింది. వీళ్లిద్దరు ముఖాముఖిగా ఇప్పటివరకు 17 సార్లు తలపడగా... 12 సార్లు స్పెయిన్ షట్లరే నెగ్గింది. సింధు కేవలం ఐదుసార్లే గెలిచింది. మారిన్‌పై సింధు చివరిసారి 2018 జూన్‌లో మలేసియా ఓపెన్ టోర్నీలో గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ ప్రణయ్ ఆట కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. ప్రణయ్ 13–21, 21–14, 15–21తో కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో పరాజయం పాలయ్యాడు.

'పారిస్'కు చేరువగా సచిన్



బ్యాంకాక్: పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించేందుకు ఆఖరి క్వాలిఫయింగ్ టోర్నీలో భారత బాక్సర్లు సచిన్ సివాచ్ (57 కేజీలు) క్వార్టర్ ఫైనల్ చేరగా... అమిత్ పంఘాల్ (51 కేజీలు), సంజీత్ కుమార్ (92 కేజీలు), జైస్మిన్ (57 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ బౌట్‌లో సచిన్ 5–0తో బతుహన్ సిఫ్టిసీ (టర్కీ)పై ఏకపక్ష విజయం సాధించాడు. రెండో రౌండ్ బౌట్‌లలో సంజీత్ 5–0తో లూయిస్ సాంచెజ్ (వెనిజులా)పై, అమిత్ 4–1తో మారిసియో రూయిజ్ (మెక్సికో)పై గెలిచారు. మహిళల 57 కేజీల రెండో రౌండ్‌లో జైస్మిన్ 5–0తో మహసతి హమ్‌జయేవా (అజర్‌బైజాన్)పై విజయం సాధించింది. ఈ టోర్నీలో సెమీఫైనల్ చేరిన బాక్సర్లకు పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లు ఖరారవుతాయి.

క్లుప్తంగా...

విశాఖ వైపు కేప్‌జెమినీ చూపు



సాక్షి, విశాఖపట్నం: ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ సంస్థలు విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించిన నేపథ్యంలో మరిన్ని కీలక సాఫ్ట్‌వేర్ సంస్థలు అదే బాటలో అడుగులు వేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఐటీ సంస్థలకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, బీచ్ ఐటీ కాన్సెప్ట్‌తో ఆకర్షితులైన సంస్థలు విశాఖవైపు దృష్టిసారిస్తున్నాయి. కేప్‌జెమినీ సంస్థ కూడా అదే దారిలో పయనిస్తోంది. దీనికి సంబంధించి ఉద్యోగుల మధ్య ఆ సంస్థ సర్వే నిర్వహించగా ఎక్కువమంది విశాఖను ఎంపిక చేసుకోవడం గమనార్హం. రెండు నెలల క్రితం సంస్థ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. త్వరలోనే ఈ సంస్థ విశాఖలో ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

- మేలో 204 నౌకల నుంచి 77.71 లక్షల మెట్రిక్ టన్నుల రవాణా



సాక్షి, విశాఖపట్నం: సరకు రవాణాలో విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) ఎప్పటికప్పుడు మెరుగుపడుతూనే ఉంది. ఒకే నెలలో అత్యధిక కార్గో హ్యాండ్లింగ్‌లో పోర్టు తన రికార్డును తానే అధిగమించింది. మే నెలలో ఇంకా ఒక రోజు మిగిలి ఉండగానే.. పోర్టు చరిత్రలోనే అత్యధిక కార్గో రవాణా చేసింది. మే నెలలో 30వ తేదీ వరకు 204 వెసెల్స్ ద్వారా 77,71,966 మెట్రిక్ టన్నులు సరకు రవాణా చేపట్టింది. ఈ ఏడాది మార్చిలో చేసిన 76,22,732 మెట్రిక్ టన్నుల రికార్డును పోర్టు అధిగమించింది. సాంకేతికత, ప్రణాళికాబద్ధ చర్యలతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామని పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు, డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే తెలిపారు.

జంతువుల అక్రమ రవాణా నిరోధానికి నోడల్ వ్యవస్థ

సాక్షి, అమరావతి: జంతువుల వధ, అక్రమ రవాణా నిరోధానికి పోలీసు శాఖ ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించింది. రాష్ట్ర స్థాయి నోడల్ అధికారిగా ఐజీ (శాంతి,భద్రతలు) రవీంద్రబాబును నియమించారు. జిల్లా స్థాయిలో నోడల్ అధికారులుగా అదనపు ఎస్పీలు, డీఎస్పీలు వ్యవహరిస్తారు. ఈమేరకు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా గురువారం ఆదేశాలు జారీ చేశారు.

నెల్లూరు వైద్య విద్యార్థి ప్రతిభ

- ఐఎన్ఐఎస్ఎస్ న్యూరాలజీ విభాగంలో ప్రథమ ర్యాంక్


హనోక్ శ్రీతేజ్


డాక్టర్ అత్తోట అఖిల్

నెల్లూరు(అర్బన్)/గుంటూరు మెడికల్: గత నెలలో ఢిల్లీలోని ఎయిమ్స్ నిర్వహించిన ఐఎన్ఐఎస్ఎస్ పరీక్షల్లో న్యూరాలజీ విభాగంలో నెల్లూరుకు చెందిన వైద్య విద్యార్థి డాక్టర్ హనోక్ శ్రీతేజ్ రాయప్ప ఆలిండియా మొదటి ర్యాంక్‌ను సాధించారు. ఆయన హైదరాబాద్‌లోని ఉస్మానియాలో ఎంబీబీఎస్, జనరల్ సర్జరీలో పీజీని పూర్తిచేశారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ కోర్సులో చేరేందుకు ఢిల్లీలోని ఎయిమ్స్ నిర్వహించిన పరీక్ష రాశారు. ప్రస్తుతం ప్రకటించిన ఫలితాల్లో న్యూరాలజీ విభాగంలో మొదటి ర్యాంక్‌ను సాధించారు. ఆయన తండ్రి డాక్టర్ రాజశేఖర్ ఆక్వాకల్చర్ కన్సల్టెంట్‌గా, తల్లి డాక్టర్ ఆశాలత నారాయణ మెడికల్ కళాశాలలో అనాటమీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

గుంటూరు డాక్టర్‌కు సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీలో రెండో ర్యాంక్

గుంటూరుకు చెందిన డాక్టర్ అత్తోట అఖిల్‌కు న్యూఢిల్లీలోని ఎయిమ్స్ ఎంట్రన్స్‌లో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో రెండో ర్యాంకు లభించింది. గుంటూరుకు చెందిన డాక్టర్ అత్తోట కవిత, డాక్టర్ అత్తోట సతీష్‌బాబు దంపతుల కుమారుడు డాక్టర్ అఖిల్‌కు జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు లభించడంతో పలువురు వైద్యులు గురువారం అభినందనలు తెలిపారు.

రేవ్ పార్టీ కేసులో సినీనటి హేమకు నోటీసులు

బనశంకరి: బెంగళూరులో ఎలక్ట్రానిక్ సిటీ జీఆర్ ఫాంహౌస్‌లో రేవ్ పార్టీలో పాల్గొని డ్రగ్స్ తీసుకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న తెలుగు నటి హేమతో పాటు 8 మందికి నగర సీసీబీ పోలీసులు గురువారం మళ్లీ నోటీసులిచ్చారు. జూన్ 1 తేదీలోగా విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. ఈ నెల 27న హాజరుకావాలని వారికి గతంలో నోటీసులు పంపగా స్పందన లేదు. ఈ నేపథ్యంలో మళ్లీ నోటీసులిచ్చారు.

గ్రామీణ యువతకు కిసాన్ డ్రోన్స్

పొదుపు సంఘాల మహిళలకూ ప్రాధాన్యత

డ్రోన్ నడపడంపై ఆసక్తిగల మహిళలకు ఉచిత శిక్షణ

- ఇప్పటికే 63 సంఘాలకు కిసాన్ డ్రోన్స్ అందజేసిన ఇఫ్కో
- డ్రోన్లతో పాటు ఎలక్ట్రికల్ వాహనాలు సైతం అందజేత
- 15 లక్షల విలువైన పరికరాలు ఉచితంగా పంపిణీ
- సెక్యూరిటీ డిపాజిట్ రూ.లక్ష చెల్లిస్తే చాలు
- నానో ఎరువుల వినియోగం పెంచడమే లక్ష్యం



సాక్షి, అమరావతి: సాగులో సూక్ష్మ ఎరువుల వినియోగం పెంచడం ద్వారా కూలీల వెతలకు చెక్ పెట్టే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో భారత ఎరువుల సహకార సంస్థ (ఇఫ్కో) అందిస్తున్న కిసాన్ డ్రోన్స్‌కు ఆదరణ పెరుగుతోంది. ఇప్పటికే 60 మంది నిరుద్యోగ యువత, పొదుపు సంఘాలకు శిక్షణ ఇచ్చి డ్రోన్లను అందజేసింది. రానున్న వ్యవసాయ సీజన్‌లో మరో 65 కిసాన్ డ్రోన్స్ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. తొలి దశలో రాష్ట్రంలో 160 డ్రోన్స్ ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా.. డిమాండ్‌ను బట్టి మరింత మందికి ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. గతేడాది 60 డ్రోన్లు, ఎలక్ట్రిక్ వాహనాలను అందించింది. ఈ ఏడాది మరో 65 మందికి ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఇందుకోసం ఎంపిక చేసిన నిరుద్యోగ యువతకు, స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తోంది. కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై.. 18–50 సంవత్సరాల మధ్య వయసు వారు శిక్షణకు అర్హులు.

మహిళలకు 15 రోజుల శిక్షణ

ఆసక్తి, అర్హత ఉన్న వారికి 15 రోజులపాటు చెన్నైలోని దక్ష, మైసూర్‌లోని జనరల్ ఏరోనాటిక్స్ సంస్థల్లో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ కోసం రూ.50 వేలు ఖర్చవుతుండగా.. రూ.15 వేలు అభ్యర్థులు చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన రూ.35 వేలు ఇఫ్కో భరిస్తుంది. అదే పొదుపు సంఘాల మహిళలకైతే శిక్షణ ఉచితంగానే అందిస్తుంది. ఇప్పటికే ఇఫ్కో ద్వారా 70 మంది గ్రామీణ యువతతోపాటు 12 మంది పొదుపు సంఘాల మహిళలకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి కాగానే డ్రోన్ పైలట్ లైసెన్స్ జారీ చేస్తున్నారు.

రూ.15 లక్షల విలువైన డ్రోన్, ఎలక్ట్రిక్ వాహనం

లైసెన్స్ పొందిన అభ్యర్థులకు రూ.15 లక్షల విలువైన అత్యాధునిక డ్రోన్‌తో కూడిన ఎలక్ట్రిక్ ఆటోలను అందిస్తున్నారు. యూనిట్ వ్యయంలో రూ.లక్ష సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లిస్తే చాలు. ఎలక్ట్రిక్ వెహికల్‌పై రెండు రోజులపాటు క్షేత్రస్థాయి శిక్షణ కూడా ఇస్తున్నారు. ఇందుకోసం మరో రూ.16 వేలు చెల్లించాల్సి ఉంటుంది. కనీసం 20 వేల ఎకరాల్లో పిచికారీ లేదా ఐదేళ్ల తర్వాత గానీ డ్రోన్, ఎలక్ట్రిక్ వాహనం అభ్యర్థుల పేరిట బదిలీ అయ్యేలా ఏర్పాటు చేశారు. ఎంపికైన అభ్యర్థులు ఈ మేరకు ఇఫ్కోతో ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది.

జూన్‌లో అర్హుల గుర్తింపు

2024–25 సీజన్‌లో మరో 65 మందికి కిసాన్ డ్రోన్స్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ మొదటి వారం నుంచి అర్హులైన వారిని గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. వారికి దశల వారీగా శిక్షణ ఇచ్చిన తర్వాత ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో కిసాన్ డ్రోన్స్ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

స్వయం ఉపాధి పొందుతున్నాం



నేను బీ ఎస్సీ కంప్యూటర్స్ చేశా. ఇఫ్కో ద్వారా మద్రాస్ ఐఐటీలో డ్రోన్ పైలట్‌గా శిక్షణ పొందా. ఇఫ్కోతో చేసుకున్న ఒప్పందం మేరకు రూ.లక్ష సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించగా.. ఆ సంస్థ నాకు రూ.15 లక్షల విలువైన కిసాన్ డ్రోన్, ఎలక్ట్రికల్ వాహనం ఇచ్చింది. రైతు పొలాల్లో అద్దె ప్రాతిపదికన పురుగు మందులు, నానో ఎరువులు పిచికారీ చేసినందుకు ఎకరాకు రూ.300 తీసుకుంటున్నా.

– కయ్యూరు మహేష్, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా

ఖర్చు తగ్గుతోంది



ఇఫ్కో ద్వారా శిక్షణ పొంది కిసాన్ డ్రోన్ తీసుకున్నాం. గతంలో ఎకరాకు పిచికారి చేయాలంటే రూ.500 నుంచి రూ.600 వరకు కూలీలకు చెల్లించాల్సి వచ్చేది. కూలీలు దొరక్క చాలా ఇవ్వండి పడేవాళ్లం. కిసాన్ డ్రోన్‌తో 25 ఎకరాల వరకు పిచికారి చెయగలుగుతున్నాం. ఇప్పుడు కేవలం 4–5 నిముషాల్లో ఎకరా విస్తీర్ణంలో పిచికారీ పూర్తవుతోంది. వృథా కూడా ఏమీ ఉండటం లేదు. ఎకరాకు రూ.300 వరకు ఆదా అవుతోంది.

– కొక్కిరాల వెంకట సుబ్బారావు, దుగ్గిరాల, బాపట్ల జిల్లా

రైతు ఖర్చులు తగ్గించడమే లక్ష్యం



నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంతోపాటు నానో ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గించాలన్న సంకల్పంతోనే ఇఫ్కో కిసాన్ డ్రోన్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే మార్కెట్లోకి వచ్చిన నానో యూరియా, డీఏపీ ఎరువులకు రైతుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. వాటి వినియోగం పెరగాలంటే డ్రోన్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నాం. గతేడాది 60 మందికి శిక్షణ ఇవ్వగా.. ఈ ఏడాది మరో 65 మందికి కిసాన్ డ్రోన్స్‌తో కూడిన ఎలక్ట్రికల్ వాహనాలు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం

– టి.శ్రీధర్‌రెడ్డి, స్టేట్ మార్కెటింగ్ మేనేజర్, ఇఫ్కో

డీఈఈ సెట్ ఫలితాలు విడుదల

- 3,191 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత
- జూన్ 6 నుంచి వెబ్ కౌన్సెలింగ్
- 20వ తేదీ నుంచి తరగతులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన డీఈఈ సెట్–2024 (డైట్ సెట్) ఫలితాలు విడుదలయ్యాయి. సెట్ కన్వీనర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మేరి చంద్రిక గురువారం విజయవాడలోని పాఠశాల విద్యా శాఖ కమిషనర్ కార్యాలయంలో ఫలితాలను విడుదల చేశారు. ఈనెల 24న డైట్ సెట్ నిర్వహించగా.. ఆరు రోజుల్లోనే మూల్యాంకనం పూర్తి చేసి ఫలితాలను ప్రకటించారు. ఈ పరీక్షకు 4,949 మంది అభ్యర్థులు హాజరవ్వగా, 3,191 మంది ఉత్తీర్ణులయ్యారు. మ్యాథమెటిక్స్ విభాగంలో విజయనగరం జిల్లాకు చెందిన బులుసు గ్రీష్మిత, ఫిజికల్ సైన్స్ విభాగంలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కేసన మీనాక్షి, బయోలాజికల్ సైన్స్ విభాగంలో వైఎస్సార్ జిల్లాకు చెందిన షేక్ రుక్సానా, సాంఘిక శాస్త్ర విభాగంలో చిత్తూరు జిల్లాకు చెందిన గుత్తా సునీల్ కుమార్ మొదటి ర్యాంకులు సాధించి స్టేట్ టాపర్స్‌గా నిలిచారు.

6 నుంచి వెబ్ కౌన్సెలింగ్

ప్రాథమిక పాఠశాలల్లో విద్యా బోధనకు ఉద్దేశించిన రెండేళ్ల డీఈఈ కోర్సుకు ఎంతో డిమాండ్ ఉంది. రాష్ట్రంలో 14 ప్రభుత్వ డైట్ కాలేజీలు ఉండగా వాటిలో 1,650 సీట్లు ఉన్నాయి. మరో 15 ప్రైవేటు డైట్ కాలేజీల్లో 1,500 సీట్లు కలిపి మొత్తంగా 3,150 సీట్లున్నాయి. డైట్ సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం కల్పించినట్టు కన్వీనర్ మేరీ చంద్రిక తెలిపారు. జూన్ 20వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఆమె వెల్లడించారు.

ఏపీ ఐసెట్‌లో 96.70 శాతం మంది ఉత్తీర్ణత

అనంతపురం: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఏపీ ఐసెట్–2024 ఫలితాలను గురువారం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి విడుదల చేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ ఐసెట్ ఫలితాలను ఎస్కేయూలోని వీసీ కాన్ఫరెన్స్ హాలులో విడుదల చేశారు. ఏపీఈసెట్ చైర్మన్ ప్రొఫెసర్ కె.హుస్సేన్‌రెడ్డి, ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి.మురళీకృష్ణ, ఎస్కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ఐసెట్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ సి.శోభాబిందు, ప్రొఫెసర్ కె.రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 48,828మంది ఏపీ ఐసెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 44,447 మంది పరీక్షకు హాజరుకాగా, 42,984 మంది (96.70 శాతం) ఉత్తీర్ణత సాధించారు. పురుషులు 23,315మంది దరఖాస్తు చేసుకోగా, 21,033 మంది హాజరయ్యారు. వీరిలో 20,296 (97 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. మహిళలు 25,513 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 23,414 మంది పరీక్షకు హాజరుకాగా, 22,688 మంది (97.48 శాతం) ఉత్తీర్ణత సాధించారు. పురుషుల కంటే మహిళల ఉత్తీర్ణత శాతం అధికంగా ఉంది. తుది 'కీ'లో కేవలం 2 ప్రశ్నలకు మాత్రమే 5 రకాల జవాబులు రావడంతో ఆ రెండు ప్రశ్నలు రాసినవారికి మార్కులు అదనంగా కలిపారు. 34 మంది అభ్యర్థులు స్క్రైబ్ సాయంతో పరీక్షలు రాశారు. ఫలితాల విడుదల అనంతరం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఏపీఈఏపీ సెట్ ఫలితాలు జూన్ 5, 6 తేదీల్లో విడుదల చేస్తామని తెలిపారు.

ఏపీ ఐసెట్‌లో టాప్ -10 ర్యాంకర్లు

పేరు	జిల్లా	ర్యాంకు
ఎ.క్రాంతికుమార్	ఎన్టీఆర్	1
జి.సాయికార్తీక్	రాజమండ్రి	2
ఎస్.వసంతలక్ష్మి	గాజువాక	3
కె.గణేష్‌కుమార్‌రెడ్డి	అనంతపురం	4
ఎస్.తరుణ్‌కుమార్	విజయనగరం	5
ఎస్.దశరథరామిరెడ్డి	తూర్పుగోదావరి	6
కె.శ్రీకర్	శ్రీకాకుళం	7
పి.అనుపమ	తూర్పుగోదావరి	8
డి.వెంకటేష్	అనంతపురం	9
డి.మునిశేషాద్రిగిరీష్‌సాయి	చిత్తూరు	10

ఏపీ ఈసెట్ ఫలితాలు విడుదల

- 36,369 మందికి గాను 32,881 మందికి అర్హత
- అబ్బాయిలు 23,849 మంది.. అమ్మాయిలు 9,032 మంది అర్హత
- ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి వెల్లడి
- వలంటీర్‌కు బయో టెక్నాలజీలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్


ఏపీ ఈసెట్ ఫలితాలు విడుదల చేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

అనంతపురం: ఇంజినీరింగ్, బీ–ఫార్మసీ రెండో సంవత్సరంలో లేటరల్ ఎంట్రీ ద్వారా అడ్మిషన్లు పొందడానికి నిర్వహించిన ఏపీ ఈసెట్–2024 ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రా రెడ్డి గురువారం విడుదల చేశారు. ఏపీ ఈసెట్ నిర్వహించిన జేఎన్‌టీయూ (అనంతపురం)లో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. 8 దఫాలుగా ఏపీ ఈసెట్‌ను విజయవంతంగా నిర్వహించిన జేఎన్‌టీయూ(ఏ) ఈసెట్ నిర్వహణ కమిటీని ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి అభినందించారు. ఏపీ ఈసెట్‌కు రాష్ట్రవ్యాప్తంగా 37,767 మంది దరఖాస్తు చేసుకోగా.. 36,369 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 32,881 మంది(90.41 శాతం) ఉత్తీర్ణులయ్యారు. అబ్బాయిలు 27,787 మంది దరఖాస్తు చేసుకోగా 26,693 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 23,849(91.68 శాతం) మంది అర్హత సాధించారు. అమ్మాయిలు 9,980 మంది దరఖాస్తు చేసుకోగా, 9,676 మంది హాజరయ్యారు. వీరిలో 9,032(93.34 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఈసెట్ ఫలితాల్లో కృష్ణా జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం 1,071 మంది పరీక్ష రాయగా 1,002 (93.56 శాతం) మంది అర్హత సాధించారు. ఉదయం సెషన్‌లో మొత్తం 145 ప్రశ్నలకు గాను 272 అభ్యంతరాలు రాగా.. నాలుగు ఆమోదం పొందాయి. మధ్యాహ్నం సెషన్‌లో మొత్తం 171 ప్రశ్నలకు గాను 444 అభ్యంతరాలు రాగా 19 ఆమోదం పొందాయి. ఈ ప్రశ్నలకు జవాబు రాసిన వారికి మార్కులు లభించాయి. ఫలితాల విడుదల కార్యక్రమంలో ఏపీ సెట్స్ స్పెషల్ ఆఫీసర్ ఎం.సుధీర్‌రెడ్డి, ఏపీ ఈసెట్ చైర్మన్ జీవీఆర్ శ్రీనివాసరావు, కన్వీనర్ పీఆర్ భానుమూర్తి, జేఎన్‌టీయూ(ఏ) రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, పాలకమండలి సభ్యులు బి.దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈసెట్‌లో మొదటి ర్యాంకు సాధించిన అభ్యర్థులు

విభాగం	పేరు	జిల్లా
అగ్రికల్చర్ ఇంజనీరింగ్	ఎం.హర్షిత	అనకాపల్లి
బయో టెక్నాలజీ	ఎం.శిల్ప	శ్రీకాకుళం
సిరామిక్ టెక్నాలజీ	ఎ.యచంద్ర	తిరుపతి
కెమికల్ ఇంజనీరింగ్	పి.అశోక్	విశాఖపట్నం
సివిల్ ఇంజనీరింగ్	జి.సుధాకర్ రెడ్డి	తెలంగాణ (కూకట్‌పల్లి)
ఈసీఈ	బి.హేమంత రెడ్డి	తిరుపతి
ఈఈఈ	ఎ.గణేశ్	తెలంగాణ
ఎల్రక్టానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్	ఎ.టి.వెంకటసాయి	కృష్ణా
మెకానికల్ ఇంజనీరింగ్	కె.శ్రీరామ్	విశాఖపట్నం
మెటాలర్జీ	ఎం.రమేశ్	అనకాపల్లి
మైనింగ్ ఇంజనీరింగ్	బి.శ్రీహాస్	వరంగల్(తెలంగాణ)
బీఎస్సీ(మ్యాథ్స్)	కె.శ్రీ గాయత్రి	గుంటూరు
ఫార్మసీ	కె.త్రివేణి	చిత్తూరు
కంప్యూటర్ సైన్సెస్	మామిడి తుహి	కృష్ణా

వలంటీర్ శిల్ప స్టేట్ ఫస్ట్



రణస్థలం: సీఎం జగన్ ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థలో చేరి ప్రజలకు సేవ చేస్తున్న ఓ యువతి ఏపీ ఈసెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం కొవ్వాడలో వలంటీర్‌గా సేవలందిస్తున్న మైలపల్లి శిల్ప రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది. శిల్ప ప్రస్తుతం శ్రీకాకుళం మహిళా పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాలలో డీ–ఫార్మసీ రెండో సంవత్సరం చదువుతోంది. ఇంజనీరింగ్ చదవాలనే ఆశయంతో ఆమె ఈసెట్ రాయగా.. బయో టెక్నాలజీ విభాగంలో ఫస్ట్ ర్యాంకు వచ్చిందని ఆమె తెలిపింది. ఆమె తండ్రి పేరు పోలీసు.. టైలర్‌గా పనిచేస్తుండగా.. తల్లి లక్ష్మి గృహిణి. కుమార్తెకు స్టేట్ ఫస్ట్ ర్యాంకు రావడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తుండగా.. గ్రామస్తులు శిల్పను అభినందించారు. శిల్ప మాట్లాడుతూ.. బయోటెక్నాలజీలో ఇంజనీరింగ్ చేసి అత్యుత్తమంగా రాణించాలని అనుకుంటున్నట్లు ఆమె తెలిపారు.

పాఠశాల నుంచే జీవన నైపుణ్యాలు బోధించాలి

ఇంటర్మీడియెట్ విద్య కమిషనర్ సౌరభ్ గౌర్


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సౌరభ్ గౌర్, శ్రీనివాసరావు తదితరులు

సాక్షి, అమరావతి: విద్యార్థులకు పాఠశాల దశ నుంచే కెరీర్ విద్యతోపాటు జీవన నైపుణ్యాలు బోధించాలని ఇంటర్మీడియెట్ విద్య కమిషనర్ సౌరభ్ గౌర్ అన్నారు. విజయవాడలోని సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయంలో గురువారం మెల్‌బోర్న్ యూనివర్సిటీ (ఆస్ట్రేలియా) సహకారంతో ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల్లో పైలెట్ కెరీర్ విద్య శిక్షణ అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమగ్ర శిక్షా ఎస్పీడీ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సౌరభ్ గౌర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియెట్ విద్యాశాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తాయని, అవసరమైన ప్రణాళికను తయారు చేయాలని సమగ్ర శిక్షా, ఎస్సీఈఆర్టీ అధికారులకు సూచించారు. సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఏడాది గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో ఎంపికచేసిన 100 ప్రభుత్వ పాఠశాలలు, 20 జూనియర్ కాలేజీల్లో 8 నుంచి 12 తరగతుల విద్యార్థులకు కెరీర్ విద్యపై శిక్షణ అందించామని తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో మరింత సమర్థంగా శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. యూనివర్సిటీ ఆఫ్ మెల్బోర్న్ గ్లోబల్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్, సీఈవో రాక్వెల్ షెరాఫ్ మాట్లాడుతూ కెరీర్ ఎడ్యుకేషన్ విధివిధానాలను వివరించారు. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో సమర్థవంతంగా కెరీర్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని అమలు చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. సీమ్యాట్ డైరెక్టర్ వీఎన్ మస్తానయ్య, కేజీబీవీ సెక్రటరీ డి.మధుసూదనరావు, శామో జాయింట్ డైరెక్టర్ ఎ.సుబ్బారెడ్డి, జీసీడీవో ఏడీ రవూఫ్, ఎస్సీఈఆర్టీ ప్రతినిధి సుధాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాస్తవ ఖర్చులే ట్రూ అప్ చార్జీలు

ఏటా విద్యుత్ కొనుగోలుకు రేటు నిర్ణయిస్తున్న విద్యుత్ నియంత్రణ మండలి

- ఎంత రేటుకి విద్యుత్ కొన్నప్పటికీ ఈఆర్‌సీ చెప్పిన చార్జీలే వసూలు
- అదనపు ఖర్చును వసూలు చేసుకోవడానికి అనుమతించాలని డిస్కంల విజ్ఞప్తి
- యూనిట్‌కు రూ.1 ఖర్చయితే 40 పైసలే వసూలు
- ఖర్చులు తగ్గితే వినియోగదారులకు వెనక్కి ఇచ్చేస్తున్న డిస్కంలు
- ఆ విధంగా 2022–23 టారిఫ్‌లో రూ.4,800 కోట్లు తగ్గించి బిల్లుల్లో సర్దుబాటు
- ఉచిత, రాయితీ విద్యుత్‌పై ట్రూ అప్ భారాన్ని మోస్తున్న ప్రభుత్వం



సాక్షి, అమరావతి: ట్రూ అప్ చార్జి.. ప్రతి నెలా కరెంటు బిల్లు రాగానే అందులో ఈ చార్జీని చూసి సంబంధం లేని ఏదో చార్జీ వేసేశారని భావిస్తుంటారు. ఈ అమాయకత్వాన్నే ఆసరా చేసుకుని ప్రతిపక్షాలు, కొన్ని పచ్చ పత్రికలు ప్రభుత్వంపై బురద జల్లుతున్నాయి. వాస్తవానికి ట్రూ అప్ అంటే వేరే ఖర్చులు కాదు. వినియోగదారులకు సంబంధం లేనివి అంతకన్నా కాదు. విద్యుత్ కొనుగోలు చేసి సరఫరా చేసేందుకు పెట్టిన వాస్తవ ఖర్చులే అవి. అది కూడా ఆంధ్రప్రదేశ్ విదుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) అనుమతించినవే.

ప్రతి ఏటా విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు వినియోగదారులపై విధించే చార్జీలను ఏపీఈఆర్‌సీనే నిర్ణయిస్తుంది. ఆ ఏడాది యూనిట్‌కు ఎంత వసూలు చేయాలని ఈఆర్‌సీ చెబితే అదే రేటును డిస్కంలు వసూలు చేయాలి. కానీ, బహిరంగ మార్కెట్‌లో ప్రతి రోజూ కొనే విద్యుత్‌కు అదనంగా ఖర్చవుతుంటుంది. ఉదాహరణకు ఈఆర్‌సీ అనుమతించిన రేటు రూ.6 అయితే కొన్న రేటు రూ.8 అయితే, పైన పడిన రూ.2 భారాన్ని కొనుగోలు సమయంలో డిస్కంలు పవర్ ఫైనాన్స్ సంస్థల నుంచి అప్పులు తెచ్చి కట్టేస్తుంటాయి. ఆ అప్పులు తీర్చడం కోసం రూ.2 తో కొన్న విద్యుత్‌ను వినియోగదారులకే అందించినందున ఆ ఖర్చును వారి నుంచి వసూలు చేసుకునేందుకు అనుమతించాలని డిస్కంలు ఏపీఈఆర్‌సీని కోరుతుంటాయి. దీనినే ట్రూ అప్ చార్జీగా పిలుస్తున్నారు.

ఖర్చు చేసినంతా కాదు

డిస్కంలు నివేదికలో ఇచ్చిన మొత్తాన్ని యథాతథంగా ఆమోదించాలని లేదు. ఏపీఈఆర్‌సీ బహిరంగ విచారణ చేపట్టి, ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించి, అన్ని అంశాలనూ పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుంది. 2014–15 నుంచి 2018–19 ఆర్థిక సంవత్సరాలకు దాదాపు రూ.7,200 కోట్లు అదనపు వ్యయం జరిగిందని డిస్కంలు నివేదించాయి. కానీ నెట్‌వర్క్ ట్రూ అప్ చార్జీలను దాదాపు రూ.3,977 కోట్లుగానే ఏపీఈఆర్‌సీ నిర్ధారించింది. ఇందులో ఉచిత వ్యవసాయ విద్యుత్ వినియోగంపై ట్రూ అప్ భారం రూ.1,066.54 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే సబ్సిడీగా భరిస్తోంది. 2021–22కు సంబంధించి ప్రతి త్రైమాసికానికి రూ.3,336.7 కోట్లకు నివేదిక సమర్పిస్తే కమిషన్ రూ.3,080 కోట్లకు అనుమతినిచ్చింది. 2023–24 ఆర్థిక సంవత్సరం జూన్ నెల నుంచి నెలవారీ విద్యుత్ కొనుగోలు చార్జీల సవరింపును డిస్కంలు అమలు చేస్తున్నాయి. దీని ప్రకారం ప్రతి నెలా సర్దుబాటు తరువాత రెండో నెలలో అమల్లోకి వస్తుంది. నెలవారీ అదనపు కొనుగోలు వ్యయం, విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరిగిపోవడం, మార్కెట్ ధరలు తారస్థాయికి చేరుకోవడం, థర్మల్ కేంద్రాలలో 20 శాతం నుంచి 30 శాతం వరకూ విదేశీ బొగ్గు వాడటం, తగినంత జల విద్యుత్ ఉత్పత్తి లేకపోవటం వలన యూనిట్ దాదాపు రూ.1 వరకూ పెరిగింది. అయినా ప్రస్తుతం డిస్కంలు కమిషన్ ఆదేశాల మేరకు 40 పైసలే వసూలు చేస్తున్నాయి. 2022–23కు రూ.7,300 కోట్ల ట్రూ అప్ చార్జీలను వసూలు చేసుకోవడానికి అనుమతించాలని డిస్కంలు కోరినా ఏపీఈఆర్‌సీ అనుమతించలేదు. అలాగే 2023–24 ఆర్థిక సంవత్సరానికి డిస్కంలు నివేదించిన రూ.10,052 కోట్ల ట్రూ అప్ చార్జీలపైనా ఏపీఈఆర్‌సీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

అప్పటికీ ఇప్పటికీ ఎంతో వ్యత్యాసం

2014–15 నుంచి 2018–19 మధ్య ఐదేళ్లలో గత ప్రభుత్వం చెల్లించాల్సిన సబ్సిడీలను చెల్లించకుండా విద్యుత్ పంపిణీ సంస్థలను నష్టాల్లోకి నెట్టేసింది. సబ్సిడీ రూ.17,487 కోట్లు మంజూరు చేయగా, అందులో రూ.10,923 కోట్లు మాత్రమే చెల్లించింది. రూ.6,564 కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించలేదు. అదే విధంగా 2014–19 మధ్య పెరిగిన విద్యుత్ కొనుగోలు, పంపిణీ వ్యయాలను బిల్లుల్లో సర్దుబాటు చేసుకునే అవకాశాన్ని డిస్కంలకు ఇవ్వలేదు. ఏపీఈఆర్‌సీకి తప్పుడు నివేదికలు ఇచ్చి, విద్యుత్ సంస్థల ఆదాయం బాగానే ఉన్నట్టు చూపించారు. దీంతో 2014–19 మధ్య దాదాపు రూ.20 వేల కోట్లు డిస్కంలు నష్టపోవాల్సి వచ్చింది. ఫలితంగా రాబడికి, వ్యయానికి మధ్య అంతరం పెరిగిపోయి, పాత అప్పులే సకాలంలో చెల్లించలేని పరిస్థితి వచ్చింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం అలా చేయడంలేదు. చెల్లించాల్సిన సబ్సిడీలను పక్కాగా చెల్లించడమే కాకుండా అదనంగా నిధులు ఇస్తూ ఆదుకునే ప్రయత్నం చేస్తోంది. ఖర్చులు పెరిగినప్పటికీ వ్యవసాయ, బడుగు బలహీన వర్గాలకు ఇస్తున్న ఉచిత, రాయితీ విద్యుత్ వినియోగంపై ట్రూ అప్ భారాన్ని ప్రభుత్వమే మోస్తోంది. 2020–21 ఆర్థిక సంవత్సరంలో కోవిడ్ వల్ల విద్యుత్ డిమాండ్ తక్కువగా ఉండటం వల్ల మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు ధరలు కనిష్టానికి చేరుకున్నాయి. దానివల్ల ఆదా అయిన దాదాపు రూ.4800 కోట్లను 2022–23 టారిఫ్‌లో డిస్కంలు తగ్గించాయి. వినియోగదారుల బిల్లుల్లో సర్దుబాటు చేశాయి. అంటే ఆ మేరకు వినియోగదారులపై చార్జీల భారం పడలేదు. ఇలా ఖర్చులు తగ్గినప్పుడు వినియోగదారులకు ప్రభుత్వం చొరవతో విద్యుత్ సంస్థలు ప్రయోజనం చేకూరుస్తున్నాయి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

సత్వర నివేదికల కోసం ఆందోళన



ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: రాయచూరు వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్) ఆసుపత్రిలో సత్వరంగా వైద్య నివేదికలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడాన్ని రోగుల కుటుంబ సభ్యులు, సహాయకులు ఖండించారు. గురువారం ఆసుపత్రిలో రోగులకు సంబంధించిన రక్త, మూత్ర, బీపీ, షుగర్ పరీక్షలు చేసిన నివేదికలు ఇవ్వడానికి గంటల తరబడి వేచి ఉంచడాన్ని తప్పుబట్టారు. వైద్యులు రోగులను చూడడానికి వచ్చే లోపు ఆ నివేదికలు అందుబాటులో లేకపోతే తిరిగి వైద్యులు మరుసటి రోజు ఉదయం వచ్చే వరకు రోగులకు వైద్యం అందదని రోగుల బంధువులు ఆరోపించారు.

ఏసీపీగా ఉమేష్ చిక్కమఠ

హుబ్లీ: అంజలి అంబిగేర హత్య కేసులో సస్పెండ్ అయిన దక్షిణ ఉప విభాగం ఏసీపీ విజయ్‌కుమార్ తళవార స్థానంలో ప్రభుత్వం ఉమేష్ చిక్కమఠను నియమిస్తూ ఆదేశాలను వెల్లడించింది. సీఐడీలో డీఎస్పీగా సేవలు అందిస్తున్న ఉమేష్ చిక్కమఠ హుబ్లీ ధార్వాడ దక్షిణ ఉప విభాగం ఏసీపీగా నియమితులయ్యారు. కాగా విజయ్‌కుమార్ తళవారను కార్కళ ఏఎన్ఎఫ్ డీఎస్పీగా ప్రభుత్వం నియమించింది.

వ్యాధులపై అవగాహన అవసరం



కార్యక్రమం ప్రారంభిస్తున్న అతిథులు

రాయచూరు రూరల్: సమాజంలోని ప్రతి ఒక్కరికీ గ్రామ స్థాయిలో నుంచి స్కీజోఫ్రీనియా తదితర వ్యాధులపై అవగాహన అవసరమని జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ సురేంద్రబాబు సూచించారు. ఆయన గురువారం జిల్లా ఆరోగ్య అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్కీజోఫ్రీనియా దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. స్కీజోఫ్రీనియా వ్యాధి నియంత్రణకు ముమ్మర ప్రచారం కల్పించాలన్నారు. నోడల్ అధికారులు గణేష్, చంద్రశేఖరయ్య, యశోద, శివకుమార్, డాక్టర్ ప్రజ్వల్, మనోహర్ పత్తార్‌లున్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

హుబ్లీ: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను హుబ్లీ టౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.20 వేలు విలువ చేసే 200 గ్రాముల గంజాయి, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కేశ్వాపుర నివాసి, కార్ వాషింగ్ పని చేస్తున్న మహబూబ్‌సాబ్ కొప్పళ, భరత్ భట్టుర అరెస్ట్ అయిన నిందితులు. ఈనెల 28న ఇక్కడి గూడ్స్‌షెడ్ రోడ్డులో గంజాయి విక్రయిస్తుండగా సీసీబీ విభాగం ఏసీపీ ఎస్పీ ఒడియర్ నేతృత్వంలో దాడి చేసి గంజాయితో పాటు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ అలీ ఏ షేక్ తెలిపారు. ఘటనపై హుబ్లీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజున సెలవు

బళ్లారిఅర్బన్: జూన్ 3న జరగనున్న విధాన పరిషత్ ఎన్నికల పోలింగ్‌కు నమోదు చేసుకున్న పట్టభద్ర ఓటర్లకు ఓటు వేయడం కోసం ఆ రోజున విశేష సాందర్భిక సెలవు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆ మేరకు పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థలు, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, అన్ని అకాడమిక్ సంస్థలు రాష్ట్ర, కేంద్ర కార్యాలయాలు జాతీయ తదితర బ్యాంకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ఇతర ఫ్యాక్టరీలు, సహకార సంఘ సంస్థల్లో పని చేసే దినకూలీ పట్టభద్రులు, ఉపాధ్యాయులకు అనుకూలం అయ్యేలా ఆ రోజున ఈ సెలవును ప్రకటించినట్లుగా ప్రభుత్వ ఆదేశాల్లో పేర్కొన్నారు.

నూతన గ్రంథాలయ భవనం అప్పగింత



కట్టడ పత్రాలను అధికారికి అందజేస్తున్న ట్రస్ట్ ప్రముఖులు

బళ్లారిఅర్బన్: కౌల్‌బజార్ సమీప బండిహట్టి శ్రీరామల దేవి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన గ్రంథాలయ భవన పత్రాలను సంబంధిత నగర కేంద్ర ముఖ్య గ్రంథాలయ అధికారులకు ట్రస్ట్ నిర్వాహకులు గురువారం అందజేసినట్లు ట్రస్ట్ అధ్యక్షుడు కే.బసవరాజ్, ప్రధాన కార్యదర్శి తదితరులు ఓ ప్రకటనలో తెలిపారు. సదరు గ్రంథాలయ స్థలం దాతలు కేటీ హనుమంతప్ప, కుటుంబ సభ్యులు ఈ నూతన కట్టడాన్ని సొంత ఖర్చుతో నిర్మించి ఇచ్చారని ట్రస్ట్ అధ్యక్షుడు బసవరాజ్ తెలిపారు. ఆ మేరకు ఈ కొత్త భవనాన్ని సంబంధిత ముఖ్య గ్రంథాలయ అధికారికి అప్పగించినట్లు ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కే.గూడ్లప్ప, కోశాధికారి బీఎం బసప్ప, తెలిపారు.

ఉపాధి హామీతో జీవనభృతికి ధీమా

- నిరుద్యోగులు సైతం పాలుపంచుకుంటున్న వైనం
- కాలువలకు నీరు వదిలేదాకా ఈ పనులే శరణ్యం



ఉపాధి హామీ పనుల్లో నిమగ్నమైన కూలీలు



ఉపాధి హామీ పనుల కొలత వేస్తున్న దృశ్యం

సాక్షి,బళ్లారి: గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పెట్టిన పంటలు పూర్తిగా నష్టపోవడంతో రైతన్నలతో పాటు వ్యవసాయ కూలీలకు ఉపాధి కరువైంది. ఈనేపథ్యంలో ఉపాధి హామీ పనులే అందరికీ ఉపాధి కల్పిస్తున్నాయి. కూలీలే కాదు, రైతు కుటుంబాలకు చెందిన వారు కూడా పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొని ఉపాధి పొందుతున్నారు. గ్రామంలోని నూటికి 80 శాతంపైగా ఉపాధి హామీ పనులు చేస్తూ ఉపాధి పొందుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. బళ్లారి తాలూకా సంగనకల్లు గ్రామంలో ప్రతి రోజు వందలాది మంది ఉదయమే పలుగు, పార, గడారలు పట్టుకుని పొలాల బాట పడుతున్నారు. ఉపాధి హామీ పనుల్లో రైతు పొలాల్లో కాలువల్లో పూడికను సైతం తీసుకునేందుకు అవకాశం కల్పించడంతో ఎటు చూసినా రైతుల పొలాల్లో వ్యవసాయ పనుల్లో భాగంగా ఉపాధి హామీ పనులు చేస్తూ అటు ఉపాధి పొందడంతో పాటు కాలువలకు నీరు వదిలేలోపు కాలువల్లో ఉన్న చెత్తా చెదారం, మట్టిని తొలగించి నీటిని బాగా పారేందుకు పూడికను తొలగిస్తున్నారు.

కూలీలుగా ప్రైవేట్ ఉపాధ్యాయులు

వ్యవసాయ కూలీలు, రైతన్నలే కాకుండా డిగ్రీ పట్టాలు పొంది, ప్రైవేటు ఉపాధ్యాయులుగా పని చేస్తున్న ఎందరో ఉపాధి హామీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత రెండు నెలల నుంచి ప్రభుత్వ సెలవులు కావడంతో ఉపాధి హామీ పనులే తమకు ఉపాధి కల్పిస్తున్నాయని నిరుద్యోగులు పేర్కొంటున్నారు. సంగనకల్లు గ్రామానికి చెందిన ఈశ్వర్ అనే పట్టభద్రుడు నగరంలోని ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు. సెలవులు కావడంతో ఇంట్లో పనిపాట లేకుండా ఊరికే కూర్చొవడానికి ఇష్టం లేక ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్నారు. నెల రోజుల నుంచి ఉపాధి హామీ పనులను ప్రతి రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చేస్తూ నెలకు కనీసం రూ.6 వేల నుంచి రూ.8 వేలు దాకా సంపాదిస్తూ ఉపాధి పొందుతున్నారు.

చిన్న, పెద్ద, మోతుబరి రైతులు కూడా

కులమతాలకతీతంగా చిన్న, పెద్ద, మోతుబరి రైతులు కూడా ఉపాధి హామీ పనులు చేస్తుండటం విశేషం. ప్రతి రోజు క్యూబిక్ మీటర్ల ప్రకారం మట్టిని తీయడంతో రోజు రూ.280 నుంచి రూ.380ల వరకు కూలీ లభిస్తోందని శకుంతల అనే ఉపాధి హామీ మహిళా కూలీ పేర్కొన్నారు. ప్రతి రోజు గ్రామాల్లో వందలాది మంది పలుగు, పార, గడార పట్టుకుని, నెత్తిన సద్దిమూట కట్టుకుని ఉపాధి హామీ పనుల్లో పాల్గొనేందుకు బయలుదేరుతున్నారు. బళ్లారి జిల్లాలో తుంగభద్ర ఆయకట్టు విస్తారంగా ఉండటంతో కాలువలకు నీరు వదిలే వరకు ఉపాధి హామీ పనులను కొనసాగించాలని, అంత వరకు పనులు ఎక్కడా దొరకవని కూలీలు పేర్కొంటున్నారు. నెల రోజులకు పైగా ఉపాధి హామీ పనులతో జీవనం సాగిస్తున్నామని, తమకు కనీసం రూ.2 వేలకు పైగా కూలీ లభిస్తోందన్నారు.

జూన్ 6 లోపు మంత్రి రాజీనామా చేయాలి

- లేకుంటే 7 నుంచి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం
- మండలి అక్రమాలపై సీబీఐ దర్యాప్తు చేయించాలి
- విధాన పరిషత్ సభ్యుడు రవికుమార్ డిమాండ్



మాట్లాడుతున్న రవికుమార్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు తదితరులు

సాక్షి,బళ్లారి: వాల్మీకి అభివృద్ధి మండలిలో కోట్లాది రూపాయల అక్రమాలు జరిగినందునే చంద్రశేఖర్ అనే అధికారి డెత్‌నోట్ రాసిపెట్టి మరీ ఆత్మహత్యకు పాల్పడ్డారని, మంత్రి మౌఖిక ఆదేశాలతోనే నిధుల మళ్లింపు జరిగిందని స్పష్టంగా తెలియజేసినా సంబంధిత మంత్రి నాగేంద్రను మంత్రి పదవి నుంచి ఎందుకు తప్పించడం లేదని, ఆయనను సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు ఎందుకు వెనకేసుకుని వస్తున్నారని విధాన పరిషత్ సభ్యుడు రవికుమార్ ధ్వజమెత్తారు. ఆయన గురువారం నగరంలోని వాజ్‌పాయి లేఅవుట్‌లో మాజీ ఎమ్మెల్యేలు గాలి సోమశేఖరరెడ్డి, సోమలింగప్ప, టీ.హెచ్. సురేష్‌బాబు తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వాల్మీకి మండలిలో వంద కోట్లకు పైగా నిధులు దారి మళ్లాయని, ఆ నిధులన్ని తెలంగాణకు తరలించినట్లు స్పష్టమైన రికార్డులు ఉన్నాయని, అక్కడ ఎన్నికల కోసం కర్ణాటక డబ్బులు వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాల్మీకి మండలిలో అక్రమాలు జరిగిన నేపథ్యంలో మంత్రిని కేబినెట్ నుంచి తొలగించేందుకు సీఎం ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని మండిపడ్డారు. అవినీతి మంత్రి నాగేంద్రను జూన్ 6వ తేదీలోపు తొలగించకపోతే 7వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు.

కలిసికట్టుగా పోరాడతాం

బెంగళూరుతో పాటు అన్ని నియోజకవర్గాల్లో తమ పార్టీ ఎమ్మెల్యేలతో పాటు ఆయా తాలూకా స్థాయి నాయకులు కలిసికట్టుగా పని చేసి, పోరాటానికి దిగుతామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న లూటీలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. గతంలో ఇదే తరహా ఆరోపణలతో మంత్రి ఈశ్వరప్పను మంత్రి పదవి నుంచి తొలగించి తాము నిజాయితీని నిరూపించుకున్నామని గుర్తు చేశారు. అవినీతిపై సమగ్ర విచారణకు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న అధికారి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మంత్రిని తక్షణం పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలతో పాటు జిల్లా బీజేపీ అధ్యక్షుడు అనిల్, కార్పొరేటర్లు కోనంకి తిలక్, హనుమంతప్ప, గోవిందు, శ్రీనివాస్ మోత్కూరు, సురేఖ మల్లనగౌడ, బీజేపీ నాయకులు కే.ఎస్.దివాకర్, రామలింగప్ప, ఎర్రంగళి తిమ్మారెడ్డి, విరుపాక్షిగౌడ, ఓబుళేసు, గురులింగనగౌడ తదితరులు పాల్గొన్నారు.

అధిక విద్యుత్ బిల్లులతో జనం జేబుకు చిల్లు



మాట్లాడుతున్న శరత్ కళస

రాయచూరు రూరల్: మీటర్ రీడింగ్‌లో లోపాలను సవరించకుండా ఇష్టానుసారంగా అధిక మొత్తంలో బిల్లులు చెల్లించాలని వినియోగదారులకు విద్యుత్ శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారని హైదరాబాద్ కర్ణాటక విద్యుత్ వినియోగదారుల వేదిక సంచాలకుడు శరత్ కళస పేర్కొన్నారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటికి మీటర్లు బిగించకుండానే బిల్లులు చెల్లించాలని పేర్కొనడాన్ని ఖండించారు. 3 నెలలకు రూ.8759 బిల్లు కట్టాలని అధికారులు చెప్పడంతో చివరికి కోర్టుకు వెళ్లడంతో జెస్కాం ఇంజినీర్‌కు అంబుడ్స్‌మెన్ రూ.26 వేలు జరిమానా విధించారన్నారు. అధికారులు ఇష్టం వచ్చినట్లు మీటర్ రీడింగ్ చేయడంలో బిల్లులు వేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా శివకుమార్, దానప్పలున్నారు.

350 లీటర్ల స్పిరిట్ స్వాధీనం

హుబ్లీ: ధార్వాడ కెళగేరి వంతెన వద్ద టవేరా వాహనంలో మహారాష్ట్ర నుంచి హుబ్లీకి అక్రమంగా రవాణా చేస్తున్న 350 లీటర్ల స్పిరిట్‌ను హుబ్లీ ధార్వాడ సీసీబీ పోలీసులు గురువారం జప్తు చేశారు. అక్రమంగా స్పిరిట్ రవాణా అవుతోందన్న సమాచారం మేరకు సీసీబీ ఏసీపీ ఒడెయర్, సీఐ సిద్ధప్ప సిమాని నేతృత్వంలో దాడి చేసిన బృందం రూ.2 లక్షల విలువ చేసే స్పిరిట్‌ను స్వాధీనం చేసుకుని వాహన డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. మహారాష్ట్ర నుంచి స్పిరిట్ సాగిస్తుండగా నరేంద్ర టోల్ నుంచి కెళగేరి వంతెన వరకు వాహనాన్ని వెంబడించిన పోలీసులు పట్టుకున్నారు. వాహనంలో ఉన్న ఇద్దరు పరారయ్యారు. వాహన యజమాని ఎవరు, ఎవరికి దీనిని సరఫరా చేస్తున్నారనే విషయంపై ధార్వాడ ఉపనగర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

హుబ్లీ: కార్పొరేటర్ అరీఫ్ భద్రపురపై హత్యాయత్నానికి ప్రయత్నించి ఎనిమిదేళ్లుగా తప్పించుకొని తిరుగుతున్న నిందితుడిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. సైఫ్ అలీ అనే వ్యక్తి 2016లో అరీఫ్ భద్రపుర హత్యకు యత్నించాడన్న ఆరోపణలపై జైలుకు చేరారు. అనంతరం బెయిల్ పొంది బయటకు వచ్చాడు. అప్పటి నుంచి కోర్టుకు హాజరు కాకుండా పోలీసుల కళ్లుగప్పి ఇతర రాష్ట్రాల్లో తలదాచుకునేవాడు. తమకు అందిన సమాచారం మేరకు టౌన్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి జుడీషియల్ కస్టడీకి అప్పగించారు.

గర్భిణి మృతిపై బంధువుల ఆందోళన



ప్రతిభ(ఫైల్)

హొసపేటె: ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుడి నిర్లక్ష్యం వల్లే గర్భిణి మహిళ మృతి చెందిన ఘటన కొప్పళలో జరిగింది. వివరాలు.. కొప్పళ జిల్లా గజేంద్రగడ తాలూకా సూడి గ్రామానికి చెందిన ప్రతిభా హిరేమఠ్(25) అనే గర్భిణి కాన్పు కోసం ఈనెల 28న కొప్పళలోని ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చింది. అయితే ఆమెకు రక్తపోటు అధికంగా ఉండడంతో కొప్పళ జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో గర్భిణి చనిపోయింది. దీనికి ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ మహేష్ నిర్లక్ష్యమే కారణమంటూ ప్రతిభ బంధువులు ఆయనపై మండిపడ్డారు. ప్రైవేట్ ఆస్పత్రిలో సరైన వైద్యం అందించలేదని, సకాలంలో వైద్యం చేయకుండా జిల్లా ఆస్పత్రికి తరలించారని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేశారు. ఈ ఘటనపై కొప్పళ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ట్యాంకర్లలో నీటి సరఫరాకు అనుమతి తప్పనిసరి



అధికారితో మాట్లాడుతున్న మున్సిపల్ కౌన్సిలర్లు

హొసపేటె: వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి ప్రైవేట్ ట్యాంకర్లకు నీటిని సరఫరా చేయడాన్ని మున్సిపల్ కౌన్సిల్ నిలిపివేసినందుకు కొందరు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు అధ్యక్షురాలిపై మండిపడ్డారు. పురపాలక సంఘం చైర్‌పర్సన్ ఏ.లత అధ్యక్షతన జరిగిన అత్యవసర సమావేశంలో ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు అనుమతివ్వాలని సభ్యులు చేసిన ఏకాభిప్రాయ తీర్మానాన్ని ఆమోదించి నివేదికను జిల్లాధికారి ఆమోదానికి పంపించారు. సమావేశం తీర్మానం మేరకు పురపాలక సంఘం ప్రైవేట్ ట్యాంకర్లకు నీటి సరఫరా కొనసాగించాలని రెండు రోజుల క్రితం నగరసభ అత్యవసర ప్రత్యేక సమావేశంలో సభ్యులు కోరం ప్రకారం నిర్ణయం తీసుకొన్నా మళ్లీ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా నిలిచి పోవడంతో కమిషనర్‌తో మున్సిపల్ ఉపాధ్యక్షులు షేక్షావలి, సభ్యులు తారిహళ్లి జంబునాథ్, కమటగి జగదీష్, గుజ్జల రాఘవేంద్ర, రూపేష్ తదితరులు వాగ్వాదానికి దిగారు. సమావేశంలో ట్యాంకర్లతో నీటి సరఫరాకు ఆమోదం తెలిపినా ఎందుకు అనుమతించలేదని నగరసభ అధికారి చంద్రప్పపై సభ్యులు మండిపడ్డారు. ఈ విషయంపై అధికారి చంద్రప్ప మాట్లాడుతూ ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా విషయమై జిల్లాధికారికి అత్యవసర సమావేశ నివేదికను పంపామన్నారు. ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున అప్పటి వరకు వేచి చూడాల్సిందేనన్నారు. గత 45 రోజులుగా నగరంలోని కొన్ని వార్డులకు మున్సిపల్ కార్పొరేషన్ ప్రైవేట్ వాహనాలను అద్దెకు తీసుకుని నీటిని సరఫరా చేస్తోందన్నారు. నగరంలో నీటి సమస్య ఉంటే మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అయితే ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరాకు అనుమతించబోమని తేల్చి చెప్పారు.

ఎరువులు, విత్తన ధరలు తగ్గించరూ



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: పెరిగిన విత్తనాలు, ఎరువుల ధరలను తగ్గించి రైతులకు అందుబాటులోకి తీసుకు రావాలని, రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలని కోరుతూ రైతు సంఘం పదాధికారులు గురువారం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ ముంగారులో విత్తనాలు వేయడానికి సిద్ధంగా ఉన్న రైతులకు పెరిగిన ఎరువులు, విత్తనాల ధరలు అశనిపాతంగా మారాయన్నారు. పెరిగిన ధరలతో ఎరువులను కొనలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ పెట్టుబడి తడిసిమోపెడయ్యే అవకాశం ఉన్నందున పెంచిన విత్తనాలు, ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎరువులు, విత్తనాల ధరలు పెంచి రైతు వ్యతిరేక నీతిని అవలంబిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల రైతు ధర్మఘట్ట నంగలి నాగేష్, జుబేర్ బాషా, అంబ్లికల్ మంజునాథ్, రాజేష్, ఫారూక్ పాషా, విజయపాల్ తదితరులు పాల్గొన్నారు.

మండలి నిధులు తెలంగాణకు మళ్లింపు?

రాయచూరు రూరల్: మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన రూ.187 కోట్ల అవినీతి భాగోతానికి సంబంధించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జరిగిన తెలంగాణ లోక్‌సభ ఎన్నికలకు మళ్లించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.14 మంది అనామధేయుల ఖాతాల్లోకి వర్చువల్ విధానం ద్వారా నిధులను మళ్లించారని సమాచారం. మండలి నిధులను పీడీ ఖాతా నుంచి ఖర్చు చేయకుండా మండలి బ్యాంక్ ఖాతాను 2024 మార్చి 5 నుంచి 23 వరకు బెంగళూరు వసంత్ నగర్ యూనియన్ బ్యాంక్ శాఖ ఖాతా నుంచి కాకుండా ఎంజీ రోడ్డులోని శాఖలో బ్యాంక్ కొత్త ఖాతాను ప్రారంభించి నిధులు డ్రా చేసినట్లు తేలింది. వివిధ బ్యాంక్ ఖాతాల నుంచి రూ.94.73 కోట్లు బదిలీ అయ్యాయి. ఈ విషయంలో యూనియన్ బ్యాంక్ సీఈఓతో పాటు ఆరుగురు మండలి అధికారులు మణి మేకలై, నితీష్ రంజన్, రామసుబ్రమణ్యం, సంజయ్ రుద్ర, పంకజ్ ద్వివేది, సుచిత్‌లపై కేసు నమోదైనట్లు తెలిసింది.

కొత్తిమీర ధరకు రెక్కలు

- కట్ట రూ.80 చొప్పున విక్రయం



మార్కెట్లో కొత్తిమీర కట్టలు

కోలారు: కొత్తిమీర కట్ట ధరలు మార్కెట్‌లో ఉన్నఫళంగా పెరిగి పోయి కట్ట కొత్తిమీరను ఏకంగా రూ.80 చొప్పున విక్రయిస్తున్నారు. నెల రోజుల క్రితం 150 కట్టలు కలిగిన ఒక కొత్తిమీర మూట ధర రూ.1500 ఉండగా, నేడు దీని ధర రూ.12 వేలకు చేరుకుంది. బెంగళూరు, చెన్నై, ఈరోడ్, హైదరాబాద్, తిరుపతి వ్యాపారుల నుంచి నాణ్యమైన నాటు కొత్తిమీరకు డిమాండ్ అధికంగా ఉంది. కొత్తిమీర దిగుబడి తక్కువగా ఉండడమే ధరలు పెరగడానికి కారణమని వ్యాపారులు అంటున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎండలు ఎక్కువగా ఉన్నందున కొత్తిమీర నాటడానికి రైతులు వెనుకడుగు వేశారు. కొంతమంది రైతులు కొత్తిమీర పండించినా దిగుబడి సరిగా రాలేదు. కొంతమంది మామిడి తోపుల్లో కొత్తిమీర పండించారు. మే నెలలో కురిసిన వానలకు కొత్తిమీర పంట బాగా నష్టమైంది. దీని వల్ల మార్కెట్‌కు కొత్తిమీర రావడం తగ్గి ధర పెరుగుదలకు కారణమైంది.

పంటల బీమా నమోదుకు సూచన

బళ్లారిఅర్బన్: ప్రస్తుత సంవత్సరం కర్ణాటక రైతు సురక్ష ప్రధానమంత్రి పంట బీమా యోజన కింద ఖరీఫ్ సీజన్‌లో పంటల బీమాకు నమోదు చేసుకోవడానికి పంట రుణాలు పొందిన, రుణం పొందని రైతులు బ్యాంకుల్లో బీమా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ తిరుమలేష్ సూచించారు. ఈ యోజన ద్వారా వరి, మొక్కజొన్న, జొన్నలు, రాగులు, సజ్జలు, కొర్రలు, కంది, ఉలవలు, సూర్యకాంతి, నువ్వులు, పత్తి, వేరుశెనగ, ఉల్లి, ఎండిమిర్చి పంటలకు బీమా చేయించుకోవాలి. జూలై 31 వరకు ఈ అవకాశం ఉంటుందని, రైతులు తమ సమీపంలోని గ్రామ-1 సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పంట రుణం పొందిన రైతులు బీమా పొందక పోతే తమ పరిధిలోని బ్యాంక్ మేనేజర్‌కు వారం రోజుల ముందుగా రాతపూర్వకంగా ముందస్తు పత్రాన్ని చెల్లించాలని జేడీ తెలిపారు. పూర్తి వివరాల కోసం రైతులు రైతు కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం లేదా జాయింట్ డైరెక్టర్ కార్యాలయాల్లో సంప్రదించాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు.

పట్టభద్రుల ఎన్నికలకు సర్వం సిద్ధం

హొసపేటె: ఈశాన్య కర్ణాటక పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ జూన్ 3న విజయనగర జిల్లాలోని 6 తాలూకాల్లోని 21 పోలింగ్ స్టేషన్లలో నిర్వహించనున్నట్లు జిల్లాధికారి దివాకర్ తెలిపారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఎన్నికల సన్నాహాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. గత ఎన్నికల్లో 15 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మొత్తం ఓటర్ల సంఖ్య 5,880 మంది మాత్రమే ఉండేవారన్నారు. కానీ ప్రస్తుత ఎన్నికల్లో విజయనగర జిల్లాలోని 6 తాలూకాల్లో 21 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 18,235 మంది ఓటర్లకు గాను 11,899 మంది మహిళలు, 6,336 మంది పురుష ఓటర్లు ఉన్నారన్నారు. ఓటింగ్ ప్రక్రియ జూన్ 3న ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. అదనపు జిల్లాధికారిణి అనురాధ పాల్గొన్నారు.

రైతులకు భూపరిహారం చెల్లించండి



సమావేశంలో పాల్గొన్న జిల్లాధికారి తదితరులు

రాయచూరు రూరల్: రాయచూరు–గిణిగేర రహదారిలోని రైతుల భూములకు ప్రభుత్వం పరిహారం అందించాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం గౌరవాధ్యక్షుడు చామరస మాలి పాటిల్ విన్నవించారు. ఆయన గురువారం జిల్లాధికారి కార్యాలయంలో జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 1990లో రైతుల నుంచి కుడి ఎడమ వైపులలో 75 అడుగుల మేర భూమిని స్వాధీనం చేసుకొని రహదారిని నిర్మించారన్నారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించాలన్నారు. రూ.1600 కోట్లతో చేపట్టే చతుష్పథ రహదారి నిర్మాణంతో గిణిగెర, గంగావతి, కారటిగి, సింధనూరు, మాన్వి, కుర్డి, సాత్ మైలు వరకు భూములను స్వాధీనం చేసే రైతులకు జాతీయ రహదారుల శాఖ అధికారులు పరిహారం అందించాలన్నారు. సమావేశంలో శరణబసవ, బూదయ్య స్వామి, ప్రభాకర్ పాటిల్, బసవరాజ, లింగారెడ్డి, సూగూరయ్యలున్నారు.

కానిస్టేబుల్ ఇంట్లో నగదు చోరీ

రాయచూరు రూరల్: నగరంలోని మార్కెట్ యార్డు పోలీస్ స్టేషన్ క్వార్టర్స్‌లో నివాసమున్న పోలీస్ కానిస్టేబుల్ ఇంట్లో రూ.10 లక్షల నగదు చోరీ జరిగినట్లు మార్కెట్ యార్డ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ అమితా తెలిపారు. బుధవారం రాత్రి లాల్ బహుద్దూర్ శాస్త్రి నగర్‌లో మహాదేవి అనే పోలీస్ కానిస్టేబుల్ ఇంట్లో ఇటీవల ఈ చోరీ జరిగిందన్నారు. ఘటనలో అనుమానితులుగా క్వార్టర్స్‌లో వాచ్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్న జలాల్ నగర్ నివాసి విశ్వనాథ్, గోవిందులను అరెస్ట్ చేసినట్లు వెస్ట్ సీఐ నాగరాజ్ తెలిపారు.

వంచనపై అప్రమత్తంగా ఉండాలి



బ్యాంకు ముందు అవగాహన కలిగిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: ప్రజల దృష్టిని మరల్చి డబ్బు, నగలు దోచుకు వెళుతున్న వారిపై అప్రమత్తంగా ఉండాలని కేజీఎఫ్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నగరంలోని బ్యాంకులు, పోస్టాఫీసులు, బస్టాండు తదితర ప్రాంతాల్లో ప్రజలను జాగృతం చేయడానికి జనజాగృతి కార్యక్రమాలను నిర్వహించారు. కేజీఎఫ్ పోలీస్ జిల్లా వ్యాప్తిలోని అన్ని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయం, బస్టాండు, మార్కెట్, ఏటీఎం తదితర పబ్లిక్ ప్రాంతాల్లో దొంగలపై అప్రమత్తంగా ఉండాలని జాగృతి కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని సీఐ, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది జాగృతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

హంపీని సందర్శించిన సీనియర్ అధికారి

హొసపేటె: కేంద్ర సాంఘిక సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి వినోద్ కవలే తన కుటుంబ సమేతంగా చారిత్రక హంపీని సందర్శించి విజయనగర సామ్రాజ్య కాలపు గొప్ప కళలు, సంస్కృతిని చూసి ఆశ్చర్య పోయారు. విజయవిఠల ఆలయం, రాణి స్నానగృహం, ఉగ్ర నరసింహ, బడవి లింగ, కమల్ మహల్, గజ పాఠశాల, శ్రీవిరుపాక్షేశ్వరాలయం, హజారరామ దేవస్థానం, మహానవమి దిబ్బ తదితర రాయల కాలం నాటి స్మారకాలను, కట్టడాలను వీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపు రద్దుకు వినతి

కేజీఎఫ్ : నిబంధనలకు వ్యతిరేకంగా ఎక్కువ మంది విద్యార్థులను చేర్చుకుంటూ వారి తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న నగరంలోని జైన్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ దళిత సంఘర్ష సమితి కార్యకర్తలు బీఈఓకు వినతిపత్రం సమర్పించారు. సంఘం సంచాలకుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ రాబర్ట్‌సన్ పేటలో మహావీర జైన్ విద్యా సంస్థ పాలక మండలి నిర్ణీత ఫీజుల కంటే ఎక్కువ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాసంస్థపై చర్యలు తీసుకోకుంటే పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు. సమితి తాలూకా అధ్యక్షుడు లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.